మంగళవారం
2•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 7
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE






## దర్శనమిచ్చిన మంచులింగం

అమర్‌నాథ్ గుహలో తొలిపూజ

పాల్గొన్న జమ్ముకశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్

మొదటిరోజే ఎనిమిది వేల మంది భక్తులకు దర్శనం

4,417 మందితో జమ్ము నుంచి బయలుదేరిన రెండో బృందం 9

## కర్ణాటక కాంగ్రెస్‌లో కలకలం

24 గంటల వ్యవధిలో పార్టీకి ఇద్దరు ఎమ్మెల్యేలు గుడ్‌బై.. క్యూలో మరో నలుగురు!

సీఎం లేని సమయంలో.. రాజకీయ కల్లోలం

సంక్షోభం అంచున కాంగ్రెస్ - జేడీ(ఎస్) సంకీర్ణ సర్కారు! 9

## హైదరాబాద్‌లో సరికొత్త సిగ్నల్ వ్యవస్థ

స్టాప్‌లైన్ వద్ద రోడ్డుకు అడ్డంగా లైటింగ్ పడే ఏర్పాటు

**బంజారాహిల్స్:** టెక్నాలజీ ద్వారా ట్రాఫిక్ నియంత్రణలో నూతన పద్ధతులు అనుసరిస్తున్న హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మరో సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పటిదాకా ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద స్తంభాలపై ఉన్న లైట్లతోనే ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసులు.. రాత్రిపూట ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు స్టాప్‌లైన్‌పై మిగతా 2వ పేజీలో



బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కువద్ద ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

# నేటినుంచి ప్రత్యేక పాలన

పాలకవర్గాలకు వీడ్కోలు.. వెంటనే ప్రత్యేకాధికారులకు బాధ్యతలు

జీహెచ్‌ఎంసీ సహా ఐదుచోట్ల కొనసాగుతున్న పాలకవర్గాలు

వార్డుల విభజన పూర్తి.. సర్కారుకు ముసాయిదా

సిద్ధమవుతున్న వార్డులవారీ ఓటరు జాబితా • ఈ నెల 14లోపే రిజర్వేషన్లు ఖరారు

### మున్సిపాలిటీల్లో పాలకవర్గాల పదవీకాలం సంపూర్ణం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :**

రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పాలకవర్గాల పదవీకాలం మంగళవారంతో ముగుస్తున్నది. పాలకవర్గాలకు వీడ్కోలు సమావేశం అనంతరం వివిధ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించనున్నారు. మున్సిపాలిటీలకు ఆర్డీవో, సబ్ కలెక్టర్లు, మేజర్ మున్సిపాలిటీ, కార్పొరేషన్లకు కలెక్టర్లు, ఐఏఎస్‌లు ప్రత్యేకాధికారులుగా నియమితులుకానున్నారు. గతంలో ఉన్న 73 మున్సిపాలిటీల్లో ఐదు మినహా.. మిగిలినవాటిలో ప్రత్యేకాధికారులు రానున్నారు. నూతనంగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో ఇప్పటికే అధికారులు బాధ్యతలు నిర్వర్తిస్తుండగా.. వారినే ప్రత్యేకాధికారులుగా నియమిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఒకేసారి ప్రత్యేకాధికారులు ఉండాల్సి రావడంతో.. కొత్తవాటిల్లో పాత అధికారులే బాధ్యతలు స్వీకరిస్తారు.

**ఆ ఐదు మినహా..:** రాష్ట్రంలోని గ్రేటర్ హైదరాబాద్, గ్రేటర్ వరంగల్‌తోపాటు మరో మూడు మున్సిపాలిటీలు మినహా మిగిలిన పాలకవర్గాల పదవీకాలం సంపూర్ణంగా ముగిసింది. జీహెచ్‌ఎంసీలో దాదాపు ఏడాదిన్నర, వరంగల్, ఖమ్మంలో రెండేండ్లు, అచ్చంపేట, సిద్దిపేటలో ఏడాదిన్నరకుపైగా పదవీకాలం ఉన్నది. వీటిని మినహాయించి, మిగిలిన 68 మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధికారులు పాలనాపగ్గాలు తీసుకోనున్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఉదయం పాలకవర్గాలను సన్మానించి సాగనంపనున్నారు. వారి పదవీకాలం సంపూర్ణంగా పూర్తిచేసినట్లు సంతకాలు పెట్టించుకున్న తర్వాత ప్రత్యేకాధికారులు బాధ్యతలు తీసుకుంటారు. ప్రత్యేకాధికారులను ఇంకా నియమించని మున్సిపాలిటీల్లో కమిషనర్లు ఇంచార్జులుగా వ్యవహరించనున్నారు.

**వార్డుల విభజన పూర్తి:** మున్సిపల్ ఎన్నికలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని 138 మున్సిపాలిటీలవారీగా వార్డుల విభజనను షెడ్యూలుకు అనుగుణంగా పూర్తిచేశారు. ఈ మేరకు ముసాయిదాను ప్రభుత్వానికి పంపించారు. మంగళవారం నుంచి ఈ నెల 5 వరకు అభ్యంతరాలను స్వీకరించి, 6న పరిష్కారం చేయనున్నారు. 7న తుది జాబితాను ప్రకటించనున్నారు. వార్డుల విభజన, ఓటర్ల జాబితా లెక్కతేల్చిన తర్వాత ఈ నెల 14లోగా రిజర్వేషన్లు ఖరారు చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం పాలకవర్గాలు కూడా లేకపోవడంతో త్వరగా రిజర్వేషన్లు ఖరారు చేసి, జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## నిర్ణయాధికారం నియంత్రణ కమిటీదే

ఇంజినీరింగ్ కాలేజీల ఫీజుల పెంపుపై సుప్రీంకోర్టు

హైకోర్టు తీర్పును పక్కనపెట్టిన సర్వోన్నత న్యాయస్థానం

టీఏఎఫ్‌ఆర్సీ నిర్ణయించిన ఫీజులకు సమర్థన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వాసవి, శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఇంజినీరింగ్ కళాశాలల ఫీజులను నిర్ణయించే విషయంలో తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీ రెగ్యులేషన్ కమిటీ (టీఏఎఫ్‌ఆర్సీ)దే తుది నిర్ణయమని సుప్రీంకోర్టు సోమవారం తీర్పును వెలువరించింది. రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలల ఫీజులను నియంత్రించడంతోపాటు రుసుముల నిర్ధారణకోసం హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో టీఏఎఫ్‌ఆర్సీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఈ కమిటీలో ఆర్థిక, విద్యారంగాల నిపుణులతోపాటు తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్, ఒక యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి సహా పలువురు నిపుణులు సభ్యులుగా మిగతా 2వ పేజీలో

## ఉత్సాహంగా సభ్యత్వాలు




గులాబీ పార్టీకి ప్రజల నుంచి అద్భుత స్పందన

పాల్గొంటున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు

విదేశాల్లోనూ జోరుగా నమోదు



7

సోమవారం నిర్మల్ నియోజకవర్గ పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జి ఎండీ ఖాజా ముజీబొద్దీన్ నుంచి సభ్యత్వం స్వీకరిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

**టీఆర్‌ఎస్** పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతున్నది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం పెద్దసంఖ్యలో పార్టీ సభ్యత్వాన్ని తీసుకోవడానికి ముందుకువచ్చారు. ప్రజల నుంచి కూడా అద్భుతమైన స్పందన కన్పించింది. ఈ స్పందన చూసి నిర్దేశించిన లక్ష్యాన్ని అతి తక్కువ సమయంలో చేరుకుంటామని నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## సచివాలయ తరలింపుపై నేడు సీఎం కేసీఆర్ సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర సచివాలయం తరలింపుపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంగళవారం అధికారులతో సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్ బీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో తరలింపు ఏర్పాట్లపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎంవో ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. నూతన సచివాలయాన్ని నిర్మించాలన్న నిర్ణయం మేరకు జూన్ 27న ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. దీనిని నిర్మించే లోపు ఇక్కడి శాఖల కార్యాలయాలను ఇతర భవంతులకు తరలించాల్సి ఉన్నది. ఏ శాఖ కార్యాలయాన్ని ఎక్కడికి తరలించాలనే దానిపై ఇప్పటికే ప్రాథమికంగా కసరత్తు జరిగింది.

## పట్టా ఒకచోట.. మోఖా మరోచోట

సర్వేచేసి హద్దులు నిర్ణయించడంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

చనిపోయిన భార్య, తండ్రిపేరిట భూమి విరాసత్ చేయకుండా వేధింపులు

ఏండ్లుగా తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తుమ్మనపల్లి రైతు ప్రదక్షిణలు

సర్వే నంబర్ దాటి మోఖాపైకి వచ్చిన పొరుగు రైతులు

**తండ్రి,** భార్య చనిపోవడంతో వారి పేరిట ఉన్న భూమిని హక్కుదారుకు విరాసత్ చేయకుండా రెవెన్యూ అధికారులు వేధిస్తున్నారు. ఆ భూమికి హద్దులు కూడా నిర్ణయించకపోవడంతో పక్కనున్న రైతులు వారి సర్వే నంబర్లు దాటి బలవంతంగా మోఖాపైకి వస్తున్నారని ఓ రైతు మొరపెట్టుకున్నా స్పందించడం లేదు. గతంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేసిన సర్వే ప్రకారం హద్దులు నిర్ణయించాలని కోరినా కిందిస్థాయి సిబ్బంది ఏండ్లుగా పట్టించుకోవడం లేదు. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లికి చెందిన రైతు బండి మల్లారెడ్డి ధర్మగంటను ఆశ్రయించారు. 4

ధర్మగంట



తన భూమి పత్రాలు చూపుతున్న తుమ్మనపల్లి రైతు బండి మల్లారెడ్డి

### యాదగిరికి వెంటనే భూమి చూపండి 4

అధికారులకు నల్లగొండ జేసీ వీ చంద్రశేఖర్ ఆదేశం

'అంధుడితో రెవెన్యూ ఆట!' కథనానికి స్పందన

## కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు

ఆరు నెలలు పొడిగింపునకు రాజ్యసభలో బిల్లు ఆమోదం 9

- కశ్మీర్‌లో రిజర్వేషన్ సవరణ బిల్లుకు సైతం ఆమోదముద్ర
- రెండు బిల్లులను ఎగువసభలో ప్రవేశపెట్టిన అమిత్‌షా
- వేర్పాటువాదం, ఉగ్రవాదాన్ని సహించబోమన్న కేంద్రహోంమంత్రి



సోమవారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలో కురిసిన వర్షానికి పంట పొలాల్లో నిలిచిన నీరు

# బంగాళాఖాతంలో వాయుగుండం!

- 24 గంటల్లో ఏర్పడే అవకాశం
- తీవ్ర అల్పపీడనంగా మారిన అల్పపీడనం
- తెలంగాణలో చాలాచోట్ల తేలికపాటినుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం
- కొన్నిచోట్ల భారీ నుంచి అతిభారీ వానలు
- తెలంగాణలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

### పలుచోట్ల ఓ మోస్తరు వానలు

పలుజిల్లాల్లో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గంటపాటు భారీ వర్షం కురిసింది. నిర్మల్, నిజామాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ అర్బన్ జిల్లాల్లో ఓ మోస్తరు వాన పడింది. తాజా వర్షాలతో భూమి పదును కావడంతో పలు ప్రాంతాల్లో రైతన్నలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. భారీ వర్షాలు కురిస్తే సాగుకు మేలు జరుగుతుందని ఆకాంక్షిస్తున్నారు. వివరాలు 5,7 పేజీల్లో

## ఎమ్మెల్యే వనమాపై అటవీ కేసు

విధులకు ఆటంకం కలిగించారంటూ పీఎస్‌లో కేసు

రెండురోజుల తరువాత ఫిర్యాదుచేసిన అటవీ అధికారులు

ఎలాంటి దౌర్జన్యం చేయలేదు.. గిరిజన రైతులకు మద్దతుగానే వెళ్లా: వనమా

3

## సార్సాలలో హరితహారం

పోలీసు భద్రత నడుమ మొక్కలు నాటిన అటవీ సిబ్బంది

20 హెక్టార్లలో 22 వేల మొక్కలు లక్ష్యం

## బస్సు లోయలో పడి 35 మంది మృతి

జమ్ముకశ్మీర్ కిష్టావర్‌లో ప్రమాదం

సామర్థ్యానికి మించి ప్రయాణికులను బస్సులో తీసుకెళ్లడమే కారణం!



జమ్ముకశ్మీర్‌లోని కిష్టావర్‌లో లోయలో పడిపోయిన మినీ బస్సు 9





తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన 2018 బ్యాచ్ ఐఏఎస్ ప్రొబేషనరీ అధికారుల బృందం సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో భేటీ అయిన దృశ్యం. చిత్రంలో ఎంసీఆర్ హెచ్చార్డీ డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య, గవర్నర్ సెక్రటరీ సురేంద్రమోహన్ కూడా ఉన్నారు.

## టీ-వ్యాలెట్‌తో ఈ-పాస్ అనుసంధానం

17 వేల రేషన్ షాపుల్లో సేవలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీ-వ్యాలెట్‌ను ప్రజాపంపిణీ వ్యవస్థలో వినియోగిస్తున్న ఈ - పాస్ మిషన్లకు అనుసంధానం చేసినట్టు తెలంగాణ వినియోగదారుల వ్యవహారాలు, పౌరసరఫరాలశాఖ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. జూలై ఒకటి డిజిటల్ ఇండియా వార్షికోత్సవం సందర్భంగా ఈ నిర్ణయం అమలు చేసినట్టు తెలిపింది. ఇకనుంచి ప్రజలు రాష్ట్రంలోని 17 వేల రేషన్‌షాపుల్లో టీ వ్యాలెట్ సేవలు వినియోగించుకోవచ్చని వెల్లడించింది. రంగారెడ్డి జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలుచేశామని, విజయవంతం కావటంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నట్టు పేర్కొన్నది. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 173 మండల్ లెవల్ స్టాకిస్ట్ (ఎంఎల్‌ఎస్)లలో ఈ-పాస్ డివైస్‌లను ఏర్పాటుచేసినట్టు వెల్లడించింది. దీనివల్ల 16 సంక్షేమశాఖలకు సబ్సిడీ బియ్యం పంపించడం పారదర్శకంగా, బాధ్యతాయుతంగా జరుగుతున్నదని తెలిపింది.

## మరమ్మతు పనులకు సర్కారు అనుమతి

- శ్రీరాంసాగర్ మొదటిదశ పరిధిలోని మైనర్లు, సబ్‌మైనర్ కాల్వలకు గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శ్రీరాంసాగర్ మొదటిదశ పరిధిలోని 81.600 కిలోమీటర్ల మేర ఉన్న డీబీఎం-30, దాని పరిధిలోని మైనర్లు, సబ్‌మైనర్ కాల్వలకు అదేవిధంగా 43.500 కిలోమీటర్ల పొడవున్న ఉన్న డీబీఎం-40, దాని పరిధిలోని మైనర్లు, సబ్‌మైనర్ల మరమ్మతులకు మార్గం సుగమమైంది. రూ.44.71 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ పనులను కావేరి- అమృత ఏజెన్సీలకు ఇప్పటికే పూర్తయిన ఒప్పంద రేట్ల ప్రకారం చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతోపాటు ఎస్సారెస్పీ మొదటిదశలో భాగంగా కాకతీయ ప్రధాన కాలువపై ఆటోనగర్ 229.275 కిలోమీటరు, దసాయిపేట 230.125 కిలోమీటరు వద్ద ఉన్న యూటీల పునర్నిర్మాణానికి రూ.14.31 కోట్ల పనులను ఎస్కేర్-ఎస్సార్సీ-ఎస్ఎల్ఈసీ ఏజెన్సీతో కొనసాగించేందుకు ప్రభుత్వం అనుమతించింది. వీటికి సంబంధించి సోమవారం నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు.



# విద్యావ్యవస్థను పటిష్ట పరచండి

- పేద పిల్లలకూ నాణ్యమైన విద్యను అందించండి
- ఇంటర్ విద్యార్థులకు సున్నా మార్కులు ఎందుకొస్తున్నాయి
- పీహెచ్‌డీలో అడ్మిషన్ల ప్రక్రియలో ప్రమాణాలు పాటించండి
- విద్యాశాఖ అధికారులతో గవర్నర్ నరసింహన్ సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్ట పరచాలని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ చెప్పారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్యావిధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నాలుచేయాలని సూచించారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధిపై భారీగా ఖర్చు పెడుతున్నా.. నాణ్యమైన విద్యావిధానం ఎందుకు అందుబాటులోకి రావడం లేదని, దీనిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, ఉన్నత విద్యాశాఖ ఉన్నతాధికారులతో గవర్నర్ సోమవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో సమీక్ష నిర్వహించారు. గవర్నర్ ప్రధానంగా ప్రస్తావించిన అంశాలను విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి అనంతరం మీడియాకు వెల్లడించారు. టెన్త్ పూర్తిచేసిన విద్యార్థులకు తిరిగి ఇంటర్మీడియట్‌లో ఎందుకు సున్నా మార్కులు వస్తున్నాయని గవర్నర్ అనుమానం వ్యక్తంచేశారని తెలిపారు. ముఖ్యంగా విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియలో ప్రమాణాలు పాటించాలని సూచించినట్టు పేర్కొన్నారు. థీసిస్‌లో నాణ్యత ఉండాలని, ఈ విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నట్టు తెలిపారు. యూనివర్సిటీల్లో విద్యా క్యాలెండర్ అమలుకు వీసీలు చొరవచూపాలని, స్నాతకోత్సవాలు ప్రతిఏడాది తప్పకుండా నిర్వహించి విద్యార్థులకు పట్టాలు ప్రదానంచేయాలని గవర్నర్ సూచించినట్టు కార్యదర్శి తెలిపారు. ప్రాథమికస్థాయి నుంచే నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకెళ్లడం వల్ల ఉన్నత విద్యావిధానం పూర్తిగా పటిష్ట పరచవచ్చని గవర్నర్ అభిప్రాయపడినట్టు ఆయన చెప్పారు. సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి, వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వీ వెంకటరమణ, ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ ఏ అశోక్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ పాల్గొన్నారు.

# టీఎస్‌సెట్‌కు సర్వం సిద్ధం

**5, 6 తేదీల్లో 43 కేంద్రాల్లో నిర్వహణ**

- మొదటిసారిగా ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష
- 15 నిమిషాలముందే కేంద్రంలో ఉండాలి
- ఓయూ వీసీ, సెట్ మెంబర్ సెక్రటరీ వెల్లడి



సోమవారం మీడియాతో మాట్లాడుతున్న ఓయూ వీసీ ప్రొఫెసర్ రామచంద్రం. చిత్రంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, ఇతర అధికారులు కూడా ఉన్నారు.

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ /ఉస్మానియా యూనివర్సిటీ:** తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్- 2019 (టీఎస్-సెట్)ను ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఉస్మానియా యూనివర్సిటీ వీసీ, సెట్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్ రామచంద్రం, సెట్ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ యాదవరాజు చెప్పారు. ఈ పరీక్షను తొలిసారిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను పూర్తిచేశామని తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులకు అర్హత సాధించేందుకు నిర్వహించే టీఎస్ సెట్ నిర్వహణ వివరాలను ఓయూ గెస్ట్‌హౌస్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డితో కలిసి వారు సోమవారం మీడియాకు వెల్లడించారు. టీఎస్‌సెట్ నిర్వహించేందుకు ఓయూకు యూజీసీ అనుమతించిందన్నారు. మొత్తం 29 సబ్జెక్టులకుగాను 44,648 దరఖాస్తులు అందాయని, వారికి రాష్ట్రవ్యాప్తంగా పది ఉమ్మడి జిల్లాల్లో 11 నగరాల్లో 43 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామని చెప్పారు. అత్యధికంగా తెలుగుకు 5,735, లైఫ్ సైన్సెస్‌కు 5,600, కెమికల్ సైన్సెస్‌కు 3,835, ఇంగ్లిష్‌కు 3,983, గణితానికి 3,802 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. గతనెల 25నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం కల్పించామని, ఇప్పటివరకు 25 వేల మందికిపైగా హాల్‌టికెట్లు పొందారని చెప్పారు. పరీక్షను ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు రెండు విడుతలుగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్షా ప్రారంభానికి గంటన్నర ముందు నుంచే అభ్యర్థులను లోపలికి అనుమతిస్తామని చెప్పారు. లోపలికి ప్రవేశించిన అనంతరం బయోమెట్రిక్ హాజరు, ఫొటో ఐడీ, వేలిముద్ర, కంప్యూటర్ కేటాయింపు తదితర ప్రక్రియ ఉంటుందని వివరించారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే కేంద్రం గేట్లు మూసివేస్తామని, తర్వాత ఎవరినీ లోపలికి అనుమతించబోమని స్పష్టంచేశారు. సమావేశంలో ఓఎస్డీ ప్రొఫెసర్ కృష్ణారావు, ఔటా అధ్యక్షుడు ప్రొఫెసర్ భట్టు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ మనోహర్, పీఆర్ అడ్వైజర్ ప్రొఫెసర్ స్టీవెన్‌సన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవీందర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జితేందర్‌నాయక్, డీన్లు ప్రొఫెసర్ నాయుడు అశోక్, ప్రొఫెసర్ రాజేందర్‌నాయక్, పీఆర్వో డాక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## మొదలైన ఇంజినీరింగ్ ఫీజుల ఖరారు

- తొలిరోజు 30 కాలేజీల్లో ఫీజుల నిర్ణయం
- మరో రెండ్రోజులు యాజమాన్యాలతో టీఏఎఫ్ఆర్సీ భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో బ్లాక్ పీరియడ్ (2019-20 నుంచి 2021-22 వరకు) ట్యూషన్ ఫీజులను నిర్ణయించే ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. తమకు ఫీజులు పెంచాలంటూ హైకోర్టుకు వెళ్లిన 81 ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో తొలుత ఫీజులను ఖరారుచేస్తున్నారు. తొలిరోజు 30 కాలేజీల్లో తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీ రెగ్యులేషన్ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) ఫీజులను నిర్ణయించింది. మరో రెండ్రోజుల్లో మిగిలిన 51 కాలేజీల్లో కూడా ఫీజులు ఖరారుచేయనున్నారు. ఈ క్రమంలో టీఏఎఫ్ఆర్సీ ఆధ్వర్యంలో నిర్ణయించిన ట్యూషన్ ఫీజులను తాము ఒప్పుకుంటున్నామంటూ అంగీకార పత్రాలపై యాజమాన్యాలు సంతకంచేస్తున్నాయి. ఫీజుల కోసం కోర్టుకు వెళ్లని కాలేజీల్లో కూడా రానున్న పదిరోజుల్లో ఫీజులను ఖరారు చేయనున్నారు.

### అప్పీలు చేసుకుంటే లక్ష చెల్లించాలి

ప్రస్తుతం టీఏఎఫ్ఆర్సీ ఆధ్వర్యంలో ఖరారవుతున్న ట్యూషన్ ఫీజులను అంగీకరించకుండా అభ్యంతరం పెట్టిన యాజమాన్యాలు తిరిగి రూ.ఒక లక్ష ఫీజు చెల్లించి అప్పీల్ చేసుకోవాలని కమిటీ స్పష్టంచేసింది. ఈ మేరకు అప్పీల్ చేసుకున్న యాజమాన్యాలకు సంబంధించి ట్యూషన్ ఫీజు ప్రతిపాదనలు పునఃపరిశీలించి ఫీజులను నిర్ణయించనున్నారు. ఈ విధానం భవిష్యత్తులో కూడా కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఇకపై ప్రైవేటు ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యాకాలేజీలు ఇష్టారాజ్యంగా కాకుండా ఒక విధానం ప్రకారం ఫీజులను నిర్ణయించే అంశాలపై టీఏఎఫ్ఆర్సీ దృష్టి సారించిదని అధికారులు తెలిపారు.

## ఇంజినీరింగ్ సీట్లు 92 వేలు

**నిరుడు పోలిస్తే ఈ ఏడాది తగ్గిన నాలుగు వేల సీట్లు**

181 కాలేజీలకు అఫిలియేషన్లు పూర్తి ■ ఐదునుంచి ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఇప్పటివరకు సుమారు 92 వేల ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఎంసెట్ వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభమయ్యే వరకు మరికొన్ని సీట్లు పెరిగే అవకాశాలున్నట్టు తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు యూనివర్సిటీల్లో కలిపి మొత్తం 181 ఇంజినీరింగ్ కాలేజీలకు అఫిలియేషన్లు పూర్తయ్యాయి. దీంతో ఆ కాలేజీల పేర్లను వెబ్ కౌన్సెలింగ్ జాబితాలో పెట్టాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఇందులో జేఎన్టీయూహెచ్ పరిధిలో 157 కాలేజీల్లో 81,009 సీట్లు, కేయూ పరిధిలో ఎనిమిది కాలేజీల్లో 2,565 సీట్లు, మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఒక్క కాలేజీలో 180 సీట్లు, ఓయూ పరిధిలో 15 కాలేజీల్లో 8,180 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. గతేడాదిలో మొత్తం 96 వేల సీట్లు అందుబాటులో ఉండగా, ఈసారి నాలుగు వేల సీట్లు తగ్గాయని అధికారులు తెలిపారు. వీటిలో 70 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో, 30 శాతం సీట్లను యాజమాన్య కోటాలో భర్తీ చేయనున్నారు.

### త్వరలో బ్రాంచీలవారీగా సీట్ల వివరాలు

రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీలతోపాటు బ్రాంచీలవారీగా సీట్ల వివరాల వెల్లడికి చర్యలు చేపట్టామని ఎంసెట్ అధికారులు తెలిపారు. ఆ తర్వాతే ఈ ఏడాదికిగాను కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఐటీ, మెకానికల్ వంటి ఇంజినీరింగ్ కోర్సుల్లో ఎన్ని సీట్లు ఉన్నాయో తెలుస్తుందని పేర్కొన్నారు. ఎంసెట్ వెబ్ కౌన్సెలింగ్ ఈ నెల ఐదు నుంచి ప్రారంభమవుతుందని, అప్పటి వరకు బ్రాంచ్‌లవారీగా సీట్ల వివరాలను విద్యార్థులకు వెల్లడిస్తామని తెలిపారు.

## గోదావరి మథనంపై కమిటీ భేటీ నేడు

- రేపు ఏపీ ఇంజినీర్లతో సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణా బేసిన్‌కు గోదావరిజలాల తరలింపు ప్రతిపాదనల రూపకల్పనపై ఇంజినీర్లు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికైతే రెండు రాష్ట్రాల ఇంజినీర్ల నుంచి ప్రధానంగా ఐదు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. వీటిపై ప్రాథమిక కసరత్తు పూర్తిచేసిన ఇంజినీర్లు.. ఆయా ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలు, ప్రయోజనాలు, అంచనావ్యయాలపై విస్తృతంగా చర్చించాలని నిర్ణయించారు. ఈ అంశంపై తెలంగాణ నీటిపారుదలశాఖ నియమించిన కమిటీ మంగళవారం భేటీ కానున్నది. బుధవారం ఏపీ ఇంజినీర్లతో సంయుక్త సమావేశం ఉన్నందున అంతకంటే ముందు కమిటీ ఒకసారి భేటీ అయి.. అంతర్గతంగా లోతైన చర్చచేయాలని భావిస్తున్నది. కమిటీకి నేతృత్వం వహిస్తున్న నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు ఈ మేరకు సభ్యులకు సమాచారమిచ్చారు. అంతర్రాష్ట్ర సీఈ నర్సింహారావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు సీఈ నర్సింహ, సీతారామప్రాజెక్టు ఎస్ఈ నాగేశ్వరరావు, అంతర్రాష్ట్ర ఎస్ఈ మోహన్‌కుమార్‌తోపాటు విశ్రాంత ఇంజినీర్లు ఎం శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రమౌళి, వెంకట్రామారావు, సత్తిరెడ్డి, భవానీ రామ్‌శంకర్ ఈ సమావేశంలో పాల్గొననున్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాలకు రోజుకు నాలుగు టీఎంసీల చొప్పున గోదావరిజలాలను తరలించేందుకు ప్రాజెక్టుల రూపకల్పన ఉండాలని తెలంగాణ, ఏపీ సీఎంలు ఆదేశించిన దరిమిలా ప్రస్తుతానికి ప్రధానంగా వినిపిస్తున్న ఐదు ప్రతిపాదనలపై కమిటీ చర్చించనున్నది.

# మిషన్ భగీరథ భేష్

- ఉత్తరప్రదేశ్ గ్రామీణాభివృద్ధి, తాగునీటిశాఖల ప్రత్యేక కార్యదర్శి సురేంద్రరామ్ ప్రశంస
- మిషన్ భగీరథపై అధ్యయనానికి రాష్ట్రానికి వచ్చిన యూపీ ప్రతినిధులు



ఎర్రమంజిల్‌లోని భగీరథ ప్రధాన కార్యాలయంలో ఈఎన్సీ కృపాకర్‌రెడ్డితో సమావేశమైన యూపీ గ్రామీణాభివృద్ధి, తాగునీటిశాఖల ప్రత్యేక కార్యదర్శి సురేంద్రరామ్ నేతృత్వంలోని ఇంజినీర్ల బృందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మిషన్ భగీరథ లాంటి ప్రాజెక్టుతోనే తాగునీటి కష్టాలకు చెక్ పెట్టవచ్చని ఉత్తరప్రదేశ్ గ్రామీణాభివృద్ధి, తాగునీటిశాఖల ప్రత్యేక కార్యదర్శి సురేంద్రరామ్ అన్నారు. ఇంత భారీ ప్రాజెక్టు మిషన్ భగీరథను తక్కువకాలంలో పూర్తిచేసి మిగతా రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. మిషన్‌భగీరథ ప్రాజెక్టును అధ్యయనం చేయడానికి ఉత్తరప్రదేశ్ నుంచి ఇంజినీర్ల బృందంతో వచ్చిన సురేంద్రరామ్.. సోమవారం ఎర్రమంజిల్‌లోని భగీరథ ప్రధాన కార్యాలయంలో ఈఎన్సీ కృపాకర్‌రెడ్డితో సమావేశమయ్యారు. మిషన్‌భగీరథ ప్రాజెక్టు నిర్మాణం, తాగునీటిని సరఫరాచేస్తున్న తీరును యూపీ బృందానికి ఈఎన్సీ వివరించారు. ఈ సందర్భంగా సురేంద్రరామ్ మాట్లాడుతూ.. భగీరథ టెండరింగ్ విధానంలోని నియమ నిబంధనలను ప్రశంసించారు. ఐదేండ్లపాటు నిర్మాణాలు, పైపుల నిర్వహణ పూర్తిబాధ్యత వర్క్ ఏజెన్సీలపైనే ఉంచడంతో క్వాలిటీవర్క్ జరుగుతుందన్నారు. ముఖ్యంగా భగీరథ నిర్వహణ కోసం అనుసరించే విధానాలు ఎంతో బాగున్నాయని కొనియాడారు. కాగా మిషన్‌భగీరథ నిర్వహణ, సాంకేతిక అంశాలపై కన్సల్టెంట్ నందారావు.. మిషన్ భగీరథ వెబ్‌సైట్, మొబైల్‌యాప్ తయారీపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ్‌కుమార్.. భగీరథలో ఉపయోగించిన జీఐఎస్, ఎంఐఎస్ పరిజ్ఞానంపై డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జ్యోతి ప్రెజెంటేషన్ ఇచ్చారు. తక్కువ కాలంలోనే ప్రాజెక్టుకు కావాల్సిన అన్ని అనుమతులు ఎలా సాధించారని యూపీ బృందం అడుగగా.. సీఎం కేసీఆర్ చొరవ, వివిధశాఖలతో నిరంతర సమన్వయం ద్వారా సాధ్యపడిందని ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి వివరించారు. ప్రతి ఒక్కరికి శుద్ధిచేసిన తాగునీరు అందించాలన్న సీఎం కేసీఆర్ సంకల్పంతోనే ప్రాజెక్టు నిర్మాణం నిర్విఘ్నంగా కొనసాగిందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజినీర్లు జగన్మోహన్‌రెడ్డి, విజయ్‌ప్రకాశ్, రమేష్, వినోభాదేవి, చెన్నారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కన్సల్టెంట్లు నందారావు, మనోహర్‌బాబుతోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నవోదయ, కేంద్రీయ విద్యాలయాలను తెలంగాణలో ఏర్పాటుచేయండి

- అభివృద్ధి అంశాలకు సహకరిస్తాం.. రాష్ట్రానికి కేంద్రం సహకరించాలి
- కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో బోధనా సిబ్బంది రిజర్వేషన్ బిల్లుకు టీఆర్ఎస్ మద్దతు
- లోక్‌సభలో టీఆర్ఎస్ పక్ష నేత నామా నాగేశ్వరరావు



సోమవారం లోక్‌సభలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ పక్ష నేత నామా నాగేశ్వరరావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. లోక్‌సభలో సోమవారం కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించిన రిజర్వేషన్ బిల్లు-2019పై జరిగిన చర్చలో పాల్గొన్న ఎంపీ నామా.. టీఆర్ఎస్ తరపున బిల్లుకు మద్దతు ప్రకటించారు. టీచర్స్ క్యాడర్‌లో ఏడువేల ఖాళీలను భర్తీచేయడానికి ప్రవేశపెట్టిన ఈ బిల్లు వల్ల ప్రతి రాష్ట్రానికి మేలు జరుగుతుందని.. ముఖ్యంగా కేంద్రీయ, నవోదయ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ అవుతాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు టీఆర్ఎస్ మద్దతు ఉంటుందని, అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు కేంద్రం కూడా మద్దతు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేసి.. ఎస్టీ, మైనార్టీల రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లును కేంద్రానికి పంపించిందని దానిని కేంద్రం ఆమోదించాలని కోరారు. విద్యాభివృద్ధి కోసం కీలక నిర్ణయాలు తీసుకొంటున్న తెలంగాణ ప్రభుత్వానికి, కేంద్రం సహకరించాలన్నారు. దేశంలో 45 జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు లేవని కేంద్రమంత్రి వెల్లడించారని అందులో తెలంగాణకు సంబంధించిన జిల్లాలే 23 ఉన్నాయని నామా పేర్కొన్నారు. ఆయా జిల్లాల్లో నవోదయ, కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటుచేయాలని.. వాటికి అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తుందని చెప్పారు. సీఎం కేసీఆర్ విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని, తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం 700 గురుకులాలను ఏర్పాటుచేశారని వివరించారు. వీటిల్లో దాదాపుగా 1.50 లక్షల మంది విద్యార్థులు చదువుకొంటున్నారని, వారికి ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తున్నదని తెలిపారు.

### ముహూర్తం

సూర్యోదయం: 5.50 గంటలకు

సూర్యాస్తమయం: 6.51 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, అమావాస్య, నక్షత్రం: మృగశిర ఉదయం 8.15 వరకు, తదుపరి ఆరుద్ర, అమృతఘడియలు: రాత్రి 9.17 నుంచి 10.53 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.35 నుంచి సాయంత్రం 5.13 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.26 నుంచి 9.18 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి 3.22 వరకు, వర్జ్యం: సాయంత్రం 4.04 నుంచి 5.40 వరకు.

### లోకం పోకడ




ఇవి ఉత్తపాలు కావమ్మో.. నీళ్లు కలిపిన పాలు ధర పెంచేస్తున్నా!

# చిన్నారుల సంరక్షణకు తగిన చర్యలు

**సీఎస్ ఎస్కే జోషి వెల్లడి ■ బచ్‌పన్ బచావో ఆందోళన్ బృందంతో భేటీ**



సోమవారం సచివాలయంలో సీఎస్ ఎస్కే జోషితో సమావేశమైన బచ్‌పన్ బచావో ఆందోళన్ చీఫ్ అడ్వయిజర్ సమీర్ మాథుర్. చిత్రంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో చిన్నారుల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి వివరించారు. బాలకార్మికులను లేకుండా చేసేందుకు దుకాణాలు, ఫ్యాక్టరీల దగ్గర నిరంతరం తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. బచ్‌పన్ బచావో ఆందోళన్ బృందం రాష్ట్రంలో రెండు రోజులు పర్యటించింది. ఈ క్రమంలో సోమవారం ఎంసీఆర్‌హెచ్చార్డీలో ఆయాశాఖల అధికారులతో బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా తీసుకుంటున్న చర్యలను బృందం సభ్యులు వివరించారు. చిన్నారుల సంరక్షణపై కేంద్రప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించిందని.. ప్రధానంగా ఆడపిల్లల తరలింపు, సంరక్షణపై దృష్టి పెట్టామని సభ్యులు పేర్కొన్నారు. అనాథలు, చిన్నారుల సంరక్షణ సంస్థలతో కూడా సమావేశమయ్యారు. చిన్నారుల కోసం తీసుకుంటున్న అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలుసూచనలు చేస్తూ సీఎస్‌కు నివేదిక అందించారు. పిల్లల హక్కుల పరిరక్షణకు నిధులు కేటాయించాలన్నారు. జువైనల్ హోంలల్లో జువైనల్ జస్టిస్ బోర్డులను ఏర్పాటు చేయాలని, చైల్డ్ వెల్ఫేర్ కమిటీల పరిశీలన పెంచాలని సూచించారు. అదేవిధంగా జిల్లా, రాష్ట్రస్థాయిలో చిన్నారుల సంక్షేమం, చైల్డ్ లేబర్‌ను అరికట్టేందుకు ఆయా శాఖల్లో సిబ్బందిని నియమించాలని, ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఎంపీగా ఉన్నప్పుడు వినోద్ కుమార్ అధ్యక్షతన చైల్డ్ వెల్ఫేర్ కోసం సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కమిటీ సూచించింది. బచ్‌పన్ బచావో ఆందోళన్ చీఫ్ అడ్వయిజర్ సమీర్ మాథుర్, రాష్ట్ర కో ఆర్డినేటర్ చందనతో పాటు పలువురు ఉన్నారు.

## నిర్ణయాధికారం నియంత్రణ కమిటీదే


మొదటిపేజీ తరువాయి...


ఉన్నారు. ఫీజులను నిర్ణయించేందుకు ఇన్‌స్టిట్యూట్ ఉన్న ప్రాంతం, కోర్సు స్వభావం, సదుపాయాల వ్యయం, పరిపాలన-నిర్వహణ, సంస్థ అభివృద్ధికి అవసరమైన మిగులు నిధులు వంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఫీజుల నియంత్రణ కమిటీ ఆయా కాలేజీల ఫీజులను నియంత్రిస్తుంది. ఈ క్ర మంలోనే పిటిషనర్ కళాశాలల ప్రతిపాదనలు స్వీకరించడంతోపాటు ప్రతినిధులతో సంప్రదింపులు జరిపిన అనంతరం ఫీజును రూ.86 వేలు, రూ.91 వేలుగా నిర్ధారించింది. ఈ నిర్ణయాన్ని సవాలుచేస్తూ కళాశాలలు హైకోర్టును ఆశ్రయించాయి. అంశం కోర్టు విచారణలో ఉండగా ఫీజులను సమీక్షించిన టీఏఎఫ్ఆర్సీ ఫీజులను రూ.97 వేలకు పెంచింది. దీనిని కూడా కాలేజీలు సవాలుచేయడంతో హైకోర్టు ఫీజులను రూ.1,60,000, రూ.1,37,000లకు పెంచుతూ తీర్పునిచ్చింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, తల్లిదండ్రుల సంఘం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. ఏప్రిల్‌లో తీర్పు ను రిజర్వుచేసి, సోమవారం వెలువరించింది. టీఏఎఫ్ఆర్సీ నిర్ణయించిన ఫీజులను పెంచడం ద్వారా హైకోర్టు తన అధికార పరిధిని దాటిందని సుప్రీంకోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలోని నిపుణులు.. టీఏఎఫ్ఆర్సీ మార్గదర్శకాల ప్రకారం నిర్ణయించిన ఫీజులనే సమర్థించింది. ఫీజులను నిర్ధారించడంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన టీఏఎఫ్ఆర్సీదే అంతిమ నిర్ణయమని తెలిపింది.



బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు కూడలి వద్ద డిజిటల్, అనలాగ్ సిగ్నళ్ల ఏర్పాటుతో రోడ్డుకు అడ్డంగా ఎర్రలైట్లు వెలుగుతున్న దృశ్యం

## హైదరాబాద్‌లో సరికొత్త సిగ్నల్ వ్యవస్థ


మొదటిపేజీ తరువాయి...


లైట్లు కనబడేలా డిజిటల్, అనలాగ్ సిగ్నళ్లను ఏర్పాటుచేస్తున్నారు. ఈ విధానాన్ని బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు కూడలి వద్ద ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. దూరంనుంచి వచ్చేవారికి కూడా కనబడేలా డిజిటల్ లైటింగ్‌ను రోడ్డుకు అడ్డంగా పడేలా ఏర్పాటుచేశారు. రాత్రిపూట సిగ్నళ్లు సరిగా కనిపించక వాహనదారులు వేగంగా దూసుకువెళ్లి ప్రమాదాలకు గురవుతున్న సంగతి తెలిసిందే. ఇలాంటి ముప్పును తగ్గించడంతోపాటు ఎదురుగా రోడ్డుకు అడ్డంగా లైటింగ్‌తో స్టాప్‌లైన్ దాటి వాహనాలు నిలిపితే సీసీ కెమెరా ద్వారా ఫొటోలు తీసి చలానా విధించే అవకాశాలు ఉన్నాయి. కేబీఆర్ పార్కు సిగ్నల్ వద్ద ఏర్పాటుచేసిన వ్యవస్థ పనితీరు ఆధారంగా ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి సిగ్నళ్లను ఏర్పాటు చేస్తామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.



## కిక్కిరిసిన ఎములాడ

వేములవాడ రాజరాజేశ్వర స్వామి సన్నిధి సోమవారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే స్వామివారికి మొక్కులు చెల్లించుకొనేందుకు భక్తులు బారులు తీరగా, శీఘ్ర, ప్రత్యేక దర్శనం క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. దాదాపు 15 వేల మంది రాజన్నను దర్శించుకోగా, రూ.19 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు.

-వేములవాడ కల్చరల్



## రామయ్య హుండీ ఆదాయం రూ.1.09 కోట్లు

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో సోమవారం ఆలయ సిబ్బంది, అధికారులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. హుండీ ఆదాయం రూ.1.09 కోట్లు వచ్చినట్టు ఆలయ ఈవో తాళ్లూరి రమేశ్‌బాబు తెలిపారు. బంగారం 125 గ్రాములు, వెండి 1.5 కిలోలు లభించిందన్నారు.

-భద్రాచలం

## సుంకిశాలకు..ఎన్నారై విరాళం రూ.కోటి



ఎన్నారై పైళ్ల మల్లారెడ్డి (ఫైల్)

**వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని సుంకిశాలలో తన సొంత నిధులతో నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి ఎన్నారై డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి రూ.కోటి విరాళం అందజేశారు. సోమవారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు గుమ్మి సాయిరెడ్డి మీడియాతో మాట్లాడుగూ.. యాదాద్రి దేవస్థానం దత్తత ఆలయమైన సుంకిశాల ఆలయం అభివృద్ధికి రూ.కోటితోపాటు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు అందజేసినట్లు తెలిపారు. ఈ నిధులతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు.



# దాడి ఘటనపై ప్రభుత్వ స్పందన బాగుంది

- రక్షణ పెరుగాలి.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేయాలి
- నిందితులపై పీడీ యాక్ట్‌ను ప్రయోగించాలి: అటవీ సిబ్బంది



సోమవారం అరణ్యభవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తీవ్ర సంచలనం సృష్టించిన కాగజ్‌నగర్ సార్సాల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన తీరు బాగుందని అటవీశాఖ అధికారులు, ఉద్యోగులు సంతృప్తి వ్యక్తంచేశారు. హరితహారంలో నిర్దేశించిన భారీలక్ష్యంతో ముందుకుసాగుతున్న తమకు స్థానికంగా మరింత రక్షణకావాలని ప్రభుత్వాన్ని కోరారు. అటవీ ఉద్యోగులపై జరిగిన దాడుల్లో నిందితులను సత్వ రం శిక్షించడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేయాలని, నిందితులపై పీడీ యాక్ట్ ప్ర యోగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. సోమవారం అరణ్యభవన్‌లో ఐఎఫ్‌ఎస్ అధికారులతోపాటు రేంజ్ ఆఫీసర్ల సంఘం, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ల సంఘం, మినిస్టీరియల్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. సమావేశం.. మహిళా అధికారిపై దాడిని తీవ్రంగా ఖండించింది. వరుసగా దాడులు జరుగుతున్నాయంటూ ఆందోళన వ్యక్తంచేసింది. ఈ సందర్భంగా అధికారులు, వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు మాట్లాడుతూ సార్సాల ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించిన తీరు ఉద్యోగులు, అధికారుల్లో నైతికస్థైర్యాన్ని నింపేలా ఉన్నదని అభిప్రాయపడ్డారు. దాడికి పాల్పడినవారిని అరెస్టుచేయడంతోపాటు దాడి వెనుక ఉన్న పెద్దలపైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

**పోడు ముసుగులో కబ్జాలు**

సీఎం కే చంద్రశేఖర్‌రావు ప్రత్యేక చొరవతీసుకుని తమ శాఖను పటిష్ఠంచేశారని, రాష్ట్రాన్ని పచ్చని తోరణంగా మార్చటానికి హరితహారం కార్యక్రమం చేపట్టారని అన్నారు. నిర్దేశిత నిబంధనల ప్రకారమే హరితహారంలో అటవీ ప్రాంతాల్లో భారీగా మొక్కలు నాటుతున్నామని పేర్కొన్నారు. కానీ ఎక్కడ అడుగుపెట్టినా అక్కడి స్థానిక రాజకీయనాయకులు గిరిజనులు, ఆదివాసీలు పోడుభూముల ముసుగులో కబ్జాలుచేస్తూ దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రస్తుతం హరితహారంలో అటవీశాఖ 50 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందని, దానికోసం తాము అహర్నిశలు కృషిచేసి, పచ్చదనాన్ని పెంపొందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని స్పష్టంచేశారు. కానీ తమకు పోలీసులు, రెవెన్యూ అధికారుల నుంచి సరైన సహకారం అందడం లేదని తెలిపారు. స్థానిక నాయకులు కబ్జాదారులకే వంతపాడుతూ దాడులకు ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. దట్టమైన అడవులలోకి చొరబడి కబ్జాలు చేస్తున్నారని, ఇలాగైతే కొంతకాలానికి అసలు అడవి మిగులదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్టంలో పచ్చదనాన్ని మొత్తం భూభాగంలో 33శాతానికి పెంచాలన్న సీఎం ఉన్నత లక్ష్యాన్ని సాధించడానికి కంకణబద్ధులమై ఉన్నామని ప్రకటించారు. సమావేశంలో ఐఎఫ్‌ఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడు రఘువీర్, ఉపాధ్యక్షుడు మునీంద్ర, కార్యదర్శి లోకేశ్ జైస్వాల్, సంయుక్త కార్యదర్శి స్వర్గం శ్రీనివాస్, అటవీశాఖ ఉద్యోగుల సంఘం కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ల సంఘం, జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘం నాయకులు విజయానందరావు, డీవీ రెడ్డి, మోహన్, నాగేంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

## దాడులను తీవ్రంగా పరిగణిస్తాం

- రాజ్యసభలో కేంద్ర మంత్రి జవదేకర్



సార్సాలలో అటవీశాఖ అధికారులపై జరిగిన దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ రాజ్యసభలో ప్రకటించారు. కర్ణాటకకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రాజీవ్ చంద్రశేఖర్ లేవనెత్తిన ఈ అంశంపై మంత్రి స్పందిస్తూ.. అటవీ అధికారులపై ఎక్కడ దాడులు చోటుచేసుకున్నా ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత దాడుల ఘటనలపై ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని సార్సాల శివారులో భారీగా మొక్కలు నాటుతున్న అటవీ సిబ్బంది, పోలీసులు (ఇన్‌సెట్) మొక్క నాటుతున్న ఎస్పీ మల్లారెడ్డి, సీసీఎఫ్ వినోద్‌కుమార్

# సార్సాలలో హరితహారం

- పోలీసు భద్రత నడుమ మొక్కలు నాటిన అటవీసిబ్బంది
- 20 హెక్టార్లలో 22 వేల మొక్కలు లక్ష్యం

**కుమ్రంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం కొత్త సార్సాల గ్రామ శివారులోని వివాదాస్పదంగా మారిన అటవీభూముల్లో సోమవారం అటవీ అధికారులు పెద్ద ఎత్తున హరితహారం నిర్వహించారు. ఎస్పీ మల్లారెడ్డితోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, కవ్వాల్ టైగర్‌జోన్ సీసీఎఫ్ వినోద్‌కుమార్, కరీంనగర్, వరంగల్ సీసీఎఫ్ అక్బర్ పర్యవేక్షణలో సుమారు 220 మంది అటవీ అధికారులు.. 180 మంది పోలీసుల భద్రత మధ్య మొక్కలు నాటారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురైన అటవీ భూములకు బదులుగా.. సార్సాల అటవీప్రాంతంలో మొక్కలు నాటుతున్న అటవీ అధికారులపై పలువురు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం అటవీ అధికారులు పోలీసుల భద్రత మధ్య వివాదాస్పద భూముల్లో హరితహారం మొక్కలు నాటారు. జిల్లా ఎస్పీ మల్లారెడ్డి, రామగుండం కమిషనర్ సత్యనారాయణ, డీఎఫ్‌వోలు లక్ష్మణ్ రంజిత్‌నాయక్, రామలింగం, శివాని డోగ్రా, ప్రదీప్‌శెట్టి, నర్సింహారావు, రవిప్రసాద్, వజ్రారెడ్డి, సారయ్య, ఖాదర్ మొయినుద్దీన్, రాజారమణారెడ్డి, మంచిర్యాల డీసీపీ రక్షిత కే మూర్తి, బెల్లంపల్లి ఏసీపీ బాలుజాదవ్, ఆసిఫాబాద్ డీఎస్పీ సత్యనారాయణ, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు. సార్సాల శివార్లలో ఎవ్వరికీ పట్టాలివ్వలేదని, అది పూర్తిగా అటవీభూమేనని రెవెన్యూ అధికారులు స్పష్టంచేశారు. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించారు.

**చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదు**

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విధులను నిర్వహిస్తున్న అధికారులపై దాడులు చేయటం, విధులను అడ్డుకోవటం నేరం. అటవీ భూములు సాగుచేసుకుంటున్న రైతులు అన్యాయం జరిగిందని భావిస్తే శాంతియుత విధానంలో పోరాడవచ్చు. కాని ఇష్టానుసారంగా అధికారులను అడ్డుకోవడం, దాడులకు పాల్పడటం సరికాదు. సార్సాల అటవీ భూముల్లో మొక్కలు నాటేందుకు శాంతియుత వాతావరణాన్ని కల్పిస్తాం.

– మల్లారెడ్డి, జిల్లా ఎస్పీ

**అటవీ భూముల్లో హరితహారం**

కాళేశ్వరం నిర్మాణంలో కోల్పోయిన అటవీభూములకు బదులుగా సార్సాలలో ప్రభుత్వం 20 హెక్టార్లు కేటాయించింది. ఈ భూముల్లోనే అటవీశాఖ మొక్కలను నాటుతున్నది. ప్రభుత్వం కేటాయించిన అటవీభూముల్లో హరితహారాన్ని అడ్డుకోవటం ఎవరికీ సాధ్యంకాదు. వివాదం చేయటానికి దాడులకు పాల్పడం సరికాదు.

– అక్బర్, వరంగల్, కరీంనగర్ సీసీఎఫ్

**పూర్తిస్థాయిలో మొక్కలు నాటుతాం**

సార్సాల వద్ద ప్రభుత్వం కేటాయించిన 20 హెక్టార్లలో పూర్తిస్థాయిలో మొక్కలు నాటుతాం. సుమారు 22 వేల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నాం. భావితరాల కోసం ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని అటవీశాఖ విజయవంతం చేస్తుంది.

– వినోద్‌కుమార్, కవ్వాల్ టైగర్‌జోన్ సీసీఎఫ్



శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ట్రెంచ్‌పనులను అడ్డుకున్న గిరిజనులతో మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

# ఎమ్మెల్యే వనమాపై అటవీకేసు

- విధులకు ఆటంకం కలిగించారంటూ పీఎస్‌లో కేసు
- రెండురోజుల తరువాత ఫిర్యాదు చేసిన అటవీ అధికారులు
- ఎలాంటి దౌర్జన్యం చేయలేదు
- గిరిజన రైతులకు మద్దతుగా వెళ్లా: వనమా వెంకటేశ్వరరావు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతోపాటు మరో నలుగురిపై లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. గత శనివారం తమశాఖ అధికారుల విధులకు ఆటంకం కలిగించారంటూ కొత్తగూడెం అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రామకృష్ణ పిచ్చేశ్వరరావు సోమవారం లక్ష్మీదేవిపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. లక్ష్మీదేవిపల్లిలోని ఇల్లెందు క్రాస్‌రోడ్ సమీపంలోని పాత హెలిప్యాడ్ స్థలంలో శనివారం అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో అటవీభూముల చుట్టూ ప్రహరీ నిర్మాణపనులు ప్రారంభించారు. సిబ్బందితో జేసీబీల ద్వారా ట్రెంచ్ నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో గిరిజనులు ఆ భూమి తమదేనంటూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతోపాటు మరికొందరు నాయకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గిరిజనులతో ఎమ్మెల్యే కలిసి ఫారెస్ట్ అధికారులు చేపట్టిన తవ్వకాలను పూడ్చారని అటవీశాఖాధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, వనమా రాఘవేందర్‌రావు, మాజీ ఎంపీటీసీ పూనెం శ్రీనివాస్, నాయకులు ఎస్కే ఫహీముద్దీన్, భూక్యా లింగయ్య అటవీ అధికారులు ఫిర్యాదు చేశారని ఎస్సై నరేశ్ తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు వివరణ కోరగా.. ఫారెస్టు అధికారులపై దౌర్జన్యం చేయలేదని, ఎవరితోనూ మాట్లాడలేదని, కేవలం గిరిజన రైతులకు మద్దతుగానే ఆ ప్రాంతానికి వెళ్లినట్టు తెలిపారు. గిరిజనుల వద్ద ఉన్న కాగితాలను అటవీసిబ్బందికి చూపించినట్టు చెప్పారు. పోడు భూముల విషయంపై సీఎం కేసీఆర్‌తో చర్చించి న్యాయంచేస్తానని మాత్రమే హామీ ఇచ్చానని పేర్కొన్నారు.

## ఉపాధి హామీ అమలులో ఉత్తమ జిల్లాగా సిద్దిపేట

- ఢిల్లీలో డాక్యుమెంటరీ అందజేయనున్న కలెక్టర్
- అధికారులకు ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందనలు



**సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ :** జాతీయ స్థాయిలో ఇప్పటికే పలు అవార్డులు సాధించిన సిద్దిపేట జిల్లాకు మరో కీలక గుర్తింపు లభించింది. ఉపాధి హామీ పథకం అమలులో సిద్దిపేట జిల్లా జాతీయ స్థాయిలో ఉత్తమ జిల్లాగా ఎంపికైంది. ఈ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడం, డబ్బు చెల్లింపు, పనిదినాల కల్పన, హరితహారం, సగటున కుటుంబాలకు కల్పించిన పనిదినాల అమలులో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, నిర్మల్ జిల్లాలు ఎంపికయ్యాయి. ఉపాధి హామీలో భాగంగా కూలీలకు పనిదినాలు కల్పించడంలో సిద్దిపేట జిల్లా ఎంపిక కావడంతో కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి కార్యక్రమం అమలుపై డాక్యుమెంటరీ అందజేయనున్నారు.

**ఎమ్మెల్యే హరీశ్‌రావు మార్గనిర్దేశం**

ఉపాధి హామీలో భాగంగా కేంద్రం అమలు చేస్తున్న అన్ని కార్యక్రమాలు ప్రజలకు అందించాలనే ఆలోచనతో గ్రామాల్లోని ప్రజలకు నిత్యం పని కల్పించడంతోపాటు గ్రామాభివృద్ధికి అధికారులు, ఈజీఎస్ సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పు డు ఎమ్మెల్యే హరీశ్‌రావు మార్గనిర్దేశం చేశారు. గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని మంత్రి హోదాలో పెద్ద సంఖ్యలో సమీక్షలు చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి పీడీ వరకు అప్రమత్తంగా ఉండి ఉపాధి హామీ ఫలాలను ప్రజలకు అందించాలని సూచనలు చేశారు.

**అధికారులకు అభినందనలు**

జాతీయ స్థాయిలో సిద్దిపేట జిల్లాకు గుర్తింపు తేవడంపై ఎమ్మెల్యే హరీశ్‌రావు అధికారులకు అభినందనలు తెలిపారు. పథకం అమలుకు కృషి చేసిన ప్రజాప్రతినిధుల చొరవ, అధికారుల అంకితభావం, కూలీల భాగస్వామ్యం ఉందని, వారి పనిని, కష్టాన్ని వెలకట్టలేనిదన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు కొనసాగించాలని అన్నారు.

## ప్రభుత్వం రక్షణ కల్పించాలి

- ప్రజలకు మంచి చేయాలనే ఈ ఉద్యోగంలోకి
- పశువులకన్నా హీనంగా కొట్టారు
- సిర్సాలలో గాయపడిన ఎఫ్‌ఆర్వో అనిత



**బేగంపేట:** విధుల్లో చేరిన తర్వాత తనకు రక్షణ కల్పించాలని సిర్సాల ఘటనలో గాయపడిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనిత ప్రభుత్వాన్ని కోరారు. కిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆమె సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలను అమలుచేసేందుకే వెళ్లానని, అక్కడ మొక్కలు నాటనున్న విషయాన్ని నాలుగురోజుల ముందు గ్రామస్థులను సమావేశపర్చి, వారికి స్పష్టంగా చెప్పిన తర్వాతే పొలంలోకి వెళ్లామని తెలిపారు. తాము పనులు చేస్తుండగా జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణ వచ్చి పోలీసులను దూరంగా నెట్టేసి దాడికి పాల్పడ్డాడని చెప్పారు. కొట్టొద్దంటూ వేడుకున్నా, పశువులకన్నా హీనంగా దాడిచేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ స్కూళ్లలో చదువుకుని, ప్రజలకు ఎంతోకొంత సేవ చేయాలనే తపనతో ఈ ఉద్యోగంలో చేరానని చెప్పారు. ప్రభుత్వ అధికారులపై దాడిచేయడం సరికాదని అన్నారు. గతంలో కూడా ఇక్కడి రాజకీయ నాయకులు గ్రామస్థులను రెచ్చగొట్టి, అధికారులపైకి ఉసిగొల్పిన సందర్భాలు అనేకం ఉన్నాయని అనిత చెప్పారు. ఇప్పుడు తనపై దాడిచేసినవారిపై ఏదో ఒక కేసు పెడితే రాజకీయ బలంతో మళ్లీ బయటకు వస్తారని, అప్పుడు తన ప్రాణాలకు రక్షణ ఉండదని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని తన ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు.

## టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో గ్రూప్ 2 రెండోవిడుత ఇంటర్వ్యూల జాబితా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రూప్ 2 రెండో విడుత ఇంటర్వ్యూల జాబితా తమ వెబ్‌సైట్లో పొందుపరిచినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. జూలై 8 నుంచి 12 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్న వారి జాబితాను కమిషన్ వెబ్‌సైట్లో పొందుపరిచింది. విడుతల వారీగా ఇంటర్వ్యూల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఎంపికైన వారి జాబితాను ఒక వారం ముందు వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచుతున్నారు.

# నకిలీ మిర్చి విత్తనాలు సీజ్

**పరకాల, నమస్తే తెలంగాణ:** వరంగల్ రూరల్ జిల్లా పరకాల పట్టణంలో సోమవారం నకిలీ మిర్చి విత్తనాలను వ్యవసాయ అధికారులు సీజ్‌చేశారు. పరకాల ఏవో శ్రీనివాస్ పట్టణానికి చెందిన ఆలేటి రమేశ్ ఇంటిలో సోదాలు జరుపగా పెద్ద మొత్తంలో నకిలీ మిర్చి విత్తన ప్యాకెట్లు దొరికాయి. మయూర్ సీడ్స్ పేరుతో ఉన్న రూ.25 లక్షల విలువైన విత్తనాల ప్యాకెట్లను గుర్తించారు. వీటితోపాటు పురుగుమందులు కూడా ఉన్నాయి. ఇంటి యజమాని రమేశ్‌ను విచారించగా బాలాజీ ఆగ్రో ఏజెన్సీస్‌కు ఇంటిని అద్దెకిచ్చాననీ, వాటితో తనకెలాంటి సంబంధంలేదని తెలిపినట్టు ఏవో పేర్కొన్నారు. అధికారుల త నిఖీల్లో రేగొండ, చిట్యాల మం డలాల్లోని పలు దుకాణాలకు ఇక్కడి నుంచి నకిలీ విత్తన ప్యాకెట్లను పంపినట్లు బిల్లులు దొరికినట్టు వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు.



వరంగల్ రూరల్ జిల్లా పరకాలలోని ఓ ఇంట్లో స్వాధీనం చేసుకొన్న నకిలీ విత్తన ప్యాకెట్లను చూపుతున్న వ్యవసాయశాఖ అధికారులు

# 11% అడవులు మాయం

## 2.95 లక్షల హెక్టార్ల అటవీ భూములు కబ్జా
## ఆదివాసీల ముసుగులో స్థానిక నేతల పాగా
## ప్రభుత్వానికి అటవీశాఖ నివేదిక

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కారడవి కనుమరుగవుతున్నది.. పచ్చని చెట్లు రాత్రికి రాత్రే నేలకొరుగుతున్నాయి.. అటవీ భూములు పంటపొలాలుగా మారుతున్నాయి. ఆదివాసీలు, గిరిజనులు, గుత్తికోయల ముసుగులో భూమాఫియా రెచ్చిపోతున్నది. సార్సాల ఘటన నేపథ్యంలో రాష్ట్రంలో అడవుల తాజా పరిస్థితిని అధికారులు ప్రభుత్వానికి నివేదించినట్టు తెలిసింది. విశ్వసనీయంగా తెలిసిన వివరాల ప్రకారం.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటివరకు దాదాపు 2.95 లక్షల హెక్టార్ల అటవీభూములు కబ్జాకు గురైనట్టు వెల్లడించారు. ఇది మొత్తం అడవుల్లో 11 శాతమని పేర్కొన్నారు. అపార ప్రకృతి సంపదకు, ప్రపంచంలోనే శ్రేష్ఠమైన కలపకు నెలవైన తెలంగాణలోని అడవులు కనుమరుగవుతున్నాయని నివేదించారు. సాధారణ అడవులేకాకుండా.. కాకులు సైతం దూరని అభయారణ్యాలు కూడా మైదానాలుగా మారుతున్నాయని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ అడవులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. అటవీ సంపద దోపిడీకి గురయింది. అడవులను పునరుద్ధరించేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు 'జంగిల్ బచావో–జంగిల్ బడావో' అన్న నినాదంతో భారీగా మొక్కలు నాటాలని, అడవులను పెంచాలని హరితహారం కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ ఏడాది హరితహారంలో అడవులలో 22 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు. క్షీణించిన అడవులలో అటవీశాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.





**ఉత్తర తెలంగాణలో విధ్వంసం**

తెలంగాణవ్యాప్తంగా 29,809 చదరపు కిలోమీటర్ల పరిధిలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఇది రాష్ట్రభూభాగంలో 25.19 శాతంగా ఉన్నది. మొత్తం 26,90,370 హెక్టార్ల అటవీభూమి ఉండగా.. అందులో 5,693 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో అభయారణ్యాలు ఉన్నాయి. ఉత్తరతెలంగాణలో అడవుల విధ్వంసం ఎక్కువగా జరిగింది. ఇది ఉమ్మడి ఏపీలో ఇది యథేచ్ఛగా కొనసాగింది. కొన్నిచోట్ల దట్టమైన అడవులు సైతం మాయమయ్యాయి. ఆదిలాబాద్‌లో 1.70 లక్షల హెక్టార్ల అటవీభూమి ఉండగా.. దాదాపు 35,860 హెక్టార్లు కబ్జా అయినట్టు అధికారులు వెల్లడించారు. ఇది 21 శాతమని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెంలో 19 శాతం, ఖమ్మంలో 27 శాతం, వరంగల్ రూరల్‌లో 85 శాతం మహబూబాబాద్ పరిధిలో 27 శాతం అటవీప్రాంతం కనుమరుగయిందని తెలిపారు. 1990లో కిన్నెరసాని అభయారణ్యంలో 85వేల హెక్టార్లుంటే దాదాపు 25 వేల హెక్టార్ల అడవి మాయమైనట్లు రికార్డులు చెప్తున్నాయి. ఇక నిర్మల్, ఇచ్చోడ తదితర ప్రాంతాల్లో కలప స్మగ్లింగ్‌తో అడవులు మాయవుతున్నాయి. ఆదిలాబాద్ కవ్వాల్ పెద్దపులుల అభయారణ్యం పరిధిలోని జన్నారం డివిజన్‌లోనే కలప స్మగ్లింగ్ ఎక్కువగా ఉన్నది. జన్నారం డివిజన్ పరిధిలోని అత్యంత దట్టమైన బీర్‌సాయిపేట బీట్‌లో అడవి మైదానంగా మారింది. ఒకప్పుడు కాకులు దూరని కారడవిగా ఉన్న బీర్‌సాయిపేటలో చిట్టడవి కూడా కనిపించని పరిస్థితి నెలకొన్నది. విచక్షణారహితంగా చెట్ల నరికివేత, భూముల కబ్జా వల్ల ఈ అభయారణ్యం మైదానప్రాంతంగా మారింది. ఇక్కడ పదేండ్లలో యాభైశాతం అడవి మాయమైనట్టు ఉపగ్రహచిత్రాలలో పరిశీలిస్తే స్పష్టమవుతుంది. ఇక దంతనపల్లి వెస్ట్‌బీట్‌లో అడవి పూర్తిగా ధ్వంసమైంది. సుమారు 70 శాతం అడవి మాయమైంది. కొత్తగూడ, ఇచ్చోడ డివిజన్లలో 1374 హెక్టార్ల అటవీభూమి ఉండగా అందలో 534 హెక్టార్ల అడవి పూర్తిగా ఆక్రమణకు గురయిందని అధికారులు వెల్లడించారు.

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No. 9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE





నల్లగొండ జిల్లా మునుగోడు తాసిల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న జేసీ చంద్రశేఖర్

## యాదగిరికి వెంటనే భూమి చూపండి

- అధికారులకు నల్లగొండ జేసీ వీ చంద్రశేఖర్ ఆదేశం
- 'అంధుడితో రెవెన్యూ ఆట!' కథనానికి స్పందన

ధర్మగంట నమస్తే ఎఫెక్ట్ DHARMA GANTA

**మునుగోడు:** ఓ దివ్యాంగుడి భూమి గల్లంతైన విషయమై సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'అంధుడితో రెవెన్యూ ఆట!' శీర్షికతో ప్రచురితమైన కథనానికి నల్లగొండ జిల్లా జాయింట్ కలెక్టర్ వీ చంద్రశేఖర్ స్పందించారు. వెంటనే అతడికి సంబంధించిన భూమి చూపించాలని అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం రావిగూడెం గ్రామానికి చెందిన బొంగు యాదగిరికి రెండు కండ్లూ కనిపించవు. అతడికి తండ్రి నుంచి వారసత్వంగా 1.28 ఎకరాల అసైన్డ్ భూమి వచ్చింది. సదరు భూమికి సంబంధించిన పాస్‌పుస్తకం కూడా ఉన్నప్పటికీ స్థలం మాత్రం గల్లంతైంది. దీంతో తన భూమి ఎక్కడుందో చూపించాలని ఆరేండ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా కనికరించడం లేదు. దీనిపై ధర్మగంటలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జేసీ చంద్రశేఖర్ సోమవారం మునుగోడు తాసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ అధికారులతో సమావేశమై యాదగిరికి సంబంధించిన సమస్యను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. యాదగిరి భూమి ఎక్కడ ఉన్నదో వెంటనే సర్వేచేసి అప్పగించాలని సర్వే పీడీని ఆదేశించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా స్థానిక రెవెన్యూ యంత్రాంగం పకడ్బందీగా పని చేయాలని చెప్పారు. జేసీ వెంట నల్లగొండ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తాసిల్దార్ జ్ఞానేశ్వర్ దేవ్, డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

# పట్టా ఒకచోట.. మోఖా మరోచోట

సర్వేచేసి హద్దులు నిర్ణయించడంలో అధికారుల నిర్లక్ష్యం • చనిపోయిన భార్య, తండ్రిపేరిట ఉన్న భూమి విరాసత్ చేయకుండా వేధింపులు

ఏండ్లుగా హుజూరాబాద్ తాసిల్ కార్యాలయం చుట్టూ తుమ్మనపల్లి రైతు ప్రదక్షిణలు • సర్వే నంబర్ దాటి మోఖాపైకి వచ్చిన పొరుగు రైతులు

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లికి చెందిన రైతు బండి మల్లారెడ్డికి భార్య, తండ్రి పేరిట మూడు సర్వే నంబర్లలో కలిపి 6.39 ఎకరాల భూమి ఉండేది. ఇందులో నుంచి కుటుంబ అవసరాల కోసం గుంటి బుచ్చమ్మకు 3.17 ఎకరాలు, మిడిదొడ్డి వెంకటయ్యకు 33 గుంటల మల్లారెడ్డి విక్రయించారు. భార్య బండి సుగుణ పేరిట సర్వే నంబర్ 450/బీ లో 20 గుంటలు, 459/జే లో 7 గుంటలు, తండ్రి కేశవరెడ్డి పేరిట 450/డీ లో 16 గుంటలు, 459/డీ లో 18 గుంటల భూమి ఉన్నది. మల్లారెడ్డి పేరిట 449/ఐ లో సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన 28 గుంటలు, 459/ఈ లో మరో 18 గుంటలు కలిపి మొత్తం 2.27 ఎకరాల భూమి ఉన్నది. భార్య సుగుణ, తండ్రి కేశవరెడ్డి చనిపోవడంతో వారిపేరిట ఉన్న భూమిని తన పేరిట విరాసత్ చేయాలంటూ మల్లారెడ్డి రెవెన్యూ అధికారులకు దరఖాస్తు పెట్టుకున్నారు. ఏండ్లు గడిచినా తన పేరిట విరాసత్ చేయడం లేదని మల్లారెడ్డి వాపోతున్నారు. మొత్తం 2.27 ఎకరాలకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఉన్నతాధికారులకు పలుమార్లు అర్జీలు సమర్పించగా.. వారి ఆదేశాలతో గతంలో సర్వేయర్ సర్వే నిర్వహించి హద్దురాళ్లను పాతారు. అయితే, ఆ హద్దురాళ్ల ప్రకారం రెవెన్యూ అధికారులు పాస్‌పుస్తకం జారీ చేయకపోవడంతో మల్లారెడ్డి భూమి పక్కన ఉన్న ఇద్దరు రైతులు వాటిని తొలిగించేశారు. 450 సర్వే నంబర్‌లో ఉన్న ఇద్దరు రైతులు తనకు చెందిన సర్వే నంబర్ 449లో మోఖాపైకి వచ్చారని మల్లారెడ్డి చెప్తున్నారు. ఒక రైతు ఎకరం, మరో రైతు 16 గుంటల భూమిని బలవంతంగా సాగుచేసుకొంటున్నారని వాపోయారు. తన భూమికి గతంలో కొలతలు నిర్వహించిన ప్రకారం హద్దులు నిర్ణయించాలని, పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని మల్లారెడ్డి ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



### అరిగోస పెడుతున్నరు

అధికారులు అరిగోస పెడుతున్నరు. గతంలో సర్వే చేయించారు. పాతిన హద్దురాళ్లను నా భూమి పక్కన ఉన్నవాళ్లు పీకేశారు. ఇలా జరిగిందని పోలీసుస్టేషన్‌కు వెళితే ఆ భూమి నీదేనని తాసిల్దార్‌తో రాయించుకుని తెమ్మన్నారు. తాసిల్దార్ వద్దకు వెళ్తే ఆ సంగతి తనకు తెలియదంటున్నారు. పెద్దసార్ల దగ్గరికి పోతే కిందిసార్లకు రాస్తున్నారు. దరఖాస్తులు పెట్టిపెట్టి యాష్టకు వస్తున్నది. ముసలివాణ్ణని కనికరం చూపుతలేరు. ఓ అధికారి అయితే ఎవరికి చెప్పుకుంటవో చెప్పుకో పొమ్మని దబాయించాడు. న్యాయంచేయాల్సిన అధికారులే ఇట్లంటే నేను ఏడికెళ్లాలె. అందుకే ధర్మగంటకు వచ్చిన.

- బండి మల్లారెడ్డి, తుమ్మనపల్లి, హుజూరాబాద్ మండలం, కరీంనగర్ జిల్లా

# భూమి కోసం రైతు ఆత్మహత్యాయత్నం

- పెన్‌పహాడ్ తాసిల్ ఎదుట ఘటన
- పాస్‌పుస్తకం ఇవ్వాలని డిమాండ్
- మూడు నెలలైనా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణ



సోమవారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ తాసిల్ కార్యాలయం ఎదుట పురుగులమందు తాగిన నాగులపాటి అన్నారం గ్రామ రైతు నాగయ్య

**పెన్‌పహాడ్:** తన భూమికి పట్టా మంజూరు చేయాలని కోరుతూ సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ తాసిల్ కార్యాలయం ఎదుట ఓ రైతు పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామంలో సర్వే నంబర్ 48లో కలంచర్ల నాగయ్యకు 1.08 ఎకరాల సాగుభూమి ఉన్నది. పహాణీలోనూ నాగయ్య పేరే ఉన్నది. కాగా ఇటీవల జరిగిన భూరికార్డుల ప్రక్షాళన అనంతరం అతడికి పాస్‌పుస్తకంలో భూమి నమోదు కాలేదు. దీంతో పాస్‌పుస్తకాల్లో తన భూమిని ఎక్కించాలని మూడు నెలలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయినప్పటికీ పట్టించుకోకపోవడంతో సోమవారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. తోటి రైతులు గమనించి సూర్యాపేట ఏరియా దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

### అవసరమైతే మరోసారి సర్వేచేస్తాం

పహాణీలో 1.08 ఎకరాల భూమి ఉన్నది వాస్తవమేనని.. కానీ, 21 గుంటలు మాత్రమే అతడు సాగు చేస్తున్నాడని.. మిగతా 27 గుంటలు కాలువలోకి వెళ్లిందని చెప్పారు. ఈ భూమి విషయంలో పాలివాండ్లకు కూడా తగాదాలు ఉన్నాయని.. అవసరమైతే మరోసారి సర్వే చేస్తామని చెప్పారు.

- ప్రమీల, పెన్‌పహాడ్ తాసిల్దార్

# మాకు న్యాయం చేయండి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మాది నిర్మల్ జిల్లా, కుంటాల మండలం, అంబకంటి. నా భర్త పాపారావు పేరుమీద ఉన్న భూమిని స్థానిక రెవెన్యూ అధికారులు అడ్డగోలుగా ఇతరులకు పట్టాచేశారు. అక్రమ పట్టాను రద్దుచేసి మా భూమి మాకు ఇప్పించాలి. ఆక్రమించిన వారే మాపై దాడులకు దిగుతున్నారు. గ్రామంలోని సర్వే నంబర్లు 577లో 25 గుంటలు, 578లో 1.38 ఎకరాలు, 580లో 2.3 ఎకరాల భూమి నా భర్త పాపారావు పేరుమీద 1990-91లో పట్టా అయింది. ఆయన పేరుమీద ఆర్వోఆర్ ప్రకారం 24 ఏండ్లు మేము కాస్తు చేసినం. కొందరు వ్యక్తులు మా భూమిని ఆక్రమించుకొని రెవెన్యూ అధికారుల అండతో అక్రమంగా పట్టాచేయించుకొన్నారు. ఈ విషయంపై రెవెన్యూశాఖ కమిషనర్‌కు ఫిర్యాదుచేశాం. స్పందించిన ఆయన సమస్య పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్‌కు లెటర్ పంపినా ఫలితం దక్కలేదు. ఎలాగైనా మా భూమిని మాకు ఇప్పించాలని వేడుకొంటున్నా.

- భూలక్ష్మి, అంబకంటి గ్రామం, నిర్మల్ జిల్లా



కరీంనగర్ జిల్లా వీణవంక తాసిల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సమ్మిరెడ్డి

# వీణవంకలో రైతన్న నిరసన

**వీణవంక:** తనకు రావాల్సిన భూమిని మరొకరికి పట్టాచేశారంటూ కరీంనగర్ జిల్లా వీణవంక తాసిల్ కార్యాలయం ఎదుట సమ్మిరెడ్డి అనే రైతు బైఠాయించి నిరసన తెలిపారు. వీణవంక మండలం నర్సింగాపూర్‌కు చెందిన మడుగూరి భాగ్యమ్మ (సమ్మిరెడ్డి తల్లి)కు సర్వే నంబర్ 607డీ, 608డీ లో 3.03 ఎకరాల భూమి ఉండేది. మూడేండ్ల క్రితం భాగ్యమ్మ పేరు మీద ఉన్న 3.03 ఎకరాల్లో నుంచి ఒక ఎకరం భూమిని అధికారులు వేరే వారి పేరు మీదకు మార్చారు. దీంతో బాధితులు అప్పటి నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సోమవారం స్థానిక తాసిల్దార్‌ను కలిసి న్యాయం చేయాలని కోరగా బయటకు వెళ్లి పొమ్మన్నాడని రైతు సమ్మిరెడ్డి వాపోయారు. దీంతో సమ్మిరెడ్డి అక్కడే బైఠాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులు జోక్యం చేసుకొని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతు ఆందోళన విరమించారు.

### ఎంజాయ్‌మెంట్ సర్వే చేయిస్తాం

భాగ్యమ్మ నాలుగేండ్ల క్రితం 3.03 ఎకరాల భూమిని తన పేరు మీద పట్టా చేయించుకొన్నారు. పక్కపొలంలో ఉన్న రైతు భాగ్యమ్మ అక్రమంగా ఎక్కువ భూమిని పట్టా చేసుకొన్నారని హుజూరాబాద్ ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా.. సర్వే జరిపించి 2.03 ఎకరాల భూమిని పట్టాచేశాం. క్షేత్రస్థాయిలో మరోసారి ఎంజాయ్‌మెంట్ సర్వేచేయించి భాగ్యమ్మకు నిజంగా 3.03 ఎకరాల భూమి వస్తే పట్టాచేస్తాం. దీనికి చుట్టు పక్కల పట్టాదారులు కూడా అంగీకారం తెలిపారు.

- హరికృష్ణ, ఇంచార్జి తాసిల్దార్, వీణవంక

# పాస్‌పుస్తకం ఇస్తలేరు

- నా భూమి వివరాలు ఆన్‌లైన్‌లో మాయంచేశారు
- ఏడాదైనా రెవెన్యూ అధికారులు కనికరిస్తలేరు
- మాజీ వాయుసేన ఉద్యోగి ఆవేదన
- ధర్మగంటను ఆశ్రయించిన బాధితుడు భూషణం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నా పేరు ఎం భూషణం. వాయుసేనలో పదవీవిరమణ చేశాను. 1982లో పదవీ విరమణ చేశాక రాష్ట్ర ప్రభుత్వం మెదక్ జిల్లాలోని హవేలి ఘన్‌పూర్ పరిధిలోని బూర్గుపల్లిలో సర్వే నంబర్ 805 (పార్టు)లో 4.20 ఎకరాల భూమిని కేటాయించింది. 1983లో అప్పటి పట్వారీ భూమి కూడా చూపించారు. ఆ తర్వాత, నా భూమిని దగ్గరుండి చూసుకొనేందుకు ఒక వ్యక్తికి అప్పగించాను. మధ్యమధ్యలో భూమిని చూడటానికి వెళ్లేవాడిని. 1989లో పంచాయతీకి పన్ను కూడా చెల్లించాను. ఈ క్రమంలో పిల్లల చదువు నిమిత్తం వేర్వేరు ప్రాంతాల్లో నివసించాల్సి వచ్చింది. రెండేండ్ల క్రితం వెళ్లి చూడగా.. అక్కడి భూమి రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. దీంతో నా భూమి చూపెట్టి, కొత్త పాస్‌పుస్తకం జారీచేయమని 2017లో స్థానిక తాసిల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నాను. దీంతో తాసిల్దార్ మా చుట్టుపక్కల భూయజమానులకు సర్వే చేస్తున్నామని సమాచారం ఇచ్చారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కూడా భూయజమానులకు సర్వే జరుగుతున్న విషయం చెప్పారు. కాకపోతే, సర్వే సమయంలో వారెవ్వరూ రాలేదు. ఒక రోజు సర్వేయర్ వచ్చి నా భూమి చూపెట్టారు. దీంతో నేను భూమినంతా చదును చేసి.. వ్యవసాయం చేయడానికి విత్తనాలు చల్లుతుండగా.. స్థానికంగా ఉండే ఓ వ్యక్తి కొందరు మనుషులను తీసుకొచ్చి నన్ను అడ్డగించారు. ఆ భూమిలో అడుగుపెట్టడానికి వీల్లేదంటూ బెదిరించారు. అయితే అతను చెప్తున్న భూమేమో సర్వే నంబర్ 804లో ఉన్నది. నాదేమో 805 సర్వే నంబరులో ఉన్నది. ఈ విషయాన్ని అతడికి అర్థమయ్యేలా చెప్తున్నా వినిపించుకోవడం లేదు. అసలు ఆ భూమిలోకి అడుగుపెట్టడానికి వీల్లేదంటూ బెదిరిస్తున్నారు. ఇదే విషయాన్ని తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లాను. ఆయన పాస్‌పుస్తకానికి సంబంధించిన ప్రొసీడింగ్ సిద్ధం చేసి.. కంప్యూటర్‌లో పొందుపరుస్తుంటే రావడం లేదు. కారణం.. ఆ సర్వే నంబర్ భూమి ప్రభుత్వానిదిగా పేర్కొని ఉండటమేనని అక్కడి క్లర్కు చెప్తున్నారు. ఇప్పటికే దాదాపు ఏడాది గడిచింది. స్థానిక తాసిల్దార్ స్పందించి నా భూమికి సంబంధించిన పాస్‌పుస్తకాన్ని ఇవ్వాలని కోరుతున్నాను.

# నా భూమిని వేరేవారికి రాసేశారు



**కట్టంగూర్:** మాది నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం సత్యనారాయణపురం గ్రామం. మా నాన్న పాదూరి కృష్ణారెడ్డి పేరుమీద కల్మెర గ్రామంలో సర్వే నంబర్ 162/3లో 1.12 ఎకరాల భూమి ఉన్నది. అందులో నా వాటాగా 7 గుంటలు వచ్చింది. మా నాన్న 1979లో చనిపోగా 1980లో సదరు భూమిని రెవెన్యూ రికార్డుల్లో నా పేరుమీదికి మార్చారు. పాత పాస్‌పుస్తకం కూడా ఉన్నది. 2014 వరకు ఈసీ, పహాణీలో నా పేరుమీదే ఉన్నది. అయితే భూ రికార్డుల ప్రక్షాళనలో అధికారులు నాకు కొత్త పాస్‌పుస్తకం ఇవ్వలేదు. ఇదేమని అడిగితే.. సదరు భూమి నా పేరుమీద లేదంటున్నారు. నేను కబ్జాలో ఉన్నప్పటికీ.. నా భూమిని 2018-19 పహాణీలో వేరే వారి పేర్ల మీద ఎక్కించారు. నా భూమిని నా పేరుమీదకి మార్చాలని ఆరునెలలుగా తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు. సమాచారహక్కు చట్టం ద్వారా దరఖాస్తుచేసినా సమాచారం ఇవ్వడంలేదు. దరఖాస్తును పరిశీలించిన వీఆర్వో, ఆర్ఐలకు భూమిని చూపించాలని అడిగితే చూపించాం. అయినా సమస్యను పరిష్కరించడంలేదు.

- పాదూరి లక్ష్మారెడ్డి, సత్యనారాయణపురం గ్రామం, కట్టంగూరు మండలం, నల్లగొండ జిల్లా

### ఉమ్మడి కుటుంబ భాగస్తుల పేరిట పట్టా మార్పిడి జరిగింది

పాదూరి లక్ష్మారెడ్డి దరఖాస్తు మేరకు ఆర్ఐ, వీఆర్వోలు ఫీల్డ్ ఎంక్వైరీచేసి రిపోర్టు ఇచ్చారు. సర్వే నంబర్163/3 లోని లక్ష్మారెడ్డికి సంబంధించిన 7 గుంటల భూమి ఉమ్మడి కుటుంబ భాగస్తులైన పాదూరి నర్సింహారెడ్డి పేర భాగ పంపిణీలో భాగంగా అమెండ్‌మెంట్ నంబర్ 5 ద్వారా 1992లో పట్టా మార్పిడి జరిగింది. ఆ నివేదికను 2019 మే 1వ తేదీన ఆర్డీవోకు సమర్పించాం. సమాచారహక్కు చట్టం కింద లక్ష్మారెడ్డి దరఖాస్తు చేసుకుంటే.. పట్టా మార్పిడికి సంబంధించిన రికార్డులను ఇస్తాం. వాటి ఆధారంగా ఆర్డీవోకు దరఖాస్తు చేసుకోవచ్చు.

- ఏఆర్ నాగరాజు, కట్టంగూర్ తాసిల్దార్



కరీంనగర్ డీఆర్వోకు ఫిర్యాదు చేస్తున్న గంగాధర మండలం తాడిజెర్రి గ్రామ రైతులు

# అక్రమంగా పట్టా మార్చారు

- డీఆర్వోకు కరీంనగర్ జిల్లా తాడిజెర్రి రైతుల ఫిర్యాదు

**సుభాష్‌నగర్:** గత 60 ఏండ్లుగా కాస్తులో ఉన్న తమ పట్టా భూములను రెవెన్యూ అధికారులు వేరే వ్యక్తులకు పట్టాచేసి, ఆన్‌లైన్‌లో నమోదుచేశారని కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి పరిధిలోని తాడిజెర్రి గ్రామ రైతులు సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి భిక్షానాయక్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 398/బీ లోని 2.20 ఎకరాలు, సర్వే నంబర్‌లోని 478/సీ లోని 1.09 ఎకరాల భూమి.. రామిడి మల్లయ్య, నారాయణ, నర్సయ్య, బాలయ్య పేరిట సమ భాగాలుగా (మొత్తం విస్తీర్ణం 3.29) ఉన్నదని వారు పేర్కొన్నారు. సదరు సర్వే నంబర్లలోని ఆ పట్టా భూమిని 60 ఏండ్లుగా సాగుచేసుకొంటూ నలుగురం జీవిస్తున్నామని ఫిర్యాదులో వివరించారు. తాడిజెర్రి గ్రామానికి చెందిన రామిడి తిరుపతి అనే వ్యక్తి కరీంనగర్ ఆర్డీవో కార్యాలయం నుంచి అక్రమ ప్రొసీడింగ్ తీసుకున్న విషయమై తాము జేసీ వద్ద ఆప్పీల్ చేసినప్పటికీ ఆ భూమిని రామిడి తిరుపతి తన పేరున ఆన్‌లైన్ చేసుకున్నారని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. కొన్నేండ్లుగా సాగుచేసుకొని జీవిస్తున్న తమకు ఆధారమైన 3.29 ఎకరాల భూమిని అక్రమంగా పట్టాచేసుకొన్న రామిడి తిరుపతి పాస్‌పుస్తకం ఖాత నంబర్ 718ని రద్దుచేసి ఆ భూమిని తమ పేరిట మార్చి న్యాయంచేయాలని కోరారు.

# రికార్డుల్లో భూమి మాయం

- కాస్తులో ఉన్నా అందని పాస్‌పుస్తకం
- 2.19 ఎకరాలకు రికార్డులు లేవంటున్న అధికారులు
- చెప్పులరిగేలా తిరిగినా కనికరించని రెవెన్యూ సిబ్బంది
- సిద్దిపేట జిల్లా ములుగు మండలం నర్సాపూర్ బాధితురాలి వేదన

పైసా పైసా కూడబెట్టి 3.26 ఎకరాల భూమిని కొనుగోలు చేసిందో వృద్ధురాలు. కానీ ఆమె పేరును పహాణీలో నమోదుచేసిన అధికారులే ఆ రైతుకు తెలియకుండా పహాణీలో నుంచి పేరును తొలగించారు. దీంతో బాధితురాలికి చెందిన 3.26 ఎకరాలకు గాను 1.07 ఎకరాలే పాస్‌పుస్తకంలో వచ్చింది. మిగిలిన 2.19 ఎకరాలను రికార్డుల్లో నుంచి మాయంచేశారు. ఎన్నిసార్లు రెవెన్యూ అధికారులకు దరఖాస్తు పెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. దీంతో సిద్దిపేట జిల్లా ములుగు మండలం నర్సాపూర్‌కు చెందిన బాధితురాలు ధర్మగంటను ఆశ్రయించారు.



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సిద్దిపేట జిల్లా ములుగు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన చందగల్ల లక్ష్మికి సర్వే నంబర్లు 10లో 1.07 ఎకరాలు, 4/అలో 13 గుంటలు, 89/ఇ లో 13 గుంటలు, 167లో 28 గుంటలు, 189లో 13 గుంటలు, 195లో 5 గుంటలు, 246లో 27 గుంటలు.. ఇలా మొత్తం 3.26 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమిని లక్ష్మి 1981లోనే కొనుగోలుచేశారు. ఈ భూమికి సంబంధించిన పహాణీలో ఆమె పేరును కూడా రెవెన్యూ అధికారులు నమోదుచేశారు. 1992-93 వరకూ పహాణీల్లో లక్ష్మి పేరే ఉన్నది. ఆ తర్వాత పహాణీలో ఆమె పేరు మాయమైంది. కానీ ఇప్పటికీ ఆ 3.26 ఎకరాల కాస్తులో లక్ష్మినే ఉన్నారు. కేవలం సర్వే నంబర్ 10లో ఉన్న 1.07 ఎకరాలు మాత్రమే బాధిత రైతు పేరిట ఉన్నది. భూరికార్డు ప్రక్షాళన సమయంలో 1.07 ఎకరాలకు మాత్రమే కొత్త పాస్‌పుస్తకం మంజూరైంది. మిగిలిన 2.19 ఎకరాల భూమి గురించి రెవెన్యూ అధికారులను అడిగితే రికార్డులు పరిశీలిస్తామని చెప్పి దాటవేస్తున్నారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి నుంచి సమస్య పరిష్కరించాలని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రికార్డులు పరిశీలించి తన భూసమస్యను పరిష్కరించాలని తాసిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే.. అసలు ఆ భూమికి సంబంధించిన రికార్డులే లేవని అంటున్నారని బాధితురాలు వాపోతున్నారు. తన పేరిట ఉన్న 3.26 ఎకరాల్లో 1.07 ఎకరాలకు మాత్రమే కొత్త పాస్‌పుస్తకం వచ్చినప్పుడు.. మిగిలిన భూమికి ఎందుకు రాదని ఆమె ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారులే కావాలని దాటవేస్తున్నారని బాధితురాలు ఆరోపిస్తున్నారు.

### ఆ భూమే నాకు ఆధారం

నా ఆ భూమే ఆధారం. దాంతోనే నా జీవితం గడుస్తున్నది. ఎంతో కష్టపడి కొనుకున్నా. ఇప్పుడు అధికారులు భూమి నాది కాదు అంటే ఎట్లా. 1993లో పహాణీలో ఉన్నప్పుడు ఇప్పుడెందుకు ఉండదు. నా భూమికి సంబంధించిన రికార్డులే లేవనడం అన్యాయం. ఇప్పటికే రెండు విడుతల రైతు బంధు సాయం నష్టపోయా. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారించి నా మొత్తం భూమికి సంబంధించిన కొత్త పాస్‌పుస్తకం ఇప్పించాలి.

- చందగల్ల లక్ష్మి, బాధితురాలు

## మాంసం ఉత్పత్తులపై శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ**: మాంసం, మాంసం ఉత్పత్తులు, పరిశుభ్రమైన నిర్వహణ, నిల్వ, ప్రాసెసింగ్ నైపుణ్య అభివృద్ధిలో శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం చెంగిచర్లలోని ఐసీఏఆర్ నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీఏఆర్ ఎస్ఆర్‌సీఎం డైరెక్టర్ వైథ్యనాథన్ మాంస ఉత్పత్తుల పరిశుభ్రమైన నిర్వహణ, ప్రాసెసింగ్ ప్రాముఖ్యాన్ని వివరించారు. ఈ శిక్షణను కర్ణాటక గొర్రెలు, ఉన్నిడెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, కర్ణాటక మొబైల్ మాంసం, మాంసం ఉత్పత్తి సంస్థ స్పాన్సర్ చేసింది. ఈ కార్యక్రమంలో కాలేజ్‌ఆఫ్ వెటర్నరీ సైన్స్ రిటైర్డ్ డీన్ ఎన్ కృష్ణ, అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ ముత్తుకుమార్, శేషప్ప, గిరీశ్‌పాటిల్ పాల్గొన్నారు.


బయటపడ్డ శాతవాహనుల కాలం నాటి విగ్రహం

# కాసిపేటలో శాతవాహనుల మహానగరం!

### జాగృతి బృందం పరిశోధనలో బయటపడ్డ చరిత్ర ఆనవాళ్లు

**కాసిపేట:** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని రాళ్లవాగు ఒడ్డున గుళ్లపాడు, వరిపేట నడుమ ఉన్న ధనాలగుట్ట ప్రాంతంలో వందల ఎకరాల్లో విస్తరించిన గ్రామం ఉండేదని తెలంగాణ జాగృతి చరిత్ర బృందం పరిశోధనలో బయటపడింది. పురాతన గ్రామ సరిహద్దు శిల్ప స్తంభాలు అక్కడ కనిపిస్తున్నాయి. ఒకస్తంభం మీద చంద్రుడు, సూర్యుడు, పీఠంపై లింగం చెక్కి ఉండగా మరొక సరిహద్దు స్తంభం మీద కుడివైపు చంద్రుడు, ఎడమ వైపు సూర్యుడు ఉన్నా డు. గుట్టలపై ఆ కాలంలో ఉపయోగించిన అనేక పురాతన వస్తువులను పరిశీలించగా అవి శాతవాహనుల కాలంలోని ఒక మహానగరం ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో సేకరించిన వాటిలో అప్పటి మానవులు నల్లమట్టితో చేసిన మందమైన కుండ పెంకులు, మట్టి పూసలు, సీసంతో చేసిన చేతిగాజులు, రంగు రాళ్లతో చేసిన పూసలు, టెర్రాకోటా బొమ్మలు, పెద్దపెద్ద ఇటుకలు, ఇనుప చిట్టెం ముక్కలు కొనుకున్నారు. గుళ్లపాడుకు చెందిన మడావి ఆంజనేయులు కుటుంబసభ్యులు తమపొలంలో దొరికిన వినాయకుడు, అమ్మదేవత, నాగేంద్రుడు, శివలింగం, నంది విగ్రహాలను సేకరించి గ్రామం నడిబొడ్డున ఆలయం నిర్మించి పూజలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పోచమ్మ గుడిలో ఆసనస్థితిలో బుద్ధుడనిపించే విగ్రహం, తలమీద ఉష్ణీషం, దీర్ఘకర్ణాలు, వక్షస్థలం మీద వస్త్రధారణ, కుడి చేయి ఆశీముద్రతో ఎడమ చేయి ఉదరానికి అడ్డుగా అరచేయి పైకి పెట్టి ఉంది. బయట పడ్డ ఇటుకల వల్ల గుండ్రంగా నిర్మాణం ఉందని తెలుస్తోంది. ఇది శాతవాహనుల కాలం నాటి ఒక నగరం లేదా బౌద్ధక్షేత్రంగా భావించవచ్చని, కాసిపేట మండలంలో అనేక ప్రాంతాల్లో కాలగర్భంలో కలిసిన మహాచరిత్ర దాగి ఉందనీ, మరిన్ని చరిత్ర ఆనవాళ్ల విషయాలు బయట పడనున్నాయని జాగృతి చరిత్ర బృందం సభ్యులు సోమవారం 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.


శాతవాహనుల చరిత్ర ఆనవాళ్లను పరిశీలిస్తున్న జాగృతి చరిత్ర బృందం సభ్యుడు సముద్రాల సునీల్



### బంగాళాఖాతంలో

# వాయుగుండం!

- 24 గంటల్లో ఏర్పడే అవకాశం.. తీవ్ర అల్పపీడనంగా మారిన అల్పపీడనం
- తెలంగాణలో తేలికపాటినుంచి ఓ మోస్తరు, భారీ వర్షాలు కురిసే అవకాశం
- రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు: హైదరాబాద్ వాతావరణ కేంద్రం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈశాన్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం సోమవారం ఉదయం తీవ్ర అల్పపీడనంగా మారింది. వాయవ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమబెంగాల్, ఒడిశా తీరాల్లో ఇది కేంద్రీకృతమై ఉన్నది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని, ఇది ఎత్తునకు వెళ్లేకొద్దీ నైరుతి దిశగా వంపు తిరిగి ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇది మరింత తీవ్రంగా మారి వచ్చే 24గంటల్లో వాయుగుండంగా మారే అవకాశమున్నదని తెలిపారు. దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 3.1 నుంచి 7.6 కిలోమీటర్ల మధ్య ఏర్పడిన ఉపరితల ఆవర్తనం.. అల్పపీడనానికి అనుబంధంగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనంలో విలీనమైందని అధికారులు వెల్లడించారు. దీని ప్రభావంగా తెలంగాణ రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశముందని తెలిపారు. కొన్నిచోట్ల భారీనుంచి అతిభారీ వర్షాలు కురియవచ్చని వివరించారు. కాగా గత 24గంటలుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో విస్తారంగా వానలు కురుస్తున్నాయి. తాజా వర్షాలతో భూమి పదును కావడంతో పలు ప్రాంతాల్లో రైతన్నలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. భారీ వర్షాలు కురిస్తే సాగుకు మేలు జరుగుతుందని ఆకాంక్షిస్తున్నారు.

# జిల్లాలవారీగా ఐసీయూ సేవలు

- నిమ్స్‌లో కొత్త ఓపీ భవనం నిర్మిస్తాం
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి
- నిమ్స్‌లో బ్లడ్ ఇర్రేడియేటర్ మిషన్.. పేయింగ్‌రూమ్ బ్లాక్‌లను ప్రారంభించిన మంత్రి


సోమవారం నిమ్స్ దవాఖానను సందర్శించిన వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని నిమ్స్, గాంధీ, ఉస్మానియా దవాఖానల్లో ఐసీయూల్లో చేరేవారి సంఖ్య పెరుగుతున్నదని, అత్యవసర సేవలను ఎక్కడికక్కడ అందించేవిధంగా జిల్లాలవారీగా ఐసీయూ సేవలను విస్తరిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. సోమవారం నిమ్స్ దవాఖానలోని బ్లడ్ ఇర్రేడియేటర్ యంత్రం, క్లినికల్ పాథాలజీ, మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ విభాగాలను, ఆధునిక వసతులతో నిర్మించిన పేయింగ్‌రూమ్ బ్లాక్‌లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ.. జిల్లాస్థాయి దవాఖానల్లో ఐసీయూ సేవలను అందుబాటులోకి తెస్తున్నామని, దూరప్రాంతాల నుంచి అత్యవసర వైద్యసేవల కోసం హైదరాబాద్‌కు వచ్చే అవసరంలేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత చాలా జిల్లాల్లో ఐసీయూ సేవలు పెరిగాయని, వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నామన్నారు. నిమ్స్‌లోని అత్యవసర సేవల బ్లాక్‌లోని ఐసీయూలో బెడ్ల సామర్థ్యం 55 ఉండగా.. ఇక్కడికి వస్తున్నవారి సంఖ్యకు అనుగుణంగా వాటిని పెంచేందుకు ప్రణాళికలు సిద్ధంచేయాలని అధికారులకు సూచించామని పేర్కొన్నారు. నిమ్స్‌లో ఔట్ పేషెంట్ల తాకిడికి అనుగుణంగా కొత్తగా ఓపీ భవనాన్ని నిర్మిస్తామన్నారు. నిమ్స్ ప్రాంగణంలోని పాత లైబ్రరీ నుంచి స్కూల్ భవనం వరకు నూతన ఓపీ భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించినట్టు మంత్రి వెల్లడించారు. సీఎం కేసీఆర్.. ఆరోగ్య తెలంగాణ సాధన దిశగా సర్కారు దవాఖానలను పటిష్ఠంచేశారని, ప్రణాళికాబద్ధంగా పేదలకు వైద్యసేవలను మరింత మెరుగుపర్చేలా ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. నిమ్స్ దవాఖానకు వచ్చిన రోగులెవ్వరూ పరీక్షల కోసం బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్నిరకాల అత్యాధునిక వైద్య పరీక్షల యంత్రాలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. నిమ్స్‌కు వచ్చినవారు పూర్తి ఆరోగ్యంతో ఇంటికి తిరిగి వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ మనోహర్, వైద్య నిపుణులు, ఆయా వైద్య విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**నిమ్స్‌లో అధునాతన సౌకర్యాలు**

నిమ్స్ దవాఖానలో మరో అధునాతన యంత్రం అందుబాటులోకి వచ్చింది. తాజాగా రూ.30లక్షలు వెచ్చించి కొనుగోలుచేసిన బ్లడ్ ఇర్రేడియేటర్ మిషన్‌ను మంత్రి ఈటల ప్రారంభించారు. ఈ మిషన్ ద్వారా రక్తంలో రోగులకు హానికలిగించే ఒకరకమైన తెల్లరక్త కణాలను అచేతనంచేస్తారు. మామూలు వ్యక్తులకు 1 మి.మీ. దూరంలో తెల్లరక్తకణాలు పదివేలు ఉంటే.. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు లక్షల్లో పెరుగుతాయి. రేడియేషన్ ప్రక్రియ ద్వారా రక్తంలో ఉండే ఒక రకమైన తెల్లరక్త కణాలను అచేతనావస్థకు తీసుకువచ్చి.. తెల్లరక్త కణాలు అధికంగా ఉన్న రోగులకు దానిని ఎక్కిస్తారు. దీనితోపాటు ప్రభుత్వం అందించిన నిధులతో నిర్మించిన ప్రత్యేక గదుల విభాగాన్ని కూడా ప్రారంభించారు. అందులోని ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్ బ్లాకుల్లో 15 ఏసీ సింగిల్‌రూమ్‌లు, 9 నాన్‌ఏసీ సింగిల్‌రూమ్‌లు ఉన్నాయి. వీటితోపాటు 71సెమీ ప్రైవేట్ గదులను 142 మంది రోగులకు సేవలందించేందుకు వీలుగా అన్ని వసతులతో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు.



# బీజేపీలో చేరే ఆలోచన లేదు

- సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తా
- మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి స్పష్టీకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బీజేపీలో చేరే ఆలోచన కానీ.. అవసరం కానీ తనకు లేదని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి స్పష్టం చేశారు. బీజేపీలో చేరుతున్నానని తనపై తప్పుడు వార్తలు ప్రచురించిన కొన్ని మీడియాసంస్థలు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆయన సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజకీయ స్వార్థం కోసం పార్టీలు మారాల్సిన అవసరం కానీ.. పదవుల కోసం పాకులాడాల్సిన పరిస్థితి కానీ తనకు లేదని పేర్కొన్నారు. అవాస్తవమైన వార్తలను ప్రచురించడం సరికాదని హితవుపలికారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ తనపై పార్టీమారుతున్నానంటూ తప్పుడు ప్రచారం చేశారని.. ఇప్పుడూ అదే తరహాలో ప్రచారంచేసి తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ చేపట్టే అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో టీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగుతానని చెప్పారు.

# పుట్టిన రోజు వేడుకల్లో అపశ్రుతి

### లారీ ఢీకొని యువకుడి మృతి


అరుణ్ (ఫైల్)

**చిగురుమామిడి:** రోడ్డు పక్కన జన్మదిన వేడుకలు చేసుకుంటున్న యువకులపైకి లారీ దూసుకెళ్లడంతో ఒకరు దుర్మరణం చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరిలో చోటుచేసుకున్నది. ఎస్సై మామిడాల సురేందర్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సుందరగిరికి చెందిన తాటిపల్లి శశికుమార్ తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఆదివారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన ఎలగందుల రాజేశ్, అందె శంకర్, ఎలగుందుల అరుణ్, హుస్నాబాద్ మండలం మడద గ్రామానికి చెందిన జెరిపోతుల సాయిని వేడుకలకు ఆహ్వానించాడు. ఆదివారం రాత్రి 12 గంటలకు గ్రామంలోని రోడ్డు పక్కన పుట్టిన రోజు కేక్ కట్ చేస్తున్న సందర్భంలో కరీంనగర్ నుంచి హుస్నాబాద్ వైపు వెళ్తున్న లారీ రోడ్డుపై ఉన్న వారిని ఢీకొట్టింది. దీంతో ఎలగందుల అరుణ్ (25) అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా రాకేశ్, శంకర్, సాయికి గాయాలు కావడంతో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. డ్రైవర్ పరారీలో ఉండగా, లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

# బీసీ కమిషన్‌కు వినతుల వెల్లువ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అంటరాని కులాలుగా బతకుతున్న తమను బీసీకులాల జాబితాలో చేర్చి న్యాయం చేయాలని సంచారకులాల ప్రతినిధులు రాష్ట్ర బీసీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. బీసీ జాబితాలో చేర్చాలని కోరుతున్న వివిధ కులాలకు సంబంధించిన వినతులు, అభ్యంతరాలపై ప్రజాసేకరణ కోసం సోమవారం రెండోరోజు బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ బీఎస్‌రాములు సభ్యు లు ఆంజనేయగౌడ్, జూలూరు గౌరీశంకర్, సభ్య కార్యదర్శి అనితా రాజేంద్రన్ బహిరంగ విచారణ చేపట్టారు. ఏండ్లుగా పురాణాలు, ఇతిహాసాలను వివిధ కళారూపాలల్లో ప్రదర్శిస్తూ జీవనం సాగించిన వందలాది సం చా ర కులాల కుటుంబాలు కులగుర్తింపు లేక వీధిన పడ్డాయని సన్నాయి, తోలుబొమ్మలాట, అడ్డపువారు, భాగవతుల కులాలకు చెందిన ప్రతినిధులు బీసీ కమిషన్ ఎదుట వాపోయారు.


బీసీ కమిషన్ సభ్యులకు వినతిపత్రం ఇస్తున్న సంచార కులాల ప్రతినిధులు


టీటీడీ కొత్త జేఈవో బసంత్‌కుమార్

# టీటీడీ జేఈవో శ్రీనివాసరాజు బదిలీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీటీడీ జేఈవో శ్రీనివాసరాజును ఏపీ ప్రభుత్వం బదిలీచేసింది. ఆయన్ను సాధారణ పరిపాలనశాఖకు బదిలీచేస్తూ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం సోమవారం ఉత్తర్వులిచ్చారు. వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ బసంత్‌కుమార్‌కు టీటీడీ జేఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించింది. శ్రీనివాసరాజుఎనిమిదేండ్లపాటు టీటీడీ జేఈవోగా పనిచేశారు. 2011లో రెండేండ్ల కాలపరిమితితో తొలుత ఆయన జేఈవోగా బాధ్యతలు చేపట్టారు. నాలుగుసార్లు ఆయనను పొడిగించారు.

# కాంగ్రెస్ నాయకులది గుడ్డి వ్యతిరేకత

- బూజుపట్టిన విధానాలను మార్చుకోవాలి
- సచివాలయం నిర్మాణాన్ని ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తారు
- ఎమ్మెల్యే బాల్క సుమన్, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాల్క సుమన్. చిత్రంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏంచేసినా వ్యతిరేకించాలనే గుడ్డి వ్యతిరేకతతో కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్నదని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల మెదళ్లు బూజుపట్టాయని, దాన్ని దులుపుకోవాలని ఎద్దేవాచేశారు.తెలంగాణభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు అసెంబ్లీ, సచివాలయ సందర్శన పేరిట డ్రామా చేశారన్నారు. సీఎం కేసీఆర్ ఓ విజన్‌తో వందేండ్ల అవసరాలు తీరేలా కొత్త సచివాలయం, అసెంబ్లీలను నిర్మిస్తున్నారని చెప్పారు. ఇప్పుడున్న సచివాలయం ఓ ప్రణాళికలేకుండా నిర్మించారని.. భద్రత, పార్కింగ్ పరంగా ఎన్నోలోపాలు, ఇబ్బందులున్నాయని వివరించారు. సందర్శకులు, మీడియా ప్రతినిధులకు కూడా సరియైన సౌకర్యం లేదన్నారు. అసెంబ్లీని పార్లమెంట్ తరహాలో తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి విషయాన్ని గుడ్డిగా వ్యతిరేకించడాన్ని కాంగ్రెస్, బీజేపీ నేతలు మానుకోవాలని హితవుచెప్పారు. కాంగ్రెస్ నాయకులు ఛత్తీస్‌గఢ్, మణిపూర్, మిజోరాం రాష్ర్టాల్లోని అసెంబ్లీ, సచివాలయ భవనాలను చూడాలని సూచించారు. గత ఐదు దశాబ్దాలుగా కాంగ్రెస్ నాయకులు తుగ్లక్‌లాగానే వ్యవహరించారని విమర్శించారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, సీతారామ, డిండి ప్రాజెక్టులు కడుతున్నందుకు సీఎం కేసీఆర్ తుగ్లక్‌లాగా కనిపిస్తున్నారా? అని ప్రశ్నించారు. సచివాలయం, అసెంబ్లీ నిర్మాణాలు పూర్తయ్యాక ఇప్పుడు విమర్శిస్తున్నవాళ్లు అప్పుడు ప్రశంసిస్తారన్నారు. సీఎం కేసీఆర్.. ప్రజలకు ఏం కావాలో అవి చేస్తున్నారని టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్‌నేతలకు తెలంగాణ బాగుపడాలని లేదని, అందుకే అన్నింటిపై విమర్శలు చేస్తుంటారన్నారు. రేవంత్‌రెడ్డి రైతులను అవమానించేవిధంగా మాట్లాడారని ఆయన అభ్యంతరం వ్యక్తంచేశారు. విపక్షాలకు ఏ ఎజెండాలేకనే అసెంబ్లీ, సచివాలయం నిర్మాణాలు ఓ పెద్దసమస్య అయినట్టు రాద్ధాంతం చేస్తున్నారని ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

# కొత్త సచివాలయం.. అసెంబ్లీ కట్టి తీరుతాం

- పబ్లిసిటీ కోసమే కాంగ్రెస్ నేతల పాట్లు
- మంత్రి తలసాని విమర్శలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆరునూరైనా కొత్త సచివాలయం, అసెంబ్లీ భవనాలు నిర్మించి తీరుతామని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ప్రజలు గర్వపడేలా ఆ భవనాలను తీర్చిదిద్దుతామన్నారు. కొత్త అసెంబ్లీ భవనం నిర్మిస్తే తప్పేంటని ప్రశ్నించారు. సోమవారం సచివాలయంలో ఆయనమీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు టైంపాస్ కోసం, టీవీల్లో, పేపర్లలో పబ్లిసిటీ కోసమే సచివాలయాన్ని సందర్శించారని, విహారయాత్రకు వచ్చినట్టు ఫొటోలు దిగారని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్‌నేతలు కనీ సం అరగంట కూడా అక్కడ ఉండలేదని.. నాలుగు గంటలపాటు అన్నిభవనాలను పరిశీలించవచ్చు కదా? అని మంత్రి వ్యాఖ్యానించారు. ఇతర రాష్ర్టాల్లో మాదిరిగా కొత్త సచివాలయం, అసెంబ్లీ ఉండాలనేదే సీఎం కేసీఆర్ ఆలోచన అని పేర్కొన్నారు. కొత్త సచివాలయం నిర్మిస్తే కాంగ్రెస్ నేతల ముల్లేంపోయిందో అర్థంకావడం లేదని.. కోడిగుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నూతన భవనాల నిర్మాణం విషయంలో కాంగ్రెస్ నేతలుచేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. కాంగ్రెస్ మాదిరిగానే తాము కూడా రొటీన్ పాలన అందించాలని వారు కోరుకుంటున్నారని చెప్పారు. అసెంబ్లీ, సచివాలయ నూతన భవనాలు ప్రభుత్వానికి సంబంధించినవే తప్ప వ్యక్తిగతంగా సీఎం కేసీఆర్‌కు సంబంధించినవి కాద న్న విషయం వారికి తెలియదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతల గైడెన్స్ తీసుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. కాంగ్రెస్‌లో గ్రూపు తగదాలు చూడలేకనే ఆ పార్టీని ఎమ్మెల్యేలు వదిలిపెట్టారని దెప్పిపొడిచారు. ప్రతిపక్షనేతగా ఎస్సీ నేత ఉండటం సొంతపార్టీవారికే ఇష్టం లేదని ఆరోపించారు. వర్షంపడితే ఏ నగరంలోనైనా గంటపాటు ఇబ్బందులు సాధారణమేనని అన్నారు.

### పెద్దపెండ్యాల వెటర్నరీ

# డాక్టర్‌పై వేటు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వరంగల్ అర్బన్ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల ప్రాథమిక పశువైద్య కేంద్రం పశువైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. పశువులకు ఆరోగ్య, వయస్సు ధ్రువీకరణ పత్రం, సబ్సిడీ గొర్రెలకు దాణా పంపిణీ చేయడానికి డబ్బులు వసూలుచేస్తున్నట్టు ఆయనపై ఆరోపణలున్నాయి. ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, ప్రభుత్వ లక్ష్యాలకు భిన్నంగా అవినీతి, అక్రమాలకుపాల్పడే అధికారులు ఎవరైనా ఉపేక్షించవద్దని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టంచేశారు. అధికారులు అక్రమాలు, ఆరోపణలకు అవకాశంలేకుండా బాధ్యతతో విధులు నిర్వహించాలని మంత్రి సూచించారు.

# తాగి వాహనం నడిపితే యాజమాన్యాలకు చెప్పాలా?

- పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు
- ఓ ప్రైవేట్ ఉద్యోగి దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**మద్యం సేవించి వాహనాలు నడుపడం (డ్రంకెన్‌డ్రైవ్) ద్వారా పట్టుబడిన ఉద్యోగుల సమాచారం.. సదరు ఉద్యోగుల యాజమాన్యాలకు తెలియజేయాలని చట్టంలోని ఏ నిబంధన పేర్కొంటున్నదో తమకు వివరించాలని హైకోర్టు సోమవారం రాష్ట్ర పోలీసులను ఆదేశించింది. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనాలను పోలీసులు నిరవధికంగా తమ కస్టడీలో ఉంచుకోవడం.. పట్టుబడ్డ ఉద్యోగుల సమాచారాన్ని సంబంధిత యాజమాన్యాలకు తెలియజేయడం వంటి పోలీస్ చర్యలను సవాల్‌చేస్తూ పృథ్వీకృష్ణ అనే ప్రైవేట్ ఉద్యోగి హైకోర్టును ఆశ్రయించారు. మోటార్‌వెహికిల్ యాక్ట్‌లో వాహనాలను నిరవధికంగా నిర్బంధంలో ఉంచాలన్న నిబంధన ఎక్కడాలేదని పిటిషనర్ తరపు న్యాయవాది ఉమేశ్‌చంద్ర వాదించారు. పోలీసులు పట్టుబడ్డ ఉద్యోగి యాజమాన్యాలకు లేఖలు రాస్తున్నారని.. దీనివల్ల చాలామంది తమ ఉద్యోగాలు కోల్పోయారని తెలిపారు. దీనిపై ప్రతివాదులకు నోటీసులు జారీచేసిన ధర్మాసనం కౌంటర్ దాఖలుచేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదావేసింది.


పోలీసుల అదుపులో నిందితులు

# తల్లాడలో 190 కేజీల గంజాయి పట్టివేత

**ఖమ్మం క్రైం:** ఏపీ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఖమ్మం జిల్లా తల్లాడ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం తల్లాడ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా రెండుకార్లలో 190 కిలోల గంజాయి బయటపడింది. నిందితులను అదుపులోకి తీసుకుని పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ ముందు ప్రవేశపెట్టారు. అనంతరం సీపీ మీడియాతో మాట్లాడు తూ.. ఏపీలోని విశాఖకు చెందిన కోసరాజు నర్సింహారావు, లమ్మసింగి లోహబాబు అలియాస్ రిషీ రెండు కార్లలో 190 కిలోల గంజాయిని మహారాష్ట్రకు తరలిస్తున్నారన్న సమాచారంతో తల్లాడ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారన్నారు. ఆ సమయం లో రెండు కార్లను తనిఖీ చేయగా భారీగా గంజాయి దొరికిందన్నారు.

# ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.22 కోట్లు

- హైకోర్టుకు స్పష్టంచేసిన వ్యవసాయశాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**గతేడాది భారీవర్షాలతో పంటలు కోల్పోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేందుకు రూ.22కోట్లు కేటాయించామని, ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా పంటలు నష్టపోయిన రైతులకు ఈ మొత్తం చెల్లించేలా ఉత్తర్వులు కూడా జారీచేశామని వ్యవసాయశాఖ సోమవారం హైకోర్టుకు స్పష్టంచేసింది. ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపులో ఆలస్యంపై ఆదిలాబాద్ జిల్లా తలమడుగు సర్పంచ్ కళ్లెం కరుణాకర్‌రెడ్డి, తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి కోర్టుకు హాజరయ్యారు.

### సిట్ దర్యాప్తుపై వివరణ ఇవ్వండి: హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో జరుగుతున్న పరువుహత్యలపై ప్రత్యేక దర్యాప్తు బృందంను ఏర్పాటుచేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సోమవారం హైకోర్టు విచారణ చేపట్టింది. సిట్ ఏర్పాటుచేసే విషయంలో మూడువారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను హైకోర్టు ఆదేశించి, తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది.

# ప్లాస్మా పద్ధతిలో విత్తనశుద్ధి

- జర్మనీలోని ఓహన్‌హీమ్ అకడమిక్ ప్రొఫెసర్ బొప్పర్ సెబాస్టియన్


వ్యవసాయవర్సిటీలో జరిగిన సెమినార్‌లో మాట్లాడుతున్న జర్మనీ ప్రొఫెసర్ సెబాస్టియన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్లాస్మా విత్తనశుద్ధి, థర్మోగేడియంట్ జర్మినేటర్స్ 'క్యూటూ' స్కానర్స్, ఇమేజ్ అనలైజర్, వీడియో మీటర్ ల్యాబ్ వంటి ఆధునాతన సాంకేతికతతో విత్తనరంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకోనున్నాయని జర్మనీలోని ఓహన్‌హీమ్ అకడమిక్ ప్రొఫెసర్ బొప్పర్ సెబాస్టియన్ చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల, జన్యు, వృక్ష ప్రజననశాస్త్ర సెమినార్‌లో సోమవారం నిర్వహించిన పరస్పర చర్చా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. సాధారణ విత్తనశుద్ధికి బదులుగా ప్రపంచవ్యాప్తంగా పెను కల్గిన ప్లాస్మా విత్తనశుద్ధి త్వరలోనే అందుబాటులోకి రానున్నదన్నారు. ఆవ పంటలో విత్తన తేజస్సు పరీక్ష, నాణ్యమైన విత్తనాల గుర్తింపునకు మల్టీస్పెక్ట్రమ్ పరీక్షలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్ జగదీశ్వర్, పాలక మండలి సభ్యులు డాక్టర్ మనోహర్ రావు, డాక్టర్ కేవీఎస్ మీనాకుమారి, డాక్టర్ సీమతోపాటు అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## జన్యు స్వచ్ఛత ఆధారంగా విత్తన నాణ్యత

- ఇస్టా సదస్సులో భాగంగా కీలక అంశాలపై చర్చ
- రేపటితో ముగియనున్న అంతర్జాతీయ విత్తన సదస్సు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అంతర్జాతీయ విత్తన సదస్సు (ఇస్టా)లో భాగంగా ఆరోరోజు విత్తన నాణ్యతపై సోమవారం హెచ్ఐసీసీలో పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. ఈ చర్చలో విత్తన సదస్సు నోడల్ అధికారి డాక్టర్ కే కేశవులు, ఇస్టా కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు, సెక్రటరీ జనరల్ ఆండ్రియాస్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. విత్తనం నాణ్యత అనేది సంప్రదాయ, సాధారణ విత్తన నాణ్యత పద్ధతులైన మొలకశాతం, తేమ శాతం, ఏకరూపత పరిమాణం, భౌతిక స్వచ్ఛత, దీర్ఘాయువు మొదలగువాటితోపాటు ఇతర పంటరకాల విత్తనాల కలయిక కూడా ఆధారపడి ఉంటుందని పలువురు ప్రతినిధులు పేర్కొన్నారు. విత్తన నాణ్యత ప్రమాణాన్ని కొన్ని కంపెనీలు చాలా వరకు కొన్ని పంటల్లో మాత్రమే జన్యు ఆధారిత విత్తన పరీక్ష పద్ధతుల ద్వారా, డీఎన్ఏ స్థాయిలో పంటరకం విత్తన స్వచ్ఛతను నిర్ణయిస్తున్నట్టు తెలిపారు. జూన్ 26న మొదలైన అంతర్జాతీయ విత్తన సదస్సు బుధవారం (3వ తేదీన) ముగియనున్నదని కేశవులు తెలిపారు.



రెండేండ్ల తర్వాత నేను గర్వంగా, గొప్ప విశ్వాసంతో చెబుతున్నా. జీఎస్టీ పన్ను విధానం అందరి మన్ననలను పొందింది. కొనుగోలుదారులు, వ్యాపారులూ జీఎస్టీతో సంతృప్తి చెందారు. అధిక పన్నులు, పన్నుల విధానంలో సంక్లిష్టత పోయి జీఎస్టీతో అందరూ లాభపడుతున్నారు.

**అరుణ్ జైట్లీ, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి**

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 17 ఓబీసీ కులాలను ఎస్సీ జాబితాలో కలుపటం రాజ్యాంగ వ్యతిరేకం. ప్రభుత్వం ఓబీసీ వారితో ఆటలాడుకుంటున్నది. వారికి అటు ఓబీసీల్లోనూ, ఇటు ఎస్సీల్లోనూ లాభం జరుగదు. ఎస్సీల్లో చేర్చితే, దానికి అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను అంతే శాతం పెంచాలి.

**మాయావతి, బీఎస్పీ అధినేత్రి**



**చరిత్రలో నేడు**



**1881**

అమెరికా అధ్యక్షుడు జేమ్స్ గారిఫీల్డ్‌పై కాల్పులు. 79 రోజుల తర్వాత మృతి.

**1940**

స్వాతంత్ర్యోద్యమ నేత సుభాష్ చంద్రబోస్ కలకత్తాలో అరెస్టు, నిర్బంధం.





**1962**

అమెరికా అర్కెన్సాస్‌లో మొట్టమొదటి 'వాల్‌మార్ట్' స్టోర్‌ను ప్రారంభించిన శ్యామ్ వాల్టన్.

జమ్ముకశ్మీర్‌సమస్య పరిష్కారంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సరికొత్త వ్యూహాన్ని ఎంచుకున్నారు. ఈ మధ్య టెర్రరిస్టుల ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన పోలీస్ అధికారి ఇంటిని ఆయన సందర్శించి పోలీసుల మనో స్థైర్యాన్ని పెంచటానికి ప్రయత్నించారు. బుర్హన్ వనీ లాంటి వారు కశ్మీర్ వ్యాలీలో హీరోగా చలామణి అవుతున్న తరుణంలో, నిత్యం టెర్రరిస్టులతో పోరాటంలో ఉన్న పోలీస్ అధికారుల త్యాగాలను కృషిని ఎత్తిపట్టాల్సిన అవసరాన్ని చాటిచెప్పారు. మరికొన్ని నెలల్లో జమ్ముకశ్మీర్‌లో ఎన్నికలు జరుగుతాయని ఊహాగానాలు వస్తున్న వేళ అమిత్ షా ప్రత్యేక కార్యాచరణ అనుసరించటం గమనార్హం.

**ది హిందూ**

మల మూత్రాలను ఎత్తిపోసే పని మనుషులు చేయటాన్ని నిషేధించిన పరిస్థితుల్లోనూ ఇంకా ఆ పనిలో మనుషులు కొనసాగుతుండటం విషాదం. ఈమధ్య కాలంలో పారిశుద్ధ్య కార్మికుల మరణాలు తరచుగా జరుగుతున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 513 ఘటనలు జరిగాయి. ఒక్క ఢిల్లీలోనే 2018 సంవత్సరంలో 429 మరణాలు సంభవించాయి. కాబట్టి ఇప్పటికైనా శాస్త్ర, సాంకేతికతలను ఉపయోగించి పారిశుద్ధ్య పనిలో యంత్రాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# ఒకాసా కుట్ర

జపాన్‌లోని ఒకాసాలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో–డిజిటల్ ఎకానమీలో తమ పెత్తనాన్ని స్థిరపరుచుకోవడానికి పారిశ్రామికదేశాల చేసిన కుటిల యత్నాలను– భారత్ తదితర వర్ధమాన దేశాలు ప్రతిఘటించడం ప్రశంసనీయం. సైనికశక్తి ద్వారా ఇతర ఎత్తుగడల ద్వారా పారిశ్రామికరంగంలో ఆధిపత్యం వహిస్తున్న పెద్ద దేశాలు ఇప్పుడిప్పుడే ప్రభవిస్తున్న ఈ–కామర్స్ రంగంలోనూ తమ పట్టును కాపాడుకోవాలని యత్నిస్తున్నాయి. 'సరిహద్దులకు అతీతంగా డేటా ప్రవాహం' ఉండాలంటూ జపాన్ 'ఒసాకా ట్రాక్' పేర ఒక డిక్లరేషన్‌ను రూపొందించింది. పేరుకు ఒసాకా ట్రాక్ అంటున్నప్పటికీ ఇది వలసవాదానికి కొత్త బాట. ఈ చర్చకు హాజరై ఒకాసా డిక్లరేషన్‌పై సంతకం చేయడానికి భారత్, దక్షిణాఫ్రికా, ఇండొనీషియా దేశాలు నిరాకరించాయి. చైనా కూడా భారత్ తదితర దేశాల వాదనను బలపరుస్తున్నది. మరోవైపు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాలు కలిసికట్టుగా వర్ధమాన దేశాలకు వ్యతిరేకంగా వ్యవహరించాయి. డేటా మీద, తద్వారా ఈ కామర్స్ మీద పూర్తి ఆధిపత్యం సాధించాలని ప్రయత్నిస్తున్న పెద్ద దేశాలు, ఈ నియమ నిబంధనలను వర్ధమాన దేశాల రుద్దడానికి చేస్తున్న తీరు కూడా డబ్ల్యుటీవో నిబంధనలకు విరుద్ధంగా, ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉన్నది. తమకు అవసరమైన రీతిలో డబ్ల్యుటీవో నిబంధనలను వాడుకుంటున్న అమెరికా, వర్ధమాన దేశాల ప్రయోజనాల విషయానికి వచ్చేసరికి, ఆ వేదికను పక్కకు పెడుతున్నది. భారత్ మాత్రం డేటా ప్రవాహ నిబంధనలు కూడా డబ్ల్యుటీవో పరిధిలో జరగాలని పట్టుబడుతున్నది. 'ఒసాకా ట్రాక్' యత్నాలకు భిన్నంగా జీ20 డిక్లరేషన్‌లో తమ వాదనలను చేర్పించడంలో భారత్, దక్షిణాఫ్రికా సఫలమయ్యాయి. 'డేటా ఫ్లో' అన్నిదేశాలను కలుపుగోలుగా, సుస్థిరంగా, భద్రంగా, నమ్మదగినదిగా, సృజనాత్మకంగా ఉండాలని, ఎదుగుతున్న సాంకేతిక వ్యవస్థలను ప్రోత్సహించేదిగా' ఉండాలనే వ్యాఖ్యలను చేర్పించడం ఇప్పటికి కొంత విజయంగానే భావించవచ్చు.

**భారత్‌లో ఈ కామర్స్ ద్వారా సాగే వ్యాపారం వచ్చే రెండు మూడేండ్లలో లక్ష కోట్ల డాలర్లపైనే ఉంటుందని అంచనా. అందువల్ల డేటా స్థానికీకరణ కోసం, ఇతర అవసరాల కోసం చట్టాలు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. అయితే ఈ చట్టాల మూలంగా వ్యక్తుల వివరాలు ప్రభుత్వం దగ్గర చేరడం కూడా హక్కులకు భంగకరమనే ఆందోళన వ్యక్తమవుతున్నది. పార్లమెంటు చట్టాలు చేసే ముందు ఈ ఆందోళనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలె.**

భవిష్యత్తులో 'డేటా' అస్త్రశస్త్రాల కన్నా శక్తిమంతమైందిగా మారబోతున్నది. నెట్ ద్వారా భిన్న ప్రాంతాల, భిన్న వయసుల వారు, ఆర్థిక అంతస్తులు, జీవన ప్రమాణాలు గల వారు సాగించే సందేశాలు, లావాదేవీలు, కొనుగోళ్ళు, సమాచారం కోసం వెతుకులాటలు మొదలైన వివరాలు (బిగ్ డేటా) ఎవరికి అందుబాటులో ఉంటే వారు వాటిని విశ్లేషించి ఉపయోగించుకోగలుగుతారు. తదనుగుణంగా ప్రకటనలు పంపించడం మొదలుకొని వ్యాపార వ్యూహాలను రూపొందించుకోగలుగుతారు. భవిష్యత్తులో ఈ కామర్స్ ద్వారానే భారీ వ్యాపారం సాగబోతున్నది. భద్రత రీత్యా కూడా సమాచారాన్ని తమ అధీనంలో పెట్టుకోవాలని ఆయా దేశాలు భావిస్తున్నాయి. మన దేశ పౌరులకు సంబంధించిన డేటా మన దేశ సరిహద్దులు దాటి పోకూడదని, 'డేటా స్థానికీకరణ' జరుగాలని భారత్ వంటి వర్ధమాన దేశాలు కోరుకుంటున్నాయి. 'డేటా స్థానికీకరణ' ప్రకారం– మన దేశ పౌరుల గురించి అమెరికా కంపెనీలు సేకరించే డేటా మన దేశంలోనే ఉండాలె. సరిహద్దులు దాటి పరాయి దేశాలకు వెళ్ళకూడదు. విశ్లేషణలు కూడా మన దేశంలోనే జరుగాలె. ఆ సమాచారం మన ప్రభుత్వానికి అందుబాటులో ఉండాల్సిందే. అవసరమైతే ఈ కంపెనీలు ఏ డేటా సేకరించ కూడదో ఆంక్షలు విధించే పరిస్థితి ఉండాలె. ఆన్‌లైన్ ద్వారా అమ్ముడయ్యే వస్తువులకు మన ప్రభుత్వం సుంకాలు విధించగలగాలె. ఇకానీ అమెరికా, ఇతర పెద్ద దేశాలు మాత్రం సుంకాలు విధించకూడదని అంటున్నాయి. అమెరికా సంస్థలకు మన దేశంలోని రిలయన్స్ వంటి కంపెనీలు ఈ కామర్స్ రంగంలో గట్టి పోటీ ఇవ్వాలని యత్నిస్తున్నాయి.

మన దేశంలో ఈ కామర్స్ సంస్థలు ఎదగడానికి అనుకూల పరిస్థితులు మన దేశ చట్టాలు కల్పించాలె. చైనా ఇదే విధంగా చట్టాలు చేసుకోవడం వల్ల దేశీయ సంస్థలు ఎదిగాయి. ఈ కామర్స్ కొత్త రంగం అయినందు వల్ల తమకంటూ నిబంధనలు రూపొందించుకోవడానికి, అనుకూల పరిస్థితులు కల్పించుకోవడానికి కొంతవ్యవధి కావాలని భారత్ తదితర వర్ధమాన దేశాలు కోరుతున్నాయి. వర్ధమాన దేశాలతో చర్చలు జరిపితే వాటికి కొంత వెసులుబాటు కల్పించవలసి వస్తుంది కనుక అసలు ఏకాభిప్రాయ సాధన కోసం ప్రయత్నమే చేయకూడదని అమెరికా ఇతర పెద్ద దేశాలు భావిస్తున్నాయి. వాటికవే చర్చించుకొని కొన్ని నిబంధనలను రూపొందించుకొని వాటిని డబ్ల్యుటీవో ద్వారా వర్ధమాన దేశాల మీద రుద్దాలని యత్నిస్తున్నాయి. ఇప్పుడు ఒసాకా ట్రాక్ పేర తీర్మానం చేయడం కూడా ఇందులో భాగమే. అంతర్జాతీయ స్థాయిలో భవిష్యత్తులో ఇంకా చర్చలు సాగుతాయి. భారత్‌లో ఈ కామర్స్ ద్వారా సాగే వ్యాపారం వచ్చే రెండు మూడేండ్లలో లక్ష కోట్ల డాలర్లపైనే ఉంటుందని అంచనా. అందువల్ల డేటా స్థానికీకరణ కోసం, ఇతర అవసరాల కోసం చట్టాలు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. అయితే ఈ చట్టాల మూలంగా వ్యక్తుల వివరాలు ప్రభుత్వం దగ్గర చేరడం కూడా హక్కులకు భంగకరమనే ఆందోళన వ్యక్తమవుతున్నది. పార్లమెంటు చట్టాలు చేసే ముందు ఈ ఆందోళనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలె.

**జనగళం**

## కలిసికట్టుగా కృషి చేయాలె

రాష్ట్రంలోని ప్రతిపక్షపార్టీలు అధికార పార్టీపై నిత్యం విమర్శలకే పరిమితం అవుతున్నాయి. అయితే రాష్ట్రాభివృద్ధి కోసం తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్న విషయాన్ని మాత్రం విస్మరించడం శోచనీయం. రాష్ట్రంలోని సగం జిల్లాలకు సాగు నీరు, తాగునీరు అందించే కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండు చేయాల్సింది పోయి విమర్శలు చేయడం సరికాదు. విభజన సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. ఇది అధికార పార్టీ సమస్య అన్నట్టు ప్రతిపక్షాల వ్యవహారం ఉన్నది. ప్రభుత్వంపై కేవలం విమర్శలు మాత్రమే చేస్తామనే వైఖరి మారాలి. విభజన, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా కృషి చేయాలి.

**-ఎ. కుమారస్వామి, హైదరాబాద్**

## పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలె

రోజురోజుకూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు కేంద్రం అడ్డుకట్ట వేయాలి. కానీ కేంద్ర ప్రభుత్వం ఈ ధరలు తగ్గించడానికి తగిన చర్యలు చేపట్టకపోవడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజానీకంపై పెను భారం పడుతున్నది. అందరి వికాసం కోసం పనిచేస్తామని చెబుతున్న కేంద్రంలోని పెద్దలు ఈ ధరల విషయంలో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. కాబట్టి ఇప్పటికైనా దీనిపై దృష్టి సారించాలి. పెరుగుతున్న పెట్రోల్, డీజిలు ధరలను తగ్గించడానికి కృషి చేయాలి.

**-బి. వేణుగోపాల్, నల్గొండ**

## జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలె

ఇన్‌కం టాక్స్ కట్టే సీనియర్ సిటీజన్స్‌కు 70 ఏండ్లు దాటిన వారికీ పన్నులో 10 శాతం రాయితీ ఇవ్వాలి. అలాగే 80 ఏండ్లు దాటిన వారికి పన్నులో 15 శాతం ఇవ్వాలి. ఎందుకంటే నేడు వీరు కట్టే హెల్త్ ఇన్స్యూరెన్స్ ప్రీమియం చాలా ఎక్కువ. కాబట్టి వీరికి ఇన్స్యూరెన్స్‌కి, వైద్యానికి జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ఆర్థికమంత్రి ఈ వెసులుబాటు రాబోయే బడ్జెట్‌లో కల్పించాలి..

**-చామర్తి వెంకట రామకృష్ణ, హైదరాబాద్**

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

విశ్లేషణ



బి.ఎస్.రాములు

# ఇతరుల నుంచి నేర్చుకోవాలె

నార్వేలో అనేక ఆదర్శవంతమైన అంశాలున్నాయి. రష్యా, చైనా, జపాన్‌లలో కూడా అనేక ఆదర్శవంతమైన అంశాలున్నాయి. నాగరిక, పౌర సమాజంలో అవి స్వీకరించడం ఎంతో అవసరం. ముఖ్యంగా పని చేయించుకోవడంకన్నా, తన పని తాను స్వయంగా చేసుకోవడం పట్ల మనకు గౌరవం పెరుగాల్సి ఉన్నది.

ఈ మధ్య కొందరు అమెరికాను అనుసరిస్తే అంతేసంగతులు అని రాయడం విచిత్రమైన విషయం. మంచి ఎక్కడున్నా స్వీకరించాల్సిందే. లక్షలాదిమంది భారతీయులు అమెరికాలోను, అమెరికా ఆధారిత సాఫ్ట్‌వేర్ రంగంలోను ఉపాధి పొందుతున్నారు. ఇండియాకు ఎంతో ఆదాయాన్ని సమకూరుస్తున్నారు. అమెరికాను, ఇంగ్లాండును, నార్వేను, రష్యా, చైనా, జపాన్‌లను ఏ విషయాల్లో ఆదర్శంగా తీసుకోవాలో ఒక స్పష్టత అవసరం. అమెరికాలో రోడ్లు నీటుగా ఉంటాయి. పన్నెండవ తరగతి దాకా సుమారుగా అన్ని ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలలు ఉచిత విద్యను అందిస్తాయి. ఐదు, పదేళ్ళ సీనియారిటీతో విదేశస్థులకు గ్రీన్‌కార్డ్, సిటిజన్‌షిప్ ఇస్తున్నది. 1927లో అమెరికా రాజ్యాంగంలో ఒక సవరణ చేసుకున్నారు. అదేమంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర దేశాల నుంచి ఆయుధాలను కొనకూడదు. తామే స్వయంగా పరిశోధనలు చేసి రూపొందించుకోవాలి అని రాజ్యాంగ సవరణ చేశారు.

గత రెండువందల సంవత్సరాలలో ఆవిష్కృతమైన అనేక సైన్స్, టెక్నాలజీ అన్వేషణలు, డిస్కవరీలలో డెబ్బై శాతం అమెరికావే అని 2007లో ఒక గ్రంథకర్త సోదాహరణంగా వివరించాడు. అమెరికాలోని స్టేట్ హైవేస్ అని పిలుచుకునే జాతీయ రహదారులు ఎన్ని వందల మైళ్ళు సాగినా ఏ ఊరిని గానీ, పట్టణాన్ని గానీ, నగరాన్ని గానీ, వారి జనజీవితానికి రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా వాటికి కనీసం మూడు మైళ్ళ దూరం నుంచి రోడ్డు వెళ్ళాలి అని 1956–1962 మధ్యన రూపొందించడం జరిగింది. ఆ రహదారుల్లో ప్రతి 15 మైళ్ళకు ఒక రెస్ట్ రూమ్‌ల సముదాయం, గ్యాస్‌స్టేషన్ (పెట్రోల్ పంప్), పార్కింగ్ స్థలాలు ఉంటాయి. ప్రతి రోడ్డుకు నెంబరు వేసి ఏది ఎటు వెళ్తుందో జీపీఎస్ ద్వారా ఇంటి నెంబరుతో సహా డైరెక్టుగా ఆ ఇంటికి వెళ్ళవచ్చు. క్యూ కట్టినప్పుడు ఎక్కడైనా సరే కౌంటర్ వద్ద ఉన్న మనిషికి మిగతా క్యూకు మధ్య ఐదు అడుగుల దూరం ఉంటుంది.

అన్ని పనులు స్వయంగా వారే చేసుకుంటారు. కారు డ్రైవర్లు అంటూ వేరే ఉండకుండా తామే స్వయంగా డ్రైవింగ్ చేస్తారు. తామే స్వయంగా వంట చేసుకుంటారు. బట్టలు ఉతుక్కొని ఇస్త్రీ చేసుకుంటారు. ఇల్లు ఊడ్చుకుంటారు. దుమ్ము వాక్యూమ్ క్లీనర్‌తో పరిశుభ్రం చేసుకుంటారు. శుభ్రపరుచుకుంటారు. ఇంటి ముందు, ఇంటి వెనుక చక్కని గడ్డిగానీ, చక్కని తోట గానీ పెంచుకుంటారు. 15 రోజులకొకసారి గడ్డిని కట్ చేయకపోతే పెనాల్టీ వేస్తారు. షాపుల్లో కొన్నవి బాగలేవని కొద్దిరోజులకు వేరే ప్రాంతంలోని ఆ షాపు తాలూకు కౌంటర్‌లో వాపసు చేసి మంచివి తీసుకోవచ్చు. పోలీసులు చాలా మర్యాదగా ప్రవర్తిస్తారు. ఇలాంటివన్నీ ఇండియాలో కూడా అనుసరణీయం. అందుకు తగిన చర్యలు, రాజ్యాంగ సవరణలు కూడా ఎంతో అవసరం.

అనేక దేశాలవాళ్ళు, అనేక జాతుల వాళ్ళు, కులాల వారు, అనేక భాషలవాళ్ళు అమెరికాలో కలిసి జీవిస్తారు. పెళ్ళికి అతి సన్నిహితులను 25 మందిని వధువు తరపున, 25 మందిని వరుడు తరపున పిలుచుకొని సింపుల్‌గా పెళ్ళి జరుపుకుంటారు. పెళ్ళి, రిజిస్ట్రేషన్ చేయించుకుంటారు. ఇలాంటివన్నీ మనం నేర్చుకోవాల్సి ఉన్నది. వారిని చూసి మనల్ని మనం మార్చుకోవాల్సే ఉన్నది.

ఇతర దేశాల నుంచి ఆయుధాలు, విమానాలు, సెల్‌ఫోన్‌లు టెక్నాలజీ కూడా కొనకుండా స్వయంగా పరిశోధనలు చేసి రూపొందించుకోవాలి అని రాజ్యాంగ సవరణ చేసుకోవచ్చు. తద్వారా లక్షల కోట్లు మిగులుతాయి. వేలాదిమందికి సైంటిస్టులుగా, వగైరా ఉపాధి లభిస్తుంది. అమెరికా ఈ రాజ్యాంగ సవరణ చేసుకున్నాకే అణు బాంబును కనుక్కోగలిగింది. అంతరిక్షంలోకి ఎన్నో ఉపగ్రహాలను పంపిన మనకు ఆయుధాలను మనమే తయారు చేసుకోవడం, సైన్స్, టెక్నాలజీని అన్వేషించి కనుక్కోవడం, విమానాలు రూపొందించుకోవడం కష్టం కాదు. ఇలా రాజ్యాంగాన్ని సవరించుకుంటే దేశం ఆయుధపరంగానే కాకుండా, ఆర్థికపరంగా సంపన్నమవుతుంది.

దేశం అంతటా అందరికీ ప్రభుత్వ పాఠశాలల ద్వారానే విద్యను అందించి, ప్రైవేటు పాఠశాలలను పన్నెండో తరగతి దాకా నిషేధించవచ్చు. అమెరికాలో పోలీసుస్టేషన్‌కు, తాహసిల్ ఆఫీస్‌కు ఎలా అయితే పరిధి ఉంటుందో అలాగే వారు నివసిస్తున్న ప్రాంతంలోని పాఠశాలలలో మాత్రమే చదివించాలి. ఈ పద్ధతులవల్ల విద్యావిధానాల్లో చక్కని ప్రమాణాలు నెలకొంటాయి. అందరికీ ఒకే బడి. అలాగే పిల్లల్ని కొట్టకుండా, తిట్టకుండా, ఎవరినైనా సరే ఎగాదిగా చూడకుండా సంస్కారాన్ని అలవర్చుకోవడం నాగరిక సమాజానికి ఒక ముఖ్య లక్షణం.

> కొందరు పనిగట్టుకొని కొన్ని ఇష్టంలేని అంశాలను, వ్యతిరేక అంశాలను చూపి ఆయా దేశాలపట్ల వ్యతిరేకతను ప్రచారం చేయడం మంచిది కాదు. మంచి అంశాలను కూడా చెప్పడం రావాలి. స్వీకరించడం రావాలి. స్వార్థానికి పరిమితమై సైన్స్, టెక్నాలజీని స్వీకరించి, మనలోని చెడును సంప్రదాయం, సంస్కృతి పేరిట సమర్థించుకోకుండా, పైన చెప్పిన ఆధునిక ప్రజాస్వామిక సంస్కృతిని, సంస్కారాన్ని అలవరచుకోవాలి.

అమెరికాలో డేకేర్ సెంటర్లు చక్కగా నడుస్తుంటాయి. పదిపన్నెండు తరగతులు చదివిన వారికి రెండేండ్లు ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ఆ శిక్షణ పొందిన సర్టిఫికెట్ ఉన్నవారే డేకేర్ సెంటర్లు, నర్సరీ స్కూళ్ళు నడపడానికి అర్హులు. ఆ శిక్షణలో పిల్లల డాక్టర్లకు ఇచ్చే కోర్సు, పిల్లల మనస్తత్వ శాస్త్రానికి సంబంధించిన కోర్సు, తల్లిగా, గార్డియన్‌గా ప్రేమించాల్సిన తీరు అందరు కలిసి ఉన్నప్పుడు ఒకరి నుంచి ఒకరికి సంక్రమించే వ్యాధుల గురించిన జాగ్రత్తలు, ఎలాంటి న్యూట్రిషన్‌ఫుడ్ మధ్యాహ్న భోజనంలో అందించాలో మొదలైనవన్నీ ఆ కోర్సులో ఉంటాయి. మన అంగన్‌వాడీ టీచర్లకు ఈ శిక్షణ ఇవ్వడం ఎంతైనా అవసరం. అందుకే వారికి పదివేల రూపాయల జీతాన్ని ఇవ్వడం జరుగుతున్నది. వీరికి ఆ శిక్షణ ఇచ్చి కేజీ టు పీజీ విద్య ప్రణాళికతో అనుసంధానింపజేయడం ఆదర్శంగా ఈ జీతాలు పెంచడం జరిగింది. అలాగే ఇంగ్లాండ్‌ను గనుక ఆదర్శంగా తీసుకుంటే ఉచిత విద్యతో పాటు, అన్నిస్థాయిల్లో ఉచిత వైద్యం ప్రభుత్వమే అందిస్తుంది. ఇది ఎంత గొప్ప విషయమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. భారతదేశంలో ఇది అనుసరించాల్సిన మార్గం. పేదలకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్, ఉచితంగా కేజీ టు పీజీ విద్య, ఉచితంగా వైద్యం అన్నీ ప్రభుత్వ పాఠశాలలే అనే విధానం ఆచరిస్తే దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగడం వేగవంతమవుతుంది.

నార్వేలో అనేక ఆదర్శవంతమైన అంశాలున్నాయి. రష్యా, చైనా, జపాన్‌లలో కూడా అనేక ఆదర్శవంతమైన అంశాలున్నాయి. నాగరిక, పౌర సమాజంలో అవి స్వీకరించడం ఎంతో అవసరం. ముఖ్యంగా పని చేయించుకోవడంకన్నా, తన పని తాను స్వయంగా చేసుకోవడం పట్ల మనకు గౌరవం పెరగాల్సి ఉన్నది. ఒక అమెరికన్ రచయిత్రి మా పూర్వీకులది ఇండియా అని ఇండియా సందర్శిస్తానని వచ్చింది. ఒకే ఇంటికి ఊడ్చేవాళ్ళు వేరు. గిన్నెలు కడిగేవారు వేరు, వంట చేసేవారు వేరు. గార్డెనింగ్‌కు వేరు. ఇస్త్రీకి వేరు, డ్రైవర్ వేరు, టాయిలెట్ క్లీనింగ్‌కు వేరు వంటి పనులకు ఐదారుగురు పనిచేయడం చూసి ఆశ్చర్యపోయింది. ఒక ఇంటి కోసం ఇంతమంది పనిమనుషులు ఎందుకో ఆమెకు అర్థం కాలేదు. ఎవరి పని వాళ్ళు ఎందుకు చేసుకోవడం లేదో చూసి బిత్తరపోయింది. అదే మాట ఆమె గ్రంథంలో రాసింది. ఆమెకిది వింతగా కనిపించింది. మనకిది సహజమనిపించే దుస్థితికి లోనయ్యాము. ఆ పనుల పట్ల విభిన్న వివక్షలు కొనసాగడం వల్లనే ఇంతమంది అవసరమవుతున్నారు. స్వయంగా చేసుకోవడం నామోషి అనే దుస్థితి కొనసాగడం శ్రామికుల పట్ల, శ్రమపట్ల పనిచేయడం పట్ల, అగౌరవాన్ని, చిన్నచూపును తెలియజేస్తాయి. ఇలాంటి వాటన్నిటిని అమెరికా, రష్యా, ఇంగ్లాండ్, చైనా, జపాన్‌లను చూసి నేర్చుకోవాల్సింది, మార్చుకోవాల్సింది ఎంతో ఉంది.

విదేశాల సైన్స్, టెక్నాలజీ స్వీకరిస్తున్నాం. విద్యుత్, రేడియో తరంగాలు, ఇంటర్నెట్, సినిమా, టీవీ, రైలు, విమానాలు, బస్సులు, కార్లు మొదలుకొని సబ్బులు, సౌందర్య సాధనాలు, ఫ్యాషన్లు అనేక దేశాల నుంచి స్వీకరిస్తున్నాం. అదేవిధంగా మంచి అంశాలను స్వీకరించటం ఎంతో అవసరం. కొందరు పనిగట్టుకొని కొన్ని ఇష్టంలేని అంశాలను, వ్యతిరేక అంశాలను చూపి ఆయా దేశాలపట్ల వ్యతిరేకతను ప్రచారం చేయడం మంచిది కాదు. మంచి అంశాలను కూడా చెప్పడం రావాలి. స్వీకరించడం రావాలి. స్వార్థానికి పరిమితమై సైన్స్, టెక్నాలజీని స్వీకరించి, మనలోని చెడును సంప్రదాయం, సంస్కృతి పేరిట సమర్థించుకోకుండా, పైన చెప్పిన ఆధునిక ప్రజాస్వామిక సంస్కృతిని, సంస్కారాన్ని అలవరచుకోవాలి. రాజ్యాంగ సవరణలను చేసుకోవడం ఎంతైనా అవసరం.

(వ్యాసకర్త: రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్)

# జలవివాదాలకు చర్చలే మార్గం

తెలంగాణం



తాడూరి శ్రీనివాస్

ఏ లాంటి భేషజాలు, బేసిన్ల గొడవలు, మనస్పర్థలు లేని స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించారు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు. రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు పెంచి అన్నదమ్ముల వలే రెండు రాష్ట్రాలు పట్టింపులకు, మొండితనాలకు పోతే ప్రజలకు దక్కేది ఏమి లేదని చాటిచెప్పారు. ప్రజలకు మేలు చేయడమే తమ ప్రధాన లక్ష్యమని కేసీఆర్, జగన్ ముందుకు సాగుతున్నారు.

గతంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు.. కేసీఆర్‌తో వ్యవహరించిన తీరునకు, ప్రస్తుతం జగన్ వ్యవహరిస్తున్న తీరుకు 'జమీన్, ఆస్మాన్‌కు ఉన్నంత ఫరక్' ఉందనడంలో సందేహం లేదు. చీటికిమాటికి కయ్యానికి కాలు దువ్వడం కాకుండా చతురతతో ప్రజాశ్రేయస్సు కోసం ఇరువురు నెయ్యానికి ప్రాధాన్యమివ్వటం గమనార్హం. విభజన అనంతరం పెండింగ్‌లో ఉన్న ఎన్నో సమస్యలు కూర్చొని పరిష్కరించుకోదగ్గవి అయినా చంద్రబాబు చేసిన కుటిల రాజకీయాల వల్ల ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్టు గత ఐదేండ్లుగా సమస్యలు అపరిష్కృతంగానే ఉండిపోయాయి. అంతేగాకుండా ప్రజల మధ్య విద్వేషాలు పెంచేలా ఉండేవి. తెలంగాణ ఏర్పడిన తర్వాత తలెత్తిన విభజన సమస్యలను సానుకూల దృక్పథంతో సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలి. కానీ మూడో వ్యక్తిది, సంస్థది, కోర్టులది గాని ప్రమేయం ఉండకూడదనేది కేసీఆర్ ఆలోచన. దీనికి ఏపీ సీఎం జగన్ కూడా సహకరించి ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారి ప్రగతిభవన్‌లో అధికారికంగా భేటీ అవడం శుభ పరిణామం. నీటి సమస్యలనూ ఏ ట్రిబ్యునల్స్‌తో సంబంధం లేకుండా చర్చల ద్వారా సఫలీకృతం అవడం గుణాత్మక మార్పును సూచిస్తున్నది. రెండు రాష్ట్రాలు స్నేహబంధంతో సున్నితమైన ఎన్నో సమస్యలను పరిష్కరించుకోవడం అనేది ఒక చరిత్ర. దేశంలో ఎన్నో రాష్ట్రాలు ఇలాంటి స్పష్టత లేక సమస్యలతో సతమతమవుతున్నాయి. ఆంధ్రరాష్ట్రంలో వైఎస్ జగన్ పరిపాలన మొదలైన నాటి నుంచి ఇరు రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, చేపడుతున్న కార్యక్రమాలు భేష్ అనిపిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం లాంటి అపూర్వఘట్టాలలో సైతం మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కేసీఆర్‌తో కలిసి పాల్గొనడం స్నేహబంధానికి ప్రతీకగా నిలిచేలా చేసింది. ఇలా కేసీఆర్ చూపిన దౌత్యనీతి రాష్ట్రాల మధ్య ఖడ్గచాలనం కాదు, కరచాలనం కావాలని దేశానికే ఆదర్శంగా నిలిచింది.

దేశంలో ఏటా జల వివాదాలు ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. వీటికి కారణం రాష్ట్రాల మధ్య సమన్వయ లోపమే. ఉదాహరణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలకు సాగు నీరు దొరకక పొలాలు బీటలు వారేవి. తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా దొరకక ప్రజలు అల్లాడిపోయేవారు. అయినా ఎగువన ఉన్న రాష్ట్రాలతో గత పాలకులు మాట్లాడటం, నీటి కష్టాలను తీర్చాలనే ప్రయత్నం చేసిన దాఖలాలు లేవు. ఏదైనా అంటే కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని, కేటాయింపుల కోసం వేసిన ట్రిబ్యునళ్లు ఆ పని చేస్తాయని తప్పించుకునేవారు. కానీ రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు ఉంటే ఈ ట్రిబ్యునళ్లతో పనే ఉండకపోయేది.

అంతరాష్ట్రాల జల వివాదాలు తలెత్తినప్పుడు కేంద్రం ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేస్తుంది. ఇవి మూడేండ్లలో సమస్యను పరిష్కరించాలి, లేదా ఇంకో రెండేండ్లు పొడిగించి మొత్తం ఐదేండ్లలో వివాదాలకు తెరదించాలి. కానీ దేశంలో ఇప్పటివరకు ఏర్పడిన ఎనిమిది ట్రిబ్యునళ్లలో ఏ ఒక్కటైన సంపూర్ణంగా జల వివాదాలను పరిష్కరించగలిగిందా? కావేరి జల వివాదం కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల మధ్య ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది సుప్రీంకోర్టు మెట్లు ఎక్కినా, ఎన్ని ట్రిబ్యునళ్లు ఏర్పడినా ఇంకా కొనసాగుతూనే ఉన్నది. రావి, బియాస్ జలవివాదం కూడా ఎన్నో ఏండ్లు కొనసాగింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్‌ల మధ్య నర్మదా జల వివాదాలు, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ మధ్య మహానది వివాదం, నిన్నమొన్నటి వరకు కృష్ణ, గోదావరి జల వివాదాలు కూడా సాగుతూనే వచ్చాయి. వీటన్నింటి పరిష్కారం కోసం ఏర్పడిన ట్రిబ్యునల్స్ ఏండ్లు గడుస్తున్నా పరిష్కారం చూపలేకపోతున్నాయంటే కారణం రాష్ట్రాల మధ్య సమన్వయం లేకపోవడమే. రాష్ట్రాధినేతలు కూర్చొని పరిష్కరిస్తే చాలావరకు సమస్యలు సుసాధ్యం కావా? అంతెందుకు రాష్ట్రంలో గోదారి, కృష్ణ నదుల్లో నీటి లభ్యత దండిగా ఉన్నా గత పాలకులకు సమర్థవంతగా వినియోగించుకునే శక్తి యుక్తులు లేక ఏటా మూడు వేల టీఎంసీల నీటిని సముద్రపు పాలు చేశారు. స్నేహపూర్వకంగా ఆలోచించివాడుకొని ఉంటే అసలు జల వివాదాలకు తావు ఉండేది కాదు కాదా.

> నీటి వివాదాల పరిష్కారం కోసం ఏర్పడ్డ ట్రిబ్యునల్స్ ఏండ్లు గడుస్తున్నా పరిష్కారం చూపలేకపోతున్నాయంటే కారణం రాష్ట్రాల మధ్య సమన్వయం లేకపోవడమే. రాష్ట్రాధినేతలు కూర్చొని పరిష్కరిస్తే చాలావరకు సమస్యలు సుసాధ్యం కావా? అంతెందుకు రాష్ట్రంలో గోదారి, కృష్ణ నదుల్లో నీటి లభ్యత దండిగా ఉన్నా గత పాలకులకు సమర్థవంతగా వినియోగించుకునే శక్తి యుక్తులు లేక ఏటా మూడు వేల టీఎంసీల నీటిని సముద్రపు పాలు చేశారు. స్నేహపూర్వకంగా ఆలోచించి వాడుకొని ఉంటే అసలు జలవివాదాలకు తావు ఉండేది కాదు కాదా.

విభేదాలు వచ్చినప్పుడు పరిష్కరించుకోవడం కాదు, అసలు విభేదాలే తలెత్తకుండా చూసుకోవడం గొప్పతనం. ఎదుటివారు కష్టాలలో ఉన్నప్పుడు వారికి సహకరించడం మానవత్వం. ఇవన్నీ కలగలిసిన నిండు మనసున్న నాయకుడు కేసీఆర్. కాబట్టి గతంలో హుదూద్ లాంటి భీకరమైన తూపానుతో ఆంధ్ర రాష్ట్రం అతలాకుతలమై విద్యుత్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైన సమయంలో అన్ని మర్చిపోయి పెద్ద మనసుతో 18 కోట్ల రూపాయల విలువైన 530ట్రాన్స్ ఫార్మర్‌లను, 28,500 విద్యుత్ స్తంభాలు, 900 మీటర్ల కేబుల్ పంపించి వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. అంతేగా కుండా 5 గురు సీనియర్ ఐఏఎస్ అధికారులను సైతం పనుల పర్యవేక్షణకు పంపండం కేసీఆర్ మానవీయతకు అద్దం పడుతుంది. అలాగే నీటి విషయంలో కూడా 2017లో తుంగభద్ర నుంచి నీటిని కర్ణాటక ముఖ్యమంత్రి అడుగగానే వెంటనే అంగీకరించారు. ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఏనాటికైనా మేలే చేస్తుంది. మనం ఎదుటి వారికి కష్టాల్లో సాయపడితో మనం కష్టాల్లో ఉన్నప్పుడు అదే మనకు దారిని చూపిస్తుందన్నది మంచి మనసు. అంతేకాదు రోజురోజుకు తగ్గుతున్న కృష్ణానది జలాల ద్వారా ఎదురయ్యే సాగు నీటి కష్టాలను బేరీజు వేసి, గోదావరి జలాలను కాలువల ద్వారా కృష్ణానదికి తరలించడానికి కాళేశ్వరానికి దిగువన గోదావరి, ఇంద్రావతి రెండు నదులు కలిసిన తర్వాత తుపాకుల గూడెం వద్ద ఒక కొత్త ప్రాజెక్ట్ నిర్మించి రోజుకు నాలుగు టీఎంసీల నీటిని శ్రీశైలం ప్రాజెక్టుకు, నాగార్జున సాగర్‌కు సొరంగాలు, కాలువల ద్వారా తరలించే ప్రయత్నాలు జరుగుతుండటం ముదావహం. ఈ నిర్ణయం వల్ల అటు రాయలసీమ ఇటు పాలమూరు, నల్గొండ జిల్లా వాసుల జీవితంలో వెలుగులు నిండబోతున్నాయి. గోదావరి, కృష్ణమ్మల కలయికను సుసాధ్యం చేసే దిశగా 'దారి మార్చి గోదారిని కృష్ణమ్మతో కలుపాలని' చేస్తున్న ఈ ప్రయత్నం కేసీఆర్, జగన్‌ల స్వచ్ఛమైన స్నేహానికి, జల బంధానికి నిదర్శనం. రాబోయే తరానికి మార్గదర్శకం.

(వ్యాసకర్త: రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మన్)

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



జగిత్యాల జిల్లా కోరుట్లలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడికి సభ్యత్వ నమోదు రశీదు అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



మేడ్చల్ జిల్లా చెంగిచెర్లలో టీఆర్‌ఎస్ సభ్యత్వాలను అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి



హైదరాబాద్ బేగంబజార్ ఛత్రి చౌరస్తాలో పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తున్న మంత్రి తలసాని. చిత్రంలో నాయకులు నందకిశోర్ వ్యాస్, జన్నారం వెంకటేశ్‌గౌడ్



టీఆర్‌ఎస్ ఖమ్మం నగర కోశాధికారి మామిళ్లపల్లి రాంబాబుకు సభ్యత్వం అందజేస్తున్న మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్

# ఉత్సాహంగా సభ్యత్వాలు

## గులాబీ పార్టీకి ప్రజల నుంచి అద్భుత స్పందన

### పాల్గొంటున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు

### విదేశాల్లోనూ జోరుగా నమోదు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/నెట్‌వర్క్:** టీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా చురుగ్గా సాగుతున్నది. పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పార్టీ సభ్యత్వాన్ని తీసుకోవడానికి ఉత్సాహంగా ముందుకొస్తున్నారు. ప్రజల నుంచి కూడా అద్భుతమైన స్పందన వస్తున్నది. ఈ స్పందన చూసి నిర్దేశించిన లక్ష్యాన్ని అతి తక్కువ సమయంలో చేరుకుంటామని నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జూన్ 27న పార్టీ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. మండలాల వారీగా పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గానికి 50వేల చొప్పున మొత్తం 60 లక్షల సభ్యత్వాన్ని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పుస్తకాల పంపిణీ పూర్తయింది. ఈనెల 20లోగా సభ్యత్వాన్ని పూర్తి చేయాలని గడువు పెట్టుకోగా ప్రజల నుంచి వస్తున్న స్పందన దృష్ట్యా ఈనెల 10కల్లా పూర్తి చేస్తామని నాయకులు చెప్తున్నారు. ప్రజల స్పందనను సానుకూలంగా మలుచుకొని త్వరగా సభ్యత్వ నమోదు పూర్తి చేయడంతోపాటు కమిటీలు వేయాలని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర నాయకులు సభ్యత్వ నమోదులో పాల్గొంటున్నారు. సభ్యత్వ నమోదు పకడ్బందీగా సాగేందుకు ఒకటి, రెండు నియోజకవర్గాలకు ఒకరు చొప్పున రాష్ట్ర స్థాయి





నాయకులను ఇంచార్జీలుగా నియమించారు. వీరు సభ్యత్వ నమోదుతోపాటుగా గ్రామ, మండల కమిటీలు ఎన్నుకునే వరకు అక్కడే ఉండాల్సి ఉంటుంది. టీఆర్‌ఎస్ పార్టీ సభ్యులకు ప్రమాద బీమా కల్పించారు. దురదృష్టవశాత్తు మరణిస్తే ఆ సమయంలో వారి సంబంధీకులకు ఆ మొత్తం చెల్లించడంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆధార్‌కార్డు నంబర్, నామినీ పేరు, ఫోన్ నంబర్, చిరునామా తప్పనిసరిగా పొందుపర్చాలని ఆదేశాలు జారీ చేశారు. టీఆర్‌ఎస్‌ను ప్రజలు తమ ఇంటి పార్టీగా అభిమానిస్తూ ఆదరిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికల్లోనూ గులాబీ పార్టీని గుండెలకుహత్తుకున్నారు. పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించడాన్ని గౌరవంగా భావిస్తున్నారు.



సూర్యాపేట నూతన జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణకు టీఆర్‌ఎస్ సభ్యత్వం అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్



మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో కార్యకర్తలకు సభ్యత్వం అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

### సభ్యత్వ నమోదు ఇలా..

మహబూబ్‌నగర్‌లో సోమవారం ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పలువురికి సభ్యత్వాన్ని అందజేశారు. సూర్యాపేట జిల్లాలోని నాలుగు మండలాలు, సూర్యాపేట, హుజూర్‌నగర్ మున్సిపాలిటీల్లో నిర్వహించిన టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదులో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు. నిర్మల్‌లో నియోజకవర్గ ఇంచార్జి ఎండీ ఖాజా ముజీబుద్దీన్ నుంచి దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. అనంతరం పలువురు నాయకులకు మంత్రి పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. మేడ్చల్ జిల్లా బోడుప్పల్ పురపాలక సంఘ పరిధిలోని చెంగిచెర్లలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్, గోషామహల్ నియోజకవర్గాల్లో పశుసంవర్ధక శాఖ మంత్రి శ్రీనివాస్ యాదవ్, జగిత్యాల జిల్లా కోరుట్లలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జగిత్యాలలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జగిత్యాల, కోరుట్లలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో పరిశీలకులు, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్ పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని నియోజకవర్గ పార్టీ ఇంచార్జి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావుతో కలిసి ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖమ్మం వీడీవోస్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సభ్యత్వ నమోదులో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌తో పాటు వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల సభ్యత్వ నమోదు ఇంచార్జి మెట్టు శ్రీనివాస్, వరంగల్ నగర మేయర్ గుండా ప్రకాశ్ రావు, రైతు రుణవిమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి తదితరులు, జనగామ జిల్లా కడవెండి, జనగామ జిల్లా కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాలకుర్తి, జనగామ నియోజకవర్గాల టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు ఇంచార్జి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామ్యూల్ పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండలో నిర్వహించిన కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పాల్గొని సభ్యత్వాలు అందించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియా, నేరేడుచర్లలో ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య, మిర్యాలగూడలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, చిట్యాల మండలం చిన్నకాపర్తిలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కార్యకర్తలకు సభ్యత్వాలు అందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఇల్లెందులో టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి, ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తదితరులు పాల్గొని పార్టీ నాయకులకు సభ్యత్వ నమోదు పత్రాలు అందజేశారు. నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పలువురికి సభ్యత్వాలు అందజేశారు. కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, అచ్చంపేటలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సభ్యత్వాలు అందజేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టులో టీఆర్‌ఎస్ నాయకుడు రామకృష్ణారెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే అబ్రహం సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు.

### విదేశాల్లోనూ విశేష స్పందన..

టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదును ఎన్నారై శాఖలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. కమిటీలు ఉన్న 40 దేశాల్లో సభ్యత్వం జరిగే విధంగా ఎన్నారై సమన్వయకర్త మహేశ్ బిగాల పర్యవేక్షిస్తున్నారు. ప్రపంచంలోనే మన దేశానికి సంబంధించి ఏ పార్టీకి లేనంత సభ్యత్వం టీఆర్‌ఎస్‌కు ఉంటుందని, ఆ దిశగా స్పందన వస్తున్నదని బిగాల పేర్కొన్నారు. కమిటీలు లేని దేశాల్లోనూ పార్టీ సభ్యత్వం స్వీకరిస్తామంటూ వినతులు వస్తున్నాయన్నారు. ఆమేరకు కమిటీలు వేయడానికి పార్టీ యంత్రాంగం సిద్ధమవుతున్నదన్నారు. సభ్యత్వ నమోదు వరకు పరిమితం కాకుండా సభ్యుల వివరాలన్నింటిని డిజిటలైజేషన్ చేస్తున్నారు. అన్ని జిల్లాల్లో డిజిటలీకరణ ప్రారంభించారు. ఈ వివరాల సేకరణ ద్వారా రాబోయే రోజుల్లో పార్టీ కేడర్‌కు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండ టం, పార్టీకి సంబంధించిన సమాచారాన్ని వారికి చేరవేయడం సులవుతుందని అంచనా వేస్తున్నారు. నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించడం వంటి వాటికి అవసరమవుతాయనే ఉద్దేశంతో సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నారు.



వరంగల్‌లో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ నుంచి టీఆర్‌ఎస్ సభ్యత్వం తీసుకుంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రవళి



నల్లగొండ జిల్లా దేవరకొండలో పార్టీ సభ్యత్వం అందిస్తున్న ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కోఆప్షన్ మెంబర్ అహ్మద్ జమీలా బేగంకు సభ్యత్వాన్ని అందజేస్తున్న వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి చేతుల మీదుగా సభ్యత్వం తీసుకుంటున్న తాడూరు వైస్ ఎంపీపీ శివలీల

# పలుచోట్ల ఓ మోస్తరు వానలు

### వరంగల్ నగరంలో ముసురు

### సాగు పనుల్లో రైతులు బిజీ

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** పలుజిల్లాల్లో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గంటపాటు భారీ వర్షం కురిసింది. నిర్మల్, నిజామాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ అర్బన్ జిల్లాలో ఓ మోస్తరు వాన పడింది. వర్షాలు పడుతుండటంతో రైతులు సాగు పనుల్లో బిజీ అయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. గంటపాటు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. తిమ్మాజిపేట, అచ్చంపేట తాడూరు మండల కేంద్రాల్లో ముసురు పట్టుకుంది. బిజినేపల్లి మండలం పాలెంలో 22 మి.మీ. వర్షపాతం నమోదైంది. నిర్మల్ జిల్లాలో ఆదివారం అర్ధ రాత్రి ఓ మోస్తరుగా వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 4.1 మి.మీటర్ల సగటు వర్ష పాతం నమోదైంది. నిజామాబాద్ జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షం పడింది. లోతట్టు ప్రదేశాల్లో వర్షపు నీరు నిలిచింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 2.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లా నిడమనూరు, దామరచర్ల మండలాల్లో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం వర్షం కురిసింది. హుజూర్‌నగర్ నియోకవర్గంలోని అన్ని మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. వరంగల్ అర్బన్ జిల్లాలో రెండు రోజులుగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి నగరంలో ముసురుకున్నది. వరంగల్ నగరం 16వ డివిజన్‌లోని లక్ష్మీపురం బొడ్రాయి ప్రాంతంలో పసునూరి సుశీలకు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. ఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు.ఖమ్మం నగరంలో సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురవగా, సమీప మండలాలైన ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, కొణిజర్ల, చింతకాని, ముదిగొండ తదితర మండాలల్లో చిరుజల్లులు కురిశాయి. వర్షాలు పడుతుండటంతో పత్తి విత్తనాలను విత్తుకునే పనిలో నిమగ్నమయ్యారు. రాగల రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ అధికారులు ప్రకటించడంతో రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు రోజులుగా చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తున్నాయి. కొత్తగూడెం, జూలూరుపాడు, అశ్వారావుపేట, పాల్వంచ, ఇల్లెందు తదితర మండలాల్లో సోమవారం చిరుజల్లులు కురిశాయి.





సోమవారం నిజామాబాద్ నగరంలో కురుస్తున్న వర్షం.. వరంగల్ అర్బన్ జిల్లా ఎల్కతుర్తిలో పత్తి సాగు కోసం అచ్చుతోలుతున్న రైతు

### ● వరుణుడు కరుణించాలని..



వర్షాలు కురవాలని కోరుతూ సోమవారం నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొత్తపేటలో మహిళలు చుట్టుకాముడు ఆడారు. మహిళలు స్థానిక చెరువు వద్దకు చేరి వర్షాలు కురిపించాలని వానదేవుడిని కోరుతూ పాటలు పాడి ఆడారు. - కేతేపల్లి

### వాయిదా కోసం వచ్చి..

# కోర్టులో బాహాబాహీ

**ఖమ్మం లీగల్:** ఖమ్మం కోర్టు ఎదుట సోమవారం వాయిదా కోసం వచ్చిన ఇరువర్గాల వారు బాహాబాహికి దిగారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు, బాధితుల వివరాల ప్రకారం.. టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న తవుడోజు వెంకటేశ్వర్లు కుమారుడు విజయ భాస్కరాచారికి, పాతలింగాలకు చెందిన అబ్బనపూరి వెంకటేశ్వర్లు కుమార్తె గంగాభవానీతో 2018 మే 6న వివాహం జరిగింది. పెండ్లయిన రెండు నెలలకే భర్త తరపువారు కేసు పెట్టారు. మరోవైపు అదనపు కట్నం కోసం తనను అత్తింటివారు వేధిస్తున్నారని గంగాభవానీ కూడా భర్త కుటుంబ సభ్యులపై కేసు పెట్టింది. కేసుల వాయిదాల కోసం ఇరువర్గాలు కొద్దిరోజులుగా కోర్టుకు వస్తున్నారు. సోమవారం కుటుంబ న్యాయస్థానంలో డైవర్స్ కేసు విచారణకు హాజరయ్యేందుకు గంగాభవానీ తన తండ్రి వెంకటేశ్వర్లు, తమ్ముడు త్రినాథ్‌తో కలిసి కోర్టుకు వచ్చింది. భర్త విజయభాస్కరాచారి తన తల్లి అన్నపూర్ణమ్మతో కలిసి వచ్చాడు. పోలీస్ యూనిఫాంలో ఉన్న వెంకటేశ్వర్లు కోర్టు ముందు ఉన్నాడు. కేసు వాయిదా పడటంతో ఇరువర్గాల వారు ఇంటికి బయలుదేరుతున్న క్రమంలో అక్కడే వారిమధ్య ఘర్షణ మొదలైంది. ఖాకీ డ్రెస్, చేతిలో లాఠీ ఉన్న వెంకటేశ్వర్లు వీరంగం సృష్టించాడు. కోడలు గంగాభవానీ, ఆమె తండ్రి వెంకటేశ్వర్లు, తమ్ముడు త్రినాథ్‌పై లాఠీ ఝుళిపించాడు. ఇరువర్గాలు కొద్దిసేపు బాహాబాహీకి దిగాయి. గంగాభవానీ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు.



ఖమ్మం కోర్టు ఆవరణలో లాఠీతో బెదిరిస్తూ హల్‌చల్ చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు

## వృద్ధురాలి దారుణ హత్య

**కేతేపల్లి:** ఒంటరిగా జీవిస్తున్న ఓ వృద్ధురాలు ఆదివారం దారుణ హత్యకు గురైంది. నల్లగొండ జిల్లా కొర్లపహాడ్‌కు చెందిన సయ్యద్ ఆషాబీ(74)కి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందగా కొడుకులు, కూతుళ్లందరూ వేర్వేరుగా ఉంటున్నారు. ఆషాబీ ఇంట్లో ఒంటరిగా ఉంటూ కిరాణా దుకాణం నడుపుకుంటూ బతుకుతుంది. సోమవారంపొద్దుపొడిచినా తల్లి బయటికి రాకపోవడంతో అదే వీధిలో ఉంటున్న కుమారుడు జాకీర్ ఇంట్లోకి వెళ్లి చూశాడు. ఆషాబీ మంచంలోనే శవమై పడి ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు ఆషాబీ మృతదేహాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ:** వరకట్నపు హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రియదర్శిని తీర్పునిచ్చినట్టు పీపీ సంజయ్‌కుమార్ వైరాగరే తెలిపారు. నిర్మల్ కు చెందిన హసీనా బేగంకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన అబ్దుల్ షఫీతో పెద్దల సమక్షంలో పెండ్లి జరిగింది. పెండ్లిలో రూ.80 వేలు, 5 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. 8 నెలలు ఆదిలాబాద్‌లోనే ఉండి తర్వాత భార్యతో కలిసి నిర్మల్‌కు వెళ్లాడు. మళ్లీ ఆదిలాబాద్‌కే వచ్చి ని వాసం ఉన్నాడు. వారికి ఇద్దరు కూతుళ్లు జన్మించారు. రూ.50 వేలు అదనపు వరకట్నం తీసుకొస్తే ఆటో కొంటానని హసీనాను వేధించాడు. ఈక్రమంలో 2016 సెప్టెంబర్ 26న ఉదయం షఫీ ఆయన తల్లి ఫాతీమాబీ, తమ్ముడు అబ్దుల్ జబ్బార్‌తో కలిసి హసీనాపై కిరోసిన్ చల్లి నిప్పంటించారు. తీవ్ర గాయాలైన ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. హసీనా తమ్ముడు సద్దాం ఖురేషి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. షఫీపై హత్యానేరం రుజువు కావడంతో జీవితఖైదు, రూ. 2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అత్త ఫాతిమాబీ, మరిది అబ్దుల్ జబ్బార్‌లకు మూడేండ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్టు పీపీ తెలిపారు.

## రేబిస్‌తో యువకుడి మృతి

**ఇంద్రవెల్లి:** రేబిస్ వ్యాధితో యువకుడు మృతి చెందిన ఘటన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం పాకిడిగూడలో సోమవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన కనక విలాస్(19) ఇంటర్మీడియెట్‌లో చదువుతున్నాడు. గతేడాది విలాస్‌ను కుక్క కరువగా, వైద్యం చేయించుకోలేదు. అప్పుడప్పుడు తలనొప్పితోపాటు వింతగా ప్రవర్తించేవాడు. ఆదివారం రాత్రి నుంచి విలాస్ ప్రవర్తనలో మార్పు రావడంతో ఉదయం ఇంద్రవెల్లి దవాఖానకు తీసుకెళ్లారు. జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా మర్గమధ్యలో మృతి చెందాడు.

### కటింగ్ మెషిన్ తగిలి

## వ్యక్తి మృతి



పోశయ్య (ఫైల్)

**బెజ్జూర్:** రాడ్ కటింగ్ మెషిన్‌కు మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు గొంతుకు తగలడంతో వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం సులుగుపల్లిలో సోమవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన గేడం పోశయ్య (45) వృత్తి రీత్యా సిమెంట్ స్తంభాలు, రింగులు తయారు చేస్తుంటాడు. ఇందుకోసం తన వద్ద ఉన్న ఇనుప రాడ్లను కట్ చేసే మెషిన్ కొద్దిరోజులుగా పనిచేయడం లేదు. సోమవారం పోశయ్య తన ఇంట్లోనే కటింగ్ మెషిన్‌కు మరమ్మతులు చేస్తున్న క్రమంలో దానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. ఒక్కసారిగా మెషిన్ తిరిగి పోశయ్య గొంతుకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

### రూ. 82 కోట్లతో

## నూతన కళాక్షేత్రం

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ:** కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో ప్రస్తుతం ఉన్న కళాభారతి స్థానంలోనే రూ.82 కోట్లతో కొత్త కళాక్షేత్రాన్ని అభివృద్ధి చేయనున్నట్టు నగర మేయర్ రవీందర్‌సింగ్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరానికి గుర్తింపు వచ్చేలా ఎనిమిది అంతస్తులతో రెండు భవనాలను నిర్మిస్తామన్నారు. ఒక భవనంలో కళాక్షేత్రంతోపాటు, సైన్స్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. మరో భవనంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు. ఇందులో మినీథియేటర్, వాణిజ్య అవసరాలకు వినియోగానికి కేటాయిస్తామని ఆయన తెలిపారు.



నౌక నుంచి తిమింగలాన్ని దింపుతున్న దృశ్యం

# జపాన్‌లో మళ్లీ తిమింగలాల వేట

క్రూరమైన చర్య అని పర్యావరణ వేత్తల ఆందోళన

**కుషిరో:** జపాన్‌లో తిమింగలాల వేట మళ్లీ మొదలైంది. పర్యావరణవేత్తల ఆందోళనలను పెడచెవిన పెడుతూ, మూడు దశాబ్దాల తర్వాత తిమింగలాల వాణిజ్య వేట సోమవారం తిరిగి ప్రారంభమైంది. ఉత్తర జపాన్‌లోని కుషిరో నుంచి ఐదు నౌకలు సోమవారం వేటకు బయల్దేరాయి. మధ్యాహ్నానికి తొలి తిమింగలం ఒడ్డుకు చేరింది. ఇంటర్నేషనల్ వేలింగ్ కమిషన్ (ఐడబ్ల్యూసీ) నుంచి జపాన్ వైదొలిగిన నేపథ్యంలో వాణిజ్య వేట పునఃప్రారంభమైంది. ఇది క్రూరమైన చర్య అని ప్రపంచ దేశాలు, పర్యావరణవేత్తలు మండిపడుతుండగా, జపాన్‌లోని వేలింగ్ కమ్యూనిటీ మాత్రం హర్షం వ్యక్తం చేస్తున్నది. డిసెంబర్ చివరితో ముగిసే ఈ సీజన్‌లో మొత్తంగా 227 తిమింగలాలు పట్టేలా పరిమితి విధించినట్లు జపాన్ ఫిషరీష్ ఏజెన్సీ సోమవారం తెలిపింది. తిమింగలాల వేట ప్రారంభించినందుకు సంతోషంగా ఉందని హిడెకి అబే అనే యువకుడు పేర్కొన్నాడు. ఈ తరం యువతలో చాలామందికి వేల్ మాంసం ఎలా వండాలో, దాని రుచి ఎలా ఉంటుందో తెలియదన్నాడు. తిమింగలాల వేట జపాన్ సంప్రదాయమని, దీనిపై అంతర్జాతీయ జోక్యం తగదని జపాన్ వాదిస్తున్నది. తిమింగలాల సంరక్షణకు ఇది దుర్దినమని హ్యూమానే సొసైటీ ఇంటర్నేషనల్ మండిపడింది.

## రైల్‌యాత్రికి లైన్ క్లియర్

టికెట్ల విక్రయానికి అనుమతి

**న్యూఢిల్లీ, జూలై 1:** రైలు టికెట్లు అమ్ముకునేందుకు ప్రముఖ ఈ-టికెటింగ్ వెబ్‌సైట్, యాప్ 'రైల్ యాత్రి'కి మార్గం సుగమమైంది. భారతీయ రైల్వేకు చెందిన ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) సంస్థ రైల్‌యాత్రికి అధీకృత (ఆథరైజ్డ్) సంస్థగా గుర్తింపునిచ్చింది. రెండు వెబ్‌సైట్ల మధ్య అనుసంధానం కల్పించింది. దీంతో రైల్‌యాత్రికి తమ వెబ్‌సైట్, యాప్ ద్వారా టికెట్లు అమ్ముకునే అవకాశం కలిగింది.

## ట్విట్టర్‌లో ఖాతా తెరిచిన ఆరెస్సెస్ అధిపతి



**న్యూఢిల్లీ:** ఇంతకాలం ట్విట్టర్‌కు దూరంగా ఉన్న రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ (ఆరెస్సెస్) అధిపతి మోహన్ భగవత్‌తోపాటు మరో ఆరుగురు ఆఫీస్ బేరర్లు కొత్తగా అకౌంట్లు తెరిచారు. ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి సురేశ్ భయ్యాజీ, సంయుక్త ప్రధాన కార్యదర్శులు సురేశ్ సోనీ, కృష్ణగోపాల్, వీ బాగయ్య, ప్రచార విభాగం అధిపతి అరుణ్‌కుమార్, మరో సీనియర్ నాయకుడు అనిరుధ్ దేశ్‌పాండే ట్విట్టర్ అకౌంట్ తెరిచిన వారిలో ఉన్నారు. గతంలో కొంతకాలం ట్విట్టర్‌లో కొనసాగిన మరో సంయుక్త ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే ఖాతా కూడా వెరిఫైడ్ స్టేటస్ చూపిస్తున్నది. సంఘ్ ఆఫీస్ బేరర్ల పేర్లతో నకిలీ అకౌంట్ల ద్వారా కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలకు అడ్డుకట్టవేసేందుకే ఆరెస్సెస్ నేతలు ట్విట్టర్ అకౌంట్లు తెరిచినట్టు తెలుస్తున్నది. అయితే, వీరు ఈ అకౌంట్లను నిత్యం వాడుకపోవచ్చని సమాచారం. ఆరెస్సెస్ అధికారిక ట్విట్టర్ ఖాతాకు దాదాపు 13లక్షల మంది ఫాలోవర్స్ ఉండటం విశేషం.



# బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ధిక్కార నోటీసు

బీజేపీ కార్యకర్త విడుదలలో జాప్యంపై వివరణ ఇవ్వాలని ఆదేశం

**కోల్‌కతా, జూలై 1:** పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు సోమవారం ధిక్కార నోటీసు జారీ చేసింది. బీజేపీ కార్యకర్త విడుదలలో జాప్యంపై నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. బెంగాల్‌కు చెందిన బీజేపీ నాయకురాలు ప్రియాంక శర్మ, మే నెలలో సీఎం మమతా బెనర్జీని బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రాతో మార్ఫింగ్ చేసిన ఫోటోను తన ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. టీఎంసీకి చెందిన ఒక నేత ఫిర్యాదుతో పరువునష్టం కేసు నమోదు చేసిన పోలీసులు మే 10న ఆమెను అరెస్ట్ చేశారు. దీంతో ప్రియాంక శర్మ సుప్రీం కోర్టును ఆశ్రయించగా మే 14న వెకేషన్ బెంచ్ బెయిల్ మంజూరు చేసింది. భావ ప్రకటన స్వేచ్ఛ కారణంగా ఇతరుల వ్యక్తిగత హక్కుకు భంగం వాటిల్లరాదన్న సర్వోన్నత న్యాయస్థానం, దీనిపై రాతపూర్వకంగా క్షమాపణ చెప్పాలని ఆమెను ఆదేశించింది. కాగా ప్రియాంక విడుదలలో 24 గంటలు జాప్యం జరుగడంపై ఆమె సోదరుడు రాజీవ్ శర్మ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. బెయిల్ ఉత్తర్వు అమలులో జాప్యంపై బెంగాల్ ప్రభుత్వానికి కోర్టు ధిక్కార నోటీసు ఇచ్చింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## ఉత్తరకొరియా అధికారులపై ట్రంప్ కార్యదర్శి చిందులు

**వాషింగ్టన్, జూలై 1:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా నూతన కార్యదర్శి స్టెఫానీ గ్రీషామ్ నోరు పారేసుకున్నారు. ఆదివారం ఉత్తర కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్‌తో 'ఫ్రీడమ్ హౌస్'లో ట్రంప్ సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ సమయంలో ఆ భవనం వద్ద ఉన్న ఉత్తరకొరియా అధికారులతోనూ, మీడియా ప్రతినిధులతోనూ స్టెఫానీ నోటి దురుసుతనం ప్రదర్శించారు. తర్వాత ట్రంప్, కిమ్ సమావేశమైన భవనం వద్దకు మీడియా ప్రతినిధులను తీసుకెళ్లారు. ఇంతకుముందు స్టెఫానీ అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా పని చేశారు. ఇంతకుముందు ట్రంప్ మీడియా కార్యదర్శిగా పని చేసిన శారా సాండర్స్ స్థానంలో స్టెఫానీ గ్రీసామ్ నియమితులయ్యారు. అయితే ట్రంప్ మీడియా కార్యదర్శిగానూ, తన కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా ఆమె పని చేస్తారని మెలానియా ట్రంప్ తెలిపారు.

## ఖైదీల జాబితాలు ఇచ్చిపుచ్చుకున్న భారత్, పాక్

పాక్ లిస్ట్‌లో లేని కుల్‌భూషణ్ జాదవ్ పేరు

**న్యూఢిల్లీ, జూలై 1:** ఇరు దేశాల్లో ఖైదీలుగా ఉన్న పౌరులు, మత్స్యకారుల జాబితాలను సోమవారం భారత్, పాక్ ఇచ్చిపుచ్చుకున్నాయి. 256 మంది పాక్ పౌరులు, 99 మంది ఆ దేశ మత్సకారుల పేర్లను న్యూఢిల్లీలోని పాక్ రాయబార కార్యాలయ అధికారులకు విదేశాంగ శాఖ అధికారులు అందజేశారు. అలాగే భారత్‌కు చెందిన 209 మంది మత్స్యకారులు, 52 మంది ఖైదీల వివరాలను ఇస్లామాబాద్‌లోని భారత రాయబార కార్యాలయ అధికారులకు పాక్ అందజేసింది. కాగా ఈ జాబితాలో పాక్ మరణ శిక్ష విధించిన భారత మాజీ నేవీ అధికారి కుల్‌భూషన్ జాదవ్ పేరు లేకపోవడం గమనార్హం. 2008లో జరిగిన ఒప్పందం ప్రకారం ప్రతి ఏటా జనవరి 1, జూలై 1న తమ తమ ఆధీనంలో ఉన్న పౌరులు, మత్స్యకారుల జాబితాను భారత్, పాక్ ఇచ్చిపుచ్చుకుంటాయి. అనంతరం వారి విడుదలకు చర్యలు చేపడతాయి.



విమానం కూలడంతో దెబ్బతిన్న భవనం

## కుప్పకూలిన విమానం.. 10 మంది మృతి

అమెరికాలో ఘటన

**డల్లాస్, జూలై 1:** అమెరికాలోని డల్లాస్ ఏరియా విమానాశ్రయం నుంచి ఒక విమానం టేకాఫ్ తీసుకున్న వెంటనే కుప్పకూలి పోయింది. అదే విమానాశ్రయంలోని 'హ్యాంగర్ (విమానాలను నిలిపే స్థలం)'ను ఢీకొట్టడంతో విమానంలో ప్రయాణిస్తున్న పది మంది మృతిచెందారు. ఈ విమానం ఆదివారం ఉదయం 9 గంటలకు టెక్సాస్ నుంచి ఫ్లోరిడాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు బయలుదేరింది. డల్లాస్ ఉత్తర సబర్బన్ ప్రాంతంలోని అడ్డిసన్ మున్సిపల్ ఎయిర్‌పోర్టులో ఈ ఘటన జరిగింది. రెండు ఇంజిన్లు గల బీచ్‌క్రాఫ్ట్ బీఈ-350కింగ్ ఎయిర్ విమానం హ్యాంగర్‌ను ఢీకొట్టడంతో మంటలతోపాటు ఆ ప్రాంతాన్ని నల్లని పొగలు కమ్ముకున్నాయి. అగ్నిమాపక దళ సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. సదరు విమానంలో ఇద్దరు సిబ్బందితోపాటు ఎనిమిది మంది ప్రయాణికులు ఉన్నారు. విమానం టేకాఫ్ తీసుకున్నప్పుడు కూడా ఎటువంటి శబ్దం రాలేదని, ఇంజిన్‌లో లోపం అని ఇప్పటికిప్పుడు చెప్పలేమని అధికారులు పేర్కొన్నారు. ఈ విమానం గతంలో చికాగో వాసి పేరిట ఉండేదని, ఇటీవలే దాన్ని అమ్మివేశారని కథనం.

# జలమయమైన ముంబై



ముంబైలో పట్టాలు నీటమునగడంతో నిలిచిపోయిన రైళ్లు

ముంచెత్తుతున్న భారీ వర్షాలు

జనజీవనం అస్తవ్యస్తం

రోడ్డు, రైలు సేవలకు తీవ్ర అంతరాయం

మహారాష్ట్ర వ్యాప్తంగా నలుగురు మృతి

**ముంబై, జూలై 1:** దేశ ఆర్థిక రాజధాని అయిన ముంబై మహానగరాన్ని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ముంబై, నగర శివారు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న కుండపోత వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రహదారులన్నీ సంద్రాన్ని తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టాలపైకి నీరు చేరడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విమానాశ్రయ పరిసరాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. థానే, పాల్ఘర్ ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది. ముంబైలోని పలు ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈనెల 3,5 తేదీల మధ్య ముంబైకు వరద ముప్పు పొంచి ఉన్నదని ప్రైవేట్ వాతావరణ అధ్యయన సంస్థ స్కైమెట్ హెచ్చరించింది. శివాజీనగర్‌లో ఆదివారం రాత్రి విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందాడని అధికారులు తెలిపారు. సోలాపూర్‌లో పిడుగుపాటుకు ముగ్గురు బలయ్యారని చెప్పారు. గత రెండు రోజుల వ్యవధిలో ముంబైలో 540 మి.మీ వర్షపాతం నమోదైందని, దశాబ్ద కాలంలో ఇదే అత్యధికమని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ తెలిపారు.



ముంబైలో నడుము లోతు నీళ్లలో ఓ యువతి

### రోడ్లపై పిల్లల జలకాలాటలు..



సియాన్-మతుంగ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు నీట మునగడంతో రైళ్ల రాకపోకలు నిలిపివేశారు. దాదార్‌లో రద్దీగా ఉండే హింద్‌మాతా రోడ్డులో మోకాళ్లలోపు నీరు నిలువడంలో చిన్నారులు ఈత కొడుతున్నారు. నీటిని తొలిగించేవరకు ప్రజలు జలమయమైన ప్రాంతాల్లో డ్రైవ్ చేయొద్దని బీఎంసీ విజ్ఞప్తి చేసింది. ముంబైలో భారీ వర్షాల నేపథ్యంలో రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల భద్రతపై రైల్వే మంత్రి పీయుష్ గోయెల్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని దక్షిణరైల్వే ట్వీట్ చేసింది. పాల్ఘర్ జిల్లాలో భారీ వర్షం కారణంగా పట్టాలు మునిగిపోవడంతో దక్షిణ రైల్వేకు చెందిన 17 రైళ్లు, సెంట్రల్ రైల్వేకు చెందిన 10కిపైగా రైళ్లను రద్దు చేశారు. సోమవారం తెల్లవారుజామున కర్జత్-లోనావలా మధ్య గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. దీంతో పుణే-పశ్చిమ మహారాష్ట్ర మధ్య నడిచే పలు రైళ్ల రాకపోకలపై ప్రభావం పడింది. భారీ వర్షాల నేపథ్యంలో వేలాది మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు విధులకు హాజరుకాలేకపోయారు.

## 300 కిలోలకు పైగా యురేనియం నిల్వలు

ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి జావద్ జరీఫ్ వెల్లడి

**టెహ్రాన్:** శుద్ధిచేసిన యురేనియం నిల్వలను ఇరాన్ పెంచుకున్నది. గత మే నెలలోనే ప్రకటించినట్లుగా శుద్ధి చేసిన యురేనియం నిల్వలు 300 కిలోల పరిమితిని అధిగమించామని ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి మహమ్మద్ జావద్ జరీఫ్ సోమవారం చెప్పారు. ఇరాన్ యురేనియం నిల్వలు పెంచుకున్న సంగతిని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) సోమవారం ధ్రువీకరించింది. 'జూలై 1 నాటికే ఇరాన్ యురేనియం నిల్వలు 300 కిలోలు దాటిపోయాయని మా పరిశీలనలో తేలింది' అని ఐఏఈఏ అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు. కాగా, యురేనియం నిల్వల పరిమితిని పెంచుకోనున్నామన్న ఇరాన్ ప్రకటన విచారకరం అని రష్యా వ్యాఖ్యానించింది. ఇది అమెరికా ఒత్తిడి ఫలితమేనని స్పష్టం చేసింది. అమెరికా మిత్ర దేశం బ్రిటన్ స్పందిస్తూ.. చరిత్రాత్మక ఒప్పందం నుంచి ముందుకు వెళ్లొద్దని ఇరాన్‌ను అభ్యర్థించింది. మరోవైపు ఈ నెల 7 నుంచి యురేనియం నిల్వల శుద్ధీకరణ స్థాయిని 3.6 % నుంచి పెంచనున్నట్లు ఇరాన్ హెచ్చరించింది. 2015 నాటి ఒప్పందం మేరకు ఇరాన్ ఇప్పటి వరకు యురేనియం శుద్ధీకరణ స్థాయిని 3.67 శాతానికే పరిమితం చేసింది. 90% శుద్ధి చేసిన యురేనియంను ఆయుధాలను తయారు చేసేందుకు ఉపయోగించుకోవచ్చు.

### జల్‌శక్తి అభియాన్ ప్రారంభం

**న్యూఢిల్లీ:** దేశంలో నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో నీటి నిల్వలను పెంపొందించే ఉద్దేశంతో చేపట్టిన 'జల్ శక్తి అభియాన్' కార్యక్రమాన్ని కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండు దశల్లో 256 జిల్లాల్లోని 1,592 బ్లాక్స్‌లో నీటి పొదుపుపై ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. జూలై 1-సెప్టెంబర్ 15వరకు తొలిదశ, అక్టోబర్ 1- నవంబర్ 30వ వరకు రెండోదశ జరుగనున్నది.

## మరో అవినీతి కేసులో జర్దారీ అరెస్ట్

పార్క్‌లేన్ కేసులో అదుపులోకి తీసుకొన్న ఎన్ఏబీ



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ సోమవారం మరో అవినీతి కేసులో అరెస్ట్ అయ్యారు. ఇప్పటికే రూ.కోట్ల కుంభకోణంలో నేషనల్ అకౌంటెబిలిటీ బ్యూరో (ఎన్ఏబీ) అదుపులో ఉన్న జర్దారీ.. పలు నకిలీ బ్యాంకు అకౌంట్ల నుంచి దాదాపు రూ.15 కోట్ల మనీల్యాండరింగ్‌కు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. జర్దారీతోపాటు ఆయన సోదరి ఫర్యాల్ తాల్పూర్‌పై ఎన్ఏబీ కేసు నమోదు చేసింది. గత నెలలో జర్దారీతోపాటు తాల్పూర్‌ను కూడా ఎన్ఏబీ అరెస్ట్ చేసింది. లండన్‌లో పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెట్టుకొన్నారని పార్క్‌లేన్ పత్రాలు జర్దారీ అవినీతిని బయటపెట్టాయి. ఇస్లామాబాద్ హైకోర్టులో పెట్టుకొన్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకొన్న అనంతరం జర్దారీని ఎన్ఏబీ అదుపులోకి తీసుకొన్నది. జర్దారీ 2008 నుంచి ఐదేండ్లపాటు పాకిస్థాన్ అధ్యక్షుడిగా కొనసాగారు.


తెలంగాణ స్టేట్
పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్, కరీంనగర్ డివిజన్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Ref No. 1) DB/EE/NIT-02/01W/eT.03/2019-20 తేది: 29.06.2019
కరీంనగర్ కమిషనరేట్ యొక్క CTC వద్ద ఇంటర్నల్ మరియు ఎక్స్‌టర్నల్ సర్వీసెస్ (ఎలక్ట్రికల్, నీటి సరఫరా మరియు పారిశుధ్య ఏర్పాట్లు)కు అత్యవసర మైనర్ మరమ్మతులు పని కొరకు నమోదిత అర్హతా గల కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడుతున్నవి. ECV: రూ. 764902.00. బిడ్ల దాఖలు కొరకు చివరి తేది: 06.07.2019న సా. 5.00 గం|| వరకు. తదుపరి వివరాల కొరకు www.eprocurement.gov.in/www.tender.telangana.gov.in దర్శించండి. ఫోన్ నం. 0878-2249100.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ TSPHCL, కరీంనగర్
DIPR RO. No. 212-PP/CL/Advt/1/2019-20, Dt: 01/07/2019

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనాల శాఖ, హైదరాబాద్
సవరణ
Lr. No.EE/R&B/NHHYD/HD/2019-20/473 తేది: 01-07-2019
పైన తెలిపిన CTNకి పాక్షిక మార్పులతో ఐటం నం.లు 8,9&10కి మాత్రమే దిగువ తేదీలు సవరించబడినవి. టెండర్ల స్వీకరణకు చివరి తేది: సవరించిన ప్రకారం 16.07.2019న మ. 3.00 గం.వరకు
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (R&B), NH డివిజన్, హైదరాబాద్
DIPR RO.No.497 - DP/CL/Advt/1/2019-20 Dt:01.07.2019

TELANGANA STATE POWER GENERATION CORPORATION LIMITED
VIDYUT SOUDHA :: HYDERABAD - 500 082
T.No.e-04/CEG/SEG-I/E3A1/RTS-B/Insurance-19-20/2019-20
RTS-B – Providing of Insurance Coverage for the plant assets of 1 x 62.5 MW RTS-B, Ramagundam, Peddapally Dist for a period of one year i.e., from 21.08.2019 to 20.08.2020. Scheduled open and Closing Date:26.06.2019 at 18:00 Hrs & 15.07.2019 at 10:00 Hrs.
T.No.e-50/CE/KTPS(O&M)/P42/A&P/S&S/2019-20
KTPS (O&M) – Procurement of Lighting Material (stock items) for the year 2019-20 at Paloncha, Bhadadri Kothagudem Dist. Value of work ₹ 26,99,013/-. Scheduled open and Closing Date:26.06.2019 at 12:00 Hrs & 18.07.2019 at 15:30 Hrs.
T.No.e-01/CE(C&C)/SE(C&C)/DE(C)/AVR2/2019-20
Purchase, Collection & Removal of Coal Mill Rejects accumulated upto the F.Y 2018-19 available in the premises of KTPP, Jayashankar Bhoopalapally Dist for period of two years from the date of issue of sale order on "As is where is basis" through e-auction. Scheduled for Inspection from:01.07.2019 at 10:30 Hrs to 08.07.2019 at 17:00 Hrs. Date of Auction: 16.07.2019.
For further Details: www.tsgenco.co.in
https://tender.telangana.gov.in & https://auction.telangana.gov.in

ఫైల్ నం. MBNRMP-ENGG/DB/TNDR/6/2019-ME-MBNR MPLTY
REP ప్రకటన
మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ
డిజైన్-బిల్డ్-ఆపరేట్ (DBO)పై మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో బయోమైనింగ్ విధానం ద్వారా ప్రస్తుతము ఉన్న కోయల్‌కొండ డంపింగ్ యార్డు రీమీడియేషన్.

| క్ర.సం. | వివరణ | కీ-తేది | సమయం |
|---|---|---|---|
| 1. | REP విడుదల | 02-07-2019 | ఉ.10.30 గం. |
| 2. | మా మునిసిపాలిటీ వెబ్‌సైట్‌లో REP లభించు తేది | 03-07-2019 | ఉ.10.30 గం. |
| 3. | ప్రీ బిడ్ సమావేశ తేది ప్రదేశం: కౌన్సిల్ హాలు మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ కార్యాలయం మహబూబ్‌నగర్ | 11-07-2019 | ఉ.11.30 గం. |
| 4. | REP పై విచారణల స్వీకరణకు చివరి తేది | 12-07-2019 | మ.03.00 గం. |
| 5. | విచారణలకు సమాధానాల జారీ | 15-07-2019 | సా.04.00 గం. |
| 6. | స్వయంగా దాఖలు తేది | 18-07-2019 | మ.03.00 గం. |
| 7. | సాంకేతిక బిడ్లు తెరుచు తేది | 22-07-2019 | ఉ.11.30 గం. |
| 8. | వాణిజ్య బిడ్లు తెరుచు తేది | 24-07-2019 | ఉ.11.30 గం. |
| 9. | బిడ్లు కోరుచున్న అధికారి | కమిషనర్, మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ | |

మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ ద్వారా మమ్ము సంప్రదించుటకు వెబ్‌సైట్: mahabubnagar municipality.telangana.gov.in ఇ-మెయిల్: mbnrmplty@gmail.com ఇంజినీర్: BI బెంజమిన్ (Dy.E.E.), మొబైల్ నం. 9849906809. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, Ch. సత్యనారాయణ, మొబైల్ నం. 9849902183




నల్లగొండ జిల్లా గరిడేపల్లి సర్పంచ్ త్రిపురం సీతారామిరెడ్డికి పార్టీకండువా కప్పుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బడుగుల, పార్టీ రాష్ట్ర నాయకుడు శానంపూడి సైదిరెడ్డి

## అభివృద్ధిని చూసే టీఆర్ఎస్‌లోకి చేరికలు

విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

**హుజూర్‌నగర్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసే ఇతర పార్టీల నాయకులు టీఆర్ఎస్‌లో చేరుతున్నారని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గరిడేపల్లి సర్పంచ్ త్రిపురం సీతారామిరెడ్డి 400 మంది కార్యకర్తలతో కలిసి మంత్రి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి గులాబీ కండువాలు కప్పి వారిని పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం తథ్యమన్నారు. పార్టీలో చేరిన వారిలో తిప్పురం చిన వెంకటరెడ్డి, నలబోలు పుల్లారెడ్డి, కుందూరి వెంకటరెడ్డి, త్రిపురం వెంకటరెడ్డి, సారెడ్డి వెంకటరెడ్డి, పచ్చా మట్టయ్య, మచ్చా సైదులు, పిట్ట నాగరాజు ఉన్నారు.



ఉట్నూర్‌లో ప్రభుత్వ దవాఖాన అదనపు గదులను ప్రారంభిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

## 33శాతం అడవులు పెంచడమే లక్ష్యం

మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

**ఉట్నూర్, నమస్తే తెలంగాణ:** అడవుల విస్తీర్ణం 33 శాతానికి పెంచడమే లక్ష్యంగా సర్కారు ముందుకెళ్తున్నదని అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయం, దవాఖాన అదనపు గదులు, క్రీడా పాఠశాల, ఏకలవ్య పాఠశాలలను ఎమ్మెల్యే రేఖానాయక్, జడ్పీ చైర్మన్ జనార్దన్, ఐటీడీఏ పీవో కృష్ణాదిత్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఏజెన్సీలో మరణాలు అధికంగా ఉండేవనీ, తెలంగాణ ప్రభుత్వం వచ్చాక తగ్గుముఖం పట్టాయన్నారు. గిరిజనుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామనీ, ఒక్కో ప్రజాప్రతినిధి ఒక్కో మండలాన్ని దత్తత తీసుకొని కృషి చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఐటీడీఏ కృషి చేస్తుందన్నారు.అటవీశాఖ అధికారులపై దాడి ఘటనలో ప్రభుత్వం సీరియస్‌గా ఉందని మంత్రి పేర్కొన్నారు.

## బాబ్లీ గేట్లు ఎత్తివేత

**మెండోరా/ బాసర:** బాబ్లీ బరాజ్ గేట్లను సోమవారం అధికారులు ఎత్తారు. సీడబ్ల్యూసీ తెలంగాణ, ఏపీ అధికారుల ఆధ్వర్యంలో బరాజ్ గేట్లను ఎత్తేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఏటా జూలై ఒకటో తేదీ నుంచి మూడు నెలల 28 రోజులు ఎత్తి ఉంచాలి. ఈమేరకు సీడబ్ల్యూసీ ఈఈ వీ గంగాధర్, ఈఈ కే నారాయణరెడ్డి, ధవళేశ్వరం ఈఈ ఎన్‌పీ గవన్నె, నాందేడ్ డీఈ జగదీశ్ బృందం సమక్షంలో బాబ్లీ 14 గేట్లను ఉదయం 11 గంటల నుంచి ఎత్తారు. బాబ్లీ పూర్తిస్థాయి నీటిమట్టం 2.74 టీఎంసీలు కాగా ప్రస్తుతం బరాజ్‌లో డెడ్ స్టోరేజ్ ఉంది. దీంతో గేట్లు ఎత్తినా దిగువకు నీళ్లు వచ్చే పరిస్థితులు లేవు.



తెరుచుకున్న బాబ్లీ బరాజ్ గేట్లు



జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొప్పుల, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

## పట్టణాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

**మెట్‌పల్లి, నమస్తే తెలంగాణ:** రోడ్లు, డ్రైనేజీ, మంచి నీరు తదితర మౌలిక సదుపాయాలను కల్పించి పట్టణాలను సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో మంత్రి పర్యటించారు. కోరుట్లలో రూ.50 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, రూ.53 కోట్లతో చేపట్టిన మిషన్ భగీరథ పనులు, మెట్‌పలిలో రూ.50 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు, రూ. 43 కోట్ల వ్యయంతో మిషన్ భగీరథ పనులకు స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మెట్‌పల్లిలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత సీఎం కేసీఆర్ పట్టణాల అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని మంత్రి పేర్కొన్నారు. 65 ఏండ్ల ఉమ్మడి రాష్ట్రంలో అస్తవ్యవస్థంగా ఉన్న విద్యావ్యవస్థను సరిదిద్దేందుకు కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శరత్, మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

దాదాపు 40 తులాల బంగారం, 3 లక్షల నగదు చోరీ

**కార్వాన్:** తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దొంగలు చొరబడి 40 తులాల బంగారంతోపాటు రూ.3 లక్షల నగదు తస్కరించిన ఘటన గ్రేటర్ హైదరాబాద్ టప్పాచబుత్రా పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. న్యూసత్యనారాయణ నగర్ మోహిని ఫంక్షన్ హాల్ సమీపంలో నివసించే దినేష్ శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి యాత్రకు వెళ్లాడు. సోమవారం సాయంత్రం సమయంలో ఇంటి తలుపులు తెరిచి ఉండడంతోపాటు గొళ్లెం విరిగి ఉండటంతో అనుమానంతో ఇరుగు పొరుగు వెళ్లి చూడగా ఇంట్లో ఎవరూ లేరు. దీంతో దొంగతనం జరిగినట్టు గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులు పరిశీలించారు. బెడ్‌రూంలోని అల్మారాతోపాటు లాకర్‌ను పగులగొట్టి అందులోని బంగారం, నగలు, నగదు ఎత్తుకెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. అనంతరం ఇంటి యజమానికి ఫోన్‌లో సమాచారమివ్వగా.. దాదాపు 40 తులాల బంగారం, 3 లక్షల నగదు అల్మారాలో దాచి ఉంచినట్టు తెలిపారు. ఇంటి యజమాని వచ్చాక కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తామని పోలీసులు తెలిపారు.

## దోపిడీ దొంగల బీభత్సం

నిజామాబాద్‌లో గంట వ్యవధిలో మూడు షాపుల్లో చోరీ

రూ.17 లక్షల విలువైన సొత్తు లూటీ



షట్టర్‌ను ధ్వంసం చేసిన దొంగలు

**నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున దోపిడీదొంగలు మూడు జ్యువెలరీ దుకాణాలకు కన్నం వేసి గంట వ్యవధిలోనే రూ.17 లక్షల ఆభరణాలతోపాటు నగదు అపహరించుకుపోయారు. వివరాల్లోకి వెళితే.. తెల్లవారుజామున 2 గంటల సమయంలో వినాయకనగర్‌లో ఉన్న సాయితేజ జ్యువెల్లర్స్ వద్దకు వచ్చిన దుండగులు బయట ఉన్న సీసీ కెమెరా వైర్లు తొలగించి, షట్టర్‌ను ధ్వంసం చేసి లోనికి ప్రవేశించారు. అదే సమయంలో పోలీస్ పెట్రోలింగ్ సైరన్ వినిపించడంతో పరారయ్యారు. తర్వాత 3.16 గంటలకు శ్రీనగర్ కాలనీలో ని శ్రీసాయి మహాలక్ష్మి జ్యువెలర్స్ వద్దకు చేరుకుని షట్టర్‌ను ధ్వంసం చేసి, లోపల ఉన్న గాజు డోర్‌ను పగులగొట్టారు. 20 జతల బంగారు కంకణాలు (8.7 గ్రాములు), రూ.లక్ష విలువైన 1 గ్రామ్ గోల్డ్ ఆభరణలతోపాటు రూ.1.20 లక్షల నగదును దోచుకున్నారు. ముఠా సభ్యుల్లో ఒకరి చేతికి పగిలిన గాజు కుచ్చుకోవడంతో రక్తస్రావం కాగా, పగిలిన గ్లాస్ డోర్‌పై రక్తం మరకలు న్నాయి. దీనికి సమీపంలో ఉన్న శ్రీచరణ్‌తేజ్ జువెల్లర్స్ వద్దకు వెళ్లిన దుండగులు అక్కడ కూడా షట్టర్‌ను ధ్వంసం చేశారు. దుకాణంలోకి ప్రవేశించి 12 తులాల బంగారు నగలతో పాటు, 20 కేజీల వెండి వస్తువులు దోచుకుపోయారు. ఇక్కడా సీసీ కెమెరాలను ధ్వంసం చేసి షాపులో ఉన్న డీవీఆర్‌ను ఎత్తుకుపోయారు. బాధితులు ఈ.లక్ష్మీనారాయణ, బి.రామకృష్ణ చారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదనపు డీసీపీ శ్రీధర్ రెడ్డి, నిజామాబాద్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్ ఘటన స్థలాలను పరిశీలించారు.

# దర్శనమిచ్చిన మంచులింగం

అమర్‌నాథ్‌లో తొలిపూజ.. పాల్గొన్న జమ్ముకశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్

మొదటిరోజే ఎనిమిది వేల మంది భక్తులకు దర్శనం




మంచులింగంవద్ద జరిగిన తొలిపూజలో పాల్గొన్న జమ్ముకశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్

**శ్రీనగర్/జమ్ము, జూలై 1:** అమర్‌నాథ్ గుహలో మహా మంచు శివలింగం దర్శనమిచ్చింది. సోమవారం గుహలో తొలిపూజ నిర్వహించారు. జమ్ముకశ్మీర్ గవర్నర్, అమర్‌నాథ్ దేవాలయ బోర్డు అధ్యక్షుడైన సత్యపాల్ మాలిక్, బోర్డు సీఈవో ఉమంగ్ నరులా తదితరులు ఈ పూజల్లో పాల్గొన్నారు. తొలిరోజు ఎనిమిదివేలకుపైగా భక్తులు మంచులింగాన్ని దర్శించుకున్నట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో శాంతి నెలకొనాలని మహదేవుడిని ప్రార్థించినట్టు గవర్నర్ సత్యపాల్ తెలిపారు. అనంతరం ఆయన బేస్ క్యాంపుల్లో సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి లోటు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, యాత్ర ప్రశాంతంగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆదివారం జమ్మూ నుంచి బయలుదేరి పహల్గామ్, బల్తాల్ బేస్ క్యాంప్‌లకు చేరుకున్న యాత్రికుల మొదటి బృందం, సోమవారం ఉదయం అమర్‌నాథ్ గుహవైపు తమ ప్రయాణాన్ని ప్రారంభించి స్వామిని దర్శించుకున్నదని ఆలయ బోర్డు అధికార ప్రతినిధి తెలిపారు. 4,417 మంది యాత్రికులతో కూడిన రెండో బ్యాచ్ సోమవారం జమ్మూలోని భగవతి నగర్ బేస్ క్యాంప్ నుంచి బయలుదేరింది. ఇందులో 3,543 మంది పురుషులు, 843 మంది స్త్రీలు, 31 మంది పిల్లలు ఉన్నారు. వీరు 142 వాహనాల్లో బయలుదేరారు. 2,800 మంది పహల్గామ్, 1,617 మంది బల్తాల్ బేస్‌క్యాంప్ వైపు వెళ్తున్నట్టు అధికారులు తెలిపారు. యాత్రికులకు ఆర్మీ, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్, స్టేట్ పోలీస్, ఇతర నిఘా వర్గాలు, ఏజెన్సీలు భద్రత కల్పిస్తున్నారు. రెండు రూట్లలో మొత్తం దాదాపు 60 వేల మంది రక్షణ కల్పిస్తున్నారు. యాత్రికుల వాహనాలకు ట్రాకింగ్ పరికరాలను అమర్చి వాటి ప్రయాణాన్ని ఉపగ్రహాల సాయంతో పర్యవేక్షిస్తున్నారు.

# బస్సు లోయలో పడి 35 మంది మృతి

17 మందికి గాయాలు.. జమ్ముకశ్మీర్‌లో ఘటన

ప్రధాని మోదీ, అమిత్ షాతో పాటు పలువురు సంతాపం



ప్రమాద స్థలంలో కొనసాగుతున్న సహాయ చర్యలు

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లోని కిష్టావర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ బస్సు లోయలో పడటంతో 35 మంది మృతి చెందగా 17 మంది గాయపడ్డారు. మృతుల్లో 13 మంది మహిళలతోపాటు 45 రోజుల పసి బిడ్డ కూడా ఉన్నది. కేశ్వాన్ నుంచి కిష్టావర్ వెళ్తున్న మినీ బస్సు సిర్గ్వారి మలుపులో సోమవారం ఉదయం 7.30 గంటలకు అదుపు తప్పి పక్కనే 500 అడుగుల లోతైన లోయలోకి పడిపోయింది. బస్సులో 52 మంది ఉండగా 35 మంది అక్కడికక్కడే చనిపోయారని డీఎస్పీ శక్తి పాఠక్ చెప్పారు. కొందరు క్షతగాత్రులను ఐఏఎఫ్‌కు చెందిన 2 ఎంఐ-17 హెలికాప్టర్లు, పవన్ హన్స్ హెలికాప్టర్ ద్వారా దవాఖానకు తరలించి చికిత్స అందజేస్తున్నట్లు తెలిపారు.

**సామర్థ్యానికి మించి ప్రయాణికులు**

28 సీట్ల మినీ బస్సులో సామర్థ్యానికి మించి 52 మంది ప్రయాణించడమే ప్రమాద కారణమని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదానికి డ్రైవర్ తప్పిదం కారణమా లేక బస్సు వైఫల్యమా అన్న దానిపై దర్యాప్తునకు ఆదేశించినట్లు కిష్టావర్ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఏఎస్ రాణా తెలిపారు. బస్సు ప్రమాదం పట్ల రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. ప్రధాని మోదీ ట్విట్టర్ వేదికగా జమ్ముకశ్మీర్ బస్సు ప్రమాదంలో 35 మంది మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'కిష్టావర్‌లో జరిగిన బస్సు ప్రమాదం హృదయ విదారకం. మృతుల కుటుంబాలకు నా సంతాపాన్ని తెలియజేస్తున్నా. క్షతగాత్రులు తర్వగా కోలుకోవాలని ఆశిస్తున్నా' అని ట్వీట్ చేశారు.

కాగా, హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లా జిల్లా ఖలినీ సమీప ఝింఝూరీ వద్ద సోమవారం ఉదయం 7.35 గంటలకు జరిగిన ప్రమాదంలో బస్సు లోయలో పడిపోయింది. ఇందులో ఇద్దరు విద్యార్థులతో పాటు ముగ్గురు మరణించారు. మరో ఆరుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి.

**రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య భారత్‌లోనే ఎక్కువ: ఐఆర్‌ఎఫ్**

జమ్ముకశ్మీర్ బస్సు ప్రమాదంలో 35 మంది మృతిపై ఇంటర్నేషనల్ రోడ్ ఫెడరేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా జరిగే రోడ్డు ప్రమాదాల్లో భారత్‌లోనే చాలా ఎక్కువగా 10 శాతానికి పైగా మరణిస్తున్నారని ఐఆర్‌ఎఫ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు కేకే కపిల పేర్కొన్నారు. 2017లో భారత్‌లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.46 లక్షల మంది చనిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. కొండ ప్రాంత జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌తోపాటు ఈశాన్య రాష్ట్రాల్లోని రహదారుల భద్రతకు సాంకేతికతలతో కూడిన చర్యలు చేపట్టాలని సూచించారు.



# కర్ణాటక కాంగ్రెస్‌లో కలకలం

వరుసగా పార్టీని వీడుతున్న ఎమ్మెల్యేలు

సీఎం లేని సమయంలో రాజకీయ కల్లోలం

24 గంటల వ్యవధిలో పార్టీకి ఇద్దరు గుడ్‌బై!

క్యూలో మరో నలుగురు ఉన్నట్టు వార్తలు

సంక్షోభంలో కాంగ్రెస్ - జేడీ(ఎస్) సంకీర్ణ సర్కార్!



ఆనంద్ సింగ్



రమేశ్ జార్కిహోళి

**బెంగుళూరు, జూలై 1:** కర్ణాటకలో కాంగ్రెస్, జేడీ(ఎస్) సంకీర్ణ ప్రభుత్వానికి తీవ్ర ఒడిదుడుకులు ఎదురవుతున్నాయి. 24 గంటల వ్యవధిలో కాంగ్రెస్ పార్టీకి ఇద్దరు ఎమ్మెల్యేలు గుడ్‌బై చెప్పడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. కర్ణాటకలోని విజయనగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆనంద్ సింగ్, బెళగావి జిల్లా గోకాక్ కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి రమేశ్ జార్కిహోళి తమ పదవులకు సోమవారం రాజీనామా చేశారు. సోమవారం ఉదయం ఆనంద్ సింగ్ తన రాజీనామా లేఖను స్పీకర్ కే ఆర్ రమేశ్ కుమార్‌కు పంపినట్టు వెల్లడించారు. ఆనంద్ సింగ్ రాజీనామా విషయం తనకు తెలియదనీ, దీనికి సంబంధించిన లేఖ ఏదీ తన వద్దకు చేరలేదని రమేశ్ పేర్కొన్నారు. దీనిపై ఆనంద్ సింగ్ స్పందిస్తూ.. 'ఒకవేళ స్పీకర్ నా రాజీనామాను ధృవీకరించకపోతే, మళ్ళీ రాజీనామా చేస్తాను' అని చెప్పారు. రాజీనామాకు గల కారణాలను వెల్లడించలేదు. గవర్నర్ వాజుభాయి వాలాతో భేటీ అయిన తర్వాత తదుపరి కార్యాచరణ వెల్లడిస్తానని తెలిపారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం జేఎస్‌డబ్ల్యూ స్టీల్ కంపెనీకి 3,667 ఎకరాల భూమిని అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ బళ్లారిలో ఆనంద్ ఇటీవల మీడియా తో మాట్లాడుతూ పార్టీ కంటే సొంత జిల్లా పరిరక్షణే తనకు ముఖ్యమని వ్యాఖ్యానించారు. ఆనంద్ త్వరలోనే బీజేపీలోకి వెళ్తారని వార్తలొచ్చాయి. సోమవారం ఉదయం ఆనంద్ రాజీనామాతో ఆలోచనలో పడిన కాంగ్రెస్ పార్టీకి సాయంత్రం మరో ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీ గోకాక్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి రమేశ్ జార్కిహోళి తన పదవికి రాజీనామా చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాజీనామా లేఖను స్పీకర్‌కి పంపినట్టు ఆయన తెలిపారు. రమేశ్ జార్కిహోళి రాజీనామాపై ఆయన సోదరుడు సతీశ్ జార్కిహోళి స్పందిస్తూ.. ఇది అంతగా ఆశ్చర్యకరమేమీ కాదన్నారు. 'రమేశ్ రాజీనామా ముందు ఊహించిందే. ఆరు నెలలుగా ఆయన రాజీనామా గురించి చెబుతూనే ఉన్నారు' అని అన్నారు. కాంగ్రెస్ పార్టీతో తాను సాంకేతికంగా (సంఖ్యాపరంగా) మాత్రమే కలిసి ఉన్నానని, లోక్‌సభ ఫలితాలు వెల్లడయ్యాక బీజేపీలో చేరేది, లేనిది చెబుతానని రమేశ్ జారికిహోళి గత ఏప్రిల్‌లో చెప్పారు. కాగా మరో నలుగురు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా రాజీనామా యోచనలో ఉన్నట్టు రమేశ్ జార్కిహోళి తనకు చెప్పారని జేడీ(ఎస్) ఎమ్మెల్సీ బసవరాజ్ హోరత్తి పేర్కొనడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

**సంకీర్ణాన్ని అస్థిరపరచాలనుకుంటున్న బీజేపీ : హెచ్ డీ కుమారస్వామి**

రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను తాను గమనిస్తున్నానని, సంకీర్ణ సర్కారును అస్థిరపరచాలని బీజేపీ పగటికల కంటున్నదని జేడీ(ఎస్) నేత, సీఎం హెచ్ డీ కుమారస్వామి ఆరోపించారు. అమెరికాలోని న్యూజెర్సీలో కాలభైరవేశ్వర ఆలయం శంకుస్థాపనకు వెళ్లిన ఆయన కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామాలపై స్పందించారు. 'రాష్ట్రంలో పరిణామాలు అన్నింటినీ నేను ఇక్కడి నుంచి గమనిస్తున్నా. కాంగ్రెస్, జేడీ(ఎస్) సంకీర్ణ ప్రభుత్వాన్ని అస్థిరపరుచాలని బీజేపీ పగటికలకంటుంది' అని ఆయన ట్వీట్ చేశారు.

**కర్ణాటక అసెంబ్లీ బలాబలాలు**

| కాంగ్రెస్-జేడీఎస్ కూటమి - 117 | |
|---|---|
| కాంగ్రెస్-77<br>జేడీఎస్-37<br>బీఎస్పీ-1 | మద్దతిస్తున్న స్వతంత్ర ఎమ్మెల్యేలు-2 |
| బీజేపీ 105 | మెజారిటీ మార్కు - 113 |

**అమెరికాలో కుమార**

కర్ణాటక సీఎం కుమారస్వామి ఓ ఆలయ శంకుస్థాపన కోసం అమెరికా పర్యటనకు వెళ్లిన 48 గంటల్లోనే రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేగింది. సీఎం బెంగుళూరు విడిచి వెళ్లిన వెంటనే, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొందరు రాజీనామాలు ప్రకటించారు. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడానికి సుముఖమైనా, ఆ పార్టీ అధిష్ఠానం నుంచి సంకేతాలు రాక వాళ్లు ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నట్టు వార్తలు వస్తున్నాయి.

**ఇంకా 20 మంది ఉన్నారు: బీ ఎస్ యెడ్యూరప్ప**

కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామా వార్తలు మీడియా ద్వారా తెలుసుకున్నానని.. అంతకు మించి తనకే సమాచారం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీ ఎస్ యెడ్యూరప్ప అన్నారు. 'సంకీర్ణ సర్కారులో ఇంకా 20 మంది దాకా అసంతృప్తి నేతలు ఉన్నారు. వాళ్ళు ఏం చేస్తారో చూడాలి. ఆ తర్వాతే ప్రభుత్వ ఏర్పాటు చేయడంపై ఆలోచిస్తాం. మధ్యంతర ఎన్నికలకు ఆస్కారం లేదు. ప్రస్తుత ప్రభుత్వం కూలిపోతే మా బాధ్యత కాదు' అని తెలిపారు.



# మన్మోహన్‌కు డీఎంకే నో

రాజ్యసభ సీటుపై

కాంగ్రెస్ విజ్ఞప్తికి తిరస్కృతి

**చెన్నై:** మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు రాజ్యసభ సీటివ్వాలని కాంగ్రెస్ పార్టీ చేసిన విజ్ఞప్తిని డీఎంకే తిరస్కరించింది. తమిళనాడులో 6 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల కమిషన్ గత నెలలో ప్రకటించింది. దీంతో మన్మోహన్‌కు ఒక స్థానం కేటాయించాలని డీఎంకేను కాంగ్రెస్ కోరినట్టు గతంలో వార్తలొచ్చాయి. ముందస్తు ఒప్పందం ప్రకారం తాము ఎండీఎంకే అధ్యక్షుడు వైగోకు సీటు కేటాయించాలని డీఎంకే పేర్కొన్నట్టు సమాచారం. అసోం నుంచి ప్రాతినిధ్యం వహించిన మన్మోహన్ పదవీ కాలం రాజ్యసభలో గత నెలలోనే ముగిసిన సంగతి తెలిసిందే. మరోసారి ఆయన అసోం నుంచి ఎన్నికయ్యేందుకు ఆ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు కావాల్సిన బలం లేదు. ఈ నెల 18న జరుగనున్న రాజ్యసభ ఎన్నికల్లో తమ పార్టీ నుంచి షణ్ముగం, సీనియర్ న్యాయవాది పీ విల్సన్ పోటీ చేస్తారని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ తెలిపారు.

# మూకదాడిలో వ్యక్తి మృతి!

ఇద్దరు నిందితుల అరెస్ట్.. పశ్చిమ బెంగాల్‌లో ఘటన

**మాల్దా:** బైకును దొంగిలించాడన్న కారణంతో స్థానికులు చితకబాదడంతో ఓ వ్యక్తి (20) చనిపోయిన ఘటన పశ్చిమ బెంగాల్‌లో జరిగింది. పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. బైక్ దొంగిలించాడని సనౌల్ షేక్ యువకునిపై బైష్ణబ్‌నగర్ వాసులు బుధవారం దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన షేక్ కోల్‌కతాలోని ఎస్‌ఎస్‌కేఎం దవాఖానలో చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. చనిపోయిన షేక్ మృతదేహం ఆదివారం మాల్దాకు చేరుకోవడంతో అక్కడి ప్రజలు ఆందోళన చేపట్టారు. షేక్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# అధ్యక్షుడిగా మీరే కొనసాగాలి!

కాంగ్రెస్ సీఎంల అభ్యర్థన.. కుదరదన్న రాహుల్



రాహుల్ గాంధీని కలిసి వస్తున్న కాంగ్రెస్ ముఖ్యమంత్రులు నారాయణస్వామి, అశోక్ గెహ్లాట్, అమరీందర్ సింగ్, కమల్‌నాథ్, భూపేశ్ బఘేల్

**న్యూఢిల్లీ:** పార్టీ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీయే కొనసాగాలని, తమ ఈ అభ్యర్థనపై ఆయన సానుకూలంగా స్పందిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్టు కాంగ్రెస్ సీఎంలు అన్నారు. రాహుల్‌తో కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాల సీఎంలు అశోక్ గెహ్లాట్ (రాజస్థాన్), అమరీందర్ సింగ్ (పంజాబ్), కమల్‌నాథ్ (మధ్యప్రదేశ్), భూపేశ్ బఘేల్ (ఛత్తీస్‌గడ్), వీ నారాయణస్వామి (పుదుచ్చేరి) సోమవారం రాహుల్‌తో భేటీ అయ్యారు. తర్వాత రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ మీడియాతో మాట్లాడుతూ తమ సమావేశంలో పార్టీ అధ్యక్షుడిగా రాహులే కొనసాగాలని కాంగ్రెస్ కార్యకర్తలందరూ కోరుకుంటున్నారని, పార్టీ అధ్యక్షుడిగా తొలగాలన్న నిర్ణయంపై రాహుల్ పునరాలోచించుకోవాలని కోరినట్టు తెలిపారు. అయితే అధ్యక్షపదవి నుంచి వైదొలగాలన్న తన నిర్ణయాన్ని సీడబ్ల్యూసీకి ఇప్పటికే తెలియజేశానని, ఈ నిర్ణయంలో మార్పు ఉండదని రాహుల్ పేర్కొన్నట్టు సమాచారం. రాహుల్‌గాంధీతో భేటీలో లోక్‌సభ ఎన్నికల ఓటమికి నేతల నైతిక బాధ్యతపై చర్చించామని అశోక్ గెహ్లాట్ తెలిపారు. అంతకుముందు గెహ్లాట్ ట్వీట్ చేస్తూ 'ప్రస్తుత సమయంలో కాంగ్రెస్‌కు రాహుల్ మాత్రమే సరైన సారథ్యం వహించగలరని మేం విశ్వసిస్తున్నాం' అని పేర్కొన్నారు.

**పీవోకేపై పిల్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు**

'రా' మాజీ అధికారికి రూ.50 వేల జరిమానా

**న్యూఢిల్లీ:** పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే), గిల్గిట్‌లను లోక్‌సభ నియోజక వర్గాలుగా ప్రకటించాలని మాజీ 'రా' అధికారి రాంకుమార్ యాదవ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌కు విచారణార్హత లేదని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ సారథ్యంలోని ధర్మాసనం పేర్కొంది. సదరు పిటిషనర్‌పై రూ.50 వేల జరిమానా విధించింది. 'ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యమేనా? ఢిల్లీలో నివసిస్తున్న మీకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పనేమిటి?' అని నిలదీసింది. 'ఈ పిటిషన్‌ను మేం విచారణకు స్వీకరించడం లేదు' అని తెలిపింది. రామ్‌కుమార్ యాదవ్ తరుపు న్యాయవాది వాదిస్తూ ఈ 2 ప్రాంతాలు భారత్‌లో అంతర్భాగం' అని చెప్పారు. పీవోకే, గిల్గిట్‌లపై భారత్ యాజమాన్య హక్కులు కలిగి ఉన్నదని వాదించారు.

# కశ్మీర్‌లో కేంద్ర పాలన పొడిగింపు

- ఆరు నెలలు పొడిగించే బిల్లుకు రాజ్యసభ ఆమోదం
- రాష్ట్రంలో రిజర్వేషన్ సవరణ బిల్లుకు సైతం ఆమోదముద్ర
- వేర్పాటువాదాన్ని, ఉగ్రవాదాన్ని సహించమన్న అమిత్‌షా



**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన మరో ఆరు నెలలు కొనసాగనున్నది. రాష్ట్రపతి పాలన గడువు మంగళవారంతో ముగుస్తుండటంతో కేంద్రం రూపొందించిన పొడిగింపు బిల్లును సోమవారం రాజ్యసభ ఆమోదించింది. ఇది మంగళవారం నుంచి అమలులోకి రానున్నది. ఈ బిల్లుకు టీఎంసీ, ఎస్పీ, పీడీపీ మద్దతు పలికాయి. దీంతోపాటు అంతర్జాతీయ సరిహద్దు సమీప గ్రామాల ప్రజల కోసం ఉద్దేశించిన 'జమ్ముకశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు-2019'కు సైతం ఆమోదముద్ర పడింది. ఈ రెండు బిల్లులను సోమవారం రాజ్యసభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. తప్పనిసరి పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన పొడిగిస్తున్నట్టు చెప్పారు. 'ఈసీ జమ్ముకశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అసెంబ్లీ ఎన్నికలను ఏడాది చివర్లో నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో కేంద్రం వద్ద మరోమార్గం లేకపోయింది' అని చెప్పారు. ఎన్నికలు ఎందుకు జరుపలేదన్న ప్రతిపక్షాల ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. గతంలో ఎన్నడూ రంజాన్ మాసంలో ఎన్నికలు జరుపలేదన్నారు. ప్రస్తుతం అమర్‌నాథ్ యాత్ర మొదలైందని, బకర్వాల్ సామాజిక వర్గానికి చెందిన ప్రజల్లో అత్యధికశాతం మంది వారి జీవనోపాధికోసం వెళ్లారని, తిరిగి అక్టోబర్‌లో వస్తారని చెప్పారు. దీంతో ఎన్నికలను ఏడాది చివర్లో నిర్వహించాలని ఈసీ నిర్ణయించిందన్నారు. ఎన్నికలకు సిద్ధమని ఈసీ ప్రకటిస్తే ఒక్కరోజు కూడా ఆలస్యం చేయబోమన్నారు. తాము కశ్మీర్‌లో అభివృద్ధిని కోరుకుంటున్నామని వేర్పాటువాదాన్ని, ఉగ్రవాదాన్ని సహించేదిలేదని స్పష్టంచేశారు. భారత్ వ్యతిరేకులపై కఠిన చర్యలు తప్పవన్నారు.

**కశ్మీర్ ప్రజల మనసులు గెలుస్తాం**

జమ్ముకశ్మీర్ రిజర్వేషన్ బిల్లు-2019 ప్రకారం రాష్ట్రంలోని అంతర్జాతీయ సరిహద్దులో నివసిస్తున్న ప్రజలకు ఉద్యోగాలు, పదోన్నతులు, విద్యాసంస్థల ప్రవేశాల్లో ప్రత్యేక రిజర్వేషన్ వర్తిస్తుంది. కఠువా, సాంబా, జమ్మూ జిల్లాల్లోని 435 గ్రామాల్లో నివసిస్తున్న 3.5 లక్షల మంది ప్రజలకు ఇది లబ్ధి చేకూర్చుతుంది. 'పాకిస్థాన్ చర్యలతో సరిహద్దు ప్రజలు బంకర్లలో తలదాచుకుంటున్నారు. పిల్లల చదువులు దెబ్బతింటున్నాయి' అని అన్నారు. ఇప్పటికే వారికి అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ఈ బిల్లుతో వారి మనసులు గెలుస్తామని చెప్పారు. కేంద్ర విద్యాసంస్థల్లో టీచర్ పోస్టుల భర్తీలో కాలేజీ లేదా వర్సిటీని యూనిట్‌గా తీసుకునేందుకు ఉద్దేశించిన బిల్లుకు కూడా ఆమోదముద్ర పడింది.

# జూన్‌లో అత్యధిక లోటు

2015 తర్వాత తొలిసారి

అతి తక్కువ వర్షపాతం: ఐఎండీ




**న్యూఢిల్లీ, జూలై 1:** జూన్ నెలలో అత్యధిక లోటు వర్షపాతం నమోదుకావడం 2015 తర్వాత ఇదే మొదటిసారి అని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఏడాది జూన్‌లో 33 శాతం లోటు వర్షపాతం నమోదైంది. మరోవిధంగా చెప్పాలంటే దీర్ఘకాలిక సగటులో (ఎల్పీఏలో) 67 శాతం వర్షపాతం మాత్రమే కురిసింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర జలసంఘం వివరాల ప్రకారం, జూన్ 27నాటికి దేశంలోని 91 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు సాధారణం కంటే తక్కువకు పడిపోయాయి. ఎల్పీఏలో 90 శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదైతే 'లోటు' వర్షపాతంగా పరిగణిస్తారు. ఎల్పీఏలో 90-96 శాతం మధ్య నమోదైతే 'సాధారణం కంటే తక్కువ'గా, 96-104 శాతం మధ్య నమోదైతే 'సాధారణ' వర్షాలు కురిసినట్లుగా భావిస్తారు. ఎల్పీఏలో 104-110 శాతం మధ్య కురిస్తే 'సాధారణం కంటే ఎక్కువ'గా, 110 శాతానికి మించి కురిస్తే 'అత్యధిక' వర్షపాతం నమోదైనట్లు పరిగణిస్తారు. 2018 జూన్‌లో ఎల్పీఏలో 95 శాతం వర్షపాతం నమోదుకాగా, 2017లో మాత్రం పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉన్నది. ఆ ఏడాది జూన్‌లో110 శాతం వర్షపాతం నమోదైంది. 2016లో 89 శాతం వర్షపాతం కురువగా, 2015లో 116 శాతం కురువడం విశేషం. 2014 జూన్‌లో మాత్రం ఎల్పీఏలో 58 శాతం వర్షపాతం మాత్రమే నమోదైంది. ఈ ఏడాది సాధారణం కంటే వారం ఆలస్యంగా జూన్ 8న నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించారు. అరేబియా సముద్రంలో ఏర్పడిన వాయు తుఫాన్ కారణంగా వారం పాటు రుతుపవనాలు స్తంభించాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఈ వారంలో రుతుపవనాలు పుంజుకునే అవకాశం ఉన్నది.

**తెలంగాణలో 32 శాతం లోటు..**

**హైదరాబాద్:** తెలంగాణలో జూన్ 1 నుంచి జూలై 1 మధ్య 32 శాతం లోటు వర్షపాతం నమోదైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అయితే మొత్తంగా ఈ సీజన్‌లో 'సాధారణ' వర్షాలే కురుస్తాయని తెలిపింది. అత్యధికంగా ఖమ్మంలో 73 శాతం లోటు వర్షపాతం నమోదైందని పేర్కొంది. సాధారణంగా ఆ జిల్లాలో 135.3 శాతం వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, 35.9 శాతం వర్షపాతం మాత్రమే కురిసిందని వివరించింది. హైదరాబాద్, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో మాత్రమే అధిక వర్షాలు కురిశాయని తెలిపింది. హైదరాబాద్‌లో సాధారణంగా 108.8 శాతం వర్షపాతం నమోదవుతుండగా, ఈసారి 116.9 శాతం వర్షపాతం రికార్డయిందని పేర్కొంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సోమవారం హెచ్చరించింది.

**హాంకాంగ్ మళ్లీ ఉద్రిక్తత**

# పార్లమెంట్‌పై నిరసనకారుల దాడి

'చైనా హ్యాండోవర్ డే'కు వ్యతిరేకంగా భారీ ప్రదర్శన



పార్లమెంట్ భవనంలో ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తున్న ఆందోళనకారులు

**హాంకాంగ్, జూలై 1:** కొన్నాళ్లుగా నిరసనలతో అట్టుడుకుతున్న హాంకాంగ్‌లో సోమవారం నిరసనకారులు ఏకంగా పార్లమెంట్‌పై దాడికిదిగారు. 1997 జూలై 1న బ్రిటన్ పాలన నుంచి విముక్తి పొంది చైనా పాలనలోకి వెళ్లిన రోజుకు గుర్తుగా ప్రభుత్వం ఏటా 'చైనా హ్యాండోవర్ డే'ను నిర్వహిస్తున్నది. దీనిని వ్యతిరేకిస్తూ సోమవారం వేలాది మంది హాంకాంగ్‌వాసులు రోడ్లమీదికి వచ్చారు. పార్లమెంట్ భవనాన్ని చుట్టుముట్టారు. చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని, అధ్యక్షుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కొందరు ఆందోళనకారులు పార్లమెంట్ భవనంలోకి చొచ్చుకెళ్లారు. ఫర్నీచర్‌ను, అద్దాలను ధ్వంసం చేశారు. గోడలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో మూడువారాలుగా శాంతియుతంగా జరుగుతున్న పోరాటం హింసాత్మకంగా మారింది. ఇటీవలే హాంకాంగ్ ప్రభుత్వం చైనాతో చేసుకున్న నిందితుల అప్పగింత ఒప్పందానికి వ్యతిరేకంగా శాంతియుతంగా భారీ నిరసన ప్రదర్శనలు జరిగిన సంగతి తెలిసిందే. సోమవారం సైతం నిరసన ప్రదర్శన శాంతియుతంగానే మొదలైంది. మధ్యాహ్నం వేలాది మంది ప్రజాస్వామ్య కార్యకర్తలు రోడ్లమీదికి వచ్చారు. బానిసత్వానికి గుర్తుగా పండుగ చేయడాన్ని మానుకొని, తాము ఏండ్లుగా ఎదురుచూస్తున్న స్వాతంత్ర్యాన్ని సిద్ధింపజేయాలని నినదించారు. సాయంత్రం కొన్ని నిరసనకారులు పార్లమెంట్ భవనంలోనికి చొచ్చుకెళ్లారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గోడలపై ఉన్న హాంకాంగ్ నేతల ఫొటోలను ధ్వంసంచేశారు. ప్రధాన హాల్‌లో బ్రిటిష్ వలసపాలన కాలం నాటి జెండాను ఎగురవేశారు. సిటీ లోగోపై నలుపు రంగు చల్లారు. మరికొందరు అద్దాలను, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఆందోళనకారులు గుర్తుతెలియని రసాయనాన్ని చల్లడంతో 13 మంది అధికారులు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. నిరసనకారులను చెదురగొట్టేందుకు బాష్పవాయువును ప్రయోగించారు. ఈ దాడిని ప్రభుత్వం ఖండించింది.

# జైరా నిర్ణయంపై మిశ్రమ స్పందన

**ముంబై:** తన మత విశ్వాసానికి ఆటంకంగా ఉన్న కారణంగా తాను నటనకు స్వస్తి పలుకుతున్నట్టు 'దంగల్' సినిమా నటి జైరా వసీం (18) చేసిన ప్రకటనపై మిశ్రమ స్పందన వ్యక్తమవుతున్నది. కొందరు ఆమెకు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు విమర్శిస్తున్నారు. కశ్మీర్‌కు చెందిన జైరా విజయవంతంగా సాగుతున్న తన సినిమా కెరీర్ నుంచి తప్పుకుంటున్నట్టు ఆదివారం చేసిన ప్రకటన సంచలనం సృష్టించింది. ఆమె సోమవారం తన నిర్ణయాన్ని పునరుద్ఘాటించారు. తన సోషల్ మీడియా అకౌంట్లు హ్యాకింగ్‌కు గురి కాలేదని, నటనా రంగం నుంచి వైదొలుగుతున్నట్టు తానే ప్రకటించానని ఆమె స్పష్టం చేశారు. ఆమె నిర్ణయంపై నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ, వసీం నిర్ణయాన్ని ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదని ట్వీట్ చేశారు. శివసేన నాయకురాలు ప్రియాంక చతుర్వేది స్పందిస్తూ, ప్రతి ఒక్కరికి తమ మత విశ్వాసాలను పాటించే హక్కు ఉన్నదని, అయితే కెరీర్‌ను ఎంపిక చేసుకునే విషయంలో మతం అడ్డుగోడ కాకూడదన్నారు.

# ఆగస్టులో ముందస్తు జనగణన

రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ ప్రకటన

మొబైల్ యాప్ ద్వారా సమాచారం సేకరించడం ఇదే తొలిసారి!

**న్యూఢిల్లీ:** తదుపరి (2021లో చేపట్టబోయే) జనగణనకు సంబంధించి ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 30 వరకు దేశవ్యాప్తంగా ముందస్తు జనగణన చేపట్టనున్నట్లు రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ వివేక్ జోషి ప్రకటించారు. అనంతరం జమ్ము కశ్మీర్‌తోపాటు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని మంచు ప్రభావిత ప్రాంతాల్లో 2020 అక్టోబర్ 1న, దేశవ్యాప్తంగా మిగిలిన ప్రాంతాల్లో 2021 మార్చి 1న జనగణన చేపట్టనున్నట్లు చెప్పారు. 140 ఏండ్ల భారత జనాభా లెక్కల చరిత్రలో మొట్టమొదటిసారి మొబైల్ యాప్ ద్వారా కూడా సమాచారం సేకరించనున్నారు. జనాభా వివరాల సేకరణకు 33 లక్షల మంది ఎన్యూమరేటర్లను వినియోగించనున్నారు. జనాభాతోపాటు ఆర్థిక-సామాజిక సమాచారాన్ని కూడా సేకరించనున్నట్లు కేంద్ర హోం శాఖ కార్యదర్శి రాజీవ్ గౌబా తెలిపారు.

## పాయింట్ల పట్టిక

| స్థానం | జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే. | ర.రే | పా |
|---|---|---|---|---|---|---|---|
| 1.✔ | ఆస్ట్రేలియా | 8 | 7 | 1 | 0 | +1.00 | 14 |
| 2. | భారత్ | 7 | 5 | 1 | 1 | +0.85 | 11 |
| 3. | న్యూజిలాండ్ | 8 | 5 | 2 | 1 | +0.57 | 11 |
| 4. | ఇంగ్లండ్ | 8 | 5 | 3 | 0 | +1.00 | 10 |
| 5. | పాకిస్థాన్ | 8 | 4 | 3 | 1 | -0.79 | 9 |
| 6. | శ్రీలంక | 8 | 3 | 3 | 2 | -0.93 | 8 |
| 7. | బంగ్లాదేశ్ | 7 | 3 | 3 | 1 | -0.13 | 7 |
| 8. | దక్షిణాఫ్రికా | 8 | 2 | 5 | 1 | -0.08 | 5 |
| 9. | వెస్టిండీస్ | 8 | 1 | 6 | 1 | -0.33 | 3 |
| 10. | ఆఫ్ఘనిస్థాన్ | 8 | 0 | 8 | 0 | -1.41 | 0 |

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు, ✔ - అర్హత

**వరల్డ్‌కప్‌లో నేడు** భారత్ X బంగ్లాదేశ్ - 3 గం. స్టార్ స్పోర్ట్స్‌లో

**అత్యధిక పరుగులు** 516 వార్నర్ (ఆస్ట్రేలియా)

**అత్యధిక వికెట్లు** 24 స్టార్క్ (ఆస్ట్రేలియా)


ధోనీ

ఇంగ్లండ్‌తో ఓటమి ఒకరకంగా మనకు మంచే చేసింది. మబ్బుల్లో తేలుతున్న మనవాళ్లను నేలకు దించింది. జట్టులోని లోటుపాట్లు బయటపెట్టింది. ఆఫ్ఘనిస్థాన్, వెస్టిండీస్ వంటి బలహీన జట్లపై మిడిలార్డర్ పెద్దగా ప్రభావం చూపలేకపోయినా విజయం సాధించగలిగాం. బలమైన ప్రత్యర్థి తగిలితే కానీ మన బ్యాటింగ్ డొల్లతనమేంటో తెలిసిరాలేదు.

ఆరెంజ్ జెర్సీ కారణంగానే ఓడిందని ఆటకు రాజకీయ రంగు పులమడానికి కొందరు ప్రయత్నిస్తుంటే.. పాకిస్థాన్ పచ్చ జెర్సీతో ఆడినా ఫలితాలు ప్రతికూలంగా వస్తున్నాయెందుకని మరొకరు కౌంటర్ ఇస్తున్నారు. దాయాది ముందుకెళ్లడం ఇష్టంలేకే భారత్ పేలవ ప్రదర్శన చేసిందని పాక్ ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తుంటే.. లేదు లేదు వారు చేయాల్సిందంతా చేశారు.. ఉపఖండ వాసుల ప్రార్థనలు ఫలించలేదని ఆ దేశ మాజీ పేసర్ అక్తర్ అంటున్నాడు.

# అయ్యో శంకరా..!

**గాయంతో ప్రపంచకప్ టోర్నీకి దూరం**

**విజయ్ స్థానంలో మయాంక్**

**బర్మింగ్‌హామ్:** ప్రతిష్ఠాత్మక ప్రపంచకప్‌లో టైటిల్ ఫేవరెట్ భారత్‌కు మళ్లీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే డాషింగ్ ఓపెనర్ శిఖర్ ధవన్ మెగాటోర్నీకి దూరం కాగా తాజాగా ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ గాయంతో వైదొలిగాడు. కాలి వేలి దెబ్బతో మిగిలిన టోర్నీకి అందుబాటులో లేకుండా పోయాడు. శంకర్ స్థానంలో కర్ణాటక బ్యాట్స్‌మన్ మయాంక్ అగర్వాల్‌కు అనూహ్యంగా చోటు దక్కింది. 'ఆఫ్ఘనిస్థాన్‌తో మ్యాచ్ కోసం ఈనెల 19న సౌతాంప్టన్‌లో నెట్ సెషన్‌లో పాల్గొన్న శంకర్ గాయపడ్డాడు. యార్కర్ స్పెషలిస్టు బుమ్రా విసిరిన బంతి శంకర్ ఎడమకాలి బొటనవేలికి బలంగా తగిలింది. అయినా ఆఫ్ఘన్, వెస్టిండీస్‌తో మ్యాచ్‌ల్లో ఆడాడు. కరీబియన్లతో మ్యాచ్ నాటికి గాయం తీవ్రత మరింత పెరిగింది. సీటీ స్కాన్ పరీక్షల్లో ఎడమ కాలు బొటనవేలు ఎముకలో చీలిక వచ్చినట్లు తేలింది. గాయం నుంచి పూర్తిగా కోలుకునేందుకు మూడు వారాల సమయం పట్టే అవకాశముంది. అందుకే శంకర్ ప్రపంచకప్ టోర్నీకి దూరమయ్యాడు' అని బీసీసీఐ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

**అగర్వాల్‌కు ఒకే:**
గాయపడ్డ శంకర్ స్థానంలో మయాంక్ అగర్వాల్‌కు జట్టులో చోటు దక్కింది. టాపార్డర్ బ్యాట్స్‌మన్ కావాలంటూ మేనేజ్‌మెంట్ కోరికకు అనుగుణంగా బోర్డు మయాంక్‌ను ఎంపిక చేస్తూ ఐసీసీకి ప్రతిపాదించింది. దీనికి ఈవెంట్ టెక్నికల్ కమిటీ ఆమోద ముద్ర వేసిందని ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇదిలా ఉంటే ధవన్ గైర్హాజరీలో ఓపెనింగ్‌కు వస్తున్న రాహుల్ అంతగా ఆకట్టుకోలేకపోతున్నాడు. దీనికి తోడు ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో గాయపడ్డ కారణంగా ముందస్తు జాగ్రత్తగా రిజర్వ్ ఓపెనర్‌గా మయాంక్ వైపు మొగ్గినట్లు తెలుస్తున్నది. మరోవైపు పంత్‌ను రోహిత్ జతగా ఓపెనింగ్‌కు పంపించి..రాహుల్‌ను నాలుగులో దింపేందుకు మేనేజ్‌మెంట్ ఆలోచిస్తున్నట్లు వినికిడి. మిగిలిన రెండు లీగ్ మ్యాచ్‌ల్లో పంత్ విఫలమైతే..ఓపెనింగ్‌లో మయాంక్‌ను, రాహుల్‌ను మిడిలార్డర్‌లో పంపే ప్రణాళికను ఎంచుకున్నట్లు కథనం. ఇక శంకర్ గాయంపై ఒకింత అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జట్టు ఫిజియో ప్యాట్రిక్ ఫర్హాత్ అసలు ఎలాంటి నివేదిక ఇచ్చాడు. గాయం ఉన్నా..శంకర్‌ను రెండు మ్యాచ్‌లు ఆడించారన్న దానిపై పలు సందేహాలు వస్తున్నాయి.

**రాయుడిని కాదని:**
తెలుగు క్రికెటర్ అంబటి రాయుడిని కాదని, ఒక్క వన్డే ఆడని మయాంక్‌ను ఎంపిక చేయడంపై అభిమానులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచకప్ స్టాండ్‌బై ఆటగాళ్లలో ఒకడైన రాయుడిని పక్కకుపెడుతూ మయాంక్‌ను తీసుకోవడం పట్ల ఫ్యాన్స్ ఫైర్ అవుతున్నారు.


శంకర్ మయాంక్

# ఎందుకీ తడబ్యాటు

**భారత్‌ను వేధిస్తున్న మిడిలార్డర్**

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

మొదటి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై సునాయాస గెలుపు... ఆ తర్వాత ఆస్ట్రేలియా, పాకిస్థాన్‌పై భారీ విజయాలు.. ఇక టీమ్‌ఇండియాకు ఎదురుందా.. బలహీనతే లేని ఆ జట్టును ఎవరైనా ఓడించగలరా అని అందరూ అనుకున్నారు. ఇక కప్పు ఇండియాదే అని అభిమానులు ఫుల్‌ఖుష్ అయ్యారు. ఆ తర్వాత టోర్నీ నుంచి ధవన్ నిష్క్రమణతో మిడిలార్డర్ డొల్లతనం బయటపడింది. ఆఫ్ఘన్‌తో మ్యాచ్‌తో టీమ్‌ఇండియా సీన్ మారిపోయింది. ఆ మ్యాచ్‌లో ధోనీ-జాదవ్ షో అందరినీ నిరాశపరిచింది. అదేదో భీకర బౌలింగ్‌ను ఎదుర్కొంటున్నట్టు.. జట్టు భారాన్నంతా భుజాలపై మోస్తున్నట్టు.. సింగిల్స్ తీస్తే గగనం.. ఫోర్ కొట్టడం అద్భుతమన్నట్టు వారిద్దరూ ఆడారు. స్లోబ్యాటింగ్‌తో ధోనీ(52 బంతుల్లో 28), కేదార్ జాదవ్(68 బంతుల్లో 52) ఆపసోపాలు పడ్డారు. వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ అదే తడబాటు... అదే స్లోబ్యాటింగ్. నాలుగో స్థానంలో వచ్చిన విజయ్ శంకర్ రెండోసారి విఫలమయ్యాడు. చివరి వరకు ఆడిన ధోనీ 61 బంతుల్లో 58పరుగులు మాత్రమే చేశాడు. ఇక అప్పటి దాకా టీమ్‌ఇండియా మిడిలార్డర్‌పై ఉన్న ఆందోళన తారస్థాయికి చేరింది. టాపార్డర్‌లో కోహ్లీ, రోహిత్ విఫలమైతే పరిస్థితేంటనే ఆందోళన పెరిగిపోయింది. ఇంగ్లండ్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌తో టీమ్‌ఇండియా బలహీనతేంటో స్పష్టంగా తేటతెల్లమైంది. పాండ్య అప్పుడప్పుడు మెరిపిస్తున్నా.. అతడిపై పూర్తిగా నమ్మకం పెట్టుకోలేని పరిస్థితి. సెమీస్ ఫైనల్స్ సమీపిస్తున్న తరుణంలో జట్టు పరిస్థితిపై అభిమానులు ఆందోళన చెందుతున్నారు. టాపార్డర్ విఫలమైతే ఇక పరాజయం ఖాయమే అనుకునే పరిస్థితి దాపురించిందని చింతిస్తున్నారు.

### కనీస పోరాటమైనా...
ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో విజయానికి చివరి ఐదు ఓవర్లలో 70 పరుగులు చేయాల్సి వచ్చింది. ఆ సమయంలో క్రీజులో ఉన్న వరల్డ్ బెస్ట్ ఫినిషర్ అనే పేరున్న మహేంద్ర సింగ్ ధోనీ, కేదార్ జాదవ్ సింగిల్స్‌కే పరిమితమయ్యారు. చేతిలో ఇంకా ఐదు వికెట్లున్నా కనీసం పోరాడలేదు. చివరి ఐదు ఓవర్లలో సింగిల్స్.. అప్పుడప్పుడూ బౌండరీలు కొడుతూ ధోనీ-కేదార్ 39 పరుగులు మాత్రమే చేసి టీమ్‌ఇండియాకు పరాజయం కట్టబెట్టారు. ఇక కీలకమైన సెమీఫైనల్స్ ముంగిట నాలుగో స్థానంలో ఎవరొస్తారో తెలియకపోవడం, ధోనీ-కేదార్‌ల వైఫల్యం టీమ్‌ఇండియాను తీవ్రంగా కలవరపరుస్తున్నది.

### ధోనీకి ఏమైంది..?
మహేంద్ర సింగ్ ధోనీ.. భారీ హిట్టింగ్‌కు మారుపేరు... ధనాధన్ ఆటతో భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించిన ఆటగాడు. అలాంటి ధోనీ... కెరీర్ చరమాంకంలో తడబడుతున్నాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో (134 స్ట్రయిక్ రేటుతో 309 పరుగులు)లో చెలరేగి ఆడినా విశ్వటోర్నీలో పరుగులు చేసేందుకు అష్టకష్టాలు పడుతున్నాడు. లక్ష్యమెంతైనా చివరి వరకు పోరాడి.. చాలా సందర్భాల్లో జట్టును విజయతీరాలకు చేర్చిన అతడు.. ప్రస్తుతం బౌండరీ బాదేందుకూ అష్టకష్టాలు పడుతున్నాడు. ఐపీఎల్‌లో ఫ్రాంచైజీల తరపున రెచ్చిపోయి ఆడే ఆటగాళ్లు విశ్వకప్‌లో జాతీయ జట్టు తరపున తేలిపోతుండడంపై అభిమానులు మండిపడుతున్నారు. మెగాటోర్నీలో సత్తాచాటి టీమ్‌ఇండియా టైటిల్‌ను గెలవాలంటే టాపార్డర్‌లో అదరగొడుతున్న రోహిత్, కోహ్లీకి ధోనీ, కేదార్ సహా మిడిలార్డర్ చేయూతనందించాల్సిన అవసరం ఉంది.

### డీఆర్ఎస్‌లోనూ ధోనీ తడబాటు
డీఆర్ఎస్ విధానాన్ని ధోనీ రివ్యూ సిస్టం అని అనేంతలా కచ్చితమైన నిర్ణయాలతో ధోనీ పేరు తెచ్చుకున్నాడు. అయితే ఈ టోర్నీలో రెండు కీలక సమయాల్లో అతడు బోల్తా పడ్డాడు. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో పాండ్యా వేసిన 11వ ఓవర్‌లో ఓపెనర్ రాయ్ గ్లోవ్‌కు తగిలి బంతి ధోనీ చేతుల్లోకి వెళ్లగా... అంపైర్ నాటౌట్ ఇచ్చాడు. కెప్టెన్ కోహ్లీ రివ్యూకి వెళదామన్నా... ధోనీ వద్దని చెప్పాడు. అలాగే, పాక్‌తో మ్యాచ్‌లోనూ... బాబర్ ఆజమ్ ఎల్బీడబ్ల్యూ విషయంలో ఇలాగే జరిగింది.


కోహ్లీ

# సెమీస్‌కు ఒక్క అడుగు

**గెలిస్తే నాకౌట్‌కు భారత్**

**బంగ్లాపై సత్తాచాటేందుకు రెడీ**

**షకీబ్‌నే నమ్ముకున్న మొర్తజా సేన**

ఓడింది ఒక్క మ్యాచే.. కానీ, సవాలక్ష ప్రశ్నలు.
లెక్కకు మిక్కిలి సవాళ్లు.. సర్వత్రా విమర్శలు.
జట్టు కూర్పు నుంచి.. మిడిలార్డర్ వైఫల్యం దాక.

ఇంగ్లండ్ చేతిలో పరాజయం ప్రభావం పక్కన పెడితే మనవాళ్ల ఆటతీరు ఎక్కువ విమర్శలకు గురైంది. భారీ షాట్లు ఆడటం మినహా మరో దారి లేని సమయంలో కూడా డాట్ బాల్స్, సింగిల్స్ ఆడిన ధోనీ, జాదవ్ అందరినీ విసిగించారు. 'ఇలాంటి సమయంలో భారత్‌కు కావాల్సింది సింగిల్స్ కాదు భారీ షాట్లు'అని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ నాసిర్ హుస్సేన్ అంటే.. 'ఏం మాట్లాడాలో కూడా అర్థం కావడంలేదు. ఇలా డాట్‌బాల్స్ ఆడేకన్నా 300కే టీమ్ ఆలౌటైనా బాగుండేది'అని భారత మాజీ సారథి గంగూలీ అభిప్రాయపడ్డాడంటే తీవ్రత అర్థం చేసుకోవచ్చు. ఇన్ని విమర్శలు వ్యక్తమవుతున్నా కెప్టెన్ కోహ్లీ, వైస్ కెప్టెన్ రోహిత్ మాత్రం ధోనీ బాగానే ఆడుతున్నాడని వెనకేసుకొస్తున్నారు. చిన్న బౌండ్రీలను చక్కగా వాడుకున్న ఇంగ్లిష్ బ్యాట్స్‌మెన్ మన స్పిన్నర్లను చితక్కొట్టిన చోట ఇన్నింగ్స్ మొత్తంలో టీమ్‌ఇండియా ఒకే సిక్సర్ బాద గలిగిందంటే దృక్పథంలోని లోపం తేటతెల్లమవుతున్నది. ఒక్క రోజు వ్యవధితో తిరిగి బరిలో దిగనున్న భారత్.. సంచలనాలకు కేంద్ర బిందువైన బంగ్లాపై సత్తాచాటి విమర్శలకు తెరదించాలని భావిస్తున్నది.

**బర్మింగ్‌హామ్:**

ప్రపంచకప్‌లో తొలి ఓటమి రుచి చూసిన భారత్.. దాన్ని వీలైనంత త్వరగా మరిచిపోయి అధికారికంగా సెమీస్ బెర్త్ ఖాయం చేసుకునేందుకు సిద్ధమైపోయింది. ఇంగ్లండ్ చేతిలో ఓడిన పిచ్‌పైనే నేడు బంగ్లాదేశ్‌తో తలపడనుంది. ఇప్పటి వరకు ఏడు మ్యాచ్‌లు ఆడిన కోహ్లీసేన 5 విజయాలు, ఒక ఓటమి, ఓ మ్యాచ్ రద్దు కారణంగా 11 పాయింట్లతో పట్టికలో రెండో స్థానంలో ఉంది. గాయాలు, మిడిలార్డర్ వైఫల్యం, జట్టు కూర్పు అంశాల్లో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతుండటంతో.. బంగ్లాపై చక్కటి విజయంతో వాటన్నింటికీ ఫుల్‌స్టాప్ పెట్టాలని టీమ్‌ఇండియా కృతనిశ్చయంతో ఉంది. మరోవైపు 7 మ్యాచ్‌ల్లో మూడింట గెలిచి మూడు ఓడి.. ఓ మ్యాచ్ రద్దు కావడంతో 7 పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్.. కోహ్లీసేనను ఓడించి నాకౌట్‌కు దగ్గరవ్వాలని ఉవ్విళ్లూరుతున్నది. చిన్న జట్టే కదా అని తేలిగ్గా తీసుకుంటే అసలుకే ఎసరొచ్చే ప్రమాదం ఉన్న నేపథ్యంలో భారత్ అప్రమత్తంగా ఉండాల్సిందే.

### మిడిల్ మరీ డల్..
గాయం కారణంగా ధవన్ దూరమైనప్పటి నుంచి భారత్‌కు మంచి ఆరంభం కరువైంది. ఇంగ్లండ్‌పై హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ శతకం బాదినా.. రాహుల్ డకౌటయ్యాడు. వరుసగా ఐదు అర్ధశతకాలతో విరాట్ తన విలువ చాటుకున్నా ఆ తర్వాత బాధ్యత మోసేవారు కరువయ్యారు. అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకోలేకపోయిన శంకర్ గాయం కారణంగా టోర్నీకి దూరం కాగా.. అతడి స్థానంలో తొలి మ్యాచ్ ఆడిన పంత్‌పై అంచనాల భారం మరీ ఎక్కువైంది. జాదవ్, ధోనీ తమ టెస్ట్ ఇన్నింగ్స్‌లతో అభిమానుల ఆగ్రహానికి గురవుతున్నారు. జట్టు కూర్పుపై సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సీమ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై జాదవ్, చహల్‌ను తప్పించి జడేజా, భువనేశ్వర్‌లకు చోటు కల్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి. చిన్న బౌండ్రీలున్న ఎడ్జ్‌బాస్టన్‌లో స్పిన్నర్ల కంటే సీమర్లుంటేనే నయం అని గత మ్యాచ్‌తో రుజువుకావడంతో మార్పులు తప్పక పోవచ్చు. పేసర్లు అంచనాలకు మించి రాణిస్తుండటం భారత్‌కు అనుకూలాంశం. బుమ్రా పరుగులు కట్టడి చేస్తుంటే.. షమీ వికెట్ల పండుగ చేసుకుంటున్నాడు. ఆడిన 3 మ్యాచ్‌ల్లోనే 13 వికెట్లు పడగొట్టి ఔరా అనిపించాడు. శంకర్ స్థానంలో ఒక్క వన్డే కూడా ఆడని మయాంక్ అగర్వాల్‌ను జట్టులోకి ఎంపిక చేసినా.. అతడికి మ్యాచ్ ఆడే చాన్స్ దక్కుతుందా అనేది సందేహమే. రాహుల్‌ను తిరిగి నాలుగుకు పంపించి పంత్‌తో ఓపెనింగ్ చేయించే అవకాశాలను కొట్టిపారేయలేం.

### బ్యాటింగ్ బలంగా..
ప్రపంచకప్‌లో అడుగుపెట్టిన ప్రతీసారి ఏదో ఓ జట్టు అవకాశాలను దెబ్బతీయడం బంగ్లాకు పరిపాటే. గతంలో మనకూ ఆ అనుభవం ఎదురైంది. కానీ ఇప్పుడు ఒకటీ అరా సంచలనాలపై కాకుండా నిలకడైన ప్రదర్శన చేయాలని భావిస్తున్నట్లు మెగా టోర్నీ ప్రారంభానికి ముందే కెప్టెన్ మొర్తజా బల్లగుద్దిచెప్పాడు. అందుకు తగ్గట్లే మూడు మ్యాచ్‌లు నెగ్గిన బంగ్లా మరో మూడింట్లో పరాజయం పాలైంది. ఓడిన మ్యాచ్‌ల్లోనూ పోరాటంతో ఆకట్టుకుంది. ఈ మ్యాచ్‌లో భారత విజయానికి, బంగ్లా పరాజయానికి మధ్య అడ్డుగా నిలుస్తాడని భావిస్తున్న ప్రపంచ నంబర్ వన్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ మీద ఆ జట్టు గంపెడు ఆశలు పెట్టుకుంది. ఈ టోర్నీలో షకీబ్ (476 పరుగులు, 10 వికెట్లు) ఇటు బంతితో అటు బ్యాటుతో రాణిస్తూ జట్టుకు మూలస్తంభంలా నిలుస్తున్నాడు. తమీమ్, లిటన్, షకీబ్, ముష్ఫికర్, సర్కార్, మహ్ముదుల్లాతో బ్యాటింగ్ బలంగా ఉన్నా.. పేసర్లు తేలిపోతుండటం ఆ జట్టును కలవరపెడుతున్నది. కెప్టెన్ మొర్తజా టోర్నీలో ఇప్పటివరకు ఒక్క వికెట్ మాత్రమే పడగొడితే.. ముస్తఫిజుర్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నాడు. ఇలాంటి బౌలింగ్‌తో కసి మీద ఉన్న భారత్ బ్యాటింగ్‌ను ఆపడం బంగ్లాకు శక్తికి మించిన పనే కావచ్చు.

**జట్లు (అంచనా)**

**భారత్:** రోహిత్, రాహుల్, కోహ్లీ (కెప్టెన్), పంత్, పాండ్యా, ధోనీ, జాదవ్/జడేజా, షమీ, కుల్దీప్, చహల్/భువీ, బుమ్రా.
**బంగ్లాదేశ్:** లిటన్, తమీమ్, షకీబ్, ముష్ఫికర్, సర్కార్, మహ్ముదుల్లా, మొసద్దిక్, సైఫుద్దీన్, మెహదీ, మొర్తజా (కెప్టెన్), ముస్తఫిజుర్.

**పిచ్, వాతావరణం**

ఇంగ్లండ్‌తో ఆడిన వికెట్‌పైనే ఈ మ్యాచ్ జరుగనుంది. ఎడ్జ్‌బాస్టన్ పిచ్ సీమర్లకు అనుకూలం అనే విషయం ఇప్పటికే స్పష్టమైంది. లెగ్‌సైడ్ బౌండ్రీ మరీ చిన్నదిగా ఉంది. పిచ్ ఫ్లాట్‌గా ఉండటంతో టాస్ గెలిచిన జట్టు మొదట బ్యాటింగ్ చేసే చాన్స్ ఎక్కువ.

**5** మరో ఐదు వికెట్లు తీస్తే బుమ్రా వన్డేల్లో 100 వికెట్లు పూర్తి చేసుకుంటాడు. కుల్దీప్ ఈ ఫీట్‌కు 8 వికెట్ల దూరంలో ఉన్నాడు.


షకీబ్

### భారత్ ఓటమికి జెర్సీనే కారణం
**శ్రీనగర్:** భారత క్రికెట్ జట్టు ఆరెంజ్ జెర్సీపై రాజకీయ రగడ చెలరేగుతూనే ఉన్నది. ఇంగ్లండ్ చేతిలో టీమ్ ఇండియా ఓటమికి నారింజ రంగు కారణమని జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ వ్యాఖ్యానించారు. 'నన్ను మూఢనమ్మకస్తురాలనుకున్న ఫర్వాలేదు. కానీ ఆటగాళ్లు ధరించిన



ఆరెంజ్ జెర్సీ వల్లనే మెగాటోర్నీలో భారత్ జైత్రయాత్రకు బ్రేక్ పడింది' అని ముఫ్తీ ట్వీట్ చేశారు. మరోవైపు నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ 'ఇంగ్లండ్, పాకిస్థాన్ తరహాలో సెమీస్ వెళ్లేందుకు క్లిష్ట పరిస్థితులు ఉంటే భారత్ ఇలాగే ఆడేదా' అని ట్విట్టర్‌లో ప్రశ్నించాడు. వీరిద్దరి వ్యాఖ్యలపై బీజేపీ నేతలు అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు.


ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్, క్యాండిస్ దంపతులకు ఆదివారం పండంటి పాప జన్మించింది. మూడో సంతానమైన పాపకు ఇస్లా రోజ్ అని పేరు పెట్టారు.

# ఆహా.. ఏం మ్యాచ్

**హోరాహోరీ సమరంలో విండీస్‌పై లంకదే పైచేయి.. శతక్కొట్టిన ఫెర్నాండో.. పూరన్ అద్భుత సెంచరీ వృథా..**


ఫెర్నాండో (104)

**పరుగుల వరద పారిన చెస్టర్ లీ స్ట్రీట్‌లో లంకదే పైచేయి అయింది. పూరన్, అలెన్ విధ్వంసంతో ఒక దశలో వెస్టిండీస్ విశ్వసమరంలో రికార్డు ఛేజింగ్ చేసేలా కనిపించినా.. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో బ్రాత్‌వైట్‌ను తలపిస్తూ.. కీలక సమయంలో పూరన్ వెనుదిరగడంతో కరీబియన్లకు మరోసారి నిరాశ తప్పలేదు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా శ్రీలంక జట్టు అంతా అయిపోయాక అదరగొట్టింది. ప్రపంచకప్ సెమీఫైనల్ అవకాశాలు దూరమయ్యాక సమిష్టి ప్రదర్శనతో ఓ విజయాన్ని ఖాతాలో వేసుకుంది.**

**చెస్టర్ లీ స్ట్రీట్:** సెమీస్ అవకాశాలను ప్రభావితం చేయని మ్యాచ్‌లో ఇరు జట్లు రెచ్చిపోయి ఆడాయి. మొత్తం 653 పరుగులు నమోదైన మ్యాచ్‌లో ఫలితంతో సంబంధం లేకుండా అభిమానులంతా సంబుర పడిపోయారు. మొదట బ్యాట్‌తో భారీ స్కోరు చేసిన లంక ఆ తర్వాత బంతితోనూ ఆకట్టుకొని 23 పరుగుల తేడాతో వెస్టిండీస్‌పై విజయం సాధించింది. అవిష్క ఫెర్నాండో (103 బంతుల్లో 104; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీతో పాటు కుషాల్ పెరెరా (51 బంతుల్లో 64; 8 ఫోర్లు), తిరిమన్నే (33 బంతుల్లో 45 నాటౌట్, 4 ఫోర్లు) మెరుపులు మెరిపించడంతో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన లంక 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 338 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో పూరన్ (103 బంతుల్లో 118; 11 ఫోర్లు, 4 సిక్సర్లు) శతకం, అలెన్ (32 బంతుల్లో 51; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకంతో దుమ్మురేపడంతో ఓ దశలో విండీస్ గెలిచేలా కనిపించినా చివరికి 50 ఓవర్లలో 9 వికెట్లకు 315 పరుగుకు పరిమితమైంది. ఫెర్నాండోకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

**స్కోరు బోర్డు**

**శ్రీలంక:** కరుణరత్నే (సి) హోప్ (బి) హోల్డర్ 32, కుషాల్ పెరెరా (రనౌట్) 64, ఫెర్నాండో (సి) అలెన్ (బి) కాట్రెల్ 104, మెండిస్ (సి అండ్ బి) అలెన్ 39, మాథ్యూస్ (బి) హోల్డర్ 26, తిరిమన్నే (నాటౌట్) 45, ఉడాన (సి) హోల్డర్ (బి) థామస్ 3, ధనంజయ (నాటౌట్) 6, **ఎక్స్‌ట్రాలు:** 19, **మొత్తం:** 50 ఓవర్లలో338/6. **వికెట్ల పతనం:** 1-93, 2-104, 3-189, 4-247, 5-314, 6-327, **బౌలింగ్:** కాట్రెల్ 10-0-69-1, థామస్ 10-1-58-1, గాబ్రియల్ 5-0-46-0, హోల్డర్ 10-0-59-2, బ్రాత్‌వైట్ 7-0-53-0, అలెన్ 8-0-44-1.

**వెస్టిండీస్:** గేల్ (సి) వాండర్సే (బి) రజిత 35, అంబ్రిస్ (సి) కుషాల్ పెరెరా (బి) మలింగ 5, హోప్ (బి) మలింగ 5, హెట్‌మైర్ (రనౌట్/డిసిల్వా) 29, పూరన్ (సి) కుషాల్ పెరెరా (బి) మాథ్యూస్ 118, హోల్డర్ (సి) (సబ్) జీవన్ (బి) వాండర్సే 26, బ్రాత్‌వైట్ (రనౌట్/ఉడాన) 8, అలెన్ (రనౌట్) 51, కాట్రెల్ (నాటౌట్) 7, థామస్ (ఎల్బీ) మలింగ 1, గాబ్రియల్ (నాటౌట్) 3, **ఎక్స్‌ట్రాలు:** 27, **మొత్తం:** 50 ఓవర్లలో 315/9. **వికెట్ల పతనం:** 1-12, 2-22, 3-71, 4-84, 5-145, 6-199, 7-282, 8-308, 9-311, **బౌలింగ్:** మలింగ 10-0-55-3, ధనంజయ 10-0-49-0, ఉడాన 10-0-67-0, రజిత 10-0-76-1, వాండర్సే 7-0-50-1, కరుణరత్నే 1-0-7-0, మాథ్యూస్ 2-0-6-1.

# ఒసాకాకు షాక్



**లండన్:** వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ తొలి రోజే సంచలనాలతో మొదలైంది. మహిళ సింగిల్స్‌లో టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ప్రపంచ రెండో ర్యాంకర్ నవోమీ ఒసాకా (జపాన్)కు తొలి రౌండ్‌లోనే ఓటమి ఎదురైతే.. మాజీ చాంపియన్ వీనస్ విలియమ్స్ 15 ఏండ్ల టీనేజ్ సంచలనం చేతిలో పరాజయం పాలైంది. సోమవారం ఇక్కడ జరిగిన పోటీలో 39వ ర్యాంకర్ యులియ పుతిన్త్సేవ(కజఖ్) చేతిలో 6-7(4/7), 2-6 తేడాతో పరాజయం పాలై టోర్నీ నుంచి ఒసాకా నిష్క్రమించింది. మరో మ్యాచ్‌లో జూలిన్(చైనా)పై మూడో సీడ్ పిస్లికోవా(చెక్ రిపబ్లిక్) 6-2, 7-6(7/4)తో వరుస సెట్లలో విజయం సాధించి ముందడుగు వేసింది.

### 15 ఏండ్ల గాఫ్ చేతిలో వీనస్ ఓటమి
ఐదుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ అయిన వీనస్ విలియయమ్స్‌ను తొలి రౌండ్‌లోనే 15 ఏళ్ల కోరీ గాఫ్(అమెరికా) మట్టికరిపించింది. వింబుల్డన్‌కు అర్హత సాధించిన పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించిన ఆమె.. వీనస్‌ను 6-4,6-4తో వరుస సెట్లలో ఓడించి చరిత్ర సృష్టించింది. గంటా 19 నిమిషాలు సాగిన మ్యాచ్‌లో వీనస్(44ర్యాంకు)ను చిత్తు చేసి తన ఆగమనాన్ని గాఫ్(313) ఘనంగా చాటింది. తొలి సెట్‌లో 3-4తో వీనస్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన గాఫ్.. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు.

### జొకోవిచ్, వావ్రింకా శుభారంభం
పురుషుల సింగిల్స్‌లో జొకోవిచ్,వావ్రింకా ముందడుగేశారు. **భారత స్టార్ ప్లేయర్ గుణేశ్వరన్(93వ ర్యాంకు) 6-7(1/7),4-6, 2-6తో మిలోస్ రవోనిక్(కెనడా, 17వ ర్యాంకు) చేతిలో తొలి రౌండ్‌లోనే ఓడాడు.**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 39,686 | 11,866 |
| 292 | 77 |

ముడి చమురు (బ్రెంట్) 64.51 డాలర్లు

**బంగారం ధరలు**

| న్యూఢిల్లీ (రూ.లలో) | |
|---|---|
| 24 క్యారెట్లు | 34,140 |
| 22 క్యారెట్లు | 33,970 |
| వెండి (కిలో) | 38,830 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 66.10 | 71.60 |
| యూరో | 74.70 | 80.70 |
| బహ్రెయిన్ దినార్ | 173.80 | 187.80 |
| కువైట్ దినార్ | 217.80 | 231.80 |
| సౌదీ రియాల్ | 17.40 | 19.00 |
| యూఏఈ దిర్హామ్ | 17.80 | 19.50 |

**చికెన్ ధరలు**

| (రూ.లలో) | |
|---|---|
| ఫారం ధర | 112.00 |
| రిటైల్ లైవ్ | 134.00 |
| డ్రెస్డ్ | 194.00 |
| స్కిన్‌లెస్ | 221.00 |

**నెక్ (వంద గుడ్లకు)**

| (రూ.లలో) | |
|---|---|
| హైదరాబాద్ | 421-00 |
| రంగారెడ్డి | 421-00 |
| మెదక్ | 421-00 |
| కరీంనగర్ | 424-00 |
| వరంగల్ | 424-00 |
| రిటైల్ ప్రైస్ | 4-80 |

# లక్ష కోట్ల దిగువకు జీఎస్టీ వసూళ్లు

## జూన్‌లో రూ.99,939 కోట్లు

**న్యూఢిల్లీ, జూలై 1:** వరుసగా మూడు నెలలపాటు లక్ష కోట్ల రూపాయలకు పైగా వసూలైన జీఎస్టీ వసూళ్లు గత నెలలో తగ్గుముఖం పట్టాయి. జూన్ నెలకుగాను రూ.99,939 కోట్లు వసూలైనట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. మే నెలలో వసూలైన రూ.1,00,289 కోట్ల కంటే ఆ తర్వాతి నెలలో తగ్గుముఖం పట్టగా, కానీ అంతక్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.95,610 కోట్లతో పోలిస్తే 4.52 శాతం పెరిగింది. గత నెలలో జీఎస్టీఆర్-3బీ రిటర్నులు 74.38 లక్షల మంది దాఖలు చేసినట్లు వెల్లడించింది. మే నెలలో దాఖలు చేసిన 72.45 లక్షలతో పోలిస్తే భారీగా పెరిగారు. జీఎస్టీ ఎగవేతదారులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం ఇందుకు దోహదం చేసింది. గత నెలలో వసూలైన రూ.99,939 కోట్ల జీఎస్టీ వసూళ్లలో సీజీఎస్టీ కింద రూ.18,366 కోట్లు వసూలవగా, ఎస్‌జీఎస్టీ కింద రూ.25,343 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.47,772 కోట్లు(దిగుమతులపై విధించిన రూ.21,980 కోట్లు కలుపుకొని), సెస్ రూపంలో రూ.8,457 కోట్లు(దిగుమతులపై విధించిన రూ.876 కోట్లు కలుపుకొని) వసూలైనట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలలో తెలిపింది. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ..ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న జీఎస్టీ వసూళ్లకు చేరుకునే అవకాశాలున్నాయన్నారు. ఒక నిర్దిష్టమైన నెలలో పన్ను వసూళ్లు తగ్గినట్లు లేదని, క్రమంగా పెరుగుతుండటంతో వచ్చే మార్చి నాటికి బడ్జెట్ లక్ష్యానికి చేరుకుంటామని ఆయన ధీమా వ్యక్తంచేశారు. 2019-20లో సీజీఎస్టీ కింద రూ.6.10 లక్షల కోట్లు, పరిహారం సెస్ కింద రూ.1.01 లక్షల కోట్లు వసూలు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. అంతక్రితం ఏడాది సీజీఎస్టీ కింద రూ.4.25 లక్షల కోట్లు వసూలవగా, పరిహారం సెస్ రూపంలో రూ.97 వేల కోట్లు వచ్చాయి. కాగా, గత నెలలో సీజీఎస్టీ కింద రూ.18,169 కోట్ల చెల్లింపులు జరిపిన కేంద్ర ప్రభుత్వం..ఎస్‌జీఎస్టీ కింద రూ.13,613 కోట్లు చెల్లించింది. మొత్తంమీద గత నెలలో కేంద్ర ప్రభుత్వానికి రూ.36,535 కోట్ల ఆదాయం సమకూరగా, అదే రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.38,956 కోట్లు లభించాయి. ఈ సందర్భంగా పీడబ్ల్యూసీ ఇండియా పార్టనర్ అండ్ లీడర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ..గతేడాదితో పోలిస్తే పన్ను వసూళ్లు అంతంత మాత్రంగానే ఉండటం ఆందోళన కలిగిస్తున్నదని, పన్నుల పరిధిని మరింత విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ఈ వారంలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఇందుకు తగిన చర్యలు ప్రకటించాలన్నారు. గత నెలలో తగ్గుముఖం పట్టినప్పటికీ..వచ్చే నెలల్లో పెరిగే అవకాశం ఉందన్నారు.

**రూ.1.66 లక్షల కోట్లకు సేవా పన్ను బకాయిలు: కాగ్**

సేవా పన్ను బకాయిలు భారీగా పెరుగుతున్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో సేవా పన్ను బకాయిలు రూ.1.18 లక్షల కోట్ల నుంచి రూ.1.66 లక్షల కోట్లకు పెరిగాయని సోమవారం పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో కాగ్ పేర్కొంది. ఈ మొత్తం బకాయిల్లో సెంట్రల్ ఎక్సైజ్ కింద రూ.96,496 కోట్లు ఉన్నాయి. 2016-17లో 1.19 శాతంగా ఉన్న రికవరీ..ఆ తర్వాతి ఏడాదిలో 1.02 శాతానికి తగ్గినట్టు వెల్లడించింది. సెంట్రల్ ఎక్సైజ్‌కు సంబంధించి 45,749 కేసుల ఆదాయం రూ.1,04,718 కోట్లుగా ఉన్నది.

### 12 శాతానికి తగ్గించాలి

- కోరుతున్న మొబైల్ కంపెనీలు

మొబైల్ ఫోన్ కంపోనెంట్స్, విడి భాగాలపై జీఎస్టీని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించాలని మొబైల్ ఫోన్ తయారీదారులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్న మొబైల్ పరిశ్రమను ఆదుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నారు. 2017 జూలై 1న దేశవ్యాప్తంగా ఈ చారిత్రక పరోక్ష పన్ను అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. జూన్ 30 అర్ధరాత్రి పార్లమెంట్ సాక్షిగా ఒకే దేశం.. ఒకే పన్ను.. ఒకే మార్కెట్ పేరుతో జీఎస్టీని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు ఆచరణలోకి తీసుకువచ్చింది. డజనుకుపైగా కేంద్ర, రాష్ట్ర పన్నులను విలీనం చేస్తూ వచ్చిన ఈ మెగా ట్యాక్స్‌లో 0, 5, 12, 18, 28 శ్లాబులను ఏర్పాటు చేశారు. 500లకుపైగా సేవలు, 1,200లకుపైగా వస్తువులకు ఈ శ్లాబుల్లో పన్నులు పడుతుండగా, బంగారంపై ప్రత్యేకంగా 3 శాతం, ముడి వజ్రాలు, విలువైన రత్నాలపై 0.25 శాతం పన్నును వసూలు చేస్తున్నారు. పెట్రోలియం ఉత్పత్తులు, మద్యం, విద్యుత్‌ను జీఎస్టీలోకి తీసుకు రాలేదు. విద్య, వైద్యం, తాజా కూరగాయలు తదితర వాటికి జీఎస్టీ నుంచి మినహాయింపునిచ్చారు.



జీఎస్టీ రెండో వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నివేదికను విడుదల చేస్తున్న కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్, తదితరు

### ఎగవేతదారులను వదిలిపెట్టం: ఠాకూర్

నకిలీ ఇన్వాయిస్‌లకు సంబంధించి 535 కేసులను జీఎస్టీ అధికారులు నమోదు చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇప్పటిదాకా దాఖలైన ఈ కేసుల్లో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) మోసపూరిత క్లయిముల విలువ రూ.2,565 కోట్లుగా ఉందన్నారు. 40 మందిని అరెస్టు చేశామని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం (2018-19) 1,620 కేసులు నమోదైయ్యాయని, మోసపూరిత క్లయిముల విలువ రూ.11,251 కోట్లుగా ఉందన్నారు. 154 మంది అరెస్టైనట్లు చెప్పారు. కాగా, నకిలీ ఇన్వాయిస్‌లను సృష్టించి మోసాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. జీఎస్టీ రెండో వార్షికోత్సవాల సందర్భంగా ఇక్కడ మాట్లాడుతూ జీఎస్టీ ఎగవేతదారులను ఉపేక్షించబోమన్నారు. కాగా, నిజాయితీగల ట్యాక్స్‌పేయర్లకు సులభతరమైన సేవలు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని రెవిన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే తెలిపారు.

### రెండే శ్లాబులు: అరుణ్ జైట్లీ

జీఎస్టీ శ్లాబులు రెండుకు తగ్గవచ్చని కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ఇప్పుడున్న 12, 18 శాతం శ్లాబులు ఒక్కటి కావచ్చని సోమవారం ఆయన ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. జీఎస్టీ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా జైట్లీ స్పందిస్తూ చాలావరకు వస్తు, సేవలు 18, 12, 5 శాతం శ్లాబుల్లోనే ఉన్నాయని గుర్తుచేశారు. గరిష్ఠ శ్రేణి 28 శాతంలో కొన్ని రకాల లగ్జరీ ఉత్పత్తులే ఉన్నాయని చెప్పారు. ఈ క్రమంలో సున్నా, 5 శాతం శ్లాబులు ఎప్పటికీ ఉంటాయన్న ఆయన పన్ను ఆదాయం పెరిగితే 12, 18 శాతం శ్లాబులను విలీనం చేసి ఒక్కటిగా జీఎస్టీ మండలి నిర్ణయించే అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. జీఎస్టీ రెవిన్యూ ఆశాజనకంగా ఉంటే 28 శాతం శ్లాబునూ ఎత్తేస్తామని ఎప్పట్నుంచో మోదీ సర్కారు చెబుతున్న విషయం తెలిసిందే. 2017-18 (జూలై నుంచి మార్చి)లో సగటు నెలసరి జీఎస్టీ వసూళ్లు రూ.89,700 కోట్లుగా ఉన్నాయి. 2018-19లో ఇది రూ.97,100 కోట్లకు పెరిగాయి. దీంతో



భవిష్యత్తులో మరింత పెరిగే ఆదాయం జీఎస్టీ శ్లాబులను తప్పక కుదిస్తాయన్న ఆశాభావాన్ని జైట్లీ వెలిబుచ్చారు.

## తగ్గిన సబ్సిడీ సిలిండర్ ధర

- రూ.3 తగ్గించిన చమురు సంస్థలు
- కిలో లీటర్ ఏటీఎఫ్‌పై ఏకంగా రూ.3,806 తగ్గింపు



**న్యూఢిల్లీ, జూలై 1:** సబ్సిడీ వంటగ్యాస్ ధర స్వల్పంగా తగ్గింది. 14.2 కిలోల సిలిండర్‌పై రూ.3.02ను తగ్గించినట్లు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు తెలిపాయి. సోమవారం నుంచే తగ్గింపు ధరలు అమల్లోకి రాగా, ఢిల్లీలో సిలిండర్ ధర రూ.494.35కు దిగివచ్చింది. నిజానికి మార్చి నుంచి రాయితీ ఎల్పీజీ ధర పెరుగుతూ వచ్చింది. గత నాలుగు నెలల్లో రూ.3.84 మేర పెరిగింది. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల పతనం దృష్ట్యా ఈసారి సిలిండర్ ధరను చమురు కంపెనీలు తగ్గించేశాయి. ప్రతి నెలా ఒకటో తారీఖున చమురు మార్కెటింగ్ సంస్థలు ఎల్పీజీ ధరను సవరిస్తాయన్న విషయం తెలిసిందే. ఆదివారం నాన్-సబ్సిడీ ఎల్పీజీ ధరను రూ.100.5 మేర తగ్గిస్తున్నట్లు చమురు మార్కెటింగ్ సంస్థలు ప్రకటించిన సంగతి విదితమే. ఈ నిర్ణయంతో ఢిల్లీలో 14.2 కిలోల సిలిండర్ ధర రూ.637కు తగ్గింది. ఏటా గ్యాస్ వినియోగదారులకు నెలకు ఒకటి చొప్పున సిలిండర్‌ను రాయితీపై కేంద్రం అందిస్తుండగా, ఈ కోటా దాటిన తర్వాత మార్కెట్ ధరకే కస్టమర్లు కొనుక్కోవాల్సి ఉంటుంది. దాని ధరే ఇప్పుడు రూ.100.5 తగ్గింది. ఇదిలావుంటే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ (ఏటీఎఫ్ లేదా విమానయాన ఇంధనం) ధరను కూడా చమురు మార్కెటింగ్ సంస్థలు భారీగా తగ్గించాయి. దీంతో ఢిల్లీలో కిలో లీటర్ ధర రూ.3,806.44 దిగి రూ.61,200.36కు దిగొచ్చింది. ఇది నాలుగు నెలల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. ఏటీఎఫ్ ధర తగ్గడం వరుసగా ఇది రెండో నెల. జూన్ 1న స్వల్పంగా రూ.61.05 తగ్గింది. ఇక కిరోసిన్ ధరను గత 24 నెలలుగా నెలనెలా లీటర్‌కు 25 పైసలు చొప్పున పెంచుతూ వస్తున్నది తెలిసిందే. పెట్రోల్, డీజిల్ ధరలపై సబ్సిడీని ఎత్తివేసిన చమురు కంపెనీలు.. 15 రోజులకోసారి వాటిని మారుస్తున్నది విదితమే.

## ప్రజల ఆశల్ని నెరవేరుస్తారా..?

### ఎన్నికల వాగ్దానాలకు అనుగుణంగా సీతారామన్ బడ్జెట్ వస్తుందా

**న్యూఢిల్లీ, జూలై 1:** స్వతంత్ర భారతావని పద్దుల పండుగకు సమయం ఆసన్నమవుతున్నది. సర్కారీ ఖర్చులు, సామాన్యుడి ఆశలను ప్రతిబింబించే బడ్జెట్ వస్తున్నది. దీంతో ఎన్నికల వాగ్దానాలకు అనుగుణంగా ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయా? అన్న ప్రశ్నలు సగటు భారతీయుడి మది నిండా మెదులుతున్నాయిప్పుడు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న విషయం తెలిసిందే. మోదీ సర్కారు.. సామాన్యుడి ప్రభుత్వమని, 'మా-బాప్ సర్కార్' అని భావించి ఇటీవలి ఎన్నికల్లో గొప్ప మెజారిటీతో ప్రజలు మరోసారి అధికారం కట్టబెట్టారు. ఈ క్రమంలో వస్తున్న బడ్జెట్.. నిరుపేదలకు, ముఖ్యంగా సగటు వేతన జీవికి ఏమాత్రం మేలు చేస్తుందన్న ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతున్నది. దీంతో ఓ వైపు ద్రవ్యలోటును.. మరోవైపు ఎన్నికల హామీలను సీతారామన్ ఎలా బ్యాలెన్స్ చేస్తారన్నది అటు పరిశ్రమ వర్గాలను, ఇటు నిపుణులను ఉత్కంఠకు గురిచేస్తున్నది. వ్యవసాయ రంగంలో రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు, ఏడాది నుంచి ఐదేండ్ల కోసం రూ. లక్ష వరకు వడ్డీ రహిత కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) రుణాలు, చిన్న, సన్నకారు రైతుల కోసం పెన్షన్ పథకం అమలు, రూ.20,000 కోట్లతో విత్తన అంకుర నిధి ఏర్పాటు, 2024కల్లా మౌలిక రంగంలో రూ.100 లక్షల కోట్ల పెట్టుబడులు తదితర హామీలను కేంద్రం ఈసారి ఎన్నికల్లో గుప్పించింది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో వీటి అమలు అంత సులభం కాదు. రిజర్వ్ బ్యాంక్ నగదు నిల్వలను అందుకున్నా.. వీటికి నిధులు సరిపోవని నిపుణులు చెబుతున్నారు. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) ఆదాయం పడిపోవడం, పెట్రోలియం, మద్యం, విద్యుత్ రంగాలనూ జీఎస్టీ పరిధిలోకి తేవాలన్న డిమాండ్లుండటంతో మరిన్ని రాయితీలు తగదని సూచిస్తున్నారు.




## లిబర్టీ చేతికి ఆర్సెలార్ ఆస్తులు

### రూ.5,782 కోట్లతో యూరప్‌లోని స్టీల్ ప్లాంట్లు, సర్వీస్ సెంటర్ల కొనుగోలు




**న్యూఢిల్లీ, జూలై 1:** ఐరోపాలోని వివిధ దేశాల్లో గల ఆర్సెలార్ మిట్టల్ ఆస్తులను లిబర్టీ స్టీల్ చేజిక్కించుకున్నది. 740 మిలియన్ యూరోల (దాదాపు రూ.5,782 కోట్లు)తో ఏడు ఉక్కు ఉత్పాదక కేంద్రాలను, ఐదు సర్వీస్ సెంటర్లను కొనుగోలు చేసింది. ఈ మేరకు లిబర్టీ స్టీల్ సోమవారం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ రెండు సంస్థలూ భారత సంతతి ఉక్కు వ్యాపారులవేనన్న విషయం తెలిసిందే. ఆర్సెలార్ మిట్టల్.. లక్ష్మీ నివాస్ మిట్టల్‌కు చెందినదైతే, సంజీవ్ గుప్తాకు చెందినది లిబర్టీ స్టీల్. కాగా, ఈ డీల్‌తో చెక్ రిపబ్లిక్, రొమానియా, ఉత్తర మెసడోనియా, ఇటలీ, లగ్జెంబర్గ్‌ల్లో ఒక్కొక్కటి చొప్పున స్టీల్ ప్లాంట్లను సొంతం చేసుకున్న లిబర్టీ స్టీల్.. బెల్జియంలో రెండు ప్లాంట్లను పొందింది. ఈ ఏడు ప్లాంట్ల ఉద్యోగులు 14వేల పైనే ఉన్నారు. అలాగే ఫ్రాన్స్, ఇటలీల్లోని ఐదు సర్వీస్ సెంటర్లనూ హస్తగతం చేసుకున్నది.

## ఐసీఐసీఐ బ్యాంక్ వడ్డీరేట్ల తగ్గింపు

- 10 బేసిస్ పాయింట్లు తగ్గించిన సంస్థ

**ముంబై, జూలై 1:** దేశంలో రెండో అతిపెద్ద ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థయైన ఐసీఐసీఐ బ్యాంక్.. రుణాలపై వడ్డీరేటును 0.10 శాతం తగ్గించింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్లు మరింత తగ్గనున్నాయి. తగ్గించిన వడ్డీరేట్లు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటు 8.65 శాతానికి తగ్గనున్నది. గత నెలలో ఐసీఐసీఐ బ్యాంక్‌తోపాటు యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు డిపాజిట్లపై వడ్డీరేట్లను పావు శాతం వరకు తగ్గించిన విషయం తెలిసిందే.

# కళ తప్పుతున్న 'ఆటో'



- అమ్మకాల్లో ప్రతికూల వృద్ధి
- దెబ్బతిన్న వినియోగదారుల సెంటిమెంట్

**న్యూఢిల్లీ, జూలై 1:** ఒకప్పుడు జెట్ స్పీడ్ వేగంతో దూసుకుపోయిన ఆటోమొబైల్ రంగ సంస్థలకు ప్రస్తుతం నిరాశ తప్పలేదు. వినియోగదారుల సెంటిమెంట్ రోజురోజుకు పడిపోతుండటంతో అమ్మకాలు అంతంత మాత్రంగానే నమోదయ్యాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలైన మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్, టయోటాల విక్రయాల్లో ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకున్నాయి. కానీ, దేశీయ ప్యాసింజర్ వాహన విభాగంలో మహీంద్రా అండ్ మహీంద్రా నాలుగు శాతం వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషం. గత నెలలో మారుతి సుజుకీ అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 15.3 శాతం పడిపోగా, హ్యుందాయ్ 42 వేల యూనిట్లను మాత్రమే విక్రయించింది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 45,314 లతో పోలిస్తే 7.3 శాతం తగ్గాయి. యుటిలిటీ వాహన తయారీలో అగ్రగామి సంస్థయైన మహీంద్రా అండ్ మహీంద్రా ప్యాసింజర్ వాహన అమ్మకాలు నాలుగు శాతం పెరిగి 18,826లకు చేరాయి. మార్కెట్ సెంటిమెంట్ మందకొడిగా కొనసాగుతున్నదని, ముఖ్యంగా ప్యాసింజర్ వాహనాల్లో ఇది ఎక్కువగా ఉన్నదని మహీంద్రా ప్రెసిడెంట్ రాజన్ వాధేరా తెలిపారు. టాటా మోటర్స్ ప్యాసింజర్ వాహన సేల్స్ 27 శాతం క్షీణించి 13,351కి పరిమితమయ్యాయి. ప్రస్తుతం ఆటోమొబైల్ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పటికీ..భవిష్యత్తులో కోలుకునే అవకాశాలున్నాయని కంపెనీ వర్గాలు స్పష్టంచేశాయి. టయోటా కిర్లోస్కర్ సేల్స్ కూడా 19 శాతం జారుకొని 10,603లకు పడిపోయాయి. ఆర్థిక అనిశ్చితి, ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడం, అధిక వడ్డీరేట్లు వాహన విక్రయాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపిందని వ్యాఖ్యానించారు.

**ద్విచక్ర వాహనాలకు తప్పని నిరాశ..**

కార్లతోపాటు ద్విచక్ర వాహన తయారీదారులకు నిరాశ తప్పలేదు. గత నెలలో దేశవ్యాప్తంగా బజాజ్ అమ్మకాలు 1 శాతం క్షీణించి 1,99,340లకు పడిపోయాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో 2,00,949ల విక్రయాలు జరిపింది. అలాగే టీవీఎస్ మోటర్ సేల్స్ 2,46,176ల నుంచి 2,26,279లకు పడిపోయాయి.

**జూన్‌లో దేశవ్యాప్తంగా అమ్ముడైన వాహనాలు**

| కంపెనీ | 2019 | 2018 | వృద్ధి (%) |
|---|---|---|---|
| మారుతి | 1,14,861 | 1,35,662 | - 15.3 |
| హ్యుందాయ్ | 42,007 | 45,314 | - 7.3 |
| టాటా మోటర్స్ | 49,073 | 56,773 | -14 |
| మహీంద్రా | 42,547 | 45,155 | -6 |
| అశోక్ లేలాండ్ | 12,810 | 15,792 | -19 |
| టయోటా కిర్లోస్కర్ | 11,365 | 14,102 | -19 |
| ఎస్కార్ట్ ట్రాక్టర్ | 8,960 | 9,983 | - 10.2 |
| మహీంద్రా ట్రాక్టర్ | 33,094 | 40,529 | -18 |
| **ద్విచక్రవాహనాలు** | | | |
| హీరో మోటోకార్ప్ | 6,16,526 | 7,04,562 | -12 |
| బజాజ్ ఆటో | 4,04,624 | 4,04,429 | --- |
| టీవీఎస్ మోటర్ | 2,79,102 | 3,13,614 | -11 |
| సుజుకీ మోటర్‌సైకిల్ | 67,491 | 52,217 | 29 |

## ఐబీజేఏ జాతీయ అధ్యక్షుడిగా పృథ్వీరాజ్



**హైదరాబాద్, జూలై 1:** దేశంలో అతి పురాతనదైన ఇండియన్ బులియన్ అండ్ జ్యూవెల్లరీ అసోసియేషన్ లిమిటెడ్(ఐబీజేఏ) జాతీయ అధ్యక్షుడిగా పృథ్వీరాజ్ కొఠారి నియమితులయ్యారు. 2024 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. అలాగే సీఏ సురేంద్ర మెహతాను జాతీయ కార్యదర్శిగా నియమించిన ఐబీజేఏ..జాయింట్ సెక్రటరీగా కేథన్ కొఠారి, ట్రెజరీగా సంజయ్ జైన్, జాయింట్ ట్రెజరీగా నీమేష్ చోక్సీ నియమితులయ్యారు.




## ఓరియంట్ ఐలవ్ ఎల్ఈడీలు

**న్యూఢిల్లీ, జూలై 1:** సరికొత్త ఎల్ఈడీ బల్బులను ఓరియంట్ ఎలక్ట్రిక్ మార్కెట్‌కు పరిచయం చేసింది. 'ఐలవ్' సిరీస్‌లో అందుబాటులోకి వస్తున్న ఈ లైట్ల వినియోగంతో సాధారణ ఎల్ఈడీ లైట్లతో ఉత్పన్నమయ్యే కంటి జబ్బులు, అలసట ఇతరత్రా అనారోగ్య సమస్యలు దూరమవుతాయని ఈ సందర్భంగా సంస్థ చెప్పింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కూడా ఇవి ఆరోగ్య హిత లైట్లని ధ్రువీకరించినట్లు పేర్కొన్నది. ఫ్లికర్ కంట్రోల్ టెక్నాలజీతో వీటిని రూపొందించామని స్పష్టం చేసింది.

## కీలక రంగాల పరుగు

**న్యూఢిల్లీ, జూలై 1:** కీలక రంగాలు దూసుకుపోయాయి. స్టీల్, విద్యుత్ రంగాల నుంచి వచ్చిన దన్నుతో మే నెలలో కీలక రంగాల్లో వృద్ధి 5.1 శాతంగా నమోదైంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో వృద్ధి 4.1 శాతంగా ఉన్నది. స్టీల్ ఉత్పత్తి గణనీయంగా పెరుగడం, దీనికి తోడు విద్యుత్ ప్రొడక్షన్ ఆశించిన స్థాయిలో వృద్ధిని కనబరుచడం వల్లనే కీలక రంగాలు భారీ వృద్ధికి దోహదం చేశాయని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక వెల్లడించంది. గత నెలలో స్టీల్ ఉత్పత్తి 19.9 శాతం ఎగబాకగా, విద్యుత్‌లో 7.2 శాతం పెరుగుదల కనిపించింది. కానీ, ఇదే సమయంలో క్రూడాయిల్, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువుల్లో వృద్ధి ప్రతికూలానికి పడిపోవడం ప్రభుత్వానికి ఇబ్బందులను తెచ్చిపెడుతున్నది.

# అద్దెకు అనిల్ హెడ్ ఆఫీస్

### అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి రిలయన్స్ ఇన్‌ఫ్రా ప్రధాన కార్యాలయం లీజుకు యోచన

**న్యూఢిల్లీ, జూలై 1:** పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన అనిల్ అంబానీ.. రుణ భారాన్ని తగ్గించుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే తమ గ్రూప్ ప్రతిష్ఠాత్మక సంస్థ రిలయన్స్ ఇన్‌ఫ్రా ప్రధాన కార్యాలయాన్ని సైతం నగదీకరణకు పెడుతున్నారు. ముంబైలోని శాంతాక్రజ్ ఈస్ట్‌లోగల ఈ భవనాన్ని దీర్ఘకాలికంగా లీజుకు ఇవ్వాలని యోచిస్తున్నట్లు సోమవారం సంస్థ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు తెలిపింది. దీని ద్వారా వచ్చే సొమ్మును పూర్తిగా అప్పులను తీర్చడానికే వినియోగిస్తామని స్పష్టం చేసింది. గతేడాది అదానీ ట్రాన్స్‌మిషన్‌కు తమ ముంబై విద్యుత్ వ్యాపారాన్ని రూ.18,800 కోట్లకు ఈ సంస్థ అమ్ముకున్న విషయం తెలిసిందే. దీంతో సంస్థ రుణ భారం రూ.22,000 కోట్ల నుంచి దిగొచ్చింది. అలాగే క్యూబ్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఢిల్లీ ఆగ్రా టోల్ రోడ్డునూ అమ్మేస్తున్నట్లు ప్రకటించింది. ఆగస్టు చివరికల్లా ఈ డీల్ ముగిసే వీలుండగా, రూ.3,600 కోట్లు వస్తాయని అంచనా వేస్తున్నది. అయితే ఈ భవనాన్ని మాత్రం అమ్మేయబోవడం లేదని పేర్కొన్న రిలయన్స్ ఇన్‌ఫ్రా.. లీజుకే ఇవ్వాలనుకుంటున్నట్లు చెప్పడం గమనార్హం. ప్రస్తుతం రూ.6,000 కోట్లకుపైగా రుణాలను కలిగి ఉన్న రిలయన్స్ ఇన్‌ఫ్రా.. వచ్చే ఏడాదికల్లా రుణ విముక్తి కావాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నది. 15,514 చదరపు మీటర్ల ప్లాట్‌లో 6.95 లక్షల చదరపు అడుగులకుపైగా విస్తీర్ణంలో ఉన్నది ఈ రిలయన్స్ ఇన్‌ఫ్రా ప్రధాన కార్యాలయం. ఇక్కడ 425కుపైగా కార్లను పార్కింగ్ చేయవచ్చు. ముంబై వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే పక్కనే ఉన్న ఈ రిలయన్స్ సెంటర్ నుంచి.. స్థానిక ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు టెర్మినల్‌కు కేవలం 15 నిమిషాల్లో వెళ్లవచ్చు. దేశీయ ఎయిర్‌పోర్టు టెర్మినల్‌ను 10 నిమిషాల్లో చేరుకోవచ్చు. బాంద్రా-కుర్లా-కాంప్లెక్స్ బిజినెస్ డిస్ట్రిక్ట్ నుంచి ఈ సెంటర్‌కు 20 నిమిషాల్లో రావచ్చు. త్వరలో వచ్చే శాంతాక్రజ్ మెట్రో స్టేషన్‌కు నడిచి వెళ్లవచ్చు. కాగా, ఈ ఆఫీసును అద్దెకు ఇస్తే.. ఇందులో పనిచేస్తున్న ఉద్యోగులను బల్లార్డ్ ఎస్టేట్‌సహా ముంబైలోని గ్రూప్‌నకు చెందిన ఇతర చోట్లకు పంపించే వీలున్నది.



## రెండు రోజుల్లో రైతుల బకాయిలు చెల్లిస్తాం

- మార్క్‌ఫెడ్ ఎండీ భాస్కరాచారి

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** మరో రెండు రోజుల్లో రైతులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లిస్తామని మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కరాచారి స్పష్టంచేశారు. 2019-20 యాసంగి సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన శనగలు, పొద్దుతిరుగుడు పువ్వు, మినుములు, జొన్నలకు ఇప్పటి వరకు చెల్లింపులు జరుపలేదని, ఇందుకోసం ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.165 కోట్లను రుణంగా తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. శనగలను క్వింటాల్ రూ.4,620 మద్దతు ధరతో 22,368.150 మెట్రిక్ టన్నులు, పొద్దుతిరుగుడు పువ్వు రూ.5,388 మద్దతు ధరతో 1787.800 మెట్రిక్ టన్నులు, మినుములు రూ.5,600 ధరతో 2130.900 మెట్రిక్ టన్నులు, జొన్నలు రూ.2,430 చొప్పున 10397.650 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది.

## ఎస్‌బీఐ మరింత ఎదగాలి

### బ్యాంక్ ఆవిర్భావ వేడుకల్లో సింగరేణి ఫైనాన్స్ డైరెక్టర్




**బేగంబజార్, జూలై 1:** వినియోగదారుల అంచనాలు, అవసరాలకు అనుగుణంగా సేవలను అందిస్తూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) మరింతగా అభివృద్ధి చెందాలని సింగరేణి కాలరీస్ డైరెక్టర్ (ఫైనాన్స్) ఎన్ బలరాం ఆకాంక్షించారు. సోమవారం కోఠిలోని ఎస్బీఐ కమర్షియల్ శాఖ భవనంలో బ్యాంక్ 64వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. దేశంలో అతిపెద్ద బ్యాంకింగ్ వ్యవస్థగా 24 వేల శాఖలతో, 43.51 కోట్ల వినియోగదారులకు ఎస్‌బీఐ మెరుగైన సేవలను అందిస్తోందన్నారు. బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శాంతమూర్తి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సింగరేణి కాలరీస్ సంస్థ.. ఎస్బీఐకి ఓ నమ్మకమైన అతిపెద్ద వినియోగదారుగా ఉందన్నారు. సింగరేణి సంస్థలోని అధిక శాతం ఉద్యోగులు ఎస్బీఐలో ఖాతాలు కలిగి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఈఎంఏ ఏజీఎంలు నాయర్, మిగ్లాని, ఎస్బీఐ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సెర్ప్‌పై ఏపీ సీఎం సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రామీణ పేదరిక నిర్మూలన కమిటీ (సెర్ప్)పై ఏపీ సీఎం జగన్ సమీక్షించారు. సమావేశానికి ఆ రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది హాజరయ్యారు. పెంచిన పెన్షన్ పంపిణీపై కూడా జగన్ సమీక్ష జరిపారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ బడ్జెట్‌పై సమీక్షలు నిర్వహించనున్నారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆయాశాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశమై ఏ శాఖకు ఎంత బడ్జెట్ కావాలో మంత్రులు, అధికారుల నుంచి ప్రతిపాదనలు తీసుకోనున్నారు.



## చండీయాగంలో పాల్గొన్న ఏపీ సీఎం జగన్

**తాడేపల్లి:** ఏపీలోని గుంటూరు జిల్లా తాడేపల్లిలో నిర్వహించిన మహారుద్రసహిత ద్విసహస్ర చండీయాగం పూర్ణాహుతి కార్యక్రమానికి సోమవారం ఏపీ సీఎం వైఎస్ జగన్ హాజరయ్యారు. వేదమంత్రోచ్చారణల మధ్య జగన్ చేతుల మీదుగా పూర్ణాహుతి జరిగింది. వైఎస్ జగన్ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ వైఎస్సార్సీపీ నేత వరప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండేండ్ల నుంచి నిర్విఘ్నంగా కొనసాగిన యాగం సోమవారం పరిసమాప్తమైంది. అనంతరం వేదపండితులు సీఎం జగన్‌కు ఆశీర్వచనాలు అందజేశారు. ముఖ్యమంత్రికి శాలువాకప్పి, కంకణం తొడిగి సత్కరించారు.

## బ్రిటన్‌లో శిక్షణకు గీతం విద్యార్థులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బ్రిటన్‌లోని లాన్సెస్టర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 22 నుంచి ఆగస్టు 9 వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ సాంస్కృతిక వేసవి శిక్షణకు గీతం డీమ్డ్ వర్సిటీ హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు పూసల ప్రణయ్ కుమార్, బానోత్ లోకేశ్ ఎంపికయ్యారని గీతం హైదరాబాద్ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్ శివప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకుల సందర్శన కోసం లాన్సెస్టర్ వర్సిటీతో మూడేండ్ల క్రితం ఒప్పందం కుదిరిందని చెప్పారు. అందులో భాగంగా గీతం విద్యార్థులకు రాయితీ రుసుముతో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. శిక్షణకు ఎంపికైన ప్రణయ్‌కుమార్, లోకేశ్‌ను గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ సంజయ్, విద్యార్థి వ్యవహారాల సంచాలకుడు డాక్టర్ శ్రీరామ్, సీఎస్‌ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్ ఫణికుమార్ తదితరులు అభినందించారు.

### హోంమంత్రిని కలిసిన టీఆర్‌ఎస్
## కువైట్ ఎన్నారై అధ్యక్షుడు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హోంశాఖ మంత్రి మహమూద్ అలీని సోమవారం టీఆర్‌ఎస్ కువైట్ ఎన్నారైశాఖ అధ్యక్షుడు అభిలాష గొడిశాల కలిశారు. కువైట్‌లో ఎన్నారైశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను ఆయన హోంమంత్రికి వివరించారు. రక్తదానం, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం, పేదలకు ఆర్థికసాయం అందించడం, దుస్తుల పంపిణీ చేపడుతున్నట్టు తెలిపారు. ఎన్నారై పాలసీని త్వరగా తీసుకురావాలని మహమూద్ అలీని కోరారు.



### ఉద్యోగుల మధ్య
# అగాధానికి కుట్ర

- హౌసింగ్ సొసైటీలో అక్రమాలంటూ బురదజల్లే ప్రయత్నం
- అనర్హులంతా ఏకమై పార్కు స్థలాలను ఆక్రమించే పన్నాగం
- తెలంగాణ ఉద్యోగులతో ప్రభుత్వం స్నేహపూర్వకంగా ఉన్నది
- టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వం మధ్య అగాధం సృష్టించేందుకు కొందరు ఉద్యోగ సంఘాల నేతలు కుట్ర చేస్తున్నారని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి విమర్శించారు. ఎన్ని ప్రయత్నాలుచేసినా స్నేహబంధం కొనసాగుతుందని స్పష్టంచేశారు. రంగారెడ్డి జిల్లా ఉద్యోగులకు సంబంధించిన హౌసింగ్ సొసైటీ వ్యవహారంలో అక్రమాలు జరిగాయంటూ బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటయ్య ఉద్యోగ విరమణ సన్మాన సభను సోమవారం ఆ సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎం ముజీబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్‌తోపాటు పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా కారం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాన్ని, ఉద్యోగ సంఘాల నేతలను టార్గెట్‌చేస్తూ వ్యతిరేకంగా వార్తలు రాయిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ నేతలతోపాటు కుల సంఘాల నాయకులు వచ్చి పంచాయతీలు నిర్వహిస్తున్నారని, ప్లాట్ల అలాట్‌మెంట్‌పై మభ్యపెడుతున్నారని రవీందర్‌రెడ్డి చెప్పారు. వాస్తవంగా గచ్చిబౌలిలో రంగారెడ్డి జిల్లా ఉద్యోగులకు సంబంధించిన ప్లాట్ల కేటాయింపులు ఎప్పుడో ముగిసిపోయాయని, ఎలాంటి అక్రమాలకు జరుగకుండా అప్పటి టీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు స్వామిగౌడ్, దేవీ ప్రసాద్ రంగారెడ్డి జిల్లా పాత కార్యవర్గాన్ని మార్చి, కొత్త కార్యవర్గం ఎన్నిక చేసి, వారికే సొసైటీ బాధ్యతలను అప్పగించారని గుర్తుచేశారు. కొందరు ఉద్దేశపూర్వకంగా అక్కడక్కడా మిగిలి ఉన్న ప్లాట్లను కబ్జాచేసేందుకు రాజకీయ నేతలను రంగంలోకి దింపుతున్నారని ఆరోపించారు. అనర్హులు కొందరు చేరి హౌసింగ్ భూముల్లో పార్కు స్థలాల కబ్జాకు కుట్ర చేస్తున్నారని రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం దగ్గర టీఎన్జీవో నేతలను బద్నాంచేసేందుకు పన్నాగం పన్నుతున్నారన్నారు. కానీ, ఇలాంటి కుట్రలకు భయపడేది లేదన్నారు. స్వామిగౌడ్, దేవీ ప్రసాద్ మాట్లాడుతూ.. కాగజ్‌నగర్‌లో ఆదివారం జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, ప్రతినిధులు రేచల్, శ్రీనివాస్ రావు, రాయకంటి ప్రతాప్, శ్రీకాంత్, బీటీఎన్జీవో అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, కార్యదర్శి బలరాం, మల్లారెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దేవేందర్‌తోపాటు పలువురు ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ, సచివాలయాన్ని సందర్శించిన కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సచివాలయం, అసెంబ్లీ నిర్మించతలపెట్టిన నేపథ్యంలో ప్రస్తుత సచివాల యం, అసెంబ్లీని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు సందర్శించారు. సెక్రటేరియట్‌ను వచ్చిన కాంగ్రెస్ నేతలు పలు భవనాలను పరిశీలించారు. నూతన సచివాలయ నిర్మాణంపై కాంగ్రెస్ నేత లు మీడియాతో వివిధ అంశాలపై స్పందించారు.

# బొగ్గు ఉత్పత్తిలో 17.3% వృద్ధి

- తొలి త్రైమాసికంలో ఆశించిన ఫలితాలు
- సింగరేణి సంస్థ వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 2019 – 20 ఆర్థికసంవత్సరం మొదటి మూడునెలల్లో బొగ్గుఉత్పత్తి, రవాణా, ఓబీ వెలికితీతలో గత ఏడాది కంటే అధికవృద్ధిని నమోదుచేసి సింగరేణి సంస్థ ప్రగతిపథంలో పయనిస్తున్నది. ఈ మేరకు సింగరేణి సంస్థ సోమవారం ఓ ప్రకటన విడుదలచేసింది. జూన్ 30తో ముగిసిన తొలి త్రైమాసికంలో 170.82 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిచేసి.. గత ఏడాది సాధించిన 145.65 లక్షల టన్నుల కంటే 17.3 శాతం అధికవృద్ధి నమోదుచేసింది. 1057.98 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని వెలికితీసి గతఏడాది వెలికితీసిన 989.47 లక్షల క్యూబిక్ మీటర్ల కంటే ఏడుశాతం అధికవృద్ధిని కనబర్చింది. ఈ ఏడాది జూన్‌లో 57.13 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది. గత ఏడాది జూన్ నెలలో 49.63 లక్షల టన్నులు ఉత్పత్తి చేయగా.. ప్రస్తుతం 15.1 శాతం వృద్ధిని సాధించింది. జూన్‌లో 55.19 లక్షల టన్నుల బొగ్గు రవాణా ఉత్పత్తి చేసి.. గత ఏడాది జూన్‌లో రవాణా చేసిన 52.72 లక్షల టన్నుల బొగ్గు రవాణాపై 4.7 శాతం వృద్ధి నమోదు చేసింది. ఓబీ వెలికితీతలో జూన్‌లో 352.78 లక్షల క్యూబిక్ మీటర్లు తొలిగించిన కంపెనీ గతఏడాది జూన్‌లో తొలిగించిన 277.14 లక్షల క్యూబిక్ మీటర్లపై 27.3 శాతం వృద్ధిని కనబర్చింది.

**94.81 స్టేషన్ పీఎల్‌ఎఫ్ సాధించిన థర్మల్ విద్యుత్ కేంద్రం**

మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద గల సింగరేణి థర్మల్ విద్యుత్‌కేంద్రం జూన్‌లో రెండు యూనిట్లు కలిపి 819.15 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిచేసి 94.81 స్టేషన్ ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ సాధించింది. 2019– 20 ఆర్థిక సంవత్సరం జూన్30తో ముగిసిన మొదటి త్రై మాసికంలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని రెండు యూనిట్ల ద్వారా 2,437.38 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉ త్పత్తిచేసి 2,2999.58 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను రాష్ట్ర అవసరాల కోసం గ్రిడ్‌కు సరఫరా చేసింది. థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రారంభమైననాటి నుంచి ఇప్పటివరకు 24,960.49 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిచేసి దానిలో 23,460.75 మిలియన్ యూనిట్లను రాష్ట్ర అవసరాలకోసం గ్రిడ్‌కు సరఫరా చేసింది.

### ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి చేయండి: సీఎండీ శ్రీధర్



వానకాలంలో వచ్చే అవాంతరాలను ప్రణాళికాబద్ధంగా అధిగమిస్తూ 2019–20 ఆర్థిక సంవత్సరానికై నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి కృషిచేయాలని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ సిబ్బందికి సూచించారు. పీఎల్‌ఎఫ్‌తో విద్యుత్‌ఉత్పాదనను కొనసాగించాలని థర్మల్ విద్యుత్ కేంద్రం అధికారులను, ఉద్యోగులను కోరారు.

# ఘనంగా జీఎస్టీ రెండో వార్షికోత్సవం

**ఖైరతాబాద్:** హైదరాబాద్ సెంట్రల్ జీఎస్టీ జోన్ రెండో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ సెంటర్‌లో సోమవారం జరిగిన ఈ వేడుకలను ముఖ్యఅతిథిగా హాజరైన సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ చలమేశ్వర్, జీఎస్టీ ప్రిన్సిపల్ కమిషనర్ మండలిక శ్రీనివాస్ ప్రారంభించారు. జస్టిస్ చలమేశ్వర్ మాట్లాడుతూ.. ఆర్థికాభివృద్ధిలో జీఎస్టీ ప్రముఖపాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ 2018–19 సంవత్సరంలో హైదరాబాద్ జోన్ పరిధిలో సాధించిన విజయాలను వివరించారు. బకాయిల వసూళ్లలో హైదరాబాద్ జోన్ దేశంలోనే మొదటిస్థానంలో ఉన్నదన్నారు. రాష్ట్రంలో మొత్తం నాలుగులక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉన్నారని.. రాష్ట్ర జీఎస్టీలో టర్నోవర్‌ను ఎనలైజ్‌చేయడం ద్వారా మంచి రెవెన్యూ సాధించామన్నారు.





ఖైరతాబాద్‌లో నిర్వహించిన జీఎస్టీ వార్షికోత్సవంలో పాల్గొన్న సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చలమేశ్వర్, జీఎస్టీ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తదితరులు

జీఎస్టీ రాకముందున్న బకాయిల్లో రూ.175 కోట్లు రికవరీ చేశామన్నారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ డాటా ఎనలైజేషన్ ద్వారా తమకు పన్ను చెల్లింపుదారుల వివరాలను అందజేయగా, రూ.571 కోట్లు ప్రభుత్వానికి చెల్లించేలా చేశామన్నారు. పన్ను ఎగవేతదారులపై 250 పైగా కేసులు నమోదుచేసి.. రూ.292 కోట్లు రికవరీ చేశామన్నారు. నకిలీ ఇన్వాయిస్ సృష్టించిన 36 మందిపై కేసులు నమోదుచేసి, 15 మందిని అరెస్టు చేశామని.. ఇప్పటివరకు రూ.34 కోట్లు రికవరీ చేశామని చెప్పారు. రాష్ట్రంలో 35 జీఎస్టీ కేంద్రాలు ఉన్నాయని, 18005995399 టోల్‌ఫ్రీ నంబరుకు అనేకమంది ఫోన్ చేసి అనుమానాలను నివృత్తి చేసుకుంటున్నారన్నారు. హైదరాబాద్ జోన్‌లో ఇప్పటివరకు రూ.1,764 కోట్ల రిఫండ్ చేశామన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ ప్రిన్సిపల్ కమిషనర్ (ఆడిట్) పురుషోత్తం, రంగారెడ్డి, సికింద్రాబాద్ కమిషనర్లు ఏఆర్‌ఎస్ కుమార్, ఎంఆర్ ఆర్‌రెడ్డి, కేసీ జానీ పాల్గొన్నారు.

### ప్రజావేదికను హెరిటేజ్
## డబ్బులతో కట్టారా?

- ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్న

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజావేదిక అనే రేకుల షెడ్డును హెరిటేజ్ కంపెనీ డబ్బుతో ఏమైనా కట్టారా? అని టీడీపీ ఎమ్మెల్సీ నారా లోకేశ్‌ను వైఎస్సార్సీపీ పార్లమెంటరీ పక్షనేత విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. 'అక్రమంగా నిర్మించిన ప్రజావేదిక కూల్చేయడంపై మీరు, మీ ముఠా సభ్యులు తెగ ఆవేశపడుతున్నారు. రూ.50 లక్షల విలువచేయని తాత్కాలిక నిర్మాణానికి రూ.9 కోట్లు దోచుకుతిన్నది బయటపడిందనా.. ఈ ఏడుపులు..? కిరాయి మనుషులతో పరామర్శలు ఏందయ్యా?' అని సోమవారం ట్విట్టర్‌లో ఎద్దేవాచేశారు. 'ఎవరు సలహా ఇచ్చారో కాని తనను ఓదార్చేందుకు రోజుకు 300 మందిని రప్పించుకుంటున్నారు చంద్రబాబు. వచ్చిన వాళ్లు బాగా నటిస్తున్నారు. దేశంలోనే సంపన్నుడైన రాజకీయ నేతను, ఇల్లు లేకపోతే మా ఇంటికొచ్చి ఉండండయ్యా అనడం డ్రామా కాకపోతే మరేమిటి?' అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాజకీయ నేతలు గెలిచినా, ఓడినా ప్రజల మధ్య ఉండాలనుకొంటారని, కానీ చంద్రబాబు మాత్రం కాలు బయటపెట్టడానికి జంకుతున్నారని విజయసాయిరెడ్డి ఎద్దేవా చేశారు. ప్రజలిచ్చిన షాక్ నుంచి తేరుకోలేదో.. లేక వాళ్ల మీద అలిగారో.. లేకుంటే లింగమనేని ఎస్టేట్ ఉంటుందో పోతుందో అన్న టెన్షన్ బాబుకు మొదలైందోనని వ్యాఖ్యానించారు.

### నిబంధనల ప్రకారమే
## చంద్రబాబుకు భద్రత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీ మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబుకు నిబంధనల ప్రకారం ఎంత భద్రత ఉండాలో అంత ఉన్నదని ఆ రాష్ట్ర డీజీపీ గౌతం సవాంగ్ స్పష్టంచేశారు. వైఎస్సార్సీపీ, టీడీపీ నేతల వ్యక్తిగత వివాదాలకు కొందరు రాజకీయ ముద్ర వేస్తున్నారని సోమవారం గౌతం సవాంగ్ అమరావతిలో మీడియాతో అన్నారు. పోలీసులకు సీఎం జగన్మోహన్ రెడ్డి స్వేచ్ఛ ఇస్తున్నారని పేర్కొన్నారు.






మన తెలుగింట.. పచ్చళ్లు లేనిదే ముద్ద దిగదు. అందుకే పండుగలు, పబ్బాలకు ఎప్పుడు ఇండ్లకు పోయినా.. వెంట పచ్చళ్లు తెచ్చుకుంటాం. ఆ రోజుల్లో మన పెద్దవాళ్లు పదుల సంఖ్యల్లో పచ్చళ్లు పెట్టేవారు. కారప్పొడులు దంచి దాచేవారు. వాటిల్లో కొద్దిగా నెయ్యిచుక్క వేసుకొని తింటే.. తృప్తిగా ఉండేది. మిక్సీలు, గ్రైండర్ల కాలంలో పచ్చళ్ల జోలికి ఎవరూ వెళ్లడం లేదు. కానీ ఈవిడ మాత్రం పచ్చళ్లంటే ప్రాణమిస్తుంది. సేంద్రియంగా పండిన పండ్లతో.. సంప్రదాయ పద్ధతిలో పచ్చళ్లు పెడుతూ ఆ కాలం నాటి రుచిని ఆన్‌లైన్ ద్వారా ఈ తరానికి పరిచయం చేస్తున్నది.

# ప్రసన్నలక్ష్మి పచ్చళ్ల కథ

పూర్వ కాలంలో మన పెద్ద వాళ్లు సంప్రదాయ పద్ధతిలో ఊరగాయలు పెట్టే వాళ్లు. అటువంటి ఊరగాయలు ఇప్పుడు మార్కెట్‌లో దొరకాలంటే చాలా కష్టంగా మారింది. దొరికినా ఎక్కువ కాలం నిల్వ ఉండకపోగా ఏ కాయది ఏ రుచో తెలియనంతగా నాణ్యత లోపిస్తున్నది. అయితే సేంద్రియ పద్ధతుల్లో పండించి ఉత్పత్తులతో సంప్రదాయ పచ్చళ్లను నేటి తరానికి అందించే ప్రయత్నం చేస్తున్నది ప్రసన్న లక్ష్మి. పలురకాల ఊరగాయలు, పొడులను ఆన్‌లైన్ ద్వారా అమ్ముతూ.. అమ్మచేతి కమ్మనైన పచ్చళ్లను పరిచయం చేస్తున్నది. రసాయనాలు, పురుగు మందులు, ఎరువులు వాడకుండా పండించిన కాయలు సేకరించి, వాటితో తానే స్వయంగా ఊరగాయ పచ్చళ్లను తయారు చేస్తున్నది. నాణ్యమైన పచ్చళ్లను అందించి అందరికీ ఆరోగ్యాన్ని పంచుతున్నది. ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌లోనూ పచ్చళ్లు విక్రయిస్తూ.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నది ప్రసన్న లక్ష్మి.

## అన్నీ సహజ సిద్ధంగానే!

పట్టణ జీవనశైలిలో సమయం తక్కువ. ఆ పూటకు కావాల్సింది ఉంటే చాలు. దీన్ని క్యాష్ చేసుకునేందుకు నకిలీ వ్యాపారులు ప్రతి పదార్థాన్ని కల్తీ చేస్తున్నారు. పచ్చళ్లు నిల్వ ఉంచడానికి పలురకాల రసాయనాలు ఉపయోగిస్తున్నారు. అవి తిని అల్సర్లతో బాధపడుతున్నారు ఆహార ప్రియులు. అందుకే రుచితోపాటు ఆరోగ్యాన్ని కూడా అందించేందుకు ప్రసన్నలక్ష్మి శ్రీకారం చుట్టింది. రైతులు సేంద్రియ పద్ధతిలో పండించిన ఉసిరి, మామిడి, టమోట వంటి కాయలు.. కారం, పసుపు, వేరుశనగ, పప్పు దినుసులు, మసాల దినుసులు, సముద్రంలో లభించే స్వచ్ఛమైన ఉప్పుతో పచ్చళ్లు, కారం పొడులు పెడుతున్నది. కారం, పసుపు దినుసులు మిషన్ల ద్వారా కాకుండా.. రోటిలో వేసి దంచి పొడి చేస్తారు. ఇందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకున్నది ప్రసన్న లక్ష్మి. పచ్చళ్లు, కారప్పొడులలో నాణ్యత కోసం నువ్వుల నూనె వాడుతున్నది. దానివల్ల ఊరగాయ తొందరగా చెడిపోదు. పచ్చడి రుచిగా ఉంటుంది. ఈ నూనె ఆరోగ్యానికి చాలా మంచిది. పచ్చళ్లు బాగా కనబడేందుకు ఎటువంటి రంగులు వాడరు. ఊరగాయ తాజాదనం పోకుండా ఉండేందుకు జాడీలు, టప్పర్‌వేర్‌లో నిల్వ ఉంచడంతో అవి సంవత్సరం పాటు తాజాగానే ఉంటాయి.

## దేశ, విదేశాల్లోనూ గిరాకీ

ప్రసన్న లక్ష్మి తయారు చేసే పచ్చళ్లు, కారప్పొడులకు దేశ, విదేశాల్లో అభిమానులున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా వంటి పలు దేశాల నుంచి పచ్చళ్లు, పొడుల ఆర్డర్లు వస్తుంటాయి. 'పికిల్ స్టోరీ' అనే వెబ్‌సైట్ నుంచి పచ్చళ్లను ఎగుమతి చేస్తుంది. ఇక ఢిల్లీ, మహారాష్ట్ర, బెంగళూరు, జలంధర్‌లో ప్రసన్న లక్ష్మీ పచ్చళ్లకు గిరాకీ ఉంది. ఫేస్‌బుక్, వాట్సప్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా 'పికిల్ స్టోరీ' ఉత్పత్తులకు బాగా ప్రచారం లభిస్తున్నది. వివిధ ఎగ్జిబిషన్లలో కూడా స్టాల్స్ పెడుతుంటారు. ప్రసన్న తయారుచేసే పొడులు, పచ్చళ్లల్లో 75 శాతం ఆమెనే స్వయంగా తయారు చేస్తుంటుంది. మిగతా 25 శాతం ఆ పదార్థాల తయారీలో నిపుణులైన వారితో చేయిస్తుంటుంది. ఏడాది పొడుగునా వాడే మామిడికాయలాంటి నిలువ పచ్చళ్లతో పాటు సీజనల్ కాయలతో కూడా రకరకాల ఊరగాయలు పెడుతుంటుంది. నిమ్మకాయ, చింతకాయ, రేగుపళ్లు, మునక్కాయ, టమాటా వంటి రకరకాల ఊరగాయలను కస్టమర్ల ఆర్డర్లను బట్టి తయారుచేస్తుంది ప్రసన్న.

### కునాల్ కపూర్ మెచ్చుకున్నారు

ఊరగాయ మాట వింటే చాలు నోరూరుతుంటుంది. ఎన్ని రకాల సరికొత్త రుచులు అందుబాటులోకి వచ్చినా వాటికి ఉండే ఆదరణ మాత్రం తగ్గదు. పచ్చళ్ల వ్యాపారం చేయమని మా బంధువులు, స్నేహితులే ప్రోత్సహించారు. ప్రముఖ మాస్టర్ చెఫ్ కునాల్ కపూర్.. నేను తయారు చేసే పచ్చళ్లు, పొడుల గురించి తెలుసుకోవడానికి మా ఇంటికి వచ్చారు. ఆయనకు సర్వపిండి చేయడం నేర్పించా. నా పొడులు, పచ్చళ్లను రుచి చూసి ఎంతో మెచ్చుకున్నారు. ఆ ప్రశంసలు నాకు మరింత ప్రోత్సాహాన్నిచ్చాయి. ఎవరైనా పచ్చళ్లు కావాల్సిన వారు 98493 11211 నంబర్‌ను సంప్రదించొచ్చు.

**- ప్రసన్నలక్ష్మి**, పికిల్ స్టోరీ వ్యవస్థాపకురాలు

## అత్తగారే పచ్చళ్ల గురువు

అనంతపురంలోని తాడిపత్రిలో పుట్టిన ప్రసన్న లక్ష్మి బీకామ్ వరకూ చెన్నైలో చదివింది. ఆమె తండ్రి వ్యాపారం నిమిత్తం ఎక్కువ కాలం చెన్నైలోనే ఉండాల్సి వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులంతా ఎక్కువ రోజులు చెన్నైలోనే ఉన్నారు. ప్రసన్న లక్ష్మికి డిగ్రీ పూర్తయిన తర్వాత పెండ్లి చేశారు. ఆమె అత్తగారిది తెలంగాణలోని అంబాజీపేట. వారిది ఉమ్మడి కుటుంబం. పెండ్లికి ముందు ప్రసన్న లక్ష్మికి వంటా వార్పు పెద్దగా వచ్చేవి కావు. తర్వాత అత్తగారి వద్ద అన్ని రకాల వంటకాలు నేర్చుకున్నది. ఇంట్లో ఎక్కువ మంది ఉండడంతో అందిరికీ సరిపడేలా పెద్ద మొత్తంలో ఊరగాయలు, పలురకాల పొడులు తయారు చేసేవారు. అత్తగారితో పాటు ఇంట్లో ఆడవాళ్లంతా ఈ పనిలో పాలుపంచుకునేవాళ్లు. ప్రసన్న వాళ్ల అత్తగారు వాళ్ల అత్తగారి నుంచి నేర్చుకున్న పచ్చళ్లను కోడళ్లందరికీ నేర్పించేది. వేసవి కాలం వచ్చిందంటే చాలు వాళ్లత్త గారింట్లో పచ్చళ్ల తయారీ ఓ మహోత్సవంలా జరిగేదట. తాను తయారు చేసిన పచ్చళ్లు, పొడులను బంధువులు, స్నేహితులకు పంపుతుండేది. అవి రుచిగా, నాణ్యతతో ఉండడంతో వారే కొనుగోలు చేసేవారు. అలా 2018లో పచ్చళ్ల వ్యాపారం ప్రారంభించింది. భర్త జైవీర్‌కు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మంచి పట్టు ఉండడంతో ఏకంగా (thepick lestory.com) వెబ్‌సైట్ ద్వారా అమ్మకాలు ప్రారంభించారు.



## పెట్టింది పేరు

తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్రా ప్రాంతాల్లో ప్రసిద్ధిగాంచిన పచ్చళ్లను తయారు చేసి వినియోగదారులకు అందిస్తున్నది ప్రసన్న లక్ష్మి. తెలంగాణలో ఫేమస్ సర్వపిండి తయారీలో ప్రసన్న లక్ష్మీది అందవేసిన చేయి. వీటితో పాటు చింతాకు, ఉలవల పొడిని కూడా తయారు చేస్తుంది. ఇక కొత్త కొత్త పచ్చళ్ల ప్రయోగాలు ఎప్పుడూ కొనసాగుతూనే ఉంటాయి. మిక్స్‌డ్ విజిటబుల్ పికిల్‌ను చాలామంది కోరుకుంటూ ఉంటారు. మూడు ప్రాంతాలకు చెందిన పచ్చళ్లు, కారప్పొడులు తయారు చేస్తుండడంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నది. ప్రస్తుతం 24 రకాల పచ్చళ్లు, 25 రకాలకుపైగా పొడులు చేస్తున్నది.

... పసుపులేటి వెంకటేశ్వరరావు
వీరగోని రజనీకాంత్

# అవాంఛిత రోమాలు తొలగించండిలా!

**కొందరు ఆడవారికి మగవారిలా మీసాలుంటాయి. వీటినే అవాంఛిత రోమాలు అంటుంటారు. జన్యుపరమైన లోపాల కారణంగా ఇవి పెరుగుతాయి. ఏదేమైనప్పటికీ అవాంఛిత రోమాలు ముఖాన్ని అందవిహీనంగా కనిపించేలా చేస్తాయి. ఈ చిన్న చిట్కాలు పాటిస్తే వాటిని సులభంగా తొలగించుకోవచ్చు.**



- పాలలో పసుపు వేసి కలిపి ఆ మిశ్రమాన్ని అవాంఛిత రోమాలున్న చోట పట్టించి 20 నిమిషాల తర్వాత వేడి నీటితో కడిగేస్తే రోమాలన్నీ తొలగిపోతాయి. ఇలా క్రమం తప్పకుండా వారం రోజుల పాటు చేస్తే మంచి ఫలితాలు చూడవచ్చు.
- ఓ అరటి పండు గుజ్జు, 2 చెంచాల ఓట్ మీల్ కలిపి ఆ మిశ్రమాన్ని అవాంఛిత రోమాల మీద రాసి 20 నిమిషాలు గుండ్రంగా తిప్పుతూ రుద్ది కడగాలి. ఇలా వారానికి 2 సార్లు చేస్తే అవాంఛిత రోమాల సమస్య తగ్గిపోతుంది.
- నువ్వుల నూనె లేదా వేరుశనగ నూనెను అవాంఛిత రోమాలపై రాసి, మర్దన చేసి మెత్తని శనగపిండిని రాసి బాగా నొక్కి నలుగు పెట్టాలి. వారానికి ఒకటి, రెండుసార్లు ఇలా చేస్తే అవాంఛిత రోమాలు తొలగిపోతాయి.
- శనగపిండి, పసుపును సమపాళ్లలో కలిపి ముఖానికి ఫేషియల్ మాదిరిగా పట్టించి ఆరిన తర్వాత నీటితో కడిగితే రోమాల పెరుగుదలను నియంత్రించవచ్చు. ఇలా క్రమం తప్పకుండా వారం రోజుల పాటు ప్రయత్నిస్తే మంచి ఫలితాలను పొందవచ్చు.
- ఆహారంలో సైటో ఈస్ట్రోజన్స్ ఉండేలా చూసుకుంటే హార్మోన్ల సమస్య తొలగి అవాంఛిత రోమాల సమస్యే రాదు. అందుకే తరచూ ఆహారంలో అవిశ గింజలు, సోయా, నువ్వులు, పొద్దు తిరుగుడు గింజలు, వెల్లుల్లి, ఎండు ఖర్జూరం వంటివి ఉండేలా చూసుకోవాలి.

# పిల్లల ఆరోగ్యం కోసం చెత్త నిర్మూలన



**ఆరోగ్యం బాగుండాలంటే మన పరిసరాలు బాగుండాలి. వాటిని బాగు చేయాల్సిన బాధ్యత మన మీదనే ఉన్నది. ఇలాంటి ఉద్దేశంతోనే ఆరుషి అనే ఉపాధ్యాయురాలు పర్యావరణ సంరక్షకురాలిగా మారింది. చెత్తను రీసైక్లింగ్ చేస్తూ, పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుతున్నది.**

చెత్తను రీసైక్లింగ్ చేయడం, పిల్లల ఆరోగ్యంతో, ఆరుషికి ఏంటి సంబంధం అనుకుంటున్నారా? ఉంది.. 2013లో ముంబైలోని దారావీ ప్రాంతంలో ఆరుషి ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నది. రోజూ పిల్లలకు పాఠాలు చెబుతున్నది. పాఠశాలకు ఎంతోమంది హాజరయ్యేవారు. కానీ, రోజులు గడిచే కొద్ది పిల్లలు తగ్గిపోతున్నారు. కారణం ఏంటని ఆరుషి ఆరా తీసింది. దీనికి కారణం పిల్లలు అనారోగ్యంపాలవుతున్నారని తెలుసుకున్నది. ఈ అనారోగ్యానికి గల కారణం ఏంటనీ తెలుసుకున్నది. ముంబైలోని అతి కాలుష్యం, దారావీ లోతట్టు ప్రాంతాన్ని కప్పేసే చెత్తా చెదారం అని తెలిసింది. ఇక్కడి ప్రజలు చెత్త ఏరడం, పిల్లల్ని చెత్తపనికి తీసుకెళ్లడం అంతా గమనించింది. దీన్ని ఎలా అయినా మార్చాలనుకున్నది. అందుకే మొదట చెత్త ఎందుకు ఉత్పత్తి అవుతుంది, అలా వచ్చిన దాన్ని ఎలా సేకరించాలనే అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లింది. తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి చెత్తబుట్టలో వేయడం. అక్కడ ప్రజలతో రీసైక్లింగ్‌కు పనికొచ్చే చెత్త కార్డ్‌బోర్డులతో బెంచీలు, కుర్చీలు తయారు చేసి పార్కులకు అందించింది. తడి చెత్తను కంపోస్ట్‌గా మార్చి రైతులకు పంపించింది. ఇలా చెత్తను ఎలా ఉపయోగించుకోవాలో అక్కడి ప్రజల్లో అవగాహన కల్పించింది. దీంతోపాటు దారావి పిల్లల అభివృద్ధి కోసం, వారి చదువు కోసం కృషి చేస్తున్నది. విరాళాలు సేకరించి వారిని చదివిస్తున్నది.

# రక్త హీనతకు విరుగుడుగా బెల్లం



**చాలా మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతూ ఉంటారు. ఇందుకోసం వైద్యులను సంప్రదించి ట్యాబ్లెట్లు, టానిక్‌లు వాడుతుంటారు. అయినప్పటికీ ఫలితం పొందక అనారోగ్యానికి గురవుతూనే ఉంటారు. వంటింట్లో అందుబాటులో ఉండే పదార్థాలతో రక్తహీనత సమస్యను జయించవచ్చు అదెలాగంటే..**

- బెల్లంలోని పొటాషియం రక్తపోటు నివారణ, నియంత్రణకు దోహదం చేస్తుంది. తరచూ బెల్లాన్ని తినడం వల్ల మహిళల్లో రక్తం శాతం పెరుగుతుంది. పండుగల వేళ చేసే నైవేద్యాలు, తరచూ ఇంట్లో చేసుకునే పిండివంటల్లో ఎక్కువగా బెల్లాన్ని వాడితే మంచిది.
- బెల్లం పోషకాల గని. వర్షాకాలంలో సాయంత్రం పూట స్నాక్స్ తయారీలో కూడా బెల్లాన్ని ఉపయోగించవచ్చు. వేయించిన వేరు శనగ పప్పు, బెల్లం కలిపి తింటే రోగ నిరోధక శక్తి పెరగడమే కాకుండా రక్తపోటు సమస్య నుంచి కూడా బయటపడవచ్చు.
- రోజూ ఆహారంలో 50 గ్రాముల బెల్లం తీసుకుంటే మూత్రపిండాల్లో రాళ్ల సమస్య తగ్గిపోతుంది. పిల్లల ఎదుగుదలకు, ఎముకలు బలంగా ఉండడానికి బెల్లంలోని కాల్షియం పనికొస్తుంది. మహిళలకు ఐరన్ అంది రక్తహీనత సమస్య దూరమవుతుంది.
- బెల్లం సహజసిద్ధమైన క్లీన్సింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. శ్వాసకోశ గ్రంథులు, ఊపిరితిత్తులూ, పొట్ట వంటి వాటిని శుభ్రపరుస్తుంది. శరీరంలోని వివిధ రకాల ఎంజైమ్‌లను ఎసిటిక్ యాసిడ్‌గా మార్చి, జీర్ణ వ్యవస్థ పనితీరుని మెరుగు పరుస్తుంది.
- ఆయుర్వేదంలో పొడిదగ్గు, జలుబు, అస్తమా వంటి సమస్యలకు వాడే మందుల్లో బెల్లం ఓ పదార్థంగా ఉంటుంది. దీన్ని తీసుకోవడం వల్ల కండరాలకు శక్తి అందుతుంది. బెల్లంలో అధిక మోతాదులో ఉండే మెగ్నీషియం రక్తనాళాలు, నరాల పనితీరుకు బాగా పనిచేస్తాయి.

# ఆటలరాణి.. రిచాగౌర్






**ఆమెను బాల్యంలో అందరూ అబ్బాయి అని హేళన చేశారు. అయినా ఆ అవమానాలను విజయానికి సోపానాలనుకొని ప్రయాణం మొదలుపెట్టింది. 25 యేండ్లకే ఏడుసార్లు అంతర్జాతీయ గోల్డ్ మెడల్స్, ఆసియా ఒలిపింక్ క్వాలిఫైయర్, మార్షల్ ఆర్ట్స్ మ్యే థాయ్ క్రీడల్లో రాణిగా నిలిచింది రిచా గౌర్.**

మ్యేథాయ్ అనేది థాయ్‌లాండ్‌లో సాంప్రదాయ యుద్ధ క్రీడ. అలాంటి క్రీడకు 'మ్యేథాయ్ ఆఫ్ క్వీన్ ఇండియా'గా రిచా గౌర్ నిలిచింది. ఈ స్థాయికి రావడానికి ఆమె ఎదుర్కొన్న కష్టాలు చాలామందికి తెలియదు. రిచా పుట్టినప్పుడు చాలా బలహీనంగా ఉన్నది. ఆమెను చాలా జాగ్రత్తగా పెంచారు. కొన్ని రోజులకు ఆరోగ్యంగా ఉందని డాక్టర్ చెప్పేసరికి ఆమె తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. రిచా చిన్నప్పటి నుంచి టామ్‌బాయ్‌లా పెరిగింది. స్కూల్‌లో అందరూ అబ్బాయి అని ఏడిపించేవారు. వారిని ఏ మాత్రం లెక్కచేయకుండా తనపని చేసుకుంటూ వెళ్లేది. రిచా ఆరో తరగతి నుంచే అన్ని ఆటలూ ఆడసాగింది. తర్వాతి ఏడాదికే క్రీడల్లో గోల్డ్‌మెడల్ సాధించింది. రాష్ట్రం తరుపున ఢిల్లీలో ఆడే అవకాశం రిచాకు దక్కింది. అంతదూరం రిచాను ఒంటరిగా తల్లిదండ్రులు పంపలేదు. ఆమెకు చదువు కంటే ఆటలంటేనే ఇష్టం. ఫ్రెండ్స్ చేసే కామెంట్స్ పట్టించుకోకుండా క్రీడల మీద ఇష్టంతో జుట్టు కత్తిరించుకొని, ప్యాంటు, చొక్కా వేసుకొని అచ్చు అబ్బాయిలా మారింది.. అవును నేను టామ్‌బాయ్‌ని అంటూ అందరి నోర్లు మూతబడేలా చేసింది. స్పోర్ట్స్ కోసం దేన్నైనా వదులుకోవడానికి సిద్ధపడింది. బేసిక్స్ నుంచి మొదలు పెట్టి జూడో, కరాటె, కిక్‌బాక్సింగ్, మ్యే థాయ్‌లాంటి వాటి మీద పట్టు సారించింది. మ్యే థాయ్‌కు ఎంపిక కాక ముందు చాలా మెడల్స్ సాధించింది. పురుషులు, మహిళల రెండు విభాగాలలో రాజస్థాన్ నుంచి మొదటి జాతీయ బంగారు పతక విజేతగా రికార్డు సృష్టించింది. సెకండ్ ఇయర్‌లో నేషనల్ చాంపియన్‌గా ఉన్న ఆమెకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. థాయ్‌లాండ్‌లో టోర్నమెంట్ మొదలైంది. రిచా తండ్రి పీఎఫ్ డబ్బుతో వెళ్లిన ఆమె బ్రోంజె మెడల్‌తో ప్రపంచ చాంపియన్‌గా తిరిగి వచ్చింది. కొన్నిరోజులకి రిచా సొంతంగా అకాడమీ స్థాపించింది. దీంతో ప్రజలకు మార్షల్ ఆర్ట్స్, గ్లోబల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెల్ఫ్ డిఫెన్స్ నేర్పిస్తున్నది. స్టూడెంట్స్, సంస్థలకు, పోలీస్, ఎన్‌సిసి క్యాడెట్లకు మాత్రమే కాకుండా దేశంలోని అన్ని గ్రామాలకు ప్రవేశం ఉంటుంది. క్రీడలకు సంబంధించి శిక్షణ కూడా అకాడమీ అందిస్తున్నది. 2016లో అప్పటి భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి అవార్డు అందుకొని మ్యే థాయ్ రాణిగా నిలిచింది.

II.

నమస్తే తెలంగాణ

# జీవనరేఖ

[ కరీంనగర్ ]

మంగళవారం 2 జూలై 2019

## ■ నెలలు నిండకుండా పుడితే?



**కొంతమంది పిల్లలు తొమ్మిది నెలలు నిండకుండానే పుడతారు. చూడటానికి వారు ఆరోగ్యంగానే, యాక్టివ్‌గానే కనిపిస్తుంటారు. అయితే తొమ్మిది నెలలు నిండిన తర్వాత పుట్టిన పిల్లలకు, వీరికి మానసిక వ్యత్యాసాలు ఉంటాయని చెప్తున్నారు నిపుణులు.**

తొమ్మిది నెలలు నిండకుండా పుట్టే పిల్లల్లో నిద్రా పరమైన, ఆలోచనా పరమైన భేదాలు స్పష్టంగా కనిపిస్తాయని అంటున్నారు ఆస్ట్రేలియా పరిశోధకులు. 'నెలలు నిండని పిల్లలు- ఆరోగ్య పరిస్థితి' అంశంపై తాజాగా వారు అధ్యయనం చేశారు QIMR బెర్గోఫర్ మెడికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నిపుణులు. అధిక సాంద్రత కలిగిన ఎలక్ట్రో ఎన్‌సెఫాలోగ్రఫీ ద్వారా పరిశీలనలు చేశారు. దాదాపు 27 వారాల పాటు 94 మంది నవజాత శిశువులపై అధ్యయనం జరిపారు. వారిలో 42 మంది నెలలు నిండని పిల్లలు ఉండగా, 52 మంది తొమ్మిది నెలలు నిండిన పిల్లలు ఉన్నారు. తొమ్మిది నెలలకు ముందే పుట్టిన 42 మంది పిల్లల్లో నిద్రాపరమైన వ్యత్యాసాలు చాలా ఉన్నట్లు వారు గుర్తించారు. వీరిలో చాలామంది గాఢ నిద్ర పోతారట. సాధారణ పిల్లలతో పోలిస్తే వీరి ఆలోచనా విధానాలలో కూడా తేడాలు ఉంటాయట.

## ■ థర్డ్ హ్యాండ్ పొగ ప్రమాదం



**'పొగతాగడం ఆరోగ్యానికి హానికరం' అంటుంటారు. కానీ పొగతాగడం కన్నా దానిని పీలిస్తేనే ప్రమాదం అనేది తెలుసుకదా? దానిని సెకండ్‌హ్యాండ్ స్మోకింగ్ అంటారు. ఐతే దానికన్నా థర్డ్ హ్యాండ్ స్మోకింగ్ ఇంకా ప్రమాదం అంటున్నారు నిపుణులు.**

ఆరుబయట పొగ తాగడం వల్ల పక్కవారికే ఎక్కువ ప్రమాదం అనేది ఇప్పటివరకు తెలుసు. కానీ ఆరు బయట కన్నా ఇంట్లోగానీ, కార్యాలయాల్లోగానీ పొగతాగడం హానికరం అని చెప్తున్నారు అమెరికన్ శాస్త్రవేత్తలు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన పరిశోధకులు థర్డ్‌హ్యాండ్ స్మోకింగ్ అంశంపై అధ్యయనం చేశారు. దీంట్లో భాగంగా పొగతాగని ఆరోగ్యవంతులైన 27-49 సంవత్సరాల మహిళల్ని పరిశీలించారు. థర్డ్‌హ్యాండ్ స్మోకింగ్ వల్ల క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల బారినపడుతారట. నేరుగా పొగతాగితే కూడా సోకని శ్వాసకోశ వ్యాధులు థర్డ్‌పార్టీ స్మోకింగ్ వల్ల సోకుతాయి. లోపలి ప్రదేశాల్లోనే తాగుతున్నాం కదా? దీనివల్ల ఎవరికి ప్రమాదం అనుకునేవాళ్లు ఒక్కసారి ఆలోచించాలి. ఇంట్లో ఆరోగ్యంగా ఉండేవాళ్ల పరిస్థితి ఎంత ప్రమాదానికి గురవుతుందో తెలుస్తుందని హెచ్చరించారు.

## ■ సంతానం ఇలా సాఫల్యం

**ఆధునిక జీవనశైలి వల్ల సంతాన సమస్యలు ఎక్కువవుతున్నాయి. పిల్లలు కలుగలేదనే బెంగ కొందరిని వేధిస్తున్నది. నిపుణుల సమక్షంలో చికిత్స చేయించుకున్నా ఫలితాలు ఉండటం లేదు. ఇలాంటి వారికి ఐవీఎఫ్ ఉపయోగపడుతుందని అంటున్నారు నిపుణులు.**



ఐవీఎఫ్ ద్వారా పిల్లలు పుట్టే సక్సెస్ రేటులో వృద్ధి కనిపిస్తుందని పరిశోధకులు చెప్తున్నారు. యురోపియన్ సొసైటీ ఆఫ్ హ్యూమన్ రీప్రొడక్షన్ అండ్ ఎంబ్రియోలజీ నివేదిక ప్రకారం ఐవీఎఫ్ ద్వారా సంతాన సాఫల్యం 24.3% సాధ్యమవుతుందని వారు చెప్పారు. 80,00,000 ఐవీఎఫ్, ఐసీఎస్ఐ చికిత్స చక్రాలను అంచనా వేశారు. ఇవి విజయవంతం అయి 1,65,000 మంది పిల్లలు పుట్టారట. ఇవన్నీ జీవనశైలిని మార్చుకునే విధానంపైనే ఆధారపడి ఉంటాయి. కాబట్టి జీవనశైలిని మార్చుకోవాలని సూచిస్తున్నారు. పిల్లలు కలుగలేదని ఆందోళన చెందేవాళ్లు ఐవీఎఫ్ సక్సెస్ రేట్‌ను గమనించి దానిని ఆశ్రయించడం ఉత్తమమని అంటున్నారు.



వాతావరణం తడిగా మారిపోయింది.

చిటపట చినుకులు పడుతున్నాయి.

తుంపరల పలకరింపులు ఎంతో హాయినిస్తున్నాయి కదా?

ఆ చినుకుల మాటున చింత కూడా దాగి ఉందని తెలుసుకుంటే మంచిది.

చల్లని వాతావరణానికి వైరస్ విజృంభించి వ్యాధులను వ్యాపింపచేస్తుంది.

మాన్‌సూన్‌తో పాటు వచ్చి మనల్ని అసౌకర్యానికి గురిచేసే ఆ వైరల్ ఫీవర్ ఏంటి? వాటి నుంచి ఎలా కాపాడుకోవచ్చు? తెలుసుకుందాం.

# వైరల్ కాలం వచ్చింది!

ఒక వారం రోజుల నుంచీ వాతావరణ పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఇలా ఒక సీజన్ నుంచి మరో సీజన్‌లోకి ప్రవేశించే ముందు రకరకాల ఇన్‌ఫెక్షన్లు దాడిచేస్తాయి. చల్లగా ఉన్న వాతావరణం వైరస్‌ల పెరుగుదలకు అనుకూలంగా ఉంటుంది. అందువల్ల ఈ సీజన్‌లో వైరల్ ఇన్‌ఫెక్షన్లు, జ్వరాల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ప్రతి పదిమందిలో ముగ్గురు-నలుగురికి జలుబు, ఇద్దరు-ముగ్గురికి జ్వరంతో కూడిన వైరల్ ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి.

### ఏంటీ వైరల్ ఫీవర్?

వైరల్ జ్వరాలు అకస్మాత్తుగా సోకుతాయి. తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఒక్కోసారి 102 డిగ్రీల జ్వరం ఉంటుంది. జ్వరం 102 డిగ్రీల కంటే ఎక్కువగా ఉండొచ్చు. తీవ్రమైన తలనొప్పి, ఒళ్లు నొప్పుల మధ్య రోగి నిస్సత్తువగా మారిపోతారు. కొందరిలో ఒంటిమీద దద్దుర్లు, వాంతులు, అరుదుగా విరేచనాలూ కనిపిస్తాయి. కొందరిలో జలుబు వంటి లక్షణాలేవీ లేకుండానే జ్వరాలు వేధిస్తుంటాయి. సాధారణంగా వీటిని 'విష జ్వరాలు' అంటారు. వాటంతట అవే తగ్గిపోయే సాధారణ వైరల్ జ్వరాలూ కూడా కొన్ని ఉంటాయి. అలాగే తప్పనిసరిగా చికిత్స తీసుకోవాల్సిన మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటివీ వైరల్ ఫీవర్ కిందికే వస్తాయి.

### ఎలా వస్తుంది?

వైరల్ ఫీవర్ గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. కొన్నిసార్లు శ్వాసనాళాల ద్వారా కూడా వ్యాపిస్తుంది. కలుషిత నీరు, ఆహారం తీసుకున్నప్పుడు కూడా వైరల్ ఫీవర్స్ విజృంభిస్తాయి. చల్లదనం తీవ్రత పెరగడం వల్ల రక్తనాళాలు కుంచించుకుపోతాయి. దీంతో రక్తసరఫరా నెమ్మదిస్తుంది. రక్తంలో ఉండే తెల్లరక్త కణాల సంఖ్య క్రమంగా తగ్గడం వల్ల శరీరంలో వ్యాధినిరోధక శక్తి తగ్గిపోతుంది. ఈ ఇన్‌ఫెక్షన్లు, జ్వరాలు, పిల్లల్లో చాలా త్వరగా వ్యాప్తి చెందుతాయి. జన సముదాయం ఎక్కువగా ఉన్నచోట వైరస్ ఎక్కువగా వ్యాపిస్తుంది. అందుకే జ్వరాలు పిల్లల్లో త్వరగా వ్యాప్తి చెందుతాయి.

### లక్షణాలేంటి?

వైరల్ ఫీవర్ సోకితే ఒళ్లు నొప్పులు, జ్వరం, నీరసం, నిస్సత్తువ, స్కిన్ రాషెస్, వికారం, తలనొప్పి, ఆకలి మందగించడం, గొంతు నొప్పి, ముక్కు కారడం, దగ్గు, గొంతు నొప్పి, ఉదరంలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. లక్షణాల తీవ్రత తగ్గడానికి వ్యాధి నుంచి ఉపశమనం కలగడానికి మాత్రమే మందులు ఉపకరిస్తాయి.



### చిన్నపిల్లల్లో ఎలాంటి సమస్యలు?

సాధారణ జలుబు లక్షణాలూ, ఫ్లూ లక్షణాలూ ఒకేలా ఉంటాయి. ఇది జలుబా? ఫ్లూ జ్వరమా? తేల్చుకోవటం చాలాసార్లు కష్టం. ఈ రెండూ వాటంతటవే తగ్గిపోయేవే అయినా ఫ్లూ సమస్యాత్మకంగా మారొచ్చు. జలుబు ప్రధానంగా వైరస్ కారణంగా వచ్చే సమస్య. దీనికి 'రైనో వైరస్' వర్గానికి చెందిన ఎన్నో రకాల వైరస్‌లు కారణం అవుతాయి. సాధారణ జలుబే అయితే ఇంటివైద్యమేదైనా చేసి తగ్గించే ప్రయత్నం చేయాలి. చీటికిమాటికీ పిల్లలకు మందు గోళీలు ఇవ్వడం అంత మంచిది కాదు. కొందరు పిల్లల్లో ఇది 'రుమాటిక్ ఫీవర్' అనే గుండెను దెబ్బతీసే జ్వరానికీ దారి తీస్తుంటుంది.

### ప్రభావం ?

శరీరంలోని కణాల మీద వైరస్ అటాక్ అవుతుంది. చాలా వరకూ వైరల్ ఫీవర్ వల్ల శరీరం పైభాగం ఎక్కువగా ప్రభావితం అవుతుంది. ముఖ్యంగా శ్వాస వ్యవస్థ మీద ప్రభావం చూపుతుంది. వైరస్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటే నరాల మీద ప్రభావం చూపుతుంది. దాంతో వివిధ రకాలగా ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. పేషెంట్ బలహీనంగా మారిపోతారు. ఆహారం పూర్తిగా తీసుకోలేకపోతారు.

### ప్రథమ చికిత్స ఏంటి?

వైరల్ ఫీవర్‌కు సంబంధించిన లక్షణాల్లో ఏ రెండు మూడు కనిపించినా రోగికి ఎక్కువగా నీళ్లు తాగించాలి. దీంతో శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటుంది. తర్వాత రోగికి తగినంత విశ్రాంతి ఇవ్వాలి. తేలికపాటి ఆహారం ఇవ్వాలి. ముఖ్యంగా ఆందోళనకు గురికాకుండా ఉండేలా రోగిని ప్రోత్సహించాలి. తాజా కొత్తిమీరతో చేసిన టీ, మెంతి వాటర్ తాగించాలి. దీనివల్ల వైరస్ నాశనం అవుతుంది. పెద్దవాళ్లకైతే గంజి తాగించడం మంచి పద్ధతి. ఇది వైరస్‌ను ఎక్కువ కాలం బతకనివ్వదు.

### నిర్ధారణ ఎలా?

జ్వరం విపరీతంగా ఉండి, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే అన్ని రకాల రక్త పరీక్షలూ చేస్తారు. డెంగీ అనుమానం ఉంటే 'ఎన్ఎస్1 యాంటీజెన్' పరీక్ష చేస్తారు. అలాగే విపరీతమైన చలి, జ్వరం ఉంటే మలేరియాగా అనుమానించి 'ర్యాపిడ్ డయాగ్నొస్టిక్ టెస్ట్ పరీక్ష చేస్తారు. వీటిద్వారా వైరల్ ఫీవరా? ఇతర వ్యాధులా తెలుస్తుంది.

### ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

వైరల్ ఫీవర్ ఇన్ఫెక్షన్ చాలా త్వరగా వ్యాప్తి చెందుతుంది. కాబట్టి ఆహారం షేర్ చేసుకోవద్దు. సాధారణ వైరల్ ఫీవర్ తొమ్మిది రోజులు ప్రభావం చూపిస్తుంది. చల్లదనానికి సూక్ష్మక్రిముల బారినుండి కాపాడే శరీరభాగాలు శక్తి హీనంగా మారిపోయి సూక్ష్మక్రిములు సులువుగా శరీరంలోకి ప్రవేశిస్తాయి. కాబట్టి చల్లదనం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షంలో వెళ్తే గొడుగు, రెయిన్ కోట్స్ తప్పనిసరిగా వాడాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి. పిల్లల లంచ్ బాక్స్‌లో పండ్లు ఎక్కువగా పెట్టాలి. నూనె పదార్థాలు తక్కువగా ఇవ్వాలి. వర్షంలో తడిసినప్పుడు జలుబు చేస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. సాధారణంగా ఈ కాలంలో కనిపించే 'గొంతు నొప్పి'కి 90% వైరస్‌లే కారణం. కాబట్టి దానిని తగ్గించేందుకు గోరు వెచ్చటి నీటిలో ఉప్పు వేసుకొని తరుచుగా పుక్కిట పట్టటం, లేదా మార్కెట్లో లభించే యాంటీసెప్టిక్ లోషన్లు నీటిలో వేసుకొని పుక్కిట పట్టటం మంచిది. కొద్దిమందికి స్ట్రెప్టోకాకల్ వంటి బ్యాక్టీరియా వల్ల గొంతునొప్పి రావచ్చు. గొంతు నొప్పి తగ్గకున్నా, తెల్లటి చీము పొక్కుల వంటివి కనబడుతున్నా తప్పనిసరిగా వైద్యులను కలవాలి.



### నిరోధక శక్తిని పెంచుకోవడమెలా?

వ్యాధి నిరోధక శక్తిని మెరుగ్గా ఉంచడంలో మనం తీసుకునే ఆహారం కూడా ఎంతో ఉపయోగపడుతుంది. పిల్లలకు చాయ్, బిస్కెట్, సమోసా వంటివి అలవాటు చేయొద్దు. స్నాక్స్ బదులుగా పండ్లు తినిపిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. నిమ్మ, నారింజ వంటి సిట్రస్ జాతి ఫలాలను ఇవ్వడం వల్ల ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు.

డా. ఎస్. రంజిత్ కుమార్
సీనియర్ జనరల్ ఫిజిషియన్
యశోద హాస్పిటల్స్
మలక్‌పేట్



## కడుపుబ్బా నవ్వండి!



**చిన్నతనంలో ఏ కల్మషం లేకుండా నవ్వినట్టే పెద్దయ్యాక కూడా నవ్వితే ఆరోగ్యంగా ఉంటారని చెప్తున్నారు నిపుణులు. ఉద్యోగాలు, వ్యాపారాల బిజీలో పడి చాలామంది నవ్వుకు దూరమవుతున్నారు. ఇలాంటి వారు కడుపుబ్బా నవ్వితే సమస్యలు కూడా తీరిపోతాయట.**

నవ్వు ఒత్తిడిని తగ్గించే ఒక మెడిసిన్ అంటున్నారు అమెరికన్ వైద్యులు. ఫ్లోరిడాకు చెందిన వైద్యబృందం 'నవ్వు-మానసిక ఆరోగ్యం' అంశంపై అధ్యయనం చేసింది. వారి అధ్యయనం ప్రకారం.. నవ్వు వల్ల మనసు ఉల్లాసపడి జ్ఞాపకశక్తి పెరుగుతుంది. నవ్వు ద్వారా ఒత్తిడిని జయించవచ్చు. గట్టిగా నవ్వడం వల్ల శరీరానికి ఆక్సిజన్ కూడా బాగా అందుతూ గుండె సంబంధిత రోగాలు దరిచేరవు. నవ్వితే శరీరంలోని 108 కండరాలు ఉత్తేజితం అవుతాయి. బీపీ అదుపులో ఉంటుంది. 15 నిమిషాల పాటు నవ్వితే శరీరంలోని సుమారు 40 కేలరీలు కరిగిపోతాయి. నొప్పుల నివారణకు తోడ్పడే ఎండార్ఫిన్ నవ్వు ద్వారా లభిస్తుంది. డిప్రెషన్‌లో ఉన్నవాళ్లకు లాఫింగ్ థెరఫీ ట్రీట్‌మెంట్ చేస్తే 70% సత్ఫలితాలు లభిస్తాయి. థైరాయిడ్, మైగ్రేన్, స్పాండిలైటిస్ వంటి సమస్యలకు నవ్వుతో పరిష్కారం చూపవచ్చు.

# 3డి మామోగ్రఫీతో.. రొమ్ము క్యాన్సర్‌కు చెక్!

రొమ్ముక్యాన్సర్ అంటే గతంలో ఒక ఆందోళన.

మాతృత్వానికి పరిపూర్ణతనిచ్చే రొమ్ముకు అనారోగ్యం వస్తే గుండెకే గాయం అయినట్లవుతుంది.

అయితే తొలిదశలోనే గుర్తిస్తే రొమ్ముక్యాన్సర్ పూర్తిగా తగ్గుతుంది.

రొమ్ముక్యాన్సర్ నుంచి ప్రాణాపాయం తప్పిన తర్వాత రూపమూ బాగుండాలనే ఆశ ఎవరికైనా ఉంటుంది.

ఇలా ఆరోగ్యమూ అందమూ తిరిగి పొందే ఆశ.. ఆకాంక్ష నెరవేరే రోజులు వచ్చేశాయి.

సలహా





**రొమ్ములో** గడ్డలనే ఆ శత్రువులను తెలుసుకోవడానికి ఇప్పుడు మరింత మెరుగైన ఉపకరణం అందుబాటులోకి వచ్చింది. అదే డిజిటల్ మామోగ్రాఫీ. ఇది గతంలో ఉన్న పరిజ్ఞానమే. అయితే దీనికి ఆధునిక సాంకేతికత జోడై బ్రెస్ట్ టోమోసింథసిస్/3డి మామోగ్రఫీ అనే అత్యంత ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఒమెగా హాస్పిటల్స్‌లో నెలకొల్పిన ఈ అత్యాధునిక ఉపకరణంతో సంప్రదాయ పద్ధతుల్లో కంటే మరింత ముందుగానే గడ్డను చూడవచ్చు. ఇది 3డీ పరిజ్ఞానంతో రొమ్ములో క్యాన్సర్ ఉన్న ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని దాన్ని తొలగించడానికి వీలవుతుంది. పక్కనున్న కణజాలం క్యాన్స ర్ గడ్డతో కలగలసిపోయి, రెండింటినీ స్పష్టంగా, నిర్దిష్టంగా గుర్తించలేని పరిస్థితి పూర్తిగా తొలగిపోయి, కాన్సర్ గడ్డ, కణితి ఉన్న భాగం మరింత స్పష్టంగా కనిపించి చికిత్స సులువు అవుతుంది. దీనివల్ల వ్యాధి తిరగబెట్టే అవకాశాలు 30 శాతం తగ్గుతాయి.

### సైబర్ నైఫ్

ఒక్క రొమ్ము క్యాన్సర్‌కు మాత్రమే కాదు అన్ని రకాల క్యాన్సర్లతో పాటు ఇక దాన్నీ రక్షించడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం కూడా ఒమెగా హాస్పిటల్లో లభ్యమవుతున్నది. అదే సైబర్ నైఫ్. ఇది కత్తి కాని కత్తి. క్యాన్సర్ ఉన్న భాగాన్ని మెత్తగా కోసే కత్తి. వాస్తవానికి రొమ్ము లాంటి ప్రదేశంలో అతి మెత్తగా గాటుకు గాయం కాకుండా, గాయానికి నొప్పి లేకుండా, సమస్య ఎప్పుడూ మళ్లీ రాకుండా (కనీసం గతంలో కంటే 30 శాతం అధికంగా) చేసే సాంకేతిక పరిజ్ఞానం. ఒకప్పుడు మెదడు, వెన్నెముక, ఊపిరితిత్తులు, కాలేయం, క్లోమగ్రంధి వంటి సున్నితమైన ప్రదేశాల్లో క్యాన్సర్ కణితి ఉంటే ఆందోళన పడేవారు.

### ఇమేజ్ గైడింగ్ టెక్నాలజీ

సైబర్ నైఫ్ అనే సునిశితమైన వైద్య పరిజ్ఞానంతో పాటు ఇమేజ్ గైడింగ్ టెక్నాలజీ అనే సాంకేతికత కూడా అందుబాటులోకి వచ్చింది. ఇమేజ్ గైడింగ్ అంటే మనం చూడలేని ప్రాంతాన్ని కూడా స్పష్టంగా అద్దంలో చూసినట్లుగా చూడటం. ఇక రొమ్ము క్యాన్సర్ విషయానికి వస్తే డిజిటల్ మామోగ్రఫీ విత్ బ్రెస్ట్ టోమోసింథసిస్/కిడి మామోగ్రఫీ పరిజ్ఞానంలోని కెమెరా సహాయంతో రొమ్ముకు అన్ని వైపులా తిప్పుతూ క్యాన్సర్ గడ్డను అన్ని కోణాలనుంచి చూస్తూ శస్త్రచికిత్స చేయడం సాధ్యమవుతుంది. పైగా దీనివల్ల ఇప్పుడు మనం చూసే క్యాన్సర్ గడ్డ గతంలో కంటే మరింత స్పష్టంగా, మరింత పెద్దగా, శస్త్రచికిత్స సమయంలో మిగతా భాగాలేవీ దెబ్బతినకుండా తీసేయడానికి వీలయ్యేంత పరిమాణంలో కనిపిస్తుంది.

### ఆక్సిలరీ క్లియరెన్స్

చికిత్స చేస్తున్నప్పుడు ఊపిరితిత్తుల్లా కదులుతుండే భాగాలు అలా కదులుతున్నా సరే ఇమేజ్ గైడింగ్ టెక్నాలజీ వల్ల, రోబోటిక్ సామర్థ్యం వల్ల క్యాన్సర్ ఉన్న భాగం తమ కిరణాలు తగిలే పరిధిలోకి వచ్చినప్పుడే వాటిని ఖచ్చితమైన చోట ప్రసరింపజేసి క్యాన్సర్‌ను కాల్చేసి మసి చేస్తాయి. అలాగే రొమ్ము కూడా ఊపిరితిత్తుల పైభాగంలో ఛాతీమీద ఉంటుంది. కాబట్టి శ్వాసిస్తూ ఉన్నప్పుడు రొమ్ము క్యాన్సర్‌కు కూడా పైవిధంగానే చికిత్స చేయవచ్చు. కొన్నిసార్లు రొమ్ము క్యాన్సర్ తొలి దశలను దాటి చంకల్లో ఉండే లింఫ్ గ్లాండ్స్‌కూ విస్తరించే అడ్వాన్స్‌డ్ దశలకూ వెళ్తుంది. అలాంటప్పుడు వ్యాధిగ్రస్తమైన లింఫ్‌గ్లాండ్స్‌ను శస్త్రచికిత్స ద్వారా తొలగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియనే 'ఆక్సిలరీ క్లియరెన్స్' అంటారు. లింఫ్ గ్లాండ్స్‌లో జబ్బు ఉన్నదీ లేనిదీ తెలుసుకోడానికి సెంటినల్ నోడ్స్ బయాప్సీ ప్రక్రియ ద్వారా ఏయే గ్లాండ్స్ రోగగ్రస్తమయ్యాయో తెలుసుకోవచ్చు. అలా తెలుసుకున్న తర్వాత కేవలం రోగగ్రస్తమైన లింఫ్ గ్లాండ్స్ ఉంటే ఆక్సిలరీ క్లియరెన్స్ చేసి వాటిని వదిలేయవచ్చు.

### ఏయే భాగాల్లో?

శరీరంలోని ఏ భాగానికైనా సైబర్‌నైఫ్ నుంచి చికిత్స చేసే కిరణాలను ప్రసరింపజేసి, క్యాన్సర్ గడ్డను, కణితి ఉన్న భాగాని తొలగింపజేయవచ్చు. క్యాన్సర్ పుట్టిన భాగంలోనే ఉండక క్రమంగా పాకేస్తుంది. ఇలా విస్తరించడాన్ని మెటాస్టాసస్ అంటారు. సైబర్ నైఫ్ ప్రత్యేకత ఏమిటంటే మెటాస్టాసస్ క్యాన్సర్లను సైతం తేలిగ్గా తొలగిస్తుంది. అంతే కాదు తల, మెడ, ముక్కు, గొంతు భాగాలలోని కణుతులు. సైబర్‌నైఫ్‌ను 360 డిగ్రీల్లో ఎటైనా తిప్పుతూ కిరణాలను ప్రసరింపజేయడం సాధ్యమవుతుంది. సైబర్ నైఫ్ ప్రయోజనాలు సాధారణంగా కరెంట్ చికిత్సగా పేర్కొనే గతంలోని లీనియర యాక్సిలరేటర్లను ఉపయోగించే సమయంలో గతంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు అన్ని జాగ్రత్తలు అవసరం లేకుండానే సులువుగా చికిత్స జరిగిపోతుంది. నొప్పి ఉండదు. మత్తు ఇవ్వాల్సిన అవసరం లేదు. శరీరానికి గాటు పెట్టనవసరం లేదు. చికిత్స చేసే సమయంలో ఊపిరితిత్తులకు రేడియేషన్ ఇస్తుంటే ఊపిరిబిగబట్టాల్సిన అవసరం లేదు. సూదిమొనంత ఖచితత్వంతో క్యాన్సర్ ఉన్న భాగానికే ఇవ్వవచ్చు. అత్యంత తక్కువ సైడ్ ఎఫెక్ట్స్. హాస్పిటల్లో ఉండాల్సిన సమయం చాలా చాలా తగ్గిపోతుంది.

క్యాన్సర్ కాని ఇతర వ్యాధుల్లోనూ ఉపయోగం సైబర్‌నైఫ్ సేవలను కేవలం క్యాన్సర్ కోసం మాత్రమే కాకుండా... క్యాన్సర్ కాని ఇతర వ్యాధుల్లోనూ ఉపయోగించుకోడానికి వీలవుతుంది. వాటిలో కొన్ని.. మెనింజియోమాస్ పిట్యూటరీ అకౌస్టిక్ న్యూరోమాస్ మెదడులో ఉండే క్రేనియల్ నర్వ్స్ స్క్వానోమాస్ గ్లామస్జుగులేర్ ఆపరేషన్‌కు వీలు కాని పారాగాంగ్లియోమాస్ హిమాంజియోమాస్ రక్తనాళాల అమరిక సరిగా లేని సందర్భాల్లో (వాస్క్యులార్ మాల్ ఫార్మేషన్) ఇటీవలే నమలడం సైతం కష్టమైనంతగా దవడ నొప్పితో సల్మాన్‌ఖాన్‌కు వచ్చిన ట్రిజెమినల్ న్యూరాల్జియా క్లస్టర్ హెడేక్ వంటి సంక్లిష్టమైన తలనొప్పులు తలలోని అత్యంత సంక్లిష్టమైన నరాలకు సర్జరీ చేయలేని సందర్భాల్లో సైబర్ నైఫ్ సేవలను ఉపయోగించుకోవచ్చు. ఇలా సైబర్ నైఫ్‌తో అన్ని రకాల క్యాన్సర్లనూ, అన్ని అవయవాల్లోని అత్యంత సంక్లిష్టమైన భాగాల్లో వచ్చిన గడ్డలను తొలగించుకోవడం సాధ్యమే. చివరకు రొమ్ముక్యాన్సర్ భాగాలు, రొమ్ములో వచ్చే గడ్డలతో సహా.

డా. సీహెచ్ మోహన వంశీ
చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్
ఒమెగా హాస్పిటల్స్
హైదరాబాద్: 9848011421
కర్నూల్: 08518 273001
గుంటూర్: 08632 223300



## సుడోకు

డైలీ సుడోకు 78 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 5 | 2 | 1 | 7 | 4 | 8 | 3 | 9 |
| 1 | 8 | 3 | 2 | 9 | 6 | 4 | 7 | 5 |
| 7 | 9 | 4 | 5 | 3 | 8 | 6 | 1 | 2 |
| 4 | 2 | 1 | 9 | 5 | 3 | 7 | 8 | 6 |
| 8 | 3 | 6 | 7 | 4 | 2 | 5 | 9 | 1 |
| 5 | 7 | 9 | 8 | 6 | 1 | 2 | 4 | 3 |
| 2 | 1 | 7 | 3 | 8 | 5 | 9 | 6 | 4 |
| 9 | 4 | 5 | 6 | 1 | 7 | 3 | 2 | 8 |
| 3 | 6 | 8 | 4 | 2 | 9 | 1 | 5 | 7 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు - 79

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 9 | | | | | | 6 |
| | | | | 6 | | 9 | | 3 |
| | | 8 | 3 | 9 | | | 1 | |
| 7 | | | 6 | | | | 8 | |
| | | 1 | | 3 | | 7 | | |
| | 4 | | | | 5 | | | 9 |
| | 1 | | | 2 | 7 | 6 | | |
| 4 | | 5 | | 1 | | | | |
| 6 | | | | | | 4 | | |

III.
నమస్తే తెలంగాణ
శాస్త్ర
[కరీంనగర్]
మంగళవారం 2 జూలై 2019

విశ్వదర్శనం

## గామా విస్ఫోటన సంకేతం



**గామా కిరణ విస్ఫోటనానికి చెందిన రేడియో కిరణ సంకేతాలను శాస్త్రవేత్తలు తొలిసారిగా గుర్తించారు. దీనిద్వారా విశ్వంలోని గురుత్వాకర్షణ క్షేత్రాలు, వాటి నిర్మాణాల తీరుతెన్నులను అవగాహన చేసుకోగలమని వారంటున్నారు.**

విశ్వంలో అత్యంత శక్తిదాయక విస్ఫోటనాలైన 'గామా కిరణ పేలుళ్ల' (Gamma-ray bursts: GRBs) తాలూకు గురుత్వాకర్షణ క్షేత్రాల రహస్యాలు తెలుసుకొనే ఆధారం ఒకటి ఖగోళ శాస్త్రవేత్తలకు తాజాగా లభించింది. సుమారు 7 బిలియన్ (700 కోట్లు) కాంతి సంవత్సరాల దూరంలోని ఒక నక్షత్ర మండలం (గెలాక్సీ)లో సంభవించినట్టుగా భావిస్తున్న 'జీఆర్‌బీ'కి చెందిన శక్తివంతమైన అగ్నిధార (జెట్)లోంచి వెలువడిన ధ్రువిత (Polarized) రేడియో సంకేతాలను మొట్టమొదటిసారిగా వారు సేకరించగలిగారు. 'నాసా'కు చెందిన నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ (Neil Gehrels Swift Observatory), అటకామ లార్జ్ మిల్లీమీటర్/ సబ్‌మిల్లీమీటర్ ఎరే (Atacama Large Millimeter/ Submillimeter Array: ALMA) అందించిన చిత్రాలపై జరిపిన పరిశోధనల ద్వారా ఈ విషయం తేలింది. 'జీఆర్‌బీ 190114సీ'గా పిలిచే గామా కిరణ విస్ఫోటనం తాలూకు అగ్నిధారల నుండి ఈ రేడియో కిరణ సంకేతాలు వెలువడినట్లు వారు తెలిపారు. 'ఆస్ట్రోఫిజికల్ జర్నల్' ఇటీవలి సంచికలో ఈ పరిశోధనా పత్రం ప్రచురితమైంది.

పురాజంతు శాస్త్రం

## మూడో అతిపెద్ద పక్షి!



**18 లక్షల ఏండ్ల కిందటి భారీ పక్షి శిలాజ అవశేషాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇది ఉష్ట్రపక్షికి మూడు రెట్లు పెద్దదేకాక ప్రపంచ చరిత్రలోనే మూడో అతిపెద్దదిగా వారు చెబుతున్నారు.**

తూర్పు యూరప్‌లోని క్రిమియా (Crimea) ద్వీపకల్పానికి చెందిన ఒక కొత్త గుహలో భారీ పక్షి శిలాజ అవశేషాన్ని శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. ఆ ఖండంలో 1.8 మిలియన్ (18 లక్షలు) సంవత్సరాల కిందట సంచరించిన 'హోమో ఎరెక్టస్' (Homo erectus) ప్రాచీన మానవులతో పాటు ఇవి జీవించినట్టు వారు భావిస్తున్నారు. లభ్యమైన భారీ తొడ ఎముక అవశేషం ఆధారంగా ఈ పక్షి సుమారు 992 పౌండ్ల (449.9 కేజీలు) బరువుతో ఉన్నట్టు వారంటున్నారు. 'ప్యాచీస్ట్రూతియో డీమానిసెన్సిస్' (Pachystruthio dmanisensis) గా పిలుస్తున్న దీనిని ప్రపంచచరిత్రలోనే మూడో అతిపెద్దదిగా, ఉష్ట్రపక్షి (మనిషికంటే ఎత్తయిన పెద్ద పక్షి : Ostrich)కి మూడు రెట్లు పెద్దదని వారు చెప్పారు. ఆఫ్రికాలోని మడగాస్కర్‌కు చెందిన 'ఏనుగు పక్షి'నే ఇప్పటికి అతిపెద్దది (1000 పౌండ్ల బరువు)గా భావిస్తుండగా గత వెయ్యేండ్ల కిందటే ఇది కనుమరుగైంది. ఆస్ట్రేలియాకు చెందిన 'మిహిరంగ్' (mihirung) గా పిలిచే పక్షి (థండర్ బర్డ్) సుమారు 500- 1000 పౌండ్ల బరువుతో ఉండేదని, దాదాపు 50,000 ఏండ్ల క్రితమే ఇదీ అంతరించి పోయిందని పరిశోధకులు అంటున్నారు. ఈ కొత్త పక్షి బాగా పరిగెత్తేదని, భారీ చిరుత, కత్తుల్లాంటి పండ్ల పిల్లి వంటి మాంసాహార మృగాలతోపాటు నివసించి ఉంటుందని వారు భావిస్తున్నారు.

ప్రకృతి పాఠం

## గబ్బిలాల వినికిడి శక్తి

**రాత్రిళ్లు చూడడానికే భయం గొలిపేలా సంచరించే గబ్బిలాల వినికిడి శక్తి ఆధారంగా శాస్త్రవేత్తలు అద్భుత వస్తువులను సృష్టిస్తున్నారు. వాటిలో ఎకోలొకేషన్ కేన్, బ్యాట్ హ్యాట్ వంటివి ఉన్నాయి.**



చీకట్లో తాము వేటాడి తినబోయే క్రిమి కీటకాలను గుర్తించడంలో కానీ, వాటి చెంతకు వేగంగా ఎగురుతూ వెళ్లడంలో కానీ, దూరం నుంచే శబ్దాలను వినడంలో కానీ గబ్బిలాలు అసాధారణ ఇంద్రియ జ్ఞానాన్ని కలిగి ఉంటాయి. వీటి జ్ఞానసంపత్తి ఆధారంగానే పలువురు శాస్త్రవేత్తలు పలు కొత్త తరహా వస్తువులను సృష్టిస్తున్నారు. గబ్బిలాల కళ్లు, చెవులు, నోరు, మెదడు వంటి శరీరావయవాల పనితనం అనూహ్యం, అసాధారణం. కటిక చీకట్లోనే వీటి కళ్లు గొప్పగా చూడలవు. ఎగిరే పురుగులను అంతకంటే వేగంగా ఎగిరి వెళ్లి అందుకోవడంలో ఇవి దిట్టలు. ప్రతిధ్వని ఆధారంగా సదరు ధ్వని ఎంతదూరంలో ఉన్నదో తేలిగ్గా పసిగట్టేయగలవు. వీటి వినికిడి శక్తి మనిషికంటే మూడురెట్లు అధికమని శాస్త్రవేత్తలు అంటున్నారు. గబ్బిలం రెండు చెవులూ విడివిడిగానూ పనిచేయగలగడం విశేషం. 'డాప్లర్ ఫలితం'గా పిలిచే ఈ సాంకేతికత ఆధారంగానే నిపుణులు రాడార్ వ్యవస్థను రూపొందించారు.

గబ్బిలాలు, డాల్ఫిన్లకు చెందిన 'ఎకోలొకేషన్' (శబ్దస్థాన గుర్తింపు) సామర్థ్యం ఆధారంగా బ్రిటన్ పరిశోధకులు ఆధునాతన ఊతకర్ర (ఎకోలొకేషన్ కేన్)ను రూపొందించారు. దీనిద్వారా అంధులు చాలా తేలిగ్గా వివిధ ధ్వనులను దూరం నుంచే వినేయగలరు. వీరు నడిచే దారిలో ఏవైనా అడ్డంకులు రాబోతుంటే, ఇందులోని ధ్వనియంత్రం గంటను మోగించడం ద్వారా వాటిని ముందే కనిపెట్టేసి, సదరు వ్యక్తికి ముందస్తు సమాచారం అందిస్తుందని పరిశోధకులు అంటున్నారు. మన దేశంలోని కొందరు ఎన్ఐటీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) పరిశోధకులు కూడా ఈ రకమైన యంత్రాన్ని



తయారుచేశారు. రోడ్డు మలుపులను అధిగమించేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందని వారంటున్నారు. ప్రతిధ్వనులను గుర్తించే పరికరంతోపాటు స్కానర్ కూడా దీనిలో ఉంది. ఢిల్లీలోని ఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) పరిశోధకులు మరొక అడుగు ముందుకేసి 'స్మార్ట్ కేన్'ను తయారుచేశారు. గబ్బిలం ఇంద్రియ జ్ఞానం (వినికిడి శక్తి) ఆధారంగానే మోటార్ వెహికిల్స్‌కు 'బీపింగ్ సౌండ్' సాంకేతికతను వారు అభివృద్ధి పరిచారు. రోడ్డు ప్రమాదాలు జరక్కుండా రాబోయే అడ్డంకులను 'బీపింగ్ శబ్దం'తో ఇది తెలియజేస్తుందని వారు అంటున్నారు.

న్యూయార్క్‌లోని కార్నెల్ విశ్వవిద్యాలయం పరిశోధకులు 'బ్యాట్ హ్యాట్' పేరిట ఒక 'స్మార్ట్ టోపీ'ని రూపొందించారు. ఇది కూడా గబ్బిలానికి చెందిన ఇంద్రియ పనితనం (వినికిడి) ఆధారంగానే రూపొందింది. దారిలో ఏ అడ్డంకులు లేకుండా ఇది మనల్ని అప్రమత్తం చేస్తుందని, 120 డీబీ (డెసిబెల్ మీటర్)ల అతిధ్వని పౌన:పున్యాన్ని గ్రహించగలదని వారు అంటున్నారు. శబ్ద పరావర్తనం ఆధారంగా సదరు 'అడ్డంకు' ఎంత దూరంలో ఉన్నదీ మనకు ఈ తెలివైన టోపీ తెలియజెప్పుందని వారు తెలిపారు.

-డా॥ రాజూరు రామకృష్ణారెడ్డి

నాడీ విజ్ఞానశాస్త్రం

# మదిలోనే మర్మమంతా!

## స్పృహ రహస్యం బట్టబయలు

**తెలివిని కలిగి ఉండడం నుంచి అద్భుత మేధస్సును ప్రదర్శించడం వరకూ మనిషి చేతనత్వానికి మూలం మస్తిష్కంలోనే ఉన్నదనడానికి శాస్త్రవేత్తలు తాజా ఆధారాలను కనుగొన్నారు.**



ఎవరు నమ్మినా, నమ్మక పోయినా, ఎందరు ఎన్ని రకాలుగా వాదించినా మనిషిలోని స్మారక స్థితి (consciousness) కి మూలం మెదడులోనే ఉంటున్నట్టు శాస్త్రజ్ఞులు ఇప్పుడు నిర్ధారణకు వచ్చారు. ఈ రహస్యాన్ని ఛేదించే క్రమంలో వివిధ దేశాలకు చెందిన పలువురు పేషెంట్ల మెదళ్లపై వారు జరిపిన ప్రయోగాలు అనూహ్య ఫలితాలను ఇచ్చాయి. చేతనాత్మక శక్తి మెదడులో ఏ రకంగా ఉత్పన్నమవుతున్నదీ, అక్కడి సదరు ప్రదేశాలు ఎలా స్పందిస్తున్నవీ, మొత్తంగా అసలు స్పృహనే కోల్పోయిన వారి మస్తిష్కాలలో సంభవించే మార్పులు ఎలాంటివి వంటి విషయాలను వారు ఈ మేరకు చాలా స్పష్టంగా గుర్తించారు. దీంతో గత కొన్ని శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ చిక్కుముడి ఎట్టకేలకు తొలగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

స్పృహ (స్మారక స్థితి) మానసిక పరమైందని, అభౌతికం కాబట్టి అసలు దాని ఉనికిని నిరూపించలేమని కూడా పలువురు భావిస్తున్న తరుణంలో ఆధునిక నాడీవిజ్ఞాన శాస్త్రవేత్తలు మెదడులోని తత్‌సంబంధ నాడీవ్యవస్థల తీరుతెన్నులను ఇటీవల పరిశోధించారు. 'సైన్స్ అడ్వాన్సెస్' ఆన్‌లైన్ పత్రికలో ప్రచురితమైన ఈ పరిశోధనాంశాలు, వాటి ఫలితాలు ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరుస్తాయి. ఇది కేవలం తాత్విక సంబంధమైన విషయం మాత్రమే కాదని, జీవనాడీ కణజాలంతో పూర్తిగా అనుసంధానమై ఉందని తద్వారా తేటతెల్లమైంది. తీవ్రస్థాయిలో మెదడు గాయాల పాలైనప్పుడు సదరు పేషెంట్లు మన ఎరుక (Aware) లో ఉన్నదీ, లేనిదీ కనుగొనడమన్నది వైద్యులకే కాక ఆ వ్యక్తుల కుటుంబ సభ్యులకూ పెద్ద సవాలుగా ఉంటున్నది. ఈ క్రమంలో 'ఆధునాతన మెదడు ప్రతిబింబ సాంకేతికతలు' (Modern brain imaging techniques) అసాధారణ దృశ్యాలనే ఆవిష్కరించాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. దీని తాలూకు అస్థిర పరిస్థితులు తొలగేలా వారి పరిశోధనలు సత్ఫలితాలతో ముందుకు సాగుతున్నాయి.

ఉన్నత స్థాయి జ్ఞానసంబంధ ప్రక్రియలన్నింటికీ మెదడులోని సంక్లిష్ట భాగాలైన ప్రాక్ లలాట లంబిక ప్రదేశంలోని వల్కలం (prefrontal cortex) లేదా ప్రెక్యూనియస్ (precuneus: మెదడు అర్ధభాగపు మధ్యస్థ ఉపరితలం మీది పార్శ్వపు చిన్న తమ్మె)తో కూడిన ప్రదేశాలలోనే ప్రతిస్పందనలు జరుగుతున్నట్టు, చేతనాత్మక ఆలోచనలకూ ఇదే కారణమనీ శాస్త్రవేత్తలు ఇదివరకే పరిశోధనాత్మకంగా ప్రకటించారు. ఐతే, మెదడులోని పెద్ద భాగాలు కూడా అనేక చర్యలకూ కారణమవుతున్నట్టు కూడా వారు గుర్తించారు. మనిషిని జాగరూకతలో ఉంచే శక్తి మెదడులోని ప్రత్యేకమైన ఏ ప్రదేశంలో ఉత్పన్నమవుతున్నదీ శాస్త్రలోకం ఇప్పటి దాకా తెలుసుకోలేదు. ఆయా వ్యక్తుల నిర్దిష్ట ఆలోచనలు, భావనలను వారు చెబితే కాని ఎదుటి వ్యక్తులు తెలుసుకోలేని స్థితిలో నిపుణులు ఇప్పటికీ ఉండడమే అసలు దురవస్థ. సదరు వ్యక్తులు వాక్సంబంధ (మాట్లాడే) ఇంద్రియజ్ఞానాన్ని కోల్పోయినప్పుడు సంజ్ఞలే ఆధారమవుతాయి. ఇంకా ఒక్కోసారి ఇవి సైతం వారిలో ఉత్పన్నం కానపుడు ఏమిటి పరిస్థితి? అలాంటి వారు నిజానికి స్మారకంలో ఉన్నట్టా? లేనట్టా? తెలుసుకోదెలా? ఇదీ శాస్త్రవేత్తల ముందున్న ప్రస్తుత సవాలు.

### 'సమాచార మార్పిడి'తోనే ఆ అద్భుతం!

తీవ్ర రోడ్డు ప్రమాదంలో గాయపడి, కోమాలోకి వెళ్లి పోయి, విశ్రామ దశ (vegetative state) లో ఉన్న వారిపై జరిపిన అయస్కాంతత్వ అనునాద పరీక్షలు (functional magnetic resonance imaging: fMRI), విశ్లేషణలు జాగృదావస్థకు కారణమవుతున్న ప్రత్యేక మెదడు ప్రదేశాలు, వాటి మధ్య జరుగుతున్న 'అద్భుత సమాచార మార్పిడు'లను స్పష్టంగా గుర్తించినట్లు పరిశోధకులు తెలిపారు. ప్యారిస్, లీజ్ (బెల్జియం), న్యూయార్క్, లండన్, ఒంటారియో వంటి నగరాలలోని వివిధ ఆస్పత్రుల్లోని పేషెంట్ల (విశ్రామదశ వారు 53 మంది, అత్యల్ప స్పృహ గలవారు 59 మంది, ఆరోగ్యవంతులు 47 మంది)పై సమగ్ర అధ్యయనాలు జరపగా పై విషయం తేలింది. ఆ ప్రదేశాల మధ్యే 'సమాచార మార్పిడి'తో భౌతిక సంబంధం కొనసాగినట్టు వారు గుర్తించారు. ఇటువంటి మొత్తం 42 ప్రత్యేక ప్రదేశాలను, ఆరు వ్యవస్థలను మెదడులో కనుగొన్నట్టు వారు చెబుతున్నారు. అత్యంత గమనార్హమైన విషయమేమిటంటే, అనస్థీషియా (మత్తు మందు) ఇచ్చినప్పుడు ఈ 'సంక్లిష్ట ప్రక్రియ' కనుగమరుగవుతున్నదని వారు తెలిపారు.





మెదడు ప్రదేశాలు: స్పృహలో ఉన్నప్పుడు, లేనప్పుడు

ఈ నేపథ్యంలోనే సాగిన ఇటీవలి పరిశోధనలు అత్యంత ఆసక్తికరమైన, ఆలోచింపదగిన ఫలితాలనే ఇచ్చాయి. ఈ ఏడాది (2019) తొలి మాసాలలో జరిగిన ఒక పెద్ద అధ్యయనంలో ఏడు దేశాలకు చెందిన పేషెంట్లను భాగస్వాములను చేయడమే కాక ఎక్కువమందిపై లోతైన- ప్రత్యేకమైన విశ్లేషణలు సాగించారు. ప్రత్యేకించి అడిగితే కాని ఏదో రకంగా చెప్పలేని లేదా స్వీయస్పందనను పూర్తిగా కోల్పోయిన వారిలో స్పృహ శక్తి లక్షణాలను సూచించే మెదడు సంకేతాలను పరిశోధకులు ఈ సందర్భంగా గుర్తించారు. అయితే, మెదడు గాయం తర్వాత జాగరూకతలో లేనివారిలో, ఉన్నవారిలో గుణాత్మక పద్ధతిలో గుర్తించదగ్గ రీతిలో ఇవి ఉండడం తమ పరిశోధనల్లోని విశేషమని వారు ప్రకటించారు.

దోర్బల బాలశేఖరశర్మ

## ఆంత్రాలలోనే అసలు కిటుకు



పనితనం

దేహారోగ్యానికి, మనుగడకు మూలమైన శరీర వ్యవస్థలలో ప్రధానమైంది జీర్ణ క్రియ ఒకటి. దీని అసలు కిటుకు అంతా అంత్రాల (పేగులు)లోనే ఉంటుంది. ఇవి కడుపులో ఒక భాగమే. ఉదరం (కడుపు) నుంచి మలద్వారం వరకూ వ్యాపించి ఉండే చిన్న-పెద్ద పేగుల వ్యవస్థ ముఖ్య లక్ష్యం ఆహారాన్ని జీర్ణం చేయడం. మనం తినే తిండి, తీసుకొనే నీరు వంటి ద్రవ పదార్థాలలోని పోషకాల శోషణ (పీల్చుకోవడం) చాలావరకు ఇక్కడే జరుగుతుంది. దేహధర్మ సమాచారాన్ని శరీరభాగాలకు అన్నింటికీ చేరవేసే వివిధ పదార్థాలనూ పేగులు ఉత్పత్తి చేస్తాయి. రోగకారక క్రిములతో పోరాడుతూ, శరీరమంతా నీటి సమతుల్యతను నియంత్రించడంలోను ఆంత్రాలు కీలక పాత్రను నిర్వరిస్తాయి. కడుపు నొప్పి, మలబద్ధకం, అతిసార వంటి వాటివల్ల కలిగే బాధలు, అసంతృప్తి తదితర ఫీలింగ్స్‌ను ఇవి ప్రతిఫలింపజేస్తాయి. ఉదరంతో నేరుగా సంబంధాన్ని కలిగి ఉండే చిన్నపేగు 3-5 మీటర్ల పొడవుంటే, చిన్నపేగుతో సంబంధం కలిగి ఉండే పెద్దపేగు పొడువు సుమారు 1-1.75 మీటర్లుగా వైద్య నిపుణులు చెప్తారు.

ఎవరేమన్నారు?



మనలోని సహజ శక్తులే నిజమైన వైద్యచికిత్సలు!

**- హిపోక్రేట్స్ (II)**

ప్రాచీన గ్రీకు వైద్యుడు

★ జీవితకాలం: క్రీ.పూ.400-370

ఆహారశాస్త్రం

## పోషకాలే ప్రధానం!

**మనిషి జీవనాన్ని, శక్తి సామర్థ్యాలను ఇనుమడింపజేసేది ఆహారం. ఇది ఎంత స్వచ్ఛత, నాణ్యత, బలవర్ధకమైతే అంత మంచిది. చాలామంది తినే తిండిపట్లనే అశ్రద్ధ, నిర్లక్ష్యం వహిస్తారు. ఫలితంగా అనారోగ్యం, అలసట, అశక్తి పాలవుతారు. మనం ఏం తింటున్నాం? అందులో పోషకాల పాలు ఎంత? కోల్పోతున్నదేమిటి? ఎవరి శరీర ధర్మానికి తగ్గట్టు వాళ్లం పోషకాలతో కూడిన ఆహారం తీసుకొంటున్నామా? ఇత్యాది విశేషాలనే ఈ శీర్షికలో వరుసగా చదువండి.**



శరీరానికి శక్తినిచ్చేవి పోషకాలే. వేటిని 'పోషకాలు' అంటారు? ప్రధానంగా మనం తాగే నీరు, తినే ఆహారంలోని మాంసకృత్తులు (ప్రొటీన్స్), కొవ్వు పదార్థాలు (ఫ్యాట్స్), పిండి లేదా గంజి పదార్థాలు (కార్బోహైడ్రేట్స్), ఖనిజాలు (మినరల్స్), జీవపదార్థాలు (విటమిన్స్) పోషకాల కిందికి వస్తాయి. వీటివల్ల శరీరానికి కావలసిన శక్తి లభిస్తుంది. ప్రాణులు అన్ని పనులూ చేసుకోవడానికి ఉపయోగపడే దేహబలాన్ని 'కదిలే శక్తి' (కైనెటిక్ ఎనర్జీ) అంటారు. ఇది మనం తీసుకొనే పోషకాలతోనే సమకూరుతుంది. మొత్తం శరీరం కదలడానికే కాదు, అంతర్గతంగా జీవనక్రియలకూ ఇది అవసరమని చాలామందికి తెలియదు. రక్తసరఫరా, శ్వాసక్రియ, పోషకాల గ్రాహ్యశక్తి, వ్యర్థాల విడుదలతోపాటు శరీర స్థిర ఉష్ణోగ్రతల నిర్వహణ అన్నీ జీవశక్తి విధానాల కిందికే వస్తాయి. ఇవన్నీ మనతోపాటు సకల జీవరాశికీ అవసరమే. ఈ మొత్తం వ్యవహారానికి అత్యంత ప్రధానం పోషకాలు. కాబట్టి, ఇవాళ ప్రపంచ వైద్య, ఆరోగ్య శాస్త్రాలన్నీ వీటి ఆధారంగానే, లక్ష్యంగానే పరిశోధనలను సాగిస్తున్నాయి.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## రూర్కెలా స్టీల్ ప్లాంట్‌లో 205 ఖాళీలు

**ఒడిశాలోని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పరిధిలో పనిచేస్తున్న రూర్కెలా స్టీల్ ప్లాంట్ (ఆర్ఎస్‌పీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ట్రెయినీ మేనేజ్‌మెంట్, జూనియర్ మేనేజర్ తదితర పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**





- మొత్తం పోస్టులు: 205
- విభాగాల వారీగా ఖాళీలు.. ఎగ్జిక్యూటివ్ పోస్టులు-26. దీనిలో.. డిప్యూటీ మేనేజర్ (బాయిలర్ అండ్ టర్బైన్ ఆపరేషన్)-11, మేనేజ్‌మెంట్ ట్రెయినీ (ఫైర్)-6, జూనియర్ మేనేజర్ (సేఫ్టీ)-6, జూనియర్ మేనేజర్ (క్వాలిటీ టెస్టింగ్ అల్ట్రాసోనిక్)-3 ఖాళీలు ఉన్నాయి.
- నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు-106. దీనిలో ఫైర్ ఆపరేటర్ ట్రెయినీ-25, ఫైర్‌మ్యాన్ కమ్ ఫైర్ ఇంజిన్ డ్రైవర్ ట్రెయినీ-81 ఖాళీలు ఉన్నాయి.
- బాయిలర్ ఆపరేటర్-7 ఖాళీలు
- ఆపరేటర్ కమ్ టెక్నీషియన్ ట్రెయినీ-47 ఖాళీలు (మెకానికల్-13, మెటలర్జీ-14, ఎలక్ట్రికల్-10, ఎలక్ట్రానిక్స్-5, ఇన్‌స్ట్రుమెంటేషన్-5
- అటెండెంట్ కమ్ టెక్నీషియన్-19 ఖాళీలు ఉన్నాయి.
- **పోస్టులవారీగా అర్హతలు:** గుర్తింపు పొందిన సంస్థ నుంచి నేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టులకు ఫైర్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్, జూనియర్ మేనేజర్‌కు మెకానికల్/మెటలర్జీ ఇంజినీరింగ్‌లో డిగ్రీ లేదా ఏదైనా బ్రాంచీలో బీఈ/బీటెక్‌తోపాటు ఇండస్ట్రియల్ సేఫ్టీలో డిప్లొమా/పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణత. ఫైర్ ఆపరేటర్‌కు ఏదైనా బ్యాచిలర్ డిగ్రీతోపాటు నేషనల్ ఫైర్ సర్వీసెస్ కాలేజ్ (నాగ్‌పూర్)చే సబ్ ఆఫీసర్ కోర్సు చేసి ఉండాలి. మిగతా పోస్టులకు మెట్రిక్యులేషన్/పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణత. నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- **వయస్సు:** 2019 జూలై 31 నాటికి 18 నుంచి 28 ఏండ్ల మధ్య ఉండాలి. పోస్టులను బట్టి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పేస్కేల్:** మేనేజర్ పోస్టులకు రూ. 32,900-58,000/-, మేనేజ్‌మెంట్ ట్రెయినీలకు రూ. 20,600-46,500/- ఆపరేటర్ కమ్ టెక్నీషియన్ రూ. 16,800-24,110/-
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 500/-, (ఆపరేటర్ కమ్ టెక్నీషియన్‌కు రూ. 250/-, అటెండెంట్ కమ్ టెక్నీషియన్‌కు రూ. 150/-)
- **ఎంపిక:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.sailcareers.com

## ఎన్‌హెచ్ టెట్ జూలై 2019

**నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీ హెచ్‌ఎంసీటీ) నేషనల్ హాస్పిటాలిటీ టీచర్స్ ఎలిజిబులిటీ టెస్ట్ (ఎన్‌హెచ్ టెట్)- జూలై 2019 ప్రకటన విడుదల చేసింది.**





- కౌన్సిల్ అనుబంధ హాస్పిటాలిటీ విద్యా సంస్థల్లో అసిస్టెంట్ లెక్చరర్, టీచింగ్ అసోసియేట్ నియామకాలకు ఎన్‌హెచ్‌టెట్‌లో అర్హత సాధించడం తప్పనిసరి.
- ఎన్‌హెచ్ టెట్ -జూలై 2019
- **అర్హత:** ఇంటర్ తర్వాత హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్/హోటల్ మేనేజ్‌మెంట్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రెండేండ్ల అనుభవం లేదా హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్/హోటల్ మేనేజ్‌మెంట్‌లో బ్యాచిలర్ డిగ్రీతోపాటు మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **ఫీజు:** రూ. 800/- (ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళలకు రూ. 400/-)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూలై 9
- **పరీక్ష తేదీ:** జూలై 20
- **వెబ్‌సైట్:** http://nchm.nic.in

## డీఆర్‌డీవోలో సైంటిస్టులు

**డిఫెన్స్ రిసెర్చ్ & డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో)కు చెందిన రిక్రూట్‌మెంట్ అండ్ అసెస్‌మెంట్ సెంటర్ (ఆర్‌ఏసీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న సైంటిస్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**



- మొత్తం ఖాళీలు: 40
- **పోస్టులు-ఖాళీలు:** సైంటిస్ట్ (ఎఫ్)-2, సైంటిస్ట్ (ఈ)-4, సైంటిస్ట్ (సీ)-21, సైంటిస్ట్ (డీ)-13.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెకానికల్/ప్రొడక్షన్, ఏరోనాటికల్/ఏరోస్పేస్, ప్రొడక్షన్ & ఇండస్ట్రియల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ లేదా తత్సమాన విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత. సంబంధిత విభాగంలో అనుభవంతోపాటు ఎంఈ/ఎంటెక్ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- **గమనిక:** జర్మన్, ఫ్రెంచ్, రష్యన్, జపనీస్, చైనీస్ భాషల్లో పరిజ్ఞానం/ప్రావీణ్యం ఉండాలి.
- **పే స్కేల్:** సైంటిస్ట్ (ఎఫ్) పోస్టులకు రూ. 1,31,100/- సైంటిస్ట్ (ఈ)- రూ. 1,23,100/-, సైంటిస్ట్ (సీ)-రూ. 67,700/, సైంటిస్ట్ (డీ)- రూ. 78,800/-
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 100/- ఎస్సీ/ఎస్టీ/పీహెచ్‌సీ, మహిళా అభ్యర్థులకు ఎలాంటి ఫీజు లేదు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 12
- **వెబ్‌సైట్:** http://rac.gov.in

## బ్యాంక్ నోట్‌ప్రెస్‌లో

**దేవాస్ (మధ్యప్రదేశ్)లోని సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లోని బ్యాంక్ నోట్ ప్రెస్ టెక్నికల్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**



- మొత్తం పోస్టులు-58
- సూపర్‌వైజర్ (ప్రింటింగ్ అండ్ ప్లేట్‌మేకింగ్/ఎయిర్ కండిషనింగ్/ఇంక్‌ఫ్యాక్టరీ)-20
- జూనియర్ టెక్నీషియన్ (ఇంక్ ఫ్యాక్టరీ/ప్రింటింగ్ అండ్ ప్లేట్ మేకింగ్)-38
- **అర్హత:** సంబంధిత ట్రేడులు/బ్రాంచీల్లో ఐటీఐ, డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2019 జూలై 25 నాటికి జూనియర్ టెక్నీషియన్లకు 25 ఏండ్లు, సూపర్‌వైజర్లకు 30 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** సూపర్‌వైజర్ పోస్టులకు రూ. 26,000-1,00,000, జూనియర్ టెక్నీషియన్ పోస్టులకు రూ. 7,750-19,040/-
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూన్ 25
- **వెబ్‌సైట్:** http://spmcil.com

నమస్తే తెలంగాణ
# చిత్రం
[ కరీంనగర్ ]
మంగళవారం 2 జూలై 2019


ఆనంద్ దేవరకొండ, జీవిత, శివాత్మిక, సుకుమార్, శ్రీధర్‌రెడ్డి, మహేంద్ర

## అన్నయ్య మాటలతో కన్నీళ్లొచ్చాయి!

'నవ్య ఆలోచనలతో దర్శకనిర్మాతలు చేస్తున్న వినూత్న ప్రయత్నాల వల్ల తెలుగు సినిమా స్వరూపం మారిపోతున్నది. కథలను ఎంచుకోవడంలో, నటీనటుల మాటల్లో, సినిమాలు చేయడంలో నిజాయితీ కనిపిస్తున్నది. కొత్త దర్శకులంతా అనుభవజ్ఞుల కంటే గొప్పగా, అందంగా సినిమాల్ని తెరకెక్కిస్తున్నారు' అని అన్నారు ప్రముఖ దర్శకుడు సుకుమార్. ఆనంద్ దేవరకొండ, శివాత్మిక నాయకానాయికలుగా పరిచయమవుతున్న చిత్రం 'దొరసాని'. మధుర శ్రీధర్‌రెడ్డి, యష్ రంగినేని నిర్మిస్తున్నారు. కె.వి.ఆర్ మహేంద్ర దర్శకుడు. ఈ నెల 12న విడుదలకానుంది. సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ను దర్శకుడు సుకుమార్ విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'తెలుగు సినిమా ధోరణిలో వస్తున్న మార్పులు చూసి 'రంగస్థలం' సినిమాను నిజాయితీగా రూపొందించే ప్రయత్నం చేశాను. 'నిశీధి' అనే లఘు చిత్రంతో నేను అమితంగా అభిమానించే శ్యామ్‌బెనగల్ చేత ప్రశంసలు అందుకొని గొప్ప దర్శకుడిగా నిరూపించుకున్నారు మహేంద్ర. విజువల్‌గా ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దారు. 'తలంబ్రాలు' సినిమాలో జీవిత ఎంత సహజంగా నటించారో అదే సహజత్వం శివాత్మికలో కనిపించింది. అచ్చమైన తెలంగాణ ఆడపడుచులా ఉంది. విజయ్ మాదిరిగానే ఆనంద్‌లో నిజాయితీ కనిపిస్తున్నది' అని అన్నారు.

**అంచనాలు లేకుండా చూడండి**

ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ 'అన్నయ్య విజయ్‌తో నన్ను పోల్చడం సరికాదు. 'పెళ్లిచూపులు' ట్రైలర్ వేడుకలో అన్నయ్య మాట్లాడిన మాటలు విని కన్నీళ్లు వచ్చాయి. ఈ వేదికపై నేను మాట్లాడుతున్న మాటలు చూసి అన్నయ్యతో పాటు అమ్మానాన్నలు అదే అనుభూతికి లోనయ్యారని అనుకుంటున్నాను. విజయ్ దేవరకొండ తమ్ముడిని కాబట్టే మూడు నిర్మాణ సంస్థలు ప్లాన్ చేసి నన్ను ఇండస్ట్రీకి పరిచయం చేశారని అంతా అనుకుంటున్నారు. అందులో నిజం లేదు. మహేంద్ర వల్లే మా కల సాధ్యమైంది. ఎలాంటి అంచనాలు లేకుండా ఈ సినిమాను సినిమాలాగే చూడండి' అని తెలిపారు. '1980 బ్యాక్‌డ్రాప్‌లో జరిగే కథ ఇది. వాస్తవికత, నిజాయితీ కలబోతగా ఉంటుంది. ఆనాటి సాంఘిక పరిస్థితులకు ఓ ఇరవై ఏళ్ల లోపు యువ జంట ప్రేమకథను మేళవిస్తూ తెరకెక్కించాను' అని కె.వి.ఆర్ మహేంద్ర చెప్పారు. మంచి సినిమాలో భాగమైనందుకు గర్వపడుతున్నానని శివాత్మిక చెప్పింది. ఈ సినిమా ఫలితం ఎలా ఉంటుందో అనే ఎన్నో భయాలు, సంశయాలు మనసులో నిండిపోయాయని జీవితా రాజశేఖర్ పేర్కొన్నారు. మధుర శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 'ట్రైలర్ ఆవిష్కరణ అనగానే తొలుత నాకు దర్శకుడు సుకుమార్ గుర్తొచ్చారు. ఆయన చేతుల మీదుగానే విడుదల చేయడం ఆనందంగా ఉంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకట్ శిద్ధారెడ్డి, ప్రశాంత్ విహారి, సన్నీ కూరపాటి, ధీరజ్ మొగిలినేని తదితరులు పాల్గొన్నారు.


హవీష్

## లింగుస్వామి దర్శకత్వంలో..

'సందకోజి (పందెంకోడి), పయ్యా (అవారా) చిత్రాలతో తెలుగు, తమిళ ప్రేక్షకుల్ని అలరించారు దర్శకుడు లింగుస్వామి. తాజాగా హీరో హవీష్‌తో ఆయన ఓ సినిమా చేయబోతున్నారు. ఆగస్టులో ఈ చిత్రం ప్రారంభం కానుంది. 'వినూత్న ఇతివృత్తంతో రూపొందనున్న సినిమా ఇది. తనదైన శైలిలో మాస్, కమర్షియల్ హంగులతో లింగుస్వామి ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందించనున్నాం. త్వరలోనే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాల్ని వెల్లడిస్తాం' అని చిత్రబృందం ప్రకటించింది.

## రెండేళ్ల తర్వాత..

తమిళంలో ధనుష్ సరసన 'కొడి' చిత్రంలో నటించింది అనుపమ పరమేశ్వన్. ఈ సినిమా తర్వాత తెలుగు, కన్నడ భాషలపై దృష్టిసారించిన ఆమె కోలీవుడ్‌కు దూరమైంది. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత తమిళంలో అనుపమ పరమేశ్వరన్ పునరాగమనం చేయబోతున్నది. అధర్వ మురళీ కథానాయకుడిగా కన్నన్ దర్శకత్వంలో ఓ రొమాంటిక్ లవ్ డ్రామా చిత్రం తెరకెక్కుతున్నది. ఈ సినిమాలో స్వేచ్ఛాస్వాతంత్ర్యాల్ని కోరుకునే భరతనాట్య కళాకారిణిగా అనుపమపరమేశ్వరన్ పాత్ర వినూత్నంగా ఉంటుందని చిత్ర బృందం చెబుతున్నది. అధర్వ మురళీ పీహెచ్‌డీ స్కాలర్‌గా కనిపించబోతున్నారు. భిన్న ధృవాల ఓ జంట ప్రేమాయణం నేపథ్యంలో దర్శకుడు సిద్ధం చేసిన కథ నచ్చడంతో తాను ఈ సినిమాను అంగీకరించినట్లు అనుపమ చెబుతున్నది. ఆమె మాట్లాడుతూ 'రెండేళ్లలో తమిళంలో చాలా కథలు విన్నాను. కానీ ఏదీ నా మనసును ఆకట్టుకోలేదు. రెగ్యులర్ సినిమా చేశానన్న పేరు కంటే ఓ మంచి సినిమా కోసం ఎదురుచూడటం మంచిదని అనిపించింది. ఆ నిరీక్షణకు ఈ సినిమాతో తెరపడింది. కుటుంబ బంధాలకు నేటితరం ఇచ్చే ప్రాధాన్యతలతో హృద్యంగా సాగుతుంది' అని తెలిపింది. విదేశాల్లో చిత్రీకరణ జరిపేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నది.


అనుపమ పరమేశ్వరన్


'డియర్ కామ్రేడ్' చిత్రంలో విజయ్ దేవరకొండ

## టీనేజ్ లవ్‌కు కలర్‌ఫుల్ స్టేషనూ..

విజయ్‌దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'డియర్ కామ్రేడ్'. భరత్ కమ్మ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్, బిగ్‌బెన్ సినిమాస్ పతాకాలపై నవీన్ ఎర్నేని, రవిశంకర్, మోహన్ చెరుకూరి, యష్ రంగినేని నిర్మిస్తున్నారు. రష్మిక మందన్న కథానాయిక. ఈ నెల 26న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ సినిమాలోని ఓ వీడియో సాంగ్‌ను ఆదివారం విడుదల చేశారు. 'కాలేజీ క్యాంటీన్ అంటేనే ప్రేమ పక్షులకు హెవెనూ..టీనేజ్ లవ్‌కు టీ కాఫీలందించే కలర్‌ఫుల్ స్టేషనూ..' అంటూ క్యాంటీన్ నేపథ్యంలో సరదాగా సాగే ఈ పాట అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నది. ఈ పాటను యూట్యూబ్‌లో రెండు మిలియన్ల మంది వీక్షించారు. కార్తీక్ రోడ్రిగ్యేజ్ ఈ గీతాన్ని ఆలపించారు. జస్టిన్ ప్రభాకరన్ సంగీతాన్నందించారు. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ వైద్యవిద్యార్థిగా, రష్మిక మందన్న మహిళా క్రికెటర్ పాత్రలో కనిపించనున్నారు. కాకినాడ నేపథ్యంలో కథ సాగుతుంది.


సత్యనారాయణ, సాయికిరణ్, శాంతి, నక్షత్ర, మేఘాంశ్, ప్రియాంక తదితరులు

## తండ్రి పేరు నిలబెడతాడు

'శ్రీహరితో కలిసి మేఘాంశ్ 'భైరవ' సినిమాలో నటించాడు. ఇది తన రెండో సినిమా. పాఠాల కంటే డైలాగుల పేజీలు బాగా చదువుతాడు. ట్రైలర్ చూసిన తర్వాత తండ్రి పేరు నిలబెడతాడన్న నమ్మకం కలిగింది' అని అన్నారు శాంతి శ్రీహరి. దివంగత నటుడు శ్రీహరి తనయుడు మేఘాంశ్ కథానాయకుడిగా అరంగేట్రం చేస్తున్న చిత్రం 'రాజ్‌దూత్'. అర్జున్, కార్తిక్ దర్శకులు. ఎమ్.ఎల్.వి సత్యనారాయణ నిర్మించారు. ఈ నెల 5న విడుదలకానుంది. నక్షత్ర, ప్రియాంకవర్మ కథానాయికలు. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. మేఘాంశ్ మాట్లాడుతూ 'రాజ్‌దూత్ బైక్ నేపథ్యంలో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. జనవరిలో ప్రారంభించి తక్కువ సమయంలో పూర్తిచేశాం. చాలా కష్టపడి చేశాం' అని తెలిపారు. మమ్మల్ని, మా కథను నమ్మి మేఘాంశ్‌తో పాటు నిర్మాత ఈ సినిమా చేశారని దర్శకద్వయం పేర్కొన్నారు. తలసాని సాయికిరణ్ మాట్లాడుతూ 'మేఘాంశ్ వందశాతం తండ్రి పేరును నిలబెడతాడు. సినిమా పెద్ద విజయాన్ని సాధించి అందరికి మంచి పేరు తెచ్చిపెట్టాలి' అని చెప్పారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ 'శ్రీహరి పెద్దకొడుకు దర్శకుడిగా, మేఘాంశ్ హీరోగా ఓ సినిమాను తప్పకుండా నిర్మిస్తాను. మేఘాంశ్ తండ్రి మాదిరిగా పెద్ద స్టార్ అవ్వాలి' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాబీ, శ్రీరామ్ ఆదిత్య, అజయ్‌భూపతి, రవికుమార్ చౌదరి, ఏడిదశ్రీరామ్, ఆదిత్యమీనన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ నూతన కార్యవర్గం


కె.మురళీమోహన్‌రావు


సునీల్ నారంగ్

తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా కె. మురళీ మోహన్‌రావు ఎన్నికయ్యారు. జూన్ 29న జరిగిన ఛాంబర్ ఎన్నికల్లో మురళీమోహన్‌రావుతో పాటు ఉపాధ్యక్షులుగా వి.ఎల్. మల్లిఖార్జున్ గౌడ్, వి.ఎల్ శ్రీధర్, గౌరవ కార్యదర్శిగా సునీల్ నారంగ్, గౌరవ సంయుక్త కార్యదర్శిగా టి బాలగోవింద్‌రాజ్, గౌరవ కోశాధికారిగా ఏ.జె ఇన్నారెడ్డి విజయం సాధించారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఏ. సుధాకర్‌రెడ్డి, బి.సత్యనారాయణగౌడ్, జి.శ్రీనివాస్, కె. ఉదయ్‌కుమార్‌రెడ్డి, పి.సుబ్రహ్మణ్యం, బి. లింగం గౌడ్, అభిషేక్ వెంకటనామా, ఎం.మోహన్‌కుమార్, బాదం వెంకటకృష్ణ, వి. నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. 2019-21 వరకు రెండేళ్ల పాటు ఈ నూతన కార్యవర్గం పదవిలో ఉంటుంది.


సాయిపల్లవి

## 1970 నాటి థ్రిల్లర్

సాయిపల్లవి కథానాయికగా నటించిన మలయాళ చిత్రం 'అథిరన్' తెలుగులో అనువాదం కానుంది. జయంత్ ఆర్ట్స్ పతాకంపై ఎ.కె.కుమార్, జి.రవికుమార్ తెలుగు ప్రేక్షకులకు అందించబోతున్నారు. ఫహద్ ఫాజిల్ హీరోగా నటించిన ఈ చిత్రంలో ప్రకాష్ రాజ్, అతుల్‌కులకర్ణి ప్రధాన పాత్రల్లో నటించారు. సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం మలయాళంలో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. నిర్మాతలు చిత్ర విశేషాలు తెలియజేస్తూ '1970లో కేరళలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అనుక్షణం ఉత్కంఠభరితంగా సాగుతూ ప్రేక్షకుల్ని థ్రిల్‌కి గురిచేస్తుంది. ఆగస్టు నెలాఖరులో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అను మోతేదత్, స్క్రీన్‌ప్లే: పీఎఫ్ మాథ్యూస్, మాటలు: ఎం.రాజశేఖర రెడ్డి, నేపథ్య సంగీతం: జిబ్రాన్, సంగీతం: పి.ఎన్.జయహరి.


కాజల్ అగర్వాల్

## ఆంగ్ల చిత్రంలో కాజల్?

ప్రస్తుతం కథానాయికలు కెరీర్‌పరంగా తమ పరిధుల్ని విస్తృతం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. దక్షిణాది లేదా హిందీ చిత్రసీమకు పరిమితమైపోకుండా అంతర్జాతీయ యవనికపై సత్తాచాటాలని తపిస్తున్నారు. బాలీవుడ్ అగ్ర నాయికలు ప్రియాంకచోప్రా, దీపికాపదుకునే హాలీవుడ్‌లో మంచి గుర్తింపును సంపాదించుకున్న విషయం తెలిసిందే. వీరి కోవలోనే సీనియర్ కథానాయిక కాజల్ అగర్వాల్ ఓ ఆంగ్ల చిత్రంలో నటించడానికి సిద్ధమవుతున్నది. వివరాల్లోకి వెళితే...యువ హీరో మంచు విష్ణు తెలుగు-ఆంగ్ల భాషల్లో ఓ చిత్రాన్ని రూపొందించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటించనుందని సమాచారం. ఓ వినూత్నమైన పాయింట్‌తో ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధానంగా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని హాలీవుడ్ దర్శకుడు డైరెక్ట్ చేయబోతున్నాడట. కథలోని నవ్యత నచ్చడంతో ఈ సినిమాలో నటించడానికి కాజల్ అగర్వాల్ వెంటనే అంగీకరించిందని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కథా చర్చలు తుదిదశలో ఉన్నాయని, భారీ వ్యయంతో ఈ సినిమాను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాల్లో వినిపిస్తున్నది. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ పాత్ర చిత్రణ పూర్తి వైవిధ్యమైన పంథాలో ఉంటుందని అంటున్నారు. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని త్వరలో వెల్లడించబోతున్నారు. కాజల్ అగర్వాల్ కథానాయికగా నటించిన 'సీత' చిత్రం ఇటీవలే విడుదలైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సొగసరి తెలుగులో శర్వానంద్ సరసన 'రణరంగం' చిత్రంలో నటిస్తున్నది.

## సందేశంతో అమృతనిలయం


విజయ్, మమత

విజయ్, మమత జంటగా నటిస్తున్న చిత్రం 'అమృత నిలయం'. రాజా విక్రమ నరేంద్ర దర్శకుడు. రామమోహన్ నాగుల, ప్రవీణ్‌కుమార్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాతలు మాట్లాడుతూ 'తాగుడు మైకంలో యువత చేసే పొరపాట్ల కారణంగా చాలా కుటుంబాలు వీధిన పడుతున్నాయి. తన జీవితాన్ని చిన్నాభిన్నం చేసిన వారిపై ఓ అంధుడి ఎలా ప్రతీకారం తీర్చుకున్నాడన్నది ఈ చిత్ర కథ. సమాజానికి చక్కటి సందేశాన్ని అందించాలనే ఆలోచనతో నిర్మించాం. అపరాజిత సేవా సమితికి చెందిన అనాథ పిల్లల మధ్య ఆడియోను, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉంది. సెన్సార్ పూర్తి చేసి సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మురళీ కంకణాల, కథ, మాటలు: రవి నాయక్.

## ఇద్దరు మిత్రుల కథ


షేర్

'కుమార్, స్వామి అనే ఇద్దరు మిత్రుల కథ ఇది. వందేళ్ల పాటు స్నేహితులుగా కలిసిమెలసి బతకాలని అనుకున్న వారి జీవితాల్లో స్వార్థపూరిత ఆలోచనల వల్ల ఎలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నది ఈ చిత్ర ఇతివృత్తం' అని అన్నారు షేర్. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కె.ఎస్ 100'. సమీర్‌ఖాన్, శైలజ అక్షిత, సునీత ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. వెంకట్రామిరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 12న విడుదలకానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో షేర్ మాట్లాడుతూ 'పార్సిల్, ఆమ్లెట్, వి సినిమాల్లో హీరోగా నటించాను. 'షాలిని' చిత్రానికి దర్శకత్వం వహించాను. కొన్ని సినిమాలకు సంగీతాన్ని అందించాను. ప్రేమకథకు హారర్ హంగులను జోడించి 'కె.ఎస్.100' చిత్రాన్ని రూపొందించాను. హంటెడ్ హౌజ్‌లో అడుగుపెట్టిన నలుగురు యువతులకు ఎలాంటి భయానక పరిస్థితులు ఎదురయ్యాయి? ఓ ప్రేమజంటతో ఆ ఇంటికి ఉన్న సంబంధమేమిటన్నది ఆకట్టుకుంటుంది. తమ మాయ మాటలతో అబ్బాయిలు కొంతమంది అమ్మాయిల్ని ఎలా మోసం చేస్తున్నారనే పాయింట్‌ను సందేశాత్మకంగా చర్చించాం. లిప్‌లాక్, రొమాంటిక్ సన్నివేశాలకు తావు లేకుండా క్లీన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించిన సినిమా ఇది' అని తెలిపారు.